'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18 సంచిక: 300
బుధవారం 21-1-2026
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఫైనల్ రిహార్సల్...
నేడు భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టి20 మ్యాచ్ -14లో

క్రాష్ మార్కెట్
రూ.10 లక్షల కోట్లు ఆవిరి.. 1,066 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ -15లో

తమిళనాడు గవర్నర్ వాకౌట్
తమిళనాడు గవర్నర్ రవి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. సంప్రదాయ ప్రసంగం చేయకుండానే అర్థాంతరంగా వెళ్లిపోయారు.
వివరాలు 6లో ▸

భారీ వాణిజ్య ఒప్పందం బాటలో..
పరస్పర ప్రయోజనాలే పరమావధిగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్, ఐరోపా సమాఖ్య నిర్ణయించాయి.
వివరాలు 6లో ▸

కెనడా, వెనెజువెలా, గ్రీన్‌లాండ్‌తో కలిపిన అమెరికా మ్యాప్‌ను ట్రూత్‌లో ట్రంప్ పోస్టు చేశారు. ఇది వైరల్‌గా మారింది.
వివరాలు 6లో ▸

బ్రాంచ్‌కే జై కొట్టాలి
దేశంలోని ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ట్రెండ్స్‌పై కెరీర్ గైడెన్స్ నిపుణులు మహేశ్వర్ పెరి విశ్లేషణ..
వివరాలు 10లో ▸

కేకే లైన్ పాయే!

రాష్ట్ర ప్రయోజనాలు పట్టని చంద్రబాబు ప్రభుత్వం

కీలకమైన కేకే లైన్ లేకుండా విశాఖపట్నం రైల్వే జోన్

ఒడిశా ప్రయోజనాలకే పట్టం కట్టిన కేంద్రం

- విశాఖ రైల్వే జోన్ స్వరూపాన్ని ఖరారు చేసిన రైల్వే బోర్డు
- అరకుతోపాటు అత్యధిక ఆదాయం ఇచ్చే కేకే లైన్‌ను కోల్పోయిన విశాఖ జోన్
- ప్రజా సంఘాలు, రైల్వే యూనియన్ల విజ్ఞప్తిని పెడచెవిన పెట్టిన వైనం..
- కూటమి ప్రజాప్రతినిధులే కేంద్ర మంత్రులుగా ఉన్నా రాష్ట్రానికి అన్యాయం
- తద్వారా ఆర్థిక స్వయం సమృద్ధి సాధించడం సాధ్యం కాదని సర్వత్రా ఆందోళన

సాక్షి, అమరావతి: విశాఖపట్నం రైల్వే జోన్ అభివృద్ధికి పురిట్లోనే సంధి కొట్టింది! ఢిల్లీలో చక్రం తిప్పుతున్నామంటూ ప్రచారం చేసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాల సాధనలో మరోసారి చేతులెత్తేశారు. ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్నప్పటికీ కేంద్రం నుంచి ప్రాజెక్టుల సాధనలో దారుణంగా విఫలమయ్యారు. రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక డిమాండ్, విభజన చట్టం హామీ కూడా అయిన విశాఖ రైల్వే జోన్ అందుకు తాజా తార్కాణం. కీలకమైన కొత్తవలస– కిరండూల్ లైన్ (కేకే లైన్) లేకుండానే విశాఖ రైల్వే జోన్‌ను కేంద్రం ఏర్పాటు చేస్తోంది. రైల్వే ప్రాజెక్టుల విషయంలో

మిగతా 2వ పేజీలో ▶

రాహుల్‌తో బాబు రాజకీయం!

టీడీపీని దెబ్బ తీసిన బీఆర్ఎస్ దిమ్మెలు కూల్చాలన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్‌తో చంద్రబాబు బంధం మరోసారి రుజువైందంటున్న రాజకీయ వర్గాలు 2 లో



- చంద్రబాబుతో క్లోజ్డ్ డోర్ మీటింగ్ ద్వారా రాయలసీమ లిఫ్ట్‌ను ఆపించానని గతంలో రేవంత్ వ్యాఖ్యలు
- కాంగ్రెస్ అధిష్టానం అనుమతి లేకుండా రేవంత్ అలా మాట్లాడటం సాధ్యం కాదంటున్న విశ్లేషకులు
- చంద్రబాబు ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ.. కాంగ్రెస్‌తో రహస్య కాపురం ఏమిటని బీజేపీ వర్గాల ఆగ్రహం
- ఈవీఎంలపై దేశవ్యాప్తంగా మాట్లాడే రాహుల్.. ఏపీ గురించి కనీసం ప్రస్తావించకపోవడంపై సర్వత్రా విస్మయం
- చంద్రబాబుతో కాంగ్రెస్ రహస్య ఒప్పందాలకు ఇదే నిదర్శనమంటున్న రాజకీయ వర్గాలు

సునీత పిటిషన్‌పై 'సుప్రీం' సీరియస్

ఇలాగైతే మరో పదేళ్లకే!

వివేకా హత్య కేసులో మేం మినీ ట్రయల్ నిర్వహించలేం

- ప్రతి చిన్న అంశానికీ దర్యాప్తు కోరతారా?
- భూతద్దంలో చూపిస్తూ మళ్లీ దర్యాప్తు కోరుతూపోతే హైకోర్టుకు పంపాల్సి వస్తుంది
- నిందితులకూ హక్కులు ఉంటాయి కదా?
- గోడ మీద పిల్లి వాటంలా సీబీఐ తీరు..
- పిటిషనర్ కోరినట్లు కాదు.. మీరేం చేయాలనుకుంటున్నారో చెప్పండి
- అంతేగానీ కోర్టు భుజంపై తుపాకీ పెట్టి కాల్చొద్దు
- విచారణ అవసరం లేదనుకుంటే కేసు క్లోజ్ చేయండి..
- స్పష్టమైన వైఖరితో రండి.. దీనిపై 5న తేల్చేస్తాం: సుప్రీంకోర్టు

2 లో

నేటి నుంచి జేఈఈ మెయిన్
29 వరకు నిర్వహణ
16లో

పార్టీ వ్యవహారాల్లో..

నబీన్ నా బాస్

నా పనితీరుపై నిర్ణేత ఆయనే: ప్రధాని మోదీ 6 లో

- బీజేపీ పగ్గాలు చేపట్టిన నబీన్
- వేడుకగా జరిగిన కార్యక్రమం
- హాజరైన బీజేపీ ముఖ్య నేతలు

క్లుప్తంగా...

నేటి నుంచి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు పంపిణీ చేయడంపై జస్టిస్ బ్రిజేష్ కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్ర సభ్యులుగా ఏర్పాటైన ట్రిబ్యునల్ బుధవారం నుంచి విచారణ చేపట్టనుంది. మూడ్రోజులపాటు విచారణ కొనసాగనుంది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా తుది వాదనలు కొనసాగించనున్నారు. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 811 టీఎంసీలు, కృష్ణా నదిలో 65 శాతం, సరాసరి లభ్యత ఆధారంగా కేడబ్ల్యూడీటీ–2 అదనంగా కేటాయించిన 194 టీఎంసీలు, పోలవరం కుడి కాలువ నుంచి కృష్ణా డెల్టాకు మళ్లించే 80 టీఎంసీల్లో సాగర్‌కు ఎగువన కృష్ణా అదనంగా వినియోగించుకునే వెసులుబాటు కల్పించిన 45 టీఎంసీలు వెరసి 1,050 టీఎంసీలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై ట్రిబ్యునల్ విచారణ జరుపుతోంది. ఇప్పటికే తెలంగాణ తుది వాదనలను పూర్తి చేసింది. ఏపీ ప్రభుత్వం తుది వాదనలు పూర్తి చేశాక ట్రిబ్యునల్ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనుంది.

వచ్చిన పదోన్నతీ వదులుకున్నారు!

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు తీసుకునేందుకు 51 మంది విముఖత

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల్లో కొందరు పదోన్నతి కోసం పెద్ద ఎత్తున పైరవీలు చేయడం చూస్తుంటారు. కానీ, విచిత్రంగా.. పంచాయతీరాజ్ శాఖలో పలువురు ఉద్యోగులు మాత్రం వారికి వచ్చిన పదోన్నతులను సైతం వదులుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ మండల స్థాయి అధికారుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రామ పంచాయతీల్లోని గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులు.. జిల్లా పరిషత్ కార్యాలయాలు, జిల్లా పంచాయతీ అధికారుల కార్యాలయాల్లో సూపరింటెండెంట్‌లుగా పనిచేస్తున్న 660 మందికి డిప్యూటీ ఎండీపీవోలుగా పదోన్నతులను కల్పించింది. ఇందులో ఏకంగా 51 మంది ఆ పదోన్నతులను తిరస్కరించారు. వీరిలో అత్యధికులు గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులే. వీరు సాధారణంగా జనాభా, ఆదాయ పరంగా ఎక్కువగా ఉండే గ్రామ పంచాయతీల్లో పనిచేస్తుంటారు. అవి అత్యధికంగా నగరాలకు, పట్టణాలకు చుట్టుపక్కలే ఉంటాయి. ఎక్కడో మండలాల్లో డిప్యూటీ ఎంపీడీవోలుగా పనిచేయడం కంటే పంచాయతీ కార్యదర్శులుగా పనిచేయడమే తమకు అన్ని విధాలుగా మేలు అని వారు భావిస్తున్నట్లు తెలిసింది. అలాగే సాధారణ సీనియారిటీ నిబంధనల ప్రకారం తర్వాత ఏడాదిలో పంచాయతీరాజ్ శాఖలోనే డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందడానికి అవకాశం ఉండడంతో.. తాజా పదోన్నతులు వదులుకున్నారని కూడా ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది.

85 ఏళ్ల వృద్ధులకు రివిజన్ టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్

డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న రోగులతో డాక్టర్ నరేంద్రరెడ్డి, ఇతర వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అత్యంత క్లిష్టతరమైన రివిజన్ టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీలను 85 ఏళ్లు దాటిన ఇద్దరికి విజయవంతంగా నిర్వహించినట్లు విజయవాడలోని సాయిభాస్కర్ హాస్పిటల్స్ ఎండీ, ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. మైలవరానికి చెందిన అప్పిడి అచ్చుమ్మ(85), విజయవాడకు చెందిన జంధ్యాల సూర్యనారాయణ(86)కు వయసు రీత్యా బీపీ, షుగర్‌తో పాటు గుండె సమస్యలు ఉన్నా తగిన జాగ్రత్తలు తీసుకుని సర్జరీలు విజయవంతంగా చేశామని తెలిపారు.

తెలుగు వాడివి ఆ మాత్రం పౌరుషం లేదా! నువ్వే ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగిన తర్వాత కనపడు!

రెడ్డి సంఘాల సమాఖ్య డైరీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించిన వైఎస్ జగన్

వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్–2026 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కారుమూరి నాగేశ్వరరావు, అధ్యక్షుడు జి.మహేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డీపీ వెంకటరమణ, ఏపీఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు ఎస్వీ.సుధాకర్ రెడ్డి, ఏపీసీపీడీసీఎల్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, సోమశేఖర్ రెడ్డి, ఏపీ ఈపీడీసీఎల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వి.సత్యనారాయణ, లక్ష్మీరావు, పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘాల సమాఖ్య డైరీలు కూడా..

ఏపీ రెడ్డి సంఘాల సమాఖ్య, కడప–2026 నూతన సంవత్సర డైరీలను కూడా వైఎస్ జగన్ ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 40 రెడ్డి సంఘాల సమాచారాన్ని క్రోడీకరించి డైరీ రూపొందించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ రెడ్డి సంఘాల సమాఖ్య ప్రెసిడెంట్ కె.వెంకట క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

రాహుల్‌తో బాబు రాజకీయం!

టీడీపీని దెబ్బ తీసిన బీఆర్‌ఎస్ దిమ్మెలు కూల్చాలన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్‌తో చంద్రబాబు బంధం మరోసారి రుజువైందంటున్న రాజకీయ వర్గాలు

సాక్షి, అమరావతి: టీడీపీని దెబ్బ తీసిన బీఆర్‌ఎస్ దిమ్మెలు కూల్చాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీతో చంద్రబాబు బంధం మరోసారి రుజువైందని రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి అలా మాట్లాడుతున్నారంటే హైకమాండ్, రాహుల్ ఆశీస్సులు లేకుండా సాధ్యం కాదని విశ్లేషిస్తున్నారు. చంద్రబాబుతో క్లోజ్డ్ డోర్ మీటింగ్ ద్వారా రాయలసీమ లిఫ్ట్‌ను ఆపించానని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించటాన్ని గుర్తు చేస్తున్నారు. ఒకవైపు ఎన్డీఏలో కీలక భాగస్వామిగా కొనసాగుతూనే మరోవైపు చంద్రబాబు కాంగ్రెస్ హైకమాండ్‌తో, రాహుల్‌గాం. దీతో అత్యంత సన్నిహితంగా మెలుగుతున్నారనే విషయాన్ని రేవంత్ వ్యాఖ్యలు రుజువు చేస్తున్నాయని ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. చంద్రబాబు – రాహుల్ బంధంపై దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఓ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి.. టీడీపీని వెనకేసుకు రావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి.. టీడీపీ ప్రయోజనాల కోసం తహతహలాడటం, బాధపడటం ఏమిటని విస్తుపోతున్నారు. 'తెలంగాణలో టీడీపీ ఉండకూడదని కక్షగట్టి ఆ పార్టీ నాయకత్వాన్ని దెబ్బ తీసిన బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను సమూలంగా వంద మీటర్ల గొయ్యి తీసి పాతిపెట్టాలి.. బీఆర్‌ఎస్ వాళ్ల గద్దెలు దిగాలి... ఊర్లలో బీఆర్‌ఎస్ దిమ్మెలు కూలాలి..' అని ఖమ్మం జిల్లాలో రేవంత్‌రెడ్డి సోమవారం వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల ద్వారా రాహుల్‌గాంధీ ఎప్పటికప్పుడు చంద్రబాబుతో టచ్‌లో ఉంటున్నట్లు నిరూపితమవుతోందని రాజకీయ విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు. చంద్రబాబు ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటునే మరోవైపు కాంగ్రెస్‌తో అత్యంత సన్నిహితంగా ఉంటున్నారనేందుకు ఇవన్నీ నిదర్శనాలని విశ్లేషిస్తున్నారు. ఇక దేశంలో ఓట్ల చోరీ గురించి పదేపదే ఆందోళనకు దిగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. 2024 ఎన్నికల సమయంలో ఏపీలో ఈవీఎంల మాయాజాలం, రాత్రి వేళ భారీగా పోలింగ్, భారీగా దొంగ ఓట్లు గురించి ఏనాడూ కనీసం నోరు విప్పిన పాపాన పోలేదని గుర్తు చేస్తున్నారు. ఏపీలో చంద్రబాబుకు ఇబ్బంది కాకూడదనే ఈ అంశాన్ని ఆయన ఏనాడూ ప్రస్తావించలేదని స్పష్టం చేస్తున్నారు.

బాబు అనైతిక బంధం!

రాజకీయ ఊసరవెల్లి నారా చంద్రబాబు మళ్లీ రంగులు మార్చుతున్నారు. ఒక్కోసారి ఒక్కో రంగు మారుస్తూ వచ్చిన ఆయన ఈసారి... ఏకకాలంలో విభిన్న రంగులు మారుస్తూ ఊసరవల్లికే అసూయ కలిగిస్తున్నారు. సొంతంగా ఎన్నికల్లో గెలవలేని చంద్రబాబు ప్రతి ఎన్నికకు వేర్వేరు పార్టీలతో పొత్తులు పెట్టుకుని ప్రజలను మోసగించడం బహిరంగ రహస్యమే. ఈసారి ఆయన తన రాజకీయ అవకాశవాదాన్ని పరాకాష్టకు తీసుకువెళుతుండటం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. చంద్రబాబు ఓవైపు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలో భాగస్వామిగా కొనసాగుతూనే.. మరోవైపు కాంగ్రెస్ పార్టీతో రాజకీయ అక్రమ సంబంధం నెరుపుతుండటం విస్మయపరుస్తోంది. భవిష్యత్ రాజకీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో తెరచాటు మైత్రి కొనసాగిస్తున్నారని టీడీపీ వర్గాలు సమర్థిస్తున్నాయి. కాంగ్రెస్‌తో చంద్రబాబు తెరచాటు రాజకీయ మంత్రాంగంపై బీజేపీ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధానంగా తెలంగాణ బీజేపీ నేతలు ఈ విషయాన్ని తమ జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్‌తో అక్రమ సంబంధం కోసం చంద్రబాబు ఏకంగా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను పణంగా పెడుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

బాబు స్క్రిప్ట్ ప్రకారమే రాజకీయ డ్రామా..

ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న టీడీపీ.. మరోవైపు కాంగ్రెస్‌తో అంటకాగుతుండటం రాజకీయ అవకాశవాదానికి పరాకాష్టగా నిలుస్తోందని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. 2018లో బీజేపీతో విడిపోయి తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన టీడీపీ... మళ్లీ 2024 ఎన్నికల్లో బీజేపీతో జట్టుకట్టినా సరే కాంగ్రెస్‌తో తెరచాటు మైత్రికి ఏమాత్రం భంగం కలగకుండా జాగ్రత్త పడుతోంది. 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి టీడీపీ శ్రేణులు సహకరించిన విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా చంద్రబాబు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారు. ఇక రేవంత్‌రెడ్డి తెలంగాణ సీఎం అయిన తరువాత కాంగ్రెస్ పార్టీతో చంద్రబాబు బంధం మరింత బలపడింది. ఏపీలో ఒంటరిగా పోటీ చేసి గెలవలేమని గ్రహించి అనివార్యంగా 2024 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. అంతమాత్రాన కాంగ్రెస్‌తో బంధాన్ని చంద్రబాబు తెగదెంపులు చేసుకోలేదు. భవిష్యత్ రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ అధిష్ఠానంతో అత్యంత సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూనే ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వంలో ఇటు ఏపీ ప్రభుత్వంలోనూ బీజేపీ, టీడీపీ భాగస్వాములుగా ఉన్నప్పటికీ.. తెలంగాణలో మాత్రం టీడీపీ శ్రేణులు కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉంటున్నాయి. టీడీపీ, కాంగ్రెస్ తెరచాటు మైత్రి తెలంగాణకే పరిమితం కాలేదు. ఢిల్లీలో కూడా టీడీపీ ప్రత్యేక ప్రతినిధులు రాహుల్‌గాంధీతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తోపాటు టీడీపీ ఎంపీలు ఎవరూ కూడా కాంగ్రెస్‌ను విమర్శించకపోవడం గమనార్హం. దీన్ని బట్టి చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే రాజకీయ డ్రామా సాగుతోందన్నది సుస్పష్టం.

ఏపీ ప్రయోజనాలు పణంగా పెట్టి..

చంద్రబాబు ఇటు బీజేపీతో బహిరంగ మైత్రి... అటు కాంగ్రెస్‌తో తెరచాటు బంధం కొనసాగిస్తే కొనసాగించుకోవచ్చు. టీడీపీ రాజకీయ వైఖరి ఆ పార్టీ ఇష్టం. కానీ అందుకోసం ఏకంగా రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెడుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాయలసీమకు అత్యంత ముఖ్యమైన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను చంద్రబాబు నిలిపివేయడమే అందుకు నిదర్శనం. ఆ విషయాన్ని స్వయంగా రేవంత్‌రెడ్డి తెలంగాణ శాసనసభలోనే వెల్లడించారు. 'రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని చంద్రబాబును క్లోజ్డ్ డోర్ మీటింగ్‌లో కోరా.. ఆయన ఆ పనులను నిలిపివేశారు..' అని రేవంత్‌రెడ్డి ప్రకటించడం తెలిసిందే. ఆయన చెప్పింది నిజం కాదని చంద్రబాబు కనీసం ఖండించకపోవడం గమనార్హం. పైగా రాయలసీమ ప్రాజెక్టుతో ప్రయోజనం లేదంటూ చంద్రబాబు, మంత్రులు దారుణంగా మాట్లాడటం నివ్వెరపరుస్తోంది. తద్వారా రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రయోజనం కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను నిలిపివేశామని చంద్రబాబు ఒప్పుకున్నట్టైంది!

సునీత పిటిషన్‌పై 'సుప్రీం' సీరియస్

ఇలాగైతే మరో పదేళ్లకే!

తేల్చిచెప్పిన సర్వోన్నత న్యాయస్థానం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో విచారణ ప్రక్రియను మరింత జాప్యం చేసేలా నర్రెడ్డి సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇప్పటికే విచారణ పూర్తయిన అంశాలను మళ్లీ తిరగతోడుతూ, కాలయాపన చేయడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. తదుపరి దర్యాప్తునకు సంబంధించి కింది కోర్టు (ట్రయల్ కోర్టు) ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టులో 'మినీ ట్రయల్' (సమాంతర విచారణ) నిర్వహించలేమని, పిటిషనర్ కోరినట్లుగా ప్రతి చిన్న అంశానికీ మళ్లీ విచారణకు ఆదేశిస్తూ పోతే కేసు కొలిక్కి రావడానికి మరో పదేళ్లు పడుతుందని న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది.

మినీ ట్రయల్ నడపాలనుకుంటున్నారా?

సునీత తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. కింది కోర్టు (సీబీఐ కోర్టు) తమ అభ్యర్థనలను పక్కన పెట్టిందంటూ ఛార్జిషీటులోని అంశాలను ఒక్కొక్కటిగా చదివే యత్నం చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సుందరేశ్ కలుగజేసుకుంటూ.. 'ఇవన్నీ ట్రయల్ కోర్టు చూసుకోవాల్సిన అంశాలు. మీరు ఇక్కడ మినీ ట్రయల్ నడపాలనుకుంటున్నారా? ప్రతి అంశాన్ని భూతద్దంలో చూపిస్తూ మళ్లీ దర్యాప్తు కోరుకుంటూ పోతే.. మేం హైకోర్టుకు పంపాల్సి వస్తుంది. అక్కడి నుంచి మళ్లీ కింది కోర్టుకు వెళ్లేసరికి మరో పదేళ్లు పడుతుంది. ఈలోపు ట్రయల్ ముగియదు. నిందితులకూ హక్కులు ఉంటాయి కదా?' అని ఘాటుగా ప్రశ్నించారు.

గోడ మీద పిల్లి వాటం వద్దు: సీబీఐకి సుప్రీం చురకలు..

ఇదే సమయంలో సీబీఐ తీరును కూడా ధర్మాసనం తప్పుబట్టింది. పిటిషనర్ అడిగారు కదా అని ప్రతిదానికీ తలొగ్గడం సరికాదని హితవు పలికింది. 'దర్యాప్తు సంస్థగా మీ వైఖరి ఏమిటి? మీకు దర్యాప్తు అవసరమనిపిస్తోందా? లేదా? ఇప్పటికే చేసిన దర్యాప్తుతో సంతృప్తి చెందారా? ఏదో ఒక స్టాండ్ తీసుకోండి. అంతేగానీ కోర్టు ఆదేశిస్తే చేస్తాం అంటూ గోడ మీద పిల్లి వాటంగా వ్యవహరించవద్దు. ఒకవేళ నిజంగానే దర్యాప్తులో లోపాలున్నాయని భావిస్తే ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పండి. పిటిషనర్ కోరిన మేరకు కాకుండా, సాక్ష్యాధారాల మేరకు మీరేం చేయాలనుకుంటున్నారో చెప్పండి. అంతేగానీ, కోర్టు భుజంపై తుపాకీ పెట్టి కాల్చొద్దు. విచారణ అవసరం లేదనుకుంటే కేసు క్లోజ్ చేయండి..' అని సీబీఐ న్యాయవాదిని ధర్మాసనం గట్టిగా మందలించింది.

ఆ ఒక్క అంశంపైనే అనుమతి..

కింది కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించిన సుప్రీం ధర్మాసనం.. హత్య జరిగిన రోజు (మార్చి 15, 2019) అర్ధరాత్రి సమయంలో కిరణ్ యాదవ్ (ఏ–2 సోదరుడు), అరుణ్‌రెడ్డి (ఏ–1 బంధువు) మధ్య మెసేజ్‌ల మార్పిడిపై మాత్రమే తదుపరి దర్యాప్తునకు సెషన్స్ కోర్టు అనుమతించిందని గుర్తు చేసింది. ఆ ఒక్క అంశం మినహా మిగిలిన వాటిపై దర్యాప్తు అవసరం లేదని కింది కోర్టు స్పష్టంగా చెప్పినప్పుడు మళ్లీ అవే అంశాలను సుప్రీంకోర్టులో ప్రస్తావించడంపై అసహనం వ్యక్తం చేసింది.

నిందితుల హక్కులను కాలరాస్తారా..?

ప్రతివాదుల తరఫు సీనియర్ న్యాయవాదులు రంజిత్ కుమార్, దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ.. తాము విచారణను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని, కానీ పిటిషనర్లు ఉద్దేశపూర్వకంగా దర్యాప్తు పేరుతో కేసును సాగదీస్తున్నారని కోర్టుకు విన్నవించారు. స్పీడ్ ట్రయల్ తమ హక్కు అని, ఏళ్ల తరబడి కేసును సాగదీయడం వల్ల తమకు అన్యాయం జరుగుతోందన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. కేసును లాజికల్ ఎండ్‌కు (తార్కిక ముగింపు) తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. విచారణను నిరవధికంగా సాగదీస్తూ పోతే నిందితుల హక్కులకు భంగం వాటిల్లుతుందని పరోక్షంగా వ్యాఖ్యానించింది.

ఫిబ్రవరి 5న తేల్చేస్తాం..

ఈ నేపథ్యంలో తదుపరి దర్యాప్తు అవసరమా? లేదా? అనే దానిపై స్పష్టమైన వైఖరితో రావాలని సీబీఐని ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. ఆ రోజుతో ఈ అంశంపై ఒక స్పష్టతనిస్తామని పేర్కొంది. దర్యాప్తు పేరుతో కాలయాపన చేయడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పడంతో పిటిషనర్లకు గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లయింది.

కేకే లైన్ పాయే!

రైల్వే బోర్డు తాజా నిర్ణయంతో విశాఖ, రాయగడ డివిజన్లు ఇలా...

- విశాఖపట్నం డివిజన్: పలాస- విశాఖపట్నం- దువ్వాడ, కూనేరు-విజయనగరం, నౌపడ జంక్షన్- పర్లాకిమిడి, బొబ్బిలి జంక్షన్ - సాలూరు, సింహాచలం నార్త్ - దువ్వాడ బైపాస్, వదలపూడి- దువ్వాడ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ - జగ్గయ్యపాలెం సెక్షన్లు
- రాయగడ డివిజన్: కొత్తవలస- కిరండూల్, బచ్చెలి / కిరండూల్, కూనేరు- తెరువలి జంక్షన్, సింగాపూర్ రోడ్- కొరాపుట్ జంక్షన్, పర్లాఖిముడి - గుణుపూర్ సెక్షన్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఒడిశా ప్రయోజనాలకే కేంద్ర ప్రభుత్వం పట్టం కట్టింది.

రాబడికి భారీగా గండి..

అత్యధిక రాబడినిచ్చే కేకే లైన్ లేకుండానే విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను కేంద్రం ఖరారు చేసింది. ఈమేరకు గతంలో వెలువడిన ప్రకటనను ధృవీకరిస్తూ రైల్వే శాఖ ఈ నెల 6న అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రముఖ పర్యాటక ప్రాంతం అరకులోయ సహా అత్యధిక రాబడినిచ్చే కేకే లైన్‌ను ఒడిశాలోని రాయగడ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న కొత్త డివిజన్‌లో చేర్చింది. ఆ డివిజన్ భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి వస్తుందని ప్రకటించింది. దాంతో కొత్తగా ఏర్పడే విశాఖ రైల్వే డివిజన్ రాబడికి భారీగా గండి పడినట్టే. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటును వైఎస్సార్‌సీపీ హయాంలోనే రైల్వే శాఖ ఆమోదించింది. ఆమేరకు 2024 ఫిబ్రవరి 28న ఉత్తర్వులు జారీ చేసింది.

వాల్తేర్ విభజన...

విశాఖ, రాయగడ డివిజన్లు

2024లో ఇచ్చిన ఉత్తర్వుల్లో వాల్తేర్ రైల్వే డివిజన్‌ను తొలగిస్తున్నట్లు రైల్వే శాఖ పేర్కొంది. ఒడిశాలోని రాయగడ కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. అత్యధిక రాబడి నిచ్చే కేకే లైన్‌తోపాటు ఉమ్మడి విజయనగరం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాల్లోని సెక్షన్లు రాయగడ రైల్వే డివిజన్ పరిధిలోకి చేర్చింది. రాయగడ రైల్వే డివిజన్ భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న ఉత్తర కోస్తా రైల్వే డివిజన్ పరిధిలోకి వస్తుందని ప్రకటించింది. దీనిపై అప్పట్లోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. రైల్వే జోన్ ప్రధాన కేంద్రం ఉన్న చోట డివిజన్ కేంద్రం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఉమ్మడి విజయనగరం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలను భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న ఉత్తర కోస్తా జోన్‌లో చేరిస్తే ఆ రెండు జిల్లాలకు రైల్వే ప్రాజెక్టుల్లో తగిన న్యాయం జరగదని స్పష్టం చేశారు. కేకే లైన్‌ను కోల్పోతే విశాఖ జోన్ ఆర్థిక స్వయం సమృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా వాల్తేర్ రైల్వే డివిజన్‌ను కొనసాగించాలని.. ఏపీ మొత్తాన్ని విశాఖ రైల్వే జోన్ పరిధిలోకి తేవాలని పట్టుబట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒత్తిడి మేరకు విశాఖపట్నం కేంద్రంగా వాల్తేర్ రైల్వే డివిజన్‌ను కొనసాగిస్తామని కేంద్రం 2024 మార్చిలో పేర్కొంది. అయితే వాల్తేర్ రైల్వే డివిజన్ స్వరూపం ఎలా ఉండబోతుందన్న దానిపై సందిగ్ధత తొలగిపోలేదు.

ఒడిశా ఒత్తిడికే తలొగ్గిన కేంద్రం...

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైల్వే ప్రాజెక్టుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. కేకే లైన్ విశాఖపట్నం రైల్వే జోన్ పరిధిలోనే ఉంచాలన్న ఉత్తరాంధ్ర వాసుల డిమాండ్‌ను నిర్లక్ష్యం చేసింది. దాంతో ఒడిశా ఒత్తిడికి తలొగ్గుతూ కేంద్ర రైల్వే బోర్డు తుది నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం, రాయగడ కేంద్రాలుగా రెండు వేర్వేరు రైల్వే డివిజన్లను ఏర్పాటు చేయనుంది. విశాఖ కేంద్రంగా కొత్తగా ఏర్పాటు చేసే దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి విశాఖపట్నం డివిజన్‌ను చేర్చింది. కానీ అత్యధిక రాబడి నిచ్చే కొత్తవలస–కిరండూల్ సెక్షన్‌తోపాటు పలాస–ఇచ్ఛాపురం సెక్షన్లను విశాఖపట్నం డివిజన్ పరిధి నుంచి తొలగించింది. వాటిని ఒడిశాలోని రాయగడ కేంద్రంగా ఏర్పాటు చేసే కొత్త డివిజన్ పరిధిలోకి తీసుకువచ్చింది. దాంతో విశాఖ డివిజన్ తీవ్రంగా నష్టపోనుంది.

మొద్దునిద్రలో బాబు ప్రభుత్వం

కీలకమైన కేకే లైన్ విశాఖ డివిజన్‌కు దూరం కావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ రైల్వే జోన్ స్వయం సమృద్ధికి కేకే లైన్ అత్యంత కీలకమని గుర్తు చేస్తున్నారు. కేకే లైన్‌ను విశాఖపట్నం డివిజన్‌లోనే కొనసాగించాలని ఉత్తరాంధ్రవాసులు, వివిధ ఉద్యోగ, కార్మిక, వ్యాపార, వాణిజ్య వర్గాలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మొర పెట్టుకుంటున్నా కూటమి ప్రభుత్వం ఏడాదిగా మొద్దు నిద్ర వీడలేదు. ఉత్తరాంధ్రకు చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మరోవైపు ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం కేకే లైన్ రాయగడ డివిజన్‌లోనే ఉండాలని ఢిల్లీ స్థాయిలో పట్టుబట్టింది. దీంతో కేకే లైన్‌ను ఒడిశాకే కేటాయిస్తూ రాయగడ డివిజన్ పరిధిలో ఉంటుందని ఈ నెల 6న మరోసారి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

దక్షిణ కోస్తా రైల్వే జోన్ స్వరూపం ఇదీ...

విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా ఏర్పాటు చేయనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ స్వరూపం ఖరారైంది. అటు సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్.. ఇటు భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలను విభజించనున్నారు. ఆంధ్రప్రదేశ్ మొత్తాన్ని విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి తేనున్నారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్ రైల్వే డివిజన్లు దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి వస్తాయి. దక్షిణ కోస్తా రైల్వే, తూర్పు కోస్తా, దక్షిణ మధ్య రైల్వే జోన్ల స్వరూపం ఇలా ఉండనుంది...

రైల్వే జోన్	ప్రధాన కేంద్రం	రైల్వే డివిజన్లు
దక్షిణ కోస్తా జోన్	విశాఖపట్నం	విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్
తూర్పు కోస్తా జోన్	భువనేశ్వర్	ఖుర్దా రోడ్, సంబల్‌పూర్, రాయగడ (కేకే లైన్‌తోసహా)
దక్షిణ మధ్య జోన్	సికింద్రాబాద్	సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

చంద్రబాబు ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువు

దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్

చీరాల రూరల్: చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలోని దళితుల ప్రాణాలకు రక్షణ కరువైందని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్ ఆరోపించారు. దళితులపై దాడులు, హత్యలు జరుగుతున్నా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చోద్యం చూస్తోందని విమర్శించారు. బాపట్ల జిల్లా చీరాల గడియార స్తంభం సెంటర్‌లోని దళిత మహాసభ కార్యాలయం వద్ద దళిత సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటరావుతో కలిసి జూలియన్ మీడియాతో మాట్లాడారు. పల్నాడు జిల్లాలో మందా సాల్మన్‌ను టీడీపీ గూండాలు అత్యంత పాశవికంగా హత్య చేశారని చెప్పారు. అలాగే కందుకూరులోని దప్పలంపాడు మాదిగవాడను బహిష్కరించారని, చీమకుర్తిలోని బండ్లమూడి గ్రామ మాదిగలపై పోలీసుల సమక్షంలోనే దాడిచేశారని, శ్రీకాకుళంలోని ఐఐఐటీలో చదువుతున్న గుంటూరు ఏటీ అగ్రహారానికి చెందిన యువకుడి మరణానికి కారణమయ్యారని పేర్కొన్నారు. అగ్రకులాల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకున్న దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మాదిగలకు పెద్దమాదిగను అవుతానని చెప్పిన చంద్రబాబు మాదిగ సామాజిక వర్గంపై దాడులు జరుగుతుంటే మౌనం వహిస్తున్న తీరును మాదిగ నాయకులు, మాదిగ ప్రజలు గమనించాలని కోరారు. దళితుల అభ్యున్నతి కోసం నియమించిన రాష్ట్ర ఎస్సీకమిషన్ ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఎస్సీ కమిషన్ చంద్రబాబు కోసం ఏర్పాటు చేశారా? దళితుల కోసం ఏర్పాటు చేసిన కమిషన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు, హత్యలు చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా దళిత మహాసభ ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

టీటీడీ ఆలయాల నిర్వహణకు ప్రత్యేక కార్పస్ ఫండ్

మాట్లాడుతున్న టీటీడీ ఈవో

తిరుపతి అన్నమయ్యసర్కిల్: టీటీడీ అనుబంధ, స్థానిక ఆలయాల నిర్వహణకు ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సూచించారు. తిరుపతిలోని పరిపాలన భవనంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. అనుబంధ, స్థానిక ఆలయాల వార్షిక హుండీ ఆదాయం, ఖర్చులు తదితర అంశాలపై చర్చించారు. ఆలయాల రోజువారి నిర్వహణ వంటి సాధారణ ఖర్చులకు కార్పస్ ఫండ్‌కు వచ్చే వడ్డీ సొమ్ము వినియోగించాలని సూచించారు. పెద్ద స్థాయిలో మరమ్మతులు, వార్షిక ఉత్సవాల కోసం టీటీడీ నిధులు ఖర్చు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల నుంచి విరాళాలు స్వీకరించడానికి వీలుగా క్యూఆర్ కోడ్ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు.

డ్వాక్రా మహిళలకు బాబు టోకరా: ఎమ్మెల్సీ కల్యాణి

సాక్షి, విశాఖపట్నం: చంద్రబాబు అధికారం చేపట్టిన నాటి నుంచి పేద మహిళలను నిలువునా మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మండిపడ్డారు. మంగళవారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ.. 'చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.16,600 కోట్ల మేర రుణాలు తగ్గించేశారు. సున్నా వడ్డీలకు గుండు సున్నా చుట్టేశారు. ఈ విషయాన్ని నాబార్డు నివేదిక స్పష్టం చేసింది. రూ.470 కోట్ల మేర మహిళల పొదుపు తగ్గిపోయిందంటే చంద్రబాబు పాలన చేతకానితనం ఏమిటో అర్థమవుతోంది. వైఎస్ జగన్ హయాంలో పురోగమనంలో ఉన్న మహిళా సంఘాలు, బాబు హయాంలో తిరుగమనంలోకి చేరిపోయాయి. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాల మాఫీతో పాటు సున్నా వడ్డీ ఎగ్గొట్టడంతో ఏ, బీ గ్రేడ్‌తో ఉన్న సంఘాలు, సీ, డీ గ్రేడ్‌లుగా దిగజారిపోయాయి. రాష్ట్రంలో 18.36 శాతం మహిళా సంఘాలు ఎన్‌పీఏలుగా మారిపోయాయి. 2024లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల పొదుపు శాతం రూ.479.11 కోట్లు తగ్గిపోయిందని నాబార్డు నివేదించింది. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఒక్కో పొదుపు సంఘానికి రూ.8.8 లక్షలు రుణాలు ఇచ్చేవారు. ఎన్నికల సమయంలో సున్నా వడ్డీని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలు చేస్తామని హామీ ఇచ్చి, చివరకు రూ.7,500 కోట్ల మేర సున్నా వడ్డీ బకాయిని పేరుకుపోయేలా చేయడమే చంద్రబాబు గారడీ' అని ఎద్దేవా చేశారు. సంక్రాంతి సంబరాల పేరిట రాష్ట్రాన్ని క్యాసినోలు, జూదాలకు అడ్డాగా, అశ్లీల నృత్యాలుగా కేపిటల్‌గా మార్చేశారనీ, గోవా వంటి నగరాల్లో జరిగే పాశ్చాత్య సంస్కృతిని రాష్ట్రానికి తీసుకువచ్చి తెలుగుదేశం పార్టీని తెలుగు డర్టీ పార్టీగా, కూటమి ప్రభుత్వం పాలనని క్యాసినో పాలనగా మార్చేశారని మండిపడ్డారు.

ఏసీబీ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టులో పిటిషన్లు

చంద్రబాబు తదితరులపై కేసుల్లో డాక్యుమెంట్లు ఇవ్వడానికి ఏసీబీ కోర్టు నిరాకరణ

ఆ ఉత్తర్వులను సవాల్ చేసిన పిటిషనర్

సాక్షి, అమరావతి: చంద్రబాబు నాయుడు 2014–19 మధ్య సీఎంగా ఉన్న సమయంలో జరిగిన మద్యం, ఫైబర్ నెట్ కుంభకోణాలపై సీఐడీ నమోదు చేసిన కేసుల డాక్యుమెంట్లను ఇచ్చేందుకు నిరాకరిస్తూ ఏసీబీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రైల్వే విశ్రాంత ఉద్యోగి ఏము కొండల రావు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ మేరకు ఆయన వేర్వేరుగా రెండు రివిజన్ పిటిషన్లను దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు, పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలని సీఐడీని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 3కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రబాబు తదితరులపై ఉన్న కేసులను ఏసీబీ కోర్టు మూసివేస్తోంది

అంతకు ముందు కొండలరావు తరఫు న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. మద్యం, ఫైబర్‌నెట్ కుంభకోణాలకు సంబంధించి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన మంత్రివర్గ సభ్యులతో పలువురు అధికారులపై గత ప్రభుత్వ హయాంలో సీఐడీ కేసులు నమోదు చేసిందన్నారు.



చంద్రబాబు తదితరులపై నమోదైన కేసులను ఒక్కొక్కటిగా ఏసీబీ కోర్టు మూసివేస్తూ వస్తోందన్నారు. ఈ కేసుల తాలూకు అన్ని రికార్డులను, డాక్యుమెంట్లను ఇవ్వాలని పిటిషనర్ కోరగా, థర్డ్ పార్టీకి ఇవ్వలేమంటూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులిచ్చిందని పేర్కొన్నారు. ఏసీబీ కోర్టు మూసేసిన కేసుల్లో విస్తృత ప్రజా ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని తెలిపారు. రూ.25వేల కోట్ల ప్రజాధనం ఆ కేసులతో ముడి ఉందని ఆయన వివరించారు. చంద్రబాబు తదితరులపై నమోదు చేసిన కేసుల్లో సీఐడీ భారీస్థాయిలో సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసిందని పేర్కొన్నారు. అలాగే ఇతర ఆధారాలను కూడా సేకరించిందన్నారు. అయినప్పటికీ సీఐడీ మాత్రం మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ కింద కేసుల మూసివేతకు ఏసీబీ కోర్టులో రిపోర్ట్ దాఖలు చేసిందన్నారు. ఏసీబీ కోర్టు సైతం వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా చంద్రబాబు తదితరులపై కేసులను మూసివేసిందన్నారు. వాస్తవానికి ఈ కేసుల్లో ప్రజా ప్రతినిధులు నిందితులుగా ఉన్నారని, అందువల్ల ఈ కేసులను ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక న్యాయస్థానం విచారించాల్సి ఉంటుందన్నారు. అయితే అందుకు విరుద్ధంగా ఏసీబీ కోర్టే విచారించిందని పేర్కొన్నారు.

పూర్తి వివరాలు సమర్పిస్తాం

సీఐడీ తరఫున అదనపు పీపీ పాణిని సోమయాజీ వాదనలు వినిపిస్తూ, ఈ కేసు మొదటిసారి విచారణకు వస్తోందన్నారు. పూర్తి వివరాలను సమర్పించేందుకు గడువునివ్వాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ, పూర్తి వివరాల సమర్పణ నిమిత్తం విచారణను ఫిబ్రవరి 3కి వాయిదా వేశారు.

వెయ్యి మందిని వెయ్యిసార్లు యుద్ధంలో ఓడించిన వాడికంటే, తనను తాను గెలుచుకున్నవాడే (మనసును అదుపులో ఉంచుకున్నవాడు) అందరికంటే గొప్ప వీరుడు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 21 జనవరి 2026

డీజీసీఏ మెతకవైఖరి

విమానయాన సంస్థ ఇండిగో లోటుపాట్లన్నిటినీ సరిదిద్దుకోవటంతో దాని నిర్వహణ మెరుగై, సాధారణ స్థాయికి చేరుకుందని పౌర విమానయాన డైరెక్టర్ జనరల్(డీజీసీఏ) విభాగం మంగళవారం తెలిపింది. మంచిదే! అత్యధిక శాతం మంది ప్రయాణికులు ఆధారపడే సంస్థ సవ్యంగా ఉండటం సంతోషించదగ్గదే. కానీ సమస్యకు మూలకారణం వెతకటంలోనూ, తగిన పెనాల్టీ విధించటంలోనూ డీజీసీఏ ఇంకా మెతకవైఖరే అవలంబిస్తోందని తాజా పరిణామాలు తెలియజేస్తున్నాయి. గత నెలలో ఇండిగో సృష్టించిన సంక్షోభంతో పోలిస్తే దానికి విధించిన పెనాల్టీ రూ. 22.2 కోట్లు ఏపాటి? ఆ సంక్షోభం అనుకోకుండా సంభవించిందేమీ కాదు. డీజీసీఏ నియంత్రణలు నచ్చక, వాటిని అనుసరించటం ససేమిరా ఇష్టంలేక ఉద్దేశపూర్వకంగా సృష్టించిన పెను తుపాను అది. దాని ప్రభావం వల్ల దాదాపు వారంరోజుల పాటు విమానయాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు 3,000 సర్వీసులు రద్దయి, కొన్ని సర్వీసుల్లో జాప్యం ఏర్పడి లక్షలాదిమంది ప్రయాణికులు ఎన్నో అగచాట్లు ఎదుర్కొనవలసి వచ్చింది. పరీక్షలకూ, ఇంటర్వ్యూలకూ హాజరు కావలసిన వారు మొదలుకొని కోట్లాది రూపాయల విలువైన ఒప్పందాలు కుదుర్చుకునే వారి వరకూ ఈ సంక్షోభం వల్ల నష్టపోయారు. మనోవేదన అనుభవించారు. ప్రాణాపాయంలో ఉన్న ఆప్తుల చివరిచూపు దక్కనివారూ, వైద్యచికిత్స కోసం బయల్దేరినవారూ రోదించారు. ప్రత్యామ్నాయాలు వెదుక్కుందామనుకున్నా లగేజి గల్లంతై అల్లాడిపోయారు. ఇంతమంది ఇన్నివిధాల నష్టపోగా అందుకు తగిన మూల్యం చెల్లించవద్దా? వేరే దేశాల్లో ఇదే జరిగితే ఏమయ్యేది?

ఇండిగో సంక్షోభం వచ్చిపడ్డాక డీజీసీఏ మేల్కొంది. డిసెంబర్ మొదటివారం నుంచి నెలాఖరు వరకూ ఆ సంస్థ రోజువారీ నిర్వహణపై నివేదికలు తెప్పించుకుంది. విమానాలు రద్దయినా, ఆలస్యమైనా అందులో పేర్కొనాలని, సిబ్బంది వివరాలివ్వాలని, ఎందరు సెలవులో ఉన్నారో, ప్రత్యామ్నాయ ఏర్పాట్లేమిటో కూడా చెప్పాలని కోరింది. సర్వీసుల నిర్వహణ తీరును, సామర్థ్యాన్ని మదింపు వేశారు. ఈ క్రమంలో డీజీసీఏ కూడా తన లోపాలు సవరించుకుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రెండేళ్ల క్రితమే ఏర్పరిచిన నిబంధనలను విమానయాన సంస్థలు బేఖాతరు చేస్తున్నా ఆ సంస్థ సరిగా పట్టించుకోలేదు. అందునా ఇండిగోను చూసీచూడనట్టు వదిలేశారు. ఆ నిబంధనలు నిజానికి భద్రతను దృష్టిలో పెట్టుకుని రూపొందించినవి. లాభార్జన కోసం తక్కువమందితో అధికపని చేయించటం ప్రమాదకరమన్న ఉద్దేశంతో నిర్దేశించిన ప్రమాణాలవి. వారంలో పైలెట్లకు ఉండే విశ్రాంతిని 36 గంటల నుంచి 48 గంటలు చేయటం, రాత్రి పనివేళల్ని గరిష్ఠంగా 10 గంటలకు పరిమితం చేయటం, ఒక పైలెట్ వారానికి రెండుసార్లు మించి నైట్ ల్యాండింగ్ చేయకూడదని నిబంధన విధించటం వంటివి అందులో ఉన్నాయి. వీటిని అమలు చేయాల్సిందేనని చెబుతున్నా ఇండిగో మొండికేసింది. 'మాపై ఒత్తిడి తెస్తే చివరికి జరిగేది ఇదే' అని తెలియజెప్పేందుకే అడ్డగోలుగా సర్వీసుల రద్దు మొదలెట్టిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. మొదట్లోనే సరైన పర్యవేక్షణతో, సమస్యాత్మకంగా ఉండేవారిపై చర్యలు తీసుకుంటే కథ వేరుగా ఉండేది. డీజీసీఏలో ఇది లేకపోబట్టి ఇండిగో ఇలా చేయగలిగింది.

ఇంత సంక్షోభాన్ని సృష్టించిన సంస్థ నిర్వాహకులకు గుణపాఠం చెప్పే రీతిలో చర్యలుంటే మరే సంస్థా ఎప్పుడూ ఇలాంటి తప్పు చేయటానికి సాహసించేది కాదు. ఇండిగో భారత్‌లో నిర్వహించే కార్యకలాపాల వల్ల వచ్చే ఆదాయం తక్కువేం కాదు. 2024–25లో ఇండిగో సంస్థ లాభార్జన రూ. 7,253 కోట్లు. ఆ సంస్థ నిర్లక్ష్యం కారణంగా ఇన్ని లక్షలమంది నష్టాలు, కష్టాలకు లోనయినప్పుడు కఠినమైన చర్యలుండొద్దా? నష్టపోయిన వారికి మెరుగైన పరిహారం చెల్లించేలా చూడొద్దా? డీజీసీఏలో కింది స్థాయిలో ఇండిగో వంటి సంస్థలతో లాలూచీ పడినవారు ఉంటే ఉండొచ్చు. అలాంటి వారిపైనే కావొచ్చు... ఆ సంస్థ చర్యలు కూడా తీసుకుంది. కానీ పై స్థాయిలో కూడా మెతకవైఖరే ఉన్నదని ఆ సంస్థ తాజా వైఖరి చూస్తే అర్థమవుతోంది. 'నియంత్రణకు సంబంధించి తగిన సంసిద్ధత లేనందు వల్లే' సంక్షోభం తలెత్తిందని డీజీసీఏ నిర్ధారణ చేయటం దేన్ని సూచిస్తోంది? ఇలాంటి ధోరణి మంచిది కాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.తదియ రా.2.18 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ధనిష్ఠ ప.2.08 వరకు తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.9.22 నుండి 10.59 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.50 నుండి 12.34 వరకు, **అమృత ఘడియలు:** లేవు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.45
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

ఆత్మవిశ్వాసం



నా శరీరాన్ని చువ్వలా మార్చుకోవటానికి నేను చాలా కష్టపడ్డాను. నా లోపలి నైపుణ్యాల గురించి మొదట్లో నాకు తెలిసేది కాదు. కానీ, శరీరాన్ని, నైపుణ్యాలను మెరుగుపరుచుకునే ఆత్మవిశ్వాసం ఉంటే మీరు దేనినైనా సాధించగలరని నేను చెప్పగలను.

– సంతానం, తమిళ నటుడు

మొగ్గ



సాయంత్రం మొగ్గగా ఉన్న పువ్వు, తెల్లారేసరికి పువ్వులా తన రేకులను విప్పుతుంది. ప్రపంచం ఆ రేకులను గొప్ప ఆశ్చర్యంతో చూస్తుంది. పరిమళాన్ని ఆస్వాదిస్తుంది. అంతేకానీ, ఒక్కో రేకు విచ్చుకోవటానికి ఆ మొగ్గ పడిన ప్రయాసను గమనించదు.

– ప్రతిభా రే, రచయిత్రి – 'పద్మభూషణ్' గ్రహీత

భిన్నంగా..!



నా గురువు నన్ను నిరంతరం కొత్తగా ఆలోచించమని పీడించేవారు. వాస్తవానికి అది పీడించటం కాదు, ప్రోత్సహించటం! ప్రతిసారీ ఆయన, "నువ్వు భిన్నంగా ఏం చేయగలవు?" అనేవారు. కొత్త ఆలోచన అనే ఆ మాయా క్షణాన్ని చేరుకోవడానికి మీరు కృషి చేయాలి.

– సంజయ్ సుబ్రహ్మణ్యన్, కర్ణాటక సంగీతకారుడు

ఆశించండి



లైఫ్‌లో మీరు నెగెటివ్‌గా దేనినీ ఆలోచించకండి. మంచి జరుగుతుందని ఆశించండి. ప్రతిదానినీ మీరు అనుమానిస్తూ ఉంటే జీవితం మీ కాలాన్నంతా హరిస్తుంది.

– రుబీనా అలీ, 'స్లమ్‌డాగ్ మిలియనీర్' బాలనటి

ఆనందం



జీవితం అంతులేని సమస్యల పరంపర. కనుక, సమస్యలు లేని జీవితాన్ని ఆశించకండి. సమస్యలకు మీ అంతట మీరు కనుగొనే పరిష్కారాల నుంచి నిజమైన ఆనందం వస్తుంది. ఆ ఆనందం ఒక విజయంతో సమానం. ఎల్లప్పుడూ ఆనందంగా ఉండండి.

– మార్క్ మాన్సన్, బ్లాగర్

డేటా

మీరు ఓపెన్ – ఏఐ లేదా ఆలీబాబాతో పోటీ పడనవసరం లేదు. అందుబాటులో ఉన్న డేటాను ఉపయోగించి మీ సొంత ఏఐ మహాసామ్రాజ్యానికి పునాది వేసుకోండి. ప్రామాణికమైన డేటాను మీరు ఇవ్వగలిగితే ఈ రంగంలో నిలదొక్కుకున్నట్లే!

– సుశాంత్ సచ్‌దేవా, రిసెర్చర్, ఓపెన్–ఏఐ

సంస్కరణలతోనే సత్వర వృద్ధి

సందర్భం

సుష్మా రామచంద్రన్

ఒకపక్క భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. మరోపక్క అమెరికా ఇష్టం వచ్చినట్లు సుంకాలు విధిస్తోంది. ఈ నేపథ్యంలో దేశ 2026–27 బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందుతున్నాయి. ఈ కీలక ఘట్టంలో 2025–26 ఆర్థిక సంవత్సరపు మొదటి ముందస్తు అంచనాలు కొన్ని శుభ వార్తలను మోసుకొచ్చాయి. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో వృద్ధి రిజర్వ్‌బ్యాంక్ తొలుత అంచనా వేసినట్లు 6.5 శాతం కాక, 7.4 శాతం ఉండగలదనే అంచనాకు రావడం పరిస్థితులలో వచ్చిన మార్పును సూచిస్తోంది.

సంస్కరణలు మార్పు తెచ్చాయనీ, వృద్ధి ఇదే స్థాయిలో నిలకడగా కొనసాగేందుకు వాటిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందనీ కూడా ఇది సూచిస్తోంది. వస్తువు – సేవల పన్ను (జీఎస్టీ)లో శ్లాబులను మార్చడం, చాలా వాటిపై పన్నుల శాతాలు తగ్గించడం వల్ల ఆర్థిక వ్యవస్థ తేటపడింది. జీఎస్టీలోని నియంత్రణ సంక్లిష్టతను దృష్టిలో పెట్టుకుని ఆ మార్పుచేర్పులు ఎప్పుడో చేసి ఉండవలసింది.

కాలం చెల్లిన చట్టాలకు గుడ్‌బై!

అలాగే, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొన్ని చర్యలను ఇటీవలి కాలంలో తీసుకున్నారు. పార్లమెంట్ ఐదేళ్ళ క్రితమే ఆమోదించిన నాలుగు కార్మిక స్మృతులను అమలులోకి తెచ్చారు. పారిశ్రామిక వ్యవహారాలకు సంబంధించిన దాదాపు 29 వేర్వేరు చట్టాల స్థానంలో ఆ స్మృతులు వచ్చి చేరాయి. వలస పాలన కాలంనాటి ఆ చట్టాలను కూడా ఎన్నడో మార్చి ఉండాల్సింది. చట్టాల సంఖ్య ఎక్కువ కావడంతో కార్మిక సమస్యలు ఏళ్ళ తరబడి చిక్కుముడులకు లోనవుతూ వచ్చాయి. ఫలితంగా, వ్యాపార సంస్థలు ఆ చట్టాలను అనుసరించడంలో గందరగోళం నెలకొంటూ వచ్చింది.

కొత్త లేబర్ కోడ్స్ ఆర్థిక వృద్ధికి తక్షణం తోడ్పడగల సంస్కరణ కాకపోవచ్చు. కానీ, పెట్టుబడులు పెట్టదలచుకున్నవారికి తీవ్ర సందేహాలను రేకెత్తిస్తున్న అంశాల్లో అవి స్పష్టతను, సరళతను తెచ్చాయి. ఉదాహరణకు, ఇంటి నుంచి పని చేసే విషయంలో అవి మరింత వెసులుబాటుకు అవకాశం కల్పించాయి. పర్మనెంట్ ఉద్యోగాలకు బదులు స్వల్పకాలిక కాంట్రాక్టులు, ఫ్రీలాన్సర్ ఉద్యోగాలు పెరుగుతున్న 'గిగ్' ఆర్థిక వ్యవస్థలో వర్కర్లకు మరింత సామాజిక భద్రతను కల్పించేందుకు తోడ్పడనున్నాయి. ఆ స్మృతుల్లో ఇప్పటికీ లోపాలు ఉంటే ఉండవచ్చు; వాటిని భవిష్యత్తులో పరిష్కరించుకోవచ్చు. మొత్తానికి, కాలం చెల్లిన చట్టాలను రద్దు చేయడం వల్ల దేశంలో వ్యాపార నిర్వహణ సులభతరం అయింది.

◆ వ్యాపార నిర్వహణ సులువుగా సాగే అవకాశాన్ని కల్పించే విధంగా 2026-27 బడ్జెట్ రూపొందాలి. అలాగే ఎగుమతులపై ఆధారపడిన పరిశ్రమలకు బడ్జెట్ కొంత ఆసరా కల్పించవలసి ఉంది.

వృద్ధి సానుకూలమే!

ఇతర రంగాలలో కూడా సంస్కరణల అవసరం ఉంది. మొదటి ముందస్తు అంచనాలలో అన్నీ సానుకూలంగా ఏమీ లేకపోవడం ఆ వాస్తవాన్ని మరింత వెల్లడిస్తోంది. ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో అంటే అక్టోబర్ నుంచి మార్చి మధ్య కాలంలో వృద్ధి రేటు మందగించింది. మొదటి రెండు త్రైమాసికాలలో వరుసగా 7.8 శాతం, 8.2 శాతం వృద్ధి రేటు నమోదైంది. తర్వాత, రెండు త్రైమాసికాలలో ఇది 6.9 శాతం స్థాయిలో ఉండవచ్చని భావిస్తున్నారు.

తిరిగి సానుకూలంగా ఉన్న అంశాల వైపు దృష్టి సారిద్దాం. వస్తూత్పత్తి 4.5 శాతం నుంచి 7.4 శాతానికి విజృంభించినట్లు ముందస్తు అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఇది 2025–26 ఆర్థిక సంవత్సరంలో అధిక వృద్ధి సాధించేందుకు ఊతం ఇచ్చింది. సగటున దాదాపు 8 శాతం చొప్పున, గత మూడేళ్లలో వృద్ధిలో కనిపించిన వేగం కూడా గణనీయమైన విషయమే. ఇప్పటికి కొద్ది ఏళ్ళ నుంచి భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా పేరు తెచ్చుకుంటున్నప్పటికీ, మధ్య–ఆదాయ ట్రాప్ నుంచి తప్పించుకునేందుకూ, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకూ, ఇంకా వేగంగా వృద్ధి చెందవలసిన అవసరం ఉంది. బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించేటపుడు, ఆర్థిక మంత్రి ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది.

దృష్టి పెట్టాల్సినవి!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాల వల్ల మారిపోతున్న ప్రపంచంలో వాణిజ్యమే పెద్ద అంశంగా కనిపిస్తోంది. అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తువులు 50 శాతం సుంకాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై మరికొంత సుంకాలు విధిస్తామని ఆయన బెదిరిస్తున్నారు. భారత –అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం అనేక కారణాల రీత్యా, ముఖ్యంగా ట్రంప్ అహంకారం వల్ల, ఇప్పటికీ తుదిరూపు దిద్దు కోలేక పోతోంది. మన దేశానికి కొత్త అమెరికా రాయబారిగా వచ్చిన సెర్జియో గోర్ కనబరుస్తున్న సానుకూలత వల్ల, ఈ ఒప్పందం కుదరవచ్చని ఆశలు పొటమరిస్తున్నాయి. దానిమాటెలా ఉన్నా... ఎగుమతులపై ఆధారపడిన, క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న పరిశ్రమలకు బడ్జెట్ కొంత ఆసరా కల్పించవలసి ఉంది.

రత్నాలు, ఆభరణాలు వంటి పరిశ్రమలు, రెడీమేడ్ దుస్తుల కంపెనీలు అమెరికా సుంకాలతో బాగా దెబ్బతినిపోతాయని భయపడిన మాట వాస్తవం. కానీ, అవి వేగంగా ఇతర మార్కెట్లకు విస్తరించడం వల్ల కనీసం తాత్కాలికంగానైనా ఆ ప్రభావాన్ని తట్టుకోగలుగుతున్నాయి. నవంబర్ (2025)కు సంబంధించిన డేటా, ఈ విభాగాల ఎగుమతుల్లో ఆశ్చర్యకరంగా పెరుగుదలను కనబరచింది. ఆ విభాగాల ఎగుమతులు 2025 నవంబర్‌లో దాదాపు 19 శాతం పెరిగాయి. ఎగుమతులలో వృద్ధికి ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ వస్తువులు, ఫార్మాస్యూటికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, రెడీమేడ్ దుస్తుల విభాగాలు ప్రధాన ఆలంబనగా నిలిచాయి. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, భారీ సుంకాల ప్రతిబంధకాలు ఉన్నప్పటికీ, అమెరికాకు ఎగుమతులు 22 శాతం పెరిగాయి. మొబైల్ ఫోన్లు, ఎగుమతుల్లో ప్రధాన వస్తువుగా నిలుస్తున్నాయి. ఒక్క ఏడాది కాలంలోనే వాటి ఎగుమతులు మూడు రెట్ల పెరుగుదలను చవిచూశాయి.

నిరుద్యోగిత రేటు మూడునెలల కాలంలో అత్యల్ప స్థాయికి అంటే 8.6 శాతానికి తగ్గిందని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం తగ్గుముఖం పట్టడం దానికి కారణంగా పేర్కొంది. అయితే, వ్యవసాయమే ఇప్పటికీ 45 శాతం మందికి ఉపాధి కల్పిస్తోంది. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న నైపుణ్యం లేని, నైపుణ్యం ఉన్న వారిని తగినంతగా ఇముడ్చుకోగలిగినంతగా వస్తూత్పత్తి రంగం వ్యాకోచించలేదు. ఈ రంగం విషయంలోనే, భారత్, ఇతర ఆసియా ఆర్థిక వ్యవస్థల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. వీలైనంత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే విధంగా ఇతర దేశాల్లో చిన్న, మధ్య తరహా వస్తూత్పత్తి సంస్థలు తగినంతగా విస్తరించగలిగాయి. వ్యాపార నిర్వహణ సులువుగా సాగే అవకాశాన్ని కల్పించే విధంగా బడ్జెట్ రూపొందాలి. అప్పుడే, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు అవసరమైన స్థాయిల్లో వృద్ధి రేటును తీసుకెళ్ళడం సాధ్యమవుతుంది.

వ్యాసకర్త సీనియర్ ఫైనాన్సియల్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

అభివృద్ధి ముసుగులో భూదోపిడీ

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం సుమారు 33,000 ఎకరాల సారవంతమైన భూమిని త్యాగం చేసిన రైతుల ఆశలు అడియాసలయ్యాయి. రాజధాని నిర్మాణంతో భవిష్యత్తు బాగుపడుతుందన్న నమ్మకంతో తమ జీవనాధారాన్ని పణంగా పెట్టిన అన్నదాతలకు నేడు కన్నీళ్లే మిగిలాయి. ఏళ్లు గడిచినా భూముల్లో అభివృద్ధి కనిపించకపోగా, రైతులకు వాగ్దానం చేసిన లాభాలు అందడం లేదు. విచిత్రమేమిటంటే, రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాల్సింది పోయి, చెరువులు, వాగులు, నిరుపయోగమైన ప్రాంతాల్లో స్థలాలు కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకొంది. అభివృద్ధి చెందిన ప్లాట్ల కోసం రైతులు రోడ్లపై ఆక్రందనలు చేస్తున్నారు.

ఒకప్పుడు 50,000 ఎకరాలు ఉంటే ప్రపంచ స్థాయి రాజధాని నిర్మిస్తామని హామీ ఇచ్చిన పాలకులు, ఇప్పుడు అదే భూమితో మున్సిపాలిటీ స్థాయి పట్టణం కూడా కష్టమనేలా మాట్లాడుతున్నారు. అప్పట్లో డ్రోన్ విజన్లు, సింగపూర్ డిజైన్లతో 'వరల్డ్ క్లాస్ క్యాపిటల్' అని ఊరించినవారు, ఇప్పుడు 'ఇంటర్నేషనల్ క్యాపిటల్' పేరుతో మరిన్ని వేల ఎకరాలు కావాలంటున్నారు. అప్పటి హామీలు కేవలం పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లకే పరిమితమయ్యాయా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఉన్న భూమినే అభివృద్ధి చేయడానికి రూ. 1,20,000 కోట్లు అవసరమని చెబుతున్న

ప్రభుత్వం, మరోవైపు రెండో దశ ల్యాండ్ పూలింగ్ పేరుతో రైతులపై ఒత్తిడి తేవడం అన్యాయం. ఇది రాజధాని కోసం కాకుండా, వ్యక్తిగత రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమేనన్న ఆరోపణలు బలపడుతున్నాయి.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా, అత్యంత సాధారణ మౌలిక సదుపాయాలకే అసాధారణంగా ఖర్చు చేస్తున్నారు. జాతీయ రహదారుల సంస్థ ఆరు వరుసల రోడ్డును కిలోమీటరుకు రూ. 20–50 కోట్లతో నిర్మిస్తుంటే, ఇక్కడ ఒక కిలోమీటర్ రోడ్డుకు రూ. 180 కోట్లు వెచ్చించడం ఏ రకమైన అభివృద్ధి? ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల నిర్వహణకు నిధులు లేవని బుకాయిస్తూ, మరోవైపు అమరావతి ఉత్సవాలకు కోట్లు ఖర్చు చేయడం పాలకుల ప్రాధాన్యాలను ప్రశ్నార్థకం చేస్తోంది.

తాజాగా ఏర్పాటు చేసిన అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏజీఐసీఎల్) అనే ప్రత్యేక సంస్థ ద్వారా రైతుల భూములను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది. ఎటువంటి టెండర్ పద్ధతులు లేకుండా, పీపీపీ మోడల్‌లో భూములను కారుచౌకగా లీజుకు ఇవ్వడానికి ఓ స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)కి అధికారాలు ఇచ్చారు. రాష్ట్ర రుణ పరిమితి నిబంధనల నుండి తప్పించుకోవడానికి, భూములను తాకట్టు పెట్టి భారీగా అప్పులు తెచ్చుకోవడమే ఈ సంస్థ అసలు లక్ష్యంగా కనిపిస్తోంది. సీఆర్‌డీఏ వంటి సంస్థలు ఉండగా, కేవలం రాజకీయ జోక్యం కోసమే ఈ కొత్త ప్రయోగాలు చేస్తున్నట్లు అర్థమవుతోంది.

రైతు దొండపాటి రామారావు అధికారుల ముందే గుండెపోటుతో మరణించడం ప్రభుత్వ భూదందా తీవ్రతకు నిదర్శనం. ఇప్పటికైనా ప్రభుత్వం పారదర్శకతతో వ్యవహరించి, ముందుగా పూలింగ్ చేసిన భూములను అభివృద్ధి చేసి రైతులకు న్యాయం చేయాలి. లేదంటే అమరావతి రుణ సంక్షోభంలో ముంచే 'దోపిడీ వాహనం'గా మిగిలిపోతుంది.

– రాహుల్ రెడ్డి తలకోల । మౌలిక సదుపాయాల విశ్లేషకుడు

గంగపుత్రులను ఆదుకున్నది వైసీపీనే!

ఇన్ బాక్స్

ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బక్కచిక్కి మూలబడిన గంగపుత్రులను ఆదుకొమ్మని 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబును విన్నవించుకోవడానికి వెళితే 'తోలుతీస్తా, తొక్క తీస్తా'నని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గంగపుత్రులను అగ్రభాగాన నిలబెట్టి అక్కున చేర్చుకున్నారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా గంగపుత్రులకు మూడు ఎమ్మెల్యేలు, ఒక రాజ్యసభ, ఒక మంత్రి; రాయలసీమ నుండి ఇద్దరు, కోస్తా నుండి ఒకరు, ఉత్తరాంధ్ర నుండి ఒకరు చొప్పున ఎమ్మెల్సీలను చేసి చట్టసభలకు పంపారు. చరిత్రలో మొట్టమొదటిసారి గంగపుత్రులకు నాలుగు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, నలుగురు చైర్మన్‌లు, 72 మంది రాష్ట్రస్థాయి డైరెక్టర్లను చేసి రాజకీయ గుర్తింపు తెచ్చారు.



వేట నిషేధ సమయంలో అప్పటి వరకు ఇస్తున్న 'మత్స్యకార భరోసా' 4,000 రూపాయలను 10,000 రూపాయలకు పెంచి, అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచే అర్హులందరికీ అందించింది జగన్ ప్రభుత్వం. కూటమి తన ఎన్నికల మేనిఫెస్టోలో మత్స్యకార భరోసా రెట్టింపు చేసి 20 వేల రూపాయలు ఇస్తామని చెప్పి మొదటి సంవత్సరం పూర్తిగా ఎగ్గొట్టింది. వైసీపీ ప్రభుత్వం ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారునికి అప్పటివరకు ఇస్తున్న ఐదు లక్షల రూపాయలను 10 లక్షల పెంచి ఇచ్చింది. డీజిల్ సబ్సిడీ ఆరు రూపాయల నుండి తొమ్మిది రూపాయలకు పెంచింది. కేవలం ఈ ఒక్క పథకం ద్వారానే సుమారు లక్షా 35 వేల మంది మత్స్యకారులకు 450 కోట్లు ఖర్చు చేసింది.

మత్స్యకారుల అభివృద్ధికి 'ఫిష్ ఆంధ్ర... ఫిట్ ఆంధ్ర'లో భాగంగా 9 ఫిషింగ్ హార్బర్లు, నాలుగు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు, మత్స్య యూనివర్సిటీ, ప్రతి నియోజకవ వర్గ కేంద్రంలో ఫిష్ హబ్, సెంటు స్థలం ఉంటే రూ. 10 లక్షలతో ఫిష్ మాల్ ఏర్పాటు, తద్వారా ఫిష్ మార్కెటింగ్, ప్రాసెసింగ్ యూనిట్లు అభివృద్ధి చేశారు. మత్స్యరంగానికి సంబంధించి అన్ని అంశాలలో ఏపీని భారత ప్రభుత్వం 2021లో ఉత్తమ రాష్ట్రంగా గుర్తించి, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం (నవంబర్ 12) నాడు బహుమతి ప్రదానం కూడా చేసింది. నేడు కూటమి ప్రభుత్వం గంగపుత్రులకు తగినంత న్యాయం చేయకపోగా గొంతులోతు కష్టాలలో కూరుకుపోయిన వారిని గాలికి వదిలేసింది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు 'ఆప్కాబ్' ఎన్నికల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గంగపుత్రులను అడ్డంగా చీల్చి, ఐకమత్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నది.

– కె.వి. రమణ । బెస్త కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, అనంతపురం

డేటా పాయింట్

ముఖ్య భాగస్వామి అమెరికాయే!

ఇండియా ఎగుమతులకు యూఎస్‌ఏ కీలకమైన భాగస్వామిగా కొనసాగుతోంది. 'ట్రేడింగ్ ఎకనామిక్స్' గణాంకాల ప్రకారం, ఇండియా ఎగుమతులు అత్యధికం (18 శాతం) అమెరికాకే వెళ్తున్నాయి.





అసలైన ఆరాధన

తిరువణ్ణామలైలో భగవాన్ రమణ మహర్షిని దర్శించుకోవడానికి చాలామంది వచ్చివెళ్తుండేవారు. తమకున్న సందేహాలు అడిగి తెలుసుకునేవారు. రమణులవారు వారితో మోక్షం పొందడం గురించి అనేక విషయాలు చెప్పేవారు. ఎదుటివారి మాటలూ వినేవారు. అయితే ఆయనకు సపర్యలు చేసే భక్తుడొకడు ఇదంతా గమనిస్తూ ఉండేవాడు. తాను దేని గురించీ విపులంగా మాట్లాడలేననీ, వేదాలు అధ్యయనం చేయనందున మోక్షం పొందే అవకాశం తనకు లేదేమోననీ అతను చింతించేవాడు.

రమణులవారు అతని కోరికను, బాధను అర్థం చేసుకున్నారు. ఒకరోజు ఆయన 'ఈ రోజు నువ్వు క్షవరం చేసుకున్నావా?' అని అడిగారు. ఆయన ఎందుకలా అడుగుతున్నారో అతనికి అర్థం కాలేదు కానీ 'అవును స్వామీ' అన్నాడు. 'అద్దంలో చూసుకునేగా నువ్వు క్షవరం చేసుకున్నావు?' అని రమణులవారు మళ్ళీ అడిగారు. అప్పటికీ అర్థంకాని అతను వినయంగా తల ఊపాడు, అవునన్నట్లు! 'అద్దంలో చూసుకునేగా చేసుకున్నావు? క్షవరం చేసుకునే వరకేగా అద్దం నీకు అవసరం. అది నీ ముఖాన్ని అందంగా మార్చుకోవడానికి తోడ్పడుతుంది. అద్దంలో నువ్వు నీ ముఖాన్ని చూడగలవు. కానీ అద్దం దానంతట అది నీకు క్షవరం చేయదుగా?' అని ఆయన అన్నారు. అప్పుడతను, 'అవును స్వామీ' అన్నాడు.

అంతట రమణులవారు, 'అదే విధంగా, వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు. అవి నీకు ఎటువంటి కష్టం లేదా గాయం లేకుండా ముక్తిని సాధించడంలో మాత్రమే సహాయపడతాయి. అంతేతప్ప వాటంతట అవి నీకు ముక్తిని ఇవ్వలేవు. తీవ్రమైన భక్తి, భగవంతుని ఆరాధన మాత్రమే నీకు ముక్తిని ఇస్తాయి. అవి నిన్ను దేవుడి వద్దకు తీసుకుపోతాయి. కనుక నువ్వు వాటిని సవ్యంగా చేస్తే చాలు' అన్నారు.

కాబట్టి, నిజమైన ప్రేమతో దేవుడిని పూజించడమూ, దేవునిలో భాగమైన ప్రతి జీవికీ మనకు చేతనైన మేరకు సేవ చేయడమూ నిజమైన భక్తి. అదే దేవునికి మనం చేసే నిజమైన ఆరాధన అవుతుంది.

– యామిజాల జగదీశ్

ఎన్‌జీటీ ఉత్తర్వులపై హైకోర్టుకు రావొచ్చు

- అలా దాఖలు చేసే వ్యాజ్యానికి విచారణార్హత ఉంది
- స్వచ్ఛమైన గాలి, నీరు పొందడమన్నది పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కు
- హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

సాక్షి, అమరావతి: జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) జారీ చేసే ఉత్తర్వులను సవాలు చేస్తూ అధికరణ 226 కింద తమ ముందు దాఖలు చేసే వ్యాజ్యాలకు విచారణార్హత ఉందని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్‌జీటీ చట్టం సెక్షన్ 22 కింద ఉన్న ప్రత్యామ్నాయం ప్రకారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని, అయితే ఈ సెక్షన్ కింద హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంపై ఎలాంటి నిషేధం లేదని తేల్చి చెప్పింది. సెక్షన్ 22 కింద ఉన్న ప్రత్యామ్నాయం హైకోర్టు తన న్యాయ పరిధి ఉపయోగించకుండా అడ్డుకోలేదంది. చట్ట నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి పర్యావరణ అనుమతులు (ఈసీ) లేకుండా జరిపే మైనింగ్ కార్యకలాపాల వల్ల ప్రభావితమయ్యే ఏ వ్యక్తి అయినా ఎన్‌జీటీ చట్టంలోని సెక్షన్ 16లో పేర్కొన్న 'బాధిత వ్యక్తి' నిర్వచన పరిధిలోకి వస్తారని తెలిపింది. ఎలాంటి కాలుష్యానికి తావు లేకుండా గాలి, నీరు పొందడమన్నది పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కని హైకోర్టు పేర్కొంది. ఈ హక్కుకు భంగం కలిగితే ఏ వ్యక్తి అయినా అందుకు సంబంధించిన చర్యలను సవాలు చేయవచ్చునని పేర్కొంది.

ముఖ్యంగా పర్యావరణ అంశాల్లో సంబంధిత గ్రామానికి చెందిన వ్యక్తి ఎవరైనా కూడా ఎన్‌జీటీ ముందు అప్పీల్ దాఖలు చేయవచ్చునని తేల్చి చెప్పింది. పొట్టి శ్రీరాములు జిల్లా మోమిడి గ్రామంలో సిలికా మైనింగ్ విషయంలో శ్రీకుమారస్వామి మైనింగ్ సంస్థకు పర్యావరణ అనుమతులు మంజూరు చేసే విషయంలో సుప్రీంకోర్టు తాజా తీర్పును, చట్ట నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, వాటికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. పర్యావరణ అనుమతులను తాత్కాలికంగా నిలిపేస్తూ ఎన్‌జీటీ ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. ఎన్‌జీటీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ శ్రీకుమారిస్వామి మైనింగ్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ కుంచెం మహేశ్వరరావు ధర్మాసనం ఇటీవల కీలక తీర్పు వెలువరించింది.

పెల్లుబికిన విద్యుదావేశం

విద్యుత్ పంపిణీ సంస్థల 2026-27 ఆదాయ, అవసరాల నివేదికలపై మొదలైన బహిరంగ విచారణ

ప్రజాభిప్రాయ సేకరణకు ప్రజలను రానివ్వకపోవడంపై మండిపడ్డ జనం

విద్యుత్ చార్జీలు భారీగా పెంచేశారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం

సాక్షి,అమరావతి: ''ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) చరిత్రలో ఎన్నడూ ఇలా ఒకే ఒక సభ్యుడు వేదికపై ఉండి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం చూడలేదు. ప్రతిసారీ చైర్మన్, ఇద్దరు సభ్యులు ఉండి బహిరంగ విచారణ చేపట్టేవారు. ఈసారి ఒక్కరే ఉండటం ఆశ్చర్యంగా ఉంది. ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే.'' అంటూ ప్రజలు, నాయకులు ఏకిపారేశారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు సమర్పించిన 2026–27 ఆదాయ, అవసరాల నివేదికలు,టారిఫ్ ప్రతిపాదనలపై బహిరంగ విచారణ మంగళవారం తిరుపతిలో మొదలైంది. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీఈఆర్సీ సభ్యుడైన పీవీఆర్ రెడ్డి, ఇన్‌చార్జ్ చైర్మన్ హోదాలో ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. వేదికపై ఆయన ఒక్కరే కూర్చుని సమస్యలను, సూచనలను వినడంపై అక్కడికి వచ్చిన వారంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గడిచిన 20 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితిని తాము చూడలేదని, రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీఈఆర్సీ చైర్మన్‌ను, సభ్యుడిని నియమించే తీరిక ఎందుకు లేదని వారంతా ప్రశ్నించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ప్రజలను లోనికి అనుమతించకపోవడంతో ప్రజల్లో ఆవేశం కట్టలు తెంచుకుంది. ప్రజాభిప్రాయ సేకరణ అని చెప్పి ప్రజలను అనుమతించకుండా, అంతా అధికారులే ఉండి విచారణ జరపడం ఏమిటని వారు నిలదీశారు. దీంతో చైర్మన్(ఇన్‌చార్జి) కల్పించుకుని అందరినీ లోనికి అనుమతించాల్సిందిగా ఆదేశించారు.

చార్జీలు పెంచేశారు.. ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వరు

2025–26 ఆర్థిక సంవత్సరంలో ఏపీఈఆర్సీ సాధించిన లక్ష్యాలను, ఇచ్చిన ఆదేశాలను చైర్మన్(ఇన్‌చార్జి) పీవీఆర్ రెడ్డి వివరించారు. ఆ వివరాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ వినియోగదారుల నుంచి వినతులను స్వీకరించారు. పలువురు నేతలు పేదల గుడిసెలకు విద్యుత్ సర్వీసులు మంజూరు చేయడం లేదని, మీటర్ల కోసం నిర్ణీత రుసుమును కూడా కట్టించుకున్నారని ఫిర్యాదు చేశారు. అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు పెట్టబోమని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు బలవంతంగా పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసు కోసం దరఖాస్తు చేస్తే నెలలు, సంవత్సరాలు కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వకపోవడం వల్ల పంటలు కోల్పోయి రూ.లక్షలు నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు భారీగా పెంచేశారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.4495 కోట్ల భారం ప్రజలపై పడకుండా చేశామని, ఇప్పుడు వసూలు చేస్తున్న ట్రూ అప్ చార్జీలు త్వరలోనే పూర్తవుతాయని, భవిష్యత్తులో ఇక ఉండవని చైర్మన్ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇప్పుడొస్తున్న చార్జీ గతంలో వాడిన దానిపై వేస్తున్నారని వివరించారు. అభిప్రాయసేకరణకు ముందు మూడు డిస్కంల ప్రగతి నివేదికలను సీఎండీలు పి.పుల్లారెడ్డి, ఐ.పృథ్వీతేజ్, శివశంకర్ లోతేటి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

వేదికపై ఒక్కరే ఉండి బహిరంగ విచారణ నిర్వహిస్తున్న పీవీఆర్ రెడ్డి

యూనిట్ రూ.2.49 ఎక్కువని రూ.4.60కి ఎలా కొంటారు?

గత ప్రభుత్వం సెకీతో యూనిట్ రూ.2.49 కి కొనుగోలు చేయడానికి ఒప్పందం చేసుకుంటే అది తప్పని సీఎం చంద్రబాబు స్వయంగా అసెంబ్లీలో మాట్లాడి యాక్సిస్ నుంచి రూ.4.60కి యూనిట్ చొప్పున కొనడానికి ఏవిధంగా ఒప్పందం చేసుకుంటారంటూ సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యుడు కందరాపు మురళి ప్రశ్నించారు. ట్రూ డౌన్ చేశామంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.17 వేల కోట్లు విద్యుత్ భారాలు ప్రజలపై వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టైమ్ ఆఫ్ డే విధానంలో మార్పుల వల్ల 12 శాతం విద్యుత్‌పై అధిక ధరలు పడతాయని, దానిని మరోసారి పరిశీలించాలని పారిశ్రామిక వేత్త కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. అసలు ఆదాయ లోటు ఎందుకు వస్తోందని, లోపం ఎక్కడుందని విద్యుత్ రంగ నిపుణులు ఎం.వేణుగోపాలరావు ప్రశ్నించారు. అందరి అభిప్రాయాలనూ ఇన్‌చార్జ్ చైర్మన్ నమోదు చేసుకున్నారు.

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

- బొలెరోను ఢీకొట్టిన కారు
- ఏపీకి చెందిన ఐదుగురు దుర్మరణం మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

రాయచూరు రూరల్: కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గూడ్స్ బొలెరో వ్యాన్, మహీంద్రా ఎస్‌యూవీ కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మరణించిన ఘటన రాయచూరు జిల్లాలోని సింధనూరు తాలూకా బూదివాళ క్యాంపు వద్ద మంగళవారం రాత్రి 10 గంటలకు జరిగింది. గూడ్స్ వాహనంలో కొందరు వ్యాపారులు గొర్రెలు, మేకలను తీసుకుని బళ్లారి వైపు వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన ఎస్‌యూవీ కారు ఢీకొట్టింది. బొలెరో వాహనం పల్టీలు కొట్టగా అందులోని ఐదుగురు తీవ్ర గాయాలతో మరణించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు సింధనూరు డీఎస్పీ చంద్రశేఖర్ తెలిపారు. మృతులు, క్షతగాత్రులు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారని, పేర్లు, ఊరు వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. సింధనూరు గ్రామీణ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

రెడ్లకు పథకాలు అందకుండా కట్ చేస్తా

మంత్రి ఆనం వ్యాఖ్యలు



ఆత్మకూరు: ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం పొంగూరులో రెడ్లు తనకు ఓట్లు వేయలేదని, వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర బెనిఫిట్స్ అందకుండా కట్ చేయిస్తానంటూ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. పొంగూరులో ఆదివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. ఆ ఎన్నికల్లో తనకు రెడ్లు ఓట్లు వేయనందునే మెజార్టీ తగ్గిందన్నారు. కొందరు స్వయంగా తనతోనే రెడ్ల పార్టీ కాబట్టి వారికి (మేకపాటి) ఓట్లు వేస్తామని చెప్పారన్నారు. రెడ్డి ఓటర్లు డబ్బు, మద్యం ప్రభావానికి లోనయ్యారంటూ హేళనగా మాట్లాడారు. తనకు ఓటు వేయనందున రెడ్లు అందరికీ పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, తదితర సంక్షేమ పథకాలు తొలగించి వేరే వారికి పంపిణీ చేయమంటారా? అని బహిరంగ సభలోనే ఆయన ప్రశ్నించారు. పక్కనే తహసీల్దార్, ఎంపీడీవో ఉన్నారని, నాకు ఓటు వేసిన రెడ్లు ముందుకొచ్చి చెప్పాలని, లేకపోతే వారికి అందే పథకాలను తొలగించమంటారా? అంటూ బెదిరింపు ధోరణితో చిందులు తొక్కారు.

చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి

కర్నూలు(టౌన్): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కర్నూలులో మంగళవారం జరిగిన వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ జగన్ పాలనలో ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాల కన్నా అధికంగా ఇస్తామని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు... అధికారంలోకి వచ్చాక ప్రజలను దగా చేశారన్నారు. వృద్ధులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, నిరుద్యోగులు, ఉద్యోగులకు సైతం అరచేతిలో వైకుంఠం చూపించారన్నారు. రెండేళ్లలోనే రూ.3 లక్షల కోట్ల అప్పులు చేసి చంద్రబాబు ప్రభుత్వం ఒక్క పథకం అమలు చేయకపోగా, చివరికి రైతులను సైతం రోడ్డు పాలు చేసిందన్నారు. చంద్రబాబు పాలనలో సచివాలయాల ఉద్యోగులను సర్వేలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

వేదిక ఏదైనా.. జగన్‌ను విమర్శించడమే చంద్రబాబు, లోకేశ్ పని

- దావోస్ పర్యటనలోనూ అదే వైఖరి.. అవే మాటలు
- ఆత్మస్తుతి.. పరనింద.. ఇదే కూటమి పాలన
- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆక్షేపణ

సాక్షి,అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయకుండా.. చెప్పుకోవడానికి ఏమీలేక 'ఆత్మస్తుతి.. పరనింద' అన్నట్టుగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆక్షేపించారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సమయం, సందర్భం ఏదైనా.. వేదిక ఎక్కడైనా మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడమే చంద్రబాబు, లోకేశ్ రాజకీయ అజెండాగా మారిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు విచ్చలవిడిగా పెరిగాయని.. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, డ్రగ్స్ అన్నీ మాఫియా మాదిరిగా తయారయ్యాయని గుర్తు చేశారు. 'చంద్రబాబు రాజకీయ పైత్యం రోజురోజుకు హద్దులు దాటుతోంది. తాజాగా దావోస్ పర్యటనలోనూ చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ అసత్యాలు మాట్లాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సభలో కూడా వైఎస్ జగన్ వల్లే ఏపీ నష్టపోయిందని నిరాధార ఆరోపణలు చేశారు. ప్రజలను మభ్యపెట్టడమే వీరి రాజకీయ ధోరణిగా మారింది. సంక్రాంతి సందర్భంగా మద్యం ఏరులై పారింది. పేకాట, జూదం, కోడి పందేలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. సుమారు 75 వేల బెల్టు షాపుల ద్వారా ప్రజలను దోచుకున్నారు. కల్తీ మద్యం అమ్ముకున్నారు. లిక్కర్ ద్వారా దాదాపు రూ.15 వేల కోట్ల ప్రజాధనం దోచుకున్నారు. ప్రజల భద్రతను గాలికి వదిలేసి, ఈ అక్రమాలన్నింటినీ డైవర్ట్ చేసేందుకు వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీపై నిరాధార ఆరోపణలు చేయడం అత్యంత దారుణం' అని శ్రీనివాసులు మండిపడ్డారు.

సాల్మన్ చేసిన తప్పేమిటి?

'పల్నాడు జిల్లా పిన్నెల్లిలో వైఎస్సార్‌సీపీ దళిత కార్యకర్త మంద సాల్మన్ చేసిన తప్పేమిటి? నచ్చిన నాయకుడికి, నచ్చిన పార్టీకి ఓటు వేయడమే ఆయన చేసిన నేరమా? ప్రాణభయంతో ఎక్కడో తలదాచుకుంటున్న సాల్మన్ భార్య తీవ్ర జ్వరంతో బాధపడుతుంటే ఆమెను చూసేందుకు వెళగా అక్కడ దారుణంగా రాడ్లతో కొట్టి చంపారు. సాల్మన్ మృతదేహాన్ని గ్రామంలో ఖననం చేయనివ్వకుండా టీడీపీ నేతలు అడ్డుకోవడంకంటే అమానుషం మరొకటి ఉండదు. నచ్చిన పార్టీకి ఓట్లు వేసిన 1,500 కుటుంబాలను గ్రామం నుంచి వెలివేయడం అమానుషం. దళితులపై ఈ రకమైన దారుణాలు జరుగుతుంటే హోం మంత్రి ఏం చేస్తున్నారు? ప్రతిపక్షం గొంతెత్తి మాట్లాడితే అక్రమ కేసులతో వేధిస్తున్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సాల్మన్ హత్యకు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు జరిపించాలి. ఆ కుటుంబానికి 5 ఎకరాల భూమి, రూ.కోటి ఆర్థిక సాయం చేయాలి. ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. వీటన్నింటి సాధన కోసం పోరాటం కొనసాగిస్తాం' అని శ్రీనివాసులు స్పష్టం చేశారు.

న్యాయవాదిపై టీడీపీ నేతల దాడి..ఇల్లు కూల్చివేత

కాకినాడ జిల్లాలో దారుణం

ఫిర్యాదు స్వీకరించని పోలీసులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికారం ఉందనే అండ చూసుకుని టీడీపీ నేతలు చెలరేగిపోతున్నారు. అడ్డూ అదుపూ లేకుండా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. చివరకు న్యాయం కోసం పోరాడే న్యాయవాదులనూ వదలడం లేదు. తాజాగా కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం గోపాలపురం గ్రామంలో మంగళవారం లాయర్ అచ్చా మరిడియ్యపై స్థానిక టీడీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. తండ్రి నుంచి సంక్రమించిన 12 సెంట్ల స్థలంలో మరిడియ్య రేకులతో ఇల్లు నిర్మించుకున్నారు. అయితే ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు గతంలో టీడీపీ నేతలు యత్నించగా మరిడియ్య న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఆయనకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చింది. ఈ క్రమంలో టీడీపీకి చెందిన యడ్ల అప్పలరాజు, యడ్ల సూరిబాబు, యర్రమిల్లి సూర్యప్రకాష్ యడ్ల సత్యనారాయణ, యర్రమిల్లి దుర్గ రమేష్ మంగళవారం తనపై దాడికి పాల్పడ్డారని బాధితుడు మరిడియ్య విలేకరులకు తెలిపారు. జేసీబీతో తన ఇంటిని కూల్చేయడంతో కోర్టు కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లు ధ్వంసం అయ్యాయన్నారు. టీడీపీ నేతల దాడిలో గాయపడిన మరిడియ్య ప్రస్తుతం తుని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

న్యాయవాది రేకుల షెడ్డును కూలగొట్టి కలపను పారేస్తున్న దృశ్యం

ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

దాడికి పాల్పడిన వారిపై ఫిర్యాదు చేసినా తొండంగి పోలీసులు స్వీకరించలేదని మరిడియ్య తెలిపారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులతో పాటు, కోర్టులో న్యాయపోరాటం చేస్తానని చెప్పారు. న్యాయవాదిపై జరిగిన దాడిని బార్ అసోసియేషన్, న్యాయవాద సంఘాలు ఖండించాయి. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని మరిడియ్య అధికారులను కోరారు.

వాసవీమాతను అవమానించిన బాబు ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ నేత వెలంపల్లి ఫైర్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన శ్రీ వాసవీ అమ్మవారిని చంద్రబాబు ప్రభుత్వం అవమానిస్తోందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న దాడుల నుంచి ఆర్యవైశ్యులను కాపాడాలంటూ మంగళవారం అమ్మవారికి పూజలు చేసిన అనంతరం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. పొదిలిలో ఆర్యవైశ్యుడైన అవినాష్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. పిడుగురాళ్లలో జ్యోతి అనే ఆర్యవైశ్య మహిళను అర్ధరాత్రి పూట అన్యాయంగా నిర్బంధించి హింసించిన సీఐపై ఎటువంటి చర్యలు లేవన్నారు. దర్శి నియోజకవర్గంలో ఆంజనేయులు అనే ఆర్యవైశ్యుడు రేషన్ డీలర్‌షిప్‌కు రాజీనామా చేయలేదని టీడీపీ నేతలు కిడ్నాప్‌నకు ప్రయత్నిస్తే అతను పారిపోయి గుడిలో తలదాచుకున్నాడన్నారు. చీరాలలో టీడీపీ నేతలు కాల్‌మనీ పేరుతో సుజాత అనే మహిళ, ఆమె కుమారుడిని నుంచి అప్పు ఇచ్చిన దానికన్నా ఐదారు రెట్లు అధిక వసూళ్లకు పాల్పడ్డారన్నారు. అయినా శాంతించక వారిని హింసించటంతో వారిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఇన్ని దారుణాలు జరుగుతున్నా ఎక్కడా కేసులు నమోదు చేయడం లేదని మండిపడ్డారు. వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించిన ప్రభుత్వం.. సీఎం హోదాలో పట్టు వస్త్రాలు సమర్పించాలని, కానీ ఈ ఏడాది దానిని విస్మరించారని దుయ్యబట్టారు.

తల్లి ప్రాణాలు కాపాడాలనే తొందరలో..

- రోడ్డు ప్రమాదానికి గురైన కానిస్టేబుల్ షాజిద్
- తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి
- గుండెపోటుతో అంబులెన్స్‌లోనే మృతి చెందిన తల్లి

షాజిద్ (ఫైల్)

కందుకూరు: గుండెపోటుకు గురైన తల్లిని కాపాడుకోవాలని వెళ్తున్న కొడుకు రోడ్డు ప్రమాదానికి గురై.. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ తానూ మృతి చెందిన విషాద ఘటన సోమవారం అర్ధరాత్రి ప్రకాశం జిల్లా కందుకూరు పట్టణంలోని కోటారెడ్డినగర్ జంక్షన్‌లో జరిగింది. వివరాల్లోకెళ్తే.. సంతోష్‌నగర్‌కు చెందిన షాజిద్ అనే కానిస్టేబుల్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం సెంట్రీ డ్యూటీ ఉండడంతో స్టేషన్‌లోనే ఉన్నాడు. ఈ సమయంలో ఆయన తల్లి సమీమ్(60) ఆరోగ్యం బాగా లేదంటూ ఇంటి దగ్గర నుంచి ఫోన్ రావడంతో హడావుడిగా ఇంటికి వెళ్లాడు. అప్పటికే తల్లి ఆయాసంతో తీవ్రంగా ఇబ్బంది పడుతుండడంతో.. తన ద్విచక్ర వాహనంపై దగ్గరలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించాడు. అయితే అక్కడ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో అంబులెన్స్‌లో మరో హాస్పిటల్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ముందుగానే హాస్పిటల్‌కు వెళ్లి అక్కడి వైద్యులను సంప్రదించాలనే ఉద్దేశంతో షాజిద్ తన బైక్‌పై కోటారెడ్డి హాస్పిటల్‌కు బయలుదేరాడు. షాజిద్‌ను అనుసరిస్తూ వెనుక వైపు అంబులెన్స్ వస్తున్న క్రమంలో.. కోటారెడ్డినగర్ జంక్షన్ వద్ద మలుపు తిరుగుతుండగా, సింగరాయకొండ వైపు నుంచి వేగంగా వస్తున్న బైక్ షాజిద్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో షాజిద్ తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ లోపు తల్లి సమీమ్‌ను తరలిస్తున్న అంబులెన్స్ హాస్పిటల్‌కు చేరుకుంది. సమీమ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం అదే అంబులెన్స్‌లో తీవ్రగాయాలైన షాజిద్‌ను ఒంగోలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ షాజిద్ మృతి చెందాడు. కాగా, కోటారెడ్డినగర్ జంక్షన్‌లో జరుగుతున్న పనుల వద్ద కాంట్రాక్టర్ ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివనాగరాజు తెలిపారు.

రెండో రోజూ ప్రశ్నల వర్షమే

- పోలవరం ప్రధాన డ్యామ్ గ్యాప్–1 పనుల నాణ్యతను పరిశీలించిన విదేశీ నిపుణులు
- నేడు మరో పొరను తవ్వి నాణ్యతను పరిశీలిస్తామని వెల్లడి
- ప్రధాన డ్యామ్ గ్యాప్–2 డిజైన్లపై అనేక ప్రశ్నలు సంధించిన నిపుణులు

అధికారులతో సమీక్షిస్తున్న నిపుణుల బృందం

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరు, నాణ్యత, డిజైన్లపై అధికారులు, డిజైనర్ ఆఫ్రి ప్రతినిధులపై విదేశీ నిపుణులు రెండో రోజూ ప్రశ్నల వర్షం కురిపించారు. సోమవారం సమీక్ష సమావేశంలో వెల్లడించినట్లుగానే మంగళవారం ప్రధాన డ్యామ్ గ్యాప్–1లో అధికారులు 20 మీటర్ల పొడవుతో మట్టి, రాళ్లతో ఒక పొర(లేయర్)ను నిర్మించారు. పొరను రోలింగ్ చేస్తున్న తీరును పరిశీలించారు. ఆ తర్వాత రోలింగ్ చేసిన పొరను తవ్వించి నాణ్యతను పరిశీలించారు. మట్టి పొర ఎలా ఉందో, ఎంత పటిష్టంగా ఉందో పరిశీలించారు. బుధవారం మరో పొర వేయాలని.. దాన్ని కూడా తవ్వి పరిశీలించాక రోలింగ్‌కు షీప్ పుట్ రోలర్లు వినియోగించాలా? ప్లాట్, వైబ్రేట్ రోలర్లు వినియోగించాలా? అన్నది నిర్ణయిద్దామని చెప్పారు. విదేశీ నిపుణులు సీన్ హించ్ బెర్గర్, డేవిడ్ బి పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కోలతోపాటు సీడబ్ల్యూసీ, సీఎస్ఎంఆర్ఎస్, సీపీడబ్ల్యూఆర్ఎస్, జీఎస్ఐ అధికారులతో కూడిన బృందం మంగళవారం పోలవరం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇంజినీర్–ఇన్–చీఫ్ నరసింహమూర్తి, ఎస్ఈ రామచంద్రరావు ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో చూపిస్తూ విదేశీ నిపుణులు సంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. అనంతరం అధికారులు, డిజైనర్ ఆఫ్రి, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో ప్రధాన డ్యామ్ గ్యాప్–2 పనులపై విదేశీ నిపుణులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన డ్యామ్ గ్యాప్–2 నిర్మించే ప్రదేశంలో ఇసుకతో నిండిన నేల స్వభావం ఉన్న ప్రాంతం, బంకమట్టితో నిండిన నేల స్వభావం ఉన్న ప్రదేశం ఉన్నాయి. ఈ ప్రాంతంలో ప్రధాన డ్యామ్ గ్యాప్–2ను 23.32 మీటర్ల ఎత్తు వరకూ నిర్మించుకోవడానికి సంబంధించిన డిజైన్లను సీడబ్ల్యూసీ ఆమోదించింది. 45.72 మీటర్ల ఎత్తు వరకూ ప్రధాన డ్యామ్ నిర్మించడానికి సంబంధించిన డిజైన్‌లను ఆఫ్రి సంస్థ ప్రతినిధులు ప్రజెంటేషన్ ద్వారా విదేశీ నిపుణులకు వివరించారు. ఆ డిజైన్ల ఆధారంగా ప్రధాన డ్యామ్ నిర్మిస్తే.. నాణ్యత ఎలా ఉంటుంది? అందుకు సంబంధించిన పరీక్షలు ఏవైనా చేశారా? వాటి ఫలితాలు ఏమైనా వచ్చాయా? అంటూ విదేశీ నిపుణులు ప్రశ్నించారు. దీనిపై బుధవారం మరోసారి చర్చించి.. ఓ నిర్ణయానికి వద్దామని చెప్పారు. ఈ పర్యటనలో సీడబ్ల్యూసీ సీఈ సరబ్‌జీత్‌సింగ్ భక్షి, మనీష్ రాథోడ్, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా, రవి అగర్వాల్, సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి వీఎస్ రామారావు, పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురామ్, డైరెక్టర్ కె.శంకర్, ఎన్ఐఆర్ఎం డైరెక్టర్ అజయ్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులు, ప్రాజెక్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయితీలు చెల్లించకపోతే ఆత్మహత్యలే శరణ్యం

మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత పారిశ్రామికవేత్తలు

- బాబు సర్కారుకు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తల అల్టిమేటం
- మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం ఎదుట ధర్నా స్థానిక పారిశ్రామికవేత్తలకు రాయితీలు చెల్లించకుండా విదేశీ కంపెనీలకు ఇస్తున్నారని ఆవేదన

సాక్షి, అమరావతి/మంగళగిరి టౌన్: ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు చెల్లించాల్సిన రాయితీలను తక్షణం విడుదల చేయకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని చంద్రబాబు ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు అల్టిమేటం జారీ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం ఎదుట 100 శాతం రాయితీల కోసం రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. గతంలో మూడుసార్లు సచివాలయాన్ని ముట్టడించినా, అనేకసార్లు ఏపీఐఐసీ ఎదుట ధర్నాలు నిర్వహించినా.. రాయితీలు విడుదల చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పుతూ, మభ్యపెడుతూ కాలయాపన చేస్తోందని వారంతా మండిపడ్డారు. చావనైనా చస్తాం కానీ.. రాయితీలు విడుదల చేసేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని తేల్చిచెప్పారు. ప్రభుత్వం స్థానికంగా ఉండే పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇవ్వకుండా విదేశాల నుంచి వచ్చి పరిశ్రమలు పెట్టే వారికి రాయితీలు ఇస్తామనడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. కాగా, ధర్నా సందర్భంగా ఏపీఐఐసీ కార్యాలయం వద్ద టెంట్లు వేసుకునేందుకు అవకాశం ఇవ్వకుండా ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారంతా 'మాట తప్పిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్.. మభ్యపెడుతున్న చంద్రబాబు ప్రభుత్వం', 'పోలీసుల దౌర్జన్యం నశించాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

నిధులిచ్చే వరకు వెళ్లం

ఈ సందర్భంగా ఏపీ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అనాబాబు మాట్లాడుతూ నూటికి నూరు శాతం నిధులు విడుదల చేసేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. శాంతియుతంగా తలపెట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. అసోసియేషన్ కార్యదర్శి పెనుమాల నాగకుమార్ మాట్లాడుతూ.. ఇక్కడ భారత రాజ్యాంగం అమలవుతుందా.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసోసియేషన్ మహిళా ప్రతినిధి కారెం సత్యనారాయణమ్మ మాట్లాడుతూ.. నూరు శాతం రాయితీ నిధులు విడుదల చేస్తామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట ఇచ్చి తప్పడం వల్ల తాము తిరిగి ధర్నాకు పూనుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాలా నాగలక్ష్మి, జంగా త్రిమూర్తులు, చిన్న మౌలాలి, వరికూటి నీరజ, డాక్టర్ మద్దాల బిందు, కనపర్తి విజయరాజు, సరిహద్దు దయాకర్, కొడాలి రాంబాబు, జగదీష్, వి.భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

ఫీజు కడితేనే పరీక్షలు రాయనిస్తాం

లేదంటే పరీక్షలకు అనుమతించేదే లేదు.. తల్లిదండ్రులకు విజయవాడ శివారులోని ఓ ప్రైవేట్ కాలేజీ వేధింపులు

కనీసం వారం గడువు ఇవ్వమని వేడుకున్నా ఇవ్వని యాజమాన్యం

సాక్షి, అమరావతి: పరీక్షకు 24 గంటల ముందు విజయవాడ శివారులోని ఓ ప్రైవేట్ కాలేజీ యాజమాన్యం తల్లిదండ్రులకు షాక్ ఇచ్చింది. మొత్తం ఫీజును చెల్లిస్తేనే విద్యార్థులను పరీక్షలు రాయనిస్తామని బెదిరిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నంద్యాలకు చెందిన బీసీ వీరయ్య ఇద్దరు కొడుకులు విజయవాడ సమీపంలోని గూడవల్లిలో ఉన్న ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఒక్కొక్కరికి రూ.1.60 లక్షల చొప్పున రూ.3.20 లక్షల ఫీజు చెల్లించేందుకు వీరయ్య అంగీకరించారు. ఇప్పటికే రూ.2.20 లక్షలు చెల్లించారు. మిగిలిన రూ.లక్ష (ఒక్కో విద్యార్థికి రూ.50 వేలు) వారంలో చెల్లిస్తానని గడువు కోరాడు. అయితే కాలేజీ యాజమాన్యం మొత్తం డబ్బు చెల్లిస్తేనే విద్యార్థులను పరీక్షలకు పంపుతామని తేల్చి చెప్పింది. అంతేగాక ఇంకా స్వల్ప ఫీజు బకాయిలు చెల్లించాల్సిన విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపుతూ వేధింపులకు దిగింది. వారం రోజులు గడువు కోరినా, ఇప్పుడే చెల్లించాలని, లేదంటే విద్యార్థులు ఇబ్బందులు పడతారని బెదిరిస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వాస్తవానికి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం 'ఎథిక్స్–హ్యూమన్ వ్యాల్యూస్' పరీక్ష, ఈ నెల 23న 'పర్యావరణ విద్య' పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల మార్కులు ప్రధాన పరీక్షల మార్కుల్లో కలపనప్పటికీ పరీక్ష రాయడం తప్పనిసరి. మెయిన్ పరీక్షలు వచ్చే నెలలో జరగనుండగా, ఈలోపు మొత్తం ఫీజు క్లియర్ చేస్తామని వేడుకున్నా వినడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

పార్టీ వ్యవహారాల్లో... నబీన్ నా బాస్

నా పనితీరుపై నిర్ణేత: మోదీ
- బీజేపీ పగ్గాలు చేపట్టిన నబీన్
- వేడుకగా జరిగిన కార్యక్రమం
- హాజరైన బీజేపీ ముఖ్య నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ ప్రస్థానంలో నూతన శకానికి తెర లేచింది. బిహార్‌కు చెందిన యువ నాయకుడు నితిన్ నబీన్ సిన్హా పార్టీ జాతీయ అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమం ఇందుకు వేదికైంది. బీజేపీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికలో 45 ఏళ్ల నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రకటించారు. ఈ మేరకు సర్టిఫికెట్‌ను ఆయనకు అందజేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఐదో అంతస్తులోని చాంబర్‌లో ప్రస్తుత అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా నుంచి నబీన్ లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ అతిరథ మహారథులంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామి, నయాబ్ సింగ్ సైనీ, ప్రమోద్ సావంత్, ముఖ్యమంత్రి పేమా ఖండు తదితరులు వీరిలో ఉన్నారు. మోదీతో పాటు వారంతా నబీన్‌ను స్వయంగా అధ్యక్ష చాంబర్లోకి తోడ్కొని వెళ్లారు. బీజేపీ చరిత్రలో అతి పిన్న వయస్కుడైన అధ్యక్షునిగా, బిహార్ నుంచి వచ్చిన తొలి సారథిగా నబీన్ నిలిచారు. బీజేపీకి ఆయన 12వ అధ్యక్షుడు. నబీన్ ఎన్నికను చరిత్రాత్మక ఘట్టంగా నడ్డా అభివర్ణించారు. ఇంతకాలం తనకు అన్నివిధాలా సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

నితిన్ వెన్నంటి సాగుతాం: మోదీ

బీజేపీ నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నబీన్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను నవతరానికి ప్రతినిధి (మిలీనియల్)గా అభివర్ణించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ''ప్రభుత్వ నేతగా, ప్రధానిగా ఎంత అనుభవమున్నా అన్నింటికంటే ముందు నేను బీజేపీ కార్యకర్తను. ఇకపై పార్టీపరమైన వ్యవహారాల్లో నితిన్ నాకు బాస్'' అని చెప్పారు. ఆయన్ను పదేపదే 'గౌరవనీయులైన' అంటూ సంబోధించారు. ''యువకుడైన నబీన్ శక్తియుక్తులు, వ్యవస్థాగత వ్యవహారాల్లో ఆయనకున్న అపార అనుభవం పార్టీకి ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఇకపై ఆయన నోట వచ్చే ప్రతి మాటా మాకందరికీ నూతన దిశానిర్దేశం చేస్తుంది. పార్టీ భావి కార్యాచరణకు నబీన్ మార్గదర్శకత్వం వెలకట్టలేని ఆస్తి కానుంది'' అన్నారు. ''పార్టీ కార్యకర్తగా నేను కూడా నా పనితీరును ఎప్పటికప్పుడు నూతన అధ్యక్షునికే నివేదిస్తాను. నా పనితీరుకు సంబంధించిన రహస్య నివేదికను రాసేది ఆయనే. కనుక నబీన్

నబీన్‌ను ఆశీర్వదిస్తున్న మోదీ. చిరునవ్వులు చిందిస్తున్న అమిత్ షా, రాజ్‌నాథ్, నడ్డా, బి.ఎల్.సంతోష్

మార్గదర్శకత్వం కోసం ఎదురు చూస్తున్నా'' అని మోదీ చెప్పుకొచ్చారు. బీజేపీ వ్యవహారాలను చక్కబెట్టడంతో పాటు ఎన్డీఏ భాగస్వాముల నడుమ సమన్వయం సజావుగా కొనసాగేలా చూడాల్సిన బాధ్యత కూడా నబీన్‌దేనని గుర్తు చేశారు.

కాంగ్రెస్ తప్పిదాలు మనం చేయొద్దు

కాంగ్రెస్ తప్పిదాల నుంచి నేర్చుకోవాలని బీజేపీ నేతలు, కార్యకర్తలకు మోదీ సూచించారు. ''1984లో 50 శాతం పై చిలుకు ఓట్లతో 400కు పైగా లోక్‌సభ స్థానాలు సాధించిన కాంగ్రెస్ నేడు 100 సీట్లు కూడా నెగ్గలేక ఆపసోపాలు పడుతోంది. కనుక ఆ పార్టీ దుర్లక్షణాలన్నింటినీ నిశితంగా గమనించి మనం వాటికి దూరంగా ఉందాం. అప్పుడిక మనల్ని ఎవరూ ఓడించలేరు'' అన్నారు. నిష్పాక్షిక ఆత్మవిమర్శే బీజేపీ బలమని గుర్తు చేశారు. ''బీజేపీ ఒక సంప్రదాయం. అది ఒక కుటుంబం. సభ్యత్వం కంటే సంబంధాలకు విలువనిచ్చే పార్టీ. పదవుల ద్వారా కాకుండా ప్రక్రియ ద్వారా పనిచేసే పార్టీ బీజేపీ. ఇక్కడ అధ్యక్షులు మారినా ఆదర్శాలు, దిశానిర్దేశాలు మారవు. వాజపేయీ, అద్వానీ, మురళీ మనోహర్ జోషీ వంటి దిగ్గజాల సారథ్యంలో బీజేపీ సున్నా నుంచి శిఖరస్థాయికి ఎదిగింది. వెంకయ్యనాయుడు, నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా సారథ్యంలో మరింత ఎదిగింది'' అని గుర్తు చేసుకున్నారు.

చొరబాట్లు, అర్బన్ నక్సల్స్‌తో... దేశ భద్రతకే ప్రమాదం!

చొరబాటుదారులు, అర్బన్ నక్సల్స్ దేశ భద్రతకు పెను ప్రమాదంగా మారారని మోదీ ఆందోళన వెలిబుచ్చారు. చొరబాటుదారులను గుర్తించి తిప్పి పంపడం చాలా ముఖ్యమన్నారు. అక్రమ వలసలతో సంపన్న దేశాలు కూడా సతమతమవుతున్నాయి. వారిని వెళ్లగొడుతున్నాయి. వారు ప్రజలను కొల్లగొట్టడాన్ని భారత్ ఎప్పటికీ అనుమతించబోదు. కొన్ని పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు దన్నుగా నిలుస్తున్నాయి. వాటి ముసుగు తొలగించి ప్రజల ముందు నిలబెడదాం'' అని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ''దేశం ఎదుర్కొంటున్న మరో పెద్ద సమస్య అర్బన్ నక్సలిజం. ''నా గురించి, ఎన్డీఏ ప్రభుత్వం గురించి సానుకూలంగా ఎవరు మాట్లాడినా లక్ష్యం చేసుకుని నోరు మూయించే కార్యక్రమం జరుగుతోంది. కొందరు జర్నలిస్టులు కూడా వారిని దారుణంగా హేళన చేసి అవమానిస్తున్నారు. అంటరానివాళ్లుగా ముద్ర వేస్తున్నారు. ఇదంతా అర్బన్ నక్సల్స్ నూతన శైలి. వీరంతా కలిసి దేశానికి చేటు చేసేందుకు నిత్యం ప్రయత్నిస్తున్నారు'' అంటూ దుయ్యబట్టారు. వీరికి శాశ్వతంగా అడ్డుకట్ట వేయడం చాలా అవసరమన్నారు.

అట్టహాసంగా కార్యక్రమం

నబీన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఆయనను మోదీ పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రధాన కార్యాలయం కోలాహలంగా మారింది. జై శ్రీరాం, జై నితిన్ నబీన్ నినాదాలతో మార్మోగింది. ఆయన భార్య, పిల్లలు, కుటుంబీకులు, సన్నిహితులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెలుగు నేతల సందడి

నబీన్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బీజేపీ నేతలు పాల్గొన్నారు. తెలంగాణ, ఏపీ బీజేపీ అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు, పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శ్రీనివాసవర్మ, ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, అంజిరెడ్డి తదితరులు వీరిలో ఉన్నారు. వారంతా నబీన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాజకీయాల్లోకి యువత

బీజేపీ నూతన సారథి నబీన్ పిలుపు

న్యూఢిల్లీ: రాజకీయాల్లోకి ప్రజలు మరింత చురుగ్గా రావాల్సిన అవసరముందని బీజేపీ నూతన అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. తద్వారా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని కలసికట్టుగా సాకారం చేసుకుందామని పేర్కొన్నారు. ''అయితే రాజకీయాలు 100 మీటర్ల రేసు కాదు. సుదీర్ఘంగా సాగే మారథాన్. అక్కడ పరీక్ష వేగానికి కాదని, శారీరక సామర్థ్యానికి. యువత దీన్ని గుర్తించాల్సిన అవసరముంది'' అన్నారు. బీజేపీ సారథిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. బీజేపీలో ప్రతి కార్యకర్తకూ పనికి తగిన గుర్తింపు ఎప్పుడూ లభిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరి కృషినీ గుర్తించేంత శక్తియుక్తులు బీజేపీ 'వాచ్‌టవర్'కు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. కీలకమైన పశ్చిమ బెంగాల్‌తో పాటు రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా కృషి చేయాలని నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బూత్ నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి దాకా పూర్తి చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేయాలని సూచించారు. విపక్ష ఇండియా కూటమి భాగస్వాములైన కాంగ్రెస్, డీఎంకేలపై నబీన్ ఈ సందర్భంగా ఘాటు విమర్శలు చేశారు. కార్తీక దీప సంప్రదాయాన్ని కూడా అడ్డుకునే కుయుక్తులకు డీఎంకే సర్కారు దిగిందన్నారు. ఇలాంటి శక్తులను ఓడించి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరముందని చెప్పారు.

బంగ్లాదేశ్ నుంచి భారతీయ ఉన్నతాధికారుల కుటుంబాలు వెనక్కి

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో భద్రత క్షీణిస్తుండటంతో అక్కడి భారతీయ ఉన్నతాధికారుల కుటుంబాలను స్వదేశానికి రప్పించాలని మోదీ ప్రభుత్వం మంగళవారం నిర్ణయించింది. త్వరలో బంగ్లాదేశ్‌లో పార్లమెంటరీ ఎన్నికలున్న నేపథ్యంలో భారత సర్కార్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అక్కడి భారత హైకమిషన్, ఇతర విభాగాల్లో పని చేస్తు న్న భారతీయుల కుటుంబసభ్యులు తిరిగి ఇండియాకు రావాలని ఇప్పటికే సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్ల డించాయి. అయితే బంగ్లాదేశ్‌లో భారత హైకమిషన్ మాత్రం యథాతథంగా పనిచేయనుంది.

తమిళనాడు అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్

- సంప్రదాయ ప్రసంగం చేయకుండానే నిష్క్రమించిన గవర్నర్ రవి
- గవర్నర్ తీరు విచారకరం
- సీఎం స్టాలిన్ మండిపాటు

స్టాలిన్

ఆర్.ఎన్.రవి

సాక్షి, చెన్నై: తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవి మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ఈ ఏడాది అసెంబ్లీ తొలి సమావేశంలో సంప్రదాయ ప్రసంగం చేయకుండానే సభ నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయారు. సభ సంప్రదాయాలను ఉల్లంఘిస్తూ మరోసారి వాకౌట్ చేసినందుకు గవర్నర్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు. వాకౌట్ చేసి సభను, సభా గౌరవాన్ని ఆయన అవమానించారని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. 2021లో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గవర్నర్ వాకౌట్ చేయడం ఇది నాలుగోసారి. అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో జాతీయ గీతాన్ని పాడకుండా రాజ్యాంగానికి, జాతీయ గీతానికి తీవ్రమైన అవమానం చేశారని దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గవర్నర్ సభ నుంచి వెళ్లిపోయారని లోక్‌భవన్ ప్రకటించింది.

ఆమోదయోగ్యం కాదు: స్టాలిన్

గవర్నర్ తీరును ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శించారు. ''రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి ఆ రాష్ట్ర సంక్షేమం విషయంలో శ్రద్ధ వహించాలి. ప్రజల అభివృద్ధిపై ఆసక్తి కనబర్చాలి. సత్యమే మాట్లాడాలి. భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ నిర్ణయాలకు ఆయన సహకరించాలి. కానీ ఆయన వీటికి విరుద్ధంగా ప్రవర్తించారు. బహిరంగంగా రాజకీయాలు మాట్లాడుతూ నిందలు వేస్తున్నారు. రాష్ట్ర పరిపాలనను అడ్డుకోవడానికి ప్రయత్ని స్తున్నారు. అసెంబ్లీలోనూ ఇవే పునరావృతమవుతు న్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు'' అని స్టాలిన్ అన్నారు. ''గవర్నర్లు ఇబ్బందులు సృష్టించడం తమిళనాడులోనే కాదు అనేక రాష్ట్రాల్లో జరుగుతోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 176 ప్రకారం సంప్రదాయ ప్రసంగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సిద్ధం చేస్తుంది. దానిని గవర్నర్ పూర్తిగా చదవాలి. ప్రసంగంపై తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి, ప్రసంగం నుంచి విషయాలను తొలగించడానికి గవర్నర్‌కు ఎలాంటి అధికారమూ లేదు'' అని సీఎం అన్నారు. అసెంబ్లీ ప్రారంభ సమావేశంలో గవర్నర్ తప్పనిసరిగా ప్రసంగించాలనే నిబంధనలను రాజ్యాంగం నుంచి తొలగించడానికి మా పార్టీ ప్రయత్నిస్తుంది'' అంటూ గవర్నర్ ప్రసంగాన్ని చదవకుండా వ్యవహరించిన తీరును వ్యతిరేకిస్తూ స్టాలిన్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. స్పీకర్ తమిళంలో చదివిన పాఠం మాత్రమే రికార్డుల్లోకి వెళ్తుందని అందులో పేర్కొన్నారు. ఆ తీర్మానాన్ని సభ ఆమోదించింది. 2022లో గవర్నర్ రవి సభలో తన తొలి ప్రసంగం చేసినప్పుడు, ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే వాకౌట్ చేసింది. 2023లో గవర్నర్ ద్రవిడ పాలన నమూనా వంటి ప్రస్తావనలను నివారించడంతో, ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగ పాఠాన్ని పక్కకు పెట్టారని ముఖ్యమంత్రి స్టాలిన్ ఎత్తి చూపినప్పుడు, రవి అకస్మాత్తుగా సభ నుంచి వాకౌట్ చేశారు. ముందుగా ఆమోదం పొందిన, రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగ పాఠాన్ని మాత్రమే సభా రికార్డుల్లో ఉంచాలని ముఖ్యమంత్రి ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దాన్ని సభ ఆమోదించింది.

కేంద్ర ప్రభుత్వోద్యోగుల అవినీతిపై..

రాష్ట్ర పోలీసులూ విచారించవచ్చు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వోద్యోగుల అవినీతి, లంచగొండితనం ఆరోపణలపై రాష్ట్ర పోలీసు వర్గాలు కూడా విచారణ జరపవచ్చని, చార్జిషీట్ కూడా దాఖలు చేయొచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. అవినీతి నిరోధక చట్టం ప్రకారం వారికి ఆ అధికారముందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ ధర్మాసనం స్పష్టం చేసింది. ఇందుకోసం సీబీఐ నుంచి రాష్ట్ర పోలీసులకు ముందస్తు అనుమతి వంటివి కూడా అవసరం లేదని తెలిపింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17 రాష్ట్ర పోలీసు వర్గాలకు ఆ అధికారం కల్పిస్తోందని గుర్తు చేసింది. విచారణాధికారి ఆ సెక్షన్లో పేర్కొన్న మేరకు నిర్దిష్ట ర్యాంకుకు చెందితే చాలని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వోద్యోగిపై క్రిమినల్ కేసు నమోదు చేసే అధికారం రాజస్తాన్ ఏసీబీకి ఉందంటూ అక్కడి హైకోర్టు ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది.

చాగోస్‌లా కావొద్దనే...

గ్రీన్‌లాండ్ స్వాధీన యత్నాలపై ట్రంప్ ● బ్రిటన్ తీరుపై అధ్యక్షుని విమర్శలు

లండన్/దావోస్: గ్రీన్‌లాండ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు తాను చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. ''బ్రిటన్ వంటి దేశమే మారిషస్ నుంచి అప్పుడెప్పుడో కొనుగోలు చేసిన చాగోస్ దీవులపై అధికారాన్ని అకారణంగా తిరిగి ఆ దేశానికి వదిలేసుకుంటోంది. అక్కడి డీగో గార్షియా దీవుల్లో అమెరికాకు వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన నావిక, బాంబర్ స్థావరాలున్నాయి. వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారిందిప్పుడు. గ్రీన్‌లాండ్ విషయంలోనూ అలాంటిది జరగొద్దనే ఆ దీవి అమెరికా చేతిలో ఉండాలని చెబుతున్నాను'' అని సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్‌సోషల్‌లో రాసుకొచ్చారు! 'నాటోకు చెందిన అత్యంత తెలివైన సభ్య దేశం' ఇలాంటి తెలివి తక్కువ పనికి దిగుతోందంటూ బ్రిటన్‌ను ఎద్దేవా కూడా చేశారాయన. ''బ్రిటన్ కనబరిచిన ఈ బలహీనతను చైనా, రష్యా కచ్చితంగా గమనించే ఉంటాయి. గ్రీన్‌లాండ్‌పై మరింత దూకుడు పెంచే ఆలోచన కూడా చేస్తుండి ఉంటాయి'' అని చెప్పుకొచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలను బ్రిటన్ ఖండించింది. చాగోస్ దీవులను మారిషస్‌కు అప్పగించాలన్న నిర్ణయం పూర్తిగా సబబేనని పేర్కొంది. చాగోస్ దీవుల్ని రెండు శతాబ్దాల క్రితం మారిషస్ నుంచి బ్రిటన్ కారుచౌకగా కొనుగోలు చేసింది. వాటిని మారిషస్‌కు తిరిగిచ్చేలా, డీగో గార్షియా దీవిని మాత్రం 99 ఏళ్ల లీజుకు బ్రిటనే అట్టిపెట్టుకునేలా గతేడాది ఒప్పందం కుదిరింది. అప్పుడు దాన్ని స్వాగతించిన ట్రంప్ ఇప్పుడు మాత్రం తప్పుబడుతున్నారు!

ట్రంప్ విశ్వసనీయత కోల్పోయారు: ఉర్సులా

గ్రీన్‌లాండ్ స్వాధీన యత్నాలకు మద్దతివ్వనందుకు పలు యూరప్ దేశాలపై 10 శాతం టారిఫ్ విధిస్తున్నట్టు ట్రంప్ చేసిన ప్రకటనను యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయన్ తూర్పారబట్టారు. ఈ నిర్ణయాన్ని ఘోర తప్పిదంగా అభివర్ణించారు. ''ఈయూపై ఇక టారిఫ్‌లు విధించబోనని గతేడాది ఇచ్చిన హామీని ట్రంప్ సునాయాసంగా తుంగలో తొక్కారు. ఆయనకు అసలు విశ్వసనీయత అన్నది ఏమైనా ఉందా?'' అంటూ ఆమె మండిపడ్డారు. ''వ్యాపారంలో మాదిరిగానే రాజకీయాల్లో కూడా ఒప్పందమంటే ఒప్పందమే. ఈయూ సమైక్యంగా నిలుస్తుంది. ట్రంప్ టారిఫ్‌లపై దీటుగా స్పందిస్తుంది'' అని ప్రకటించారు.

కాస్త వెన్నెముక చూపండి!

టారిఫ్‌ల వ్యవహారంలో యూరప్ దేశాలు పిరికిగా వ్యవహరిస్తున్నాయంటూ కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ఎద్దేవా చేశారు. ఆ దేశాలకు అసలు వెన్నెముక అనేదే లేదా అంటూ తూర్పారబట్టారు. ట్రంప్ టారిఫ్‌లను కలసికట్టుగా, దీటుగా ఎదుర్కోవాలని వాటికి సూచించారు. అలాగే గ్రీన్‌లాండ్‌కు కూడా యూరప్ దేశాలన్నీ సమైక్యంగా మద్దతిచ్చి ట్రంప్ దూకుడుకు అడ్డుకట్ట వేయాలన్నారు.

అమెరికాపై ట్రేడ్ బజూకా?

- ట్రంప్ టారిఫ్‌లకు అదే విరుగుడు
- ఈయూ దేశాలకు మాక్రాన్ పిలుపు

దావోస్: గ్రీన్‌లాండ్ స్వాధీనానికి అంగీకరించడం లేదంటూ పలు యూరప్ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 10 శాతం టారిఫ్‌పై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ మరోసారి ధ్వజమెత్తారు. అంతూ పొంతూ లేకుండా సాగుతున్న ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపులను దీటుగా ఎదుర్కోవాలని యూరోపియన్ యూనియన్ దేశాలకు ఆయన పిలుపునిచ్చారు. అందుకోసం అవసరమైతే 'ట్రేడ్ బజూకా'గా పిలిచే యాంటీ కొయెర్షన్ ఇన్‌స్ట్రుమెంట్ (ఏసీఐ) ఆయుధాన్ని వాడేందుకు కూడా ఈయూ కూటమి వెనకాడొద్దన్నారు. మంగళవారం దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరంలో మాట్లాడుతూ మాక్రాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈయూ కూటమి చేతిలో ఉన్న అతి పదునైన ఆయుధం ఏసీఐ. ప్రస్తుత కఠిన పరిస్థితుల దృష్ట్యా దాన్ని అమెరికాపై వాడేందుకు ఈయూ దేశాలు ఏమాత్రం వెనకాడొద్దు'' అని అభిప్రాయపడ్డారు. ఈయూ దేశాలపై ఆర్థిక, ఇతరత్రా ఒత్తిళ్లు, బెదిరింపులను తిప్పికొట్టేందుకు ఆ సమాఖ్య రూపొందించుకున్న వాణిజ్య అస్త్రం ట్రేడ్ బజూకా. దీనిద్వారా కూటమేతర దేశాలపై ప్రతీకార సుంకాల విధింపుతో పాటు పలు ఇతరత్రా ఆంక్షలు విధించే అధికారం ఈయూకు దఖలు పడింది. అలాగే ఈయూకు చెందిన ఎలాంటి బిడ్డింగుల్లోనూ సదరు దేశాలు పాల్గొనేందుకు వీలుండదు. కూటమేతర దేశాలను, ముఖ్యంగా చైనా, రష్యాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ట్రేడ్ బజూకాను మిత్రదేశమైన అమెరికాపైనే ఈయూ ప్రయోగించే పరిస్థితులు కన్పిస్తుండటం విశేషం!

గ్రీన్‌లాండ్‌పై అమెరికా జెండా పాతుతున్న ట్రంప్

(ఏఐ ఫొటోలు)

కెనడా, వెనెజువెలా, గ్రీన్‌లాండ్‌లతో కూడిన అమెరికా మ్యాప్

కెనడాపైనా ట్రంప్ కన్ను!

- కెనడా, వెనెజువెలా, గ్రీన్‌లాండ్‌తో అమెరికా మ్యాప్!
- గ్రీన్‌లాండ్‌పై అమెరికా జెండా
- కలకలం రేపుతున్న ట్రంప్ ఫొటోలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరు నానాటికీ శ్రుతి మించి రాగాన పడుతోంది. అర్ధరాత్రి అధ్యక్ష దంపతులను కిడ్నాప్ చేసి చెరబట్టిన వెనెజువెలాతో పాటు గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలని కలలుగంటున్న ట్రంప్ దృష్టి పొరుగుదేశం కెనడా పైనా పడింది. ఆ మూడు దేశాలనూ అమెరికా మ్యాప్‌లో చేర్చేసి మురిసిపోయారాయన! కెనడా, వెనెజువెలా, గ్రీన్‌లాండ్‌తో కలిపిన అమెరికా మ్యాప్‌ను సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో ట్రంప్ మంగళవారం పోస్టు చేశారు. తద్వారా అవి ఎప్పటికైనా అమెరికా భూభాగాలేనన్న సంకేతాలిచ్చారు! ఈ మేరకు ట్రంప్ పోస్టు చేసిన ఏఐ ఫొటో వైరల్‌గా మారింది. అందులో వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో పలువురు దేశాధినేతలతో ఆయన ఏదో సీరియస్‌గా చర్చిస్తూ కన్పిస్తున్నారు. నేపథ్యంలో మూడు దేశాలను అమెరికా భూభాగంతో కలిపి చూపుతున్న ఆ దేశ సరికొత్త మ్యాప్ ప్రముఖంగా కన్పిస్తోంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్, యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాండెర్ లెయన్, నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టె తదితరులు ఫొటోలో ఉన్నారు. తద్వారా... కెనడా, వెనెజువెలా, గ్రీన్‌లాండ్ స్వాధీనానికి ఆయా దేశాల ఆమోదముందని చెప్పడం ట్రంప్ ఉద్దేశమని విశ్లేషిస్తున్నారు. ట్రంప్ అక్కడితో ఆగలేదు! గ్రీన్‌లాండ్ గడ్డపై తాను సగర్వంగా అమెరికా జెండా పాతుతున్నట్టుగా మరో ఏఐ ఆధారిత ఫొటోను కూడా పోస్ట్ చేశారు. ఆయనతో పాటు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఫొటోలో కన్పిస్తున్నారు. ''గ్రీన్‌లాండ్, అమెరికా భూభాగం, స్థాపితం: 2026' అని రాసిన బోర్డు కూడా ఫొటోలో దర్శనమిస్తోంది. కెనడా స్వచ్ఛందంగా అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరాలని గతంలో ట్రంప్ వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఇక డెన్మార్క్ అధీనంలోని స్వయంపాలిత ప్రాంతమైన గ్రీన్‌లాండ్ స్వాధీ నానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలు, ఆ క్రమంలో చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు కొంతకాలంగా అంతర్జాతీయ రగడకు దారితీస్తు న్నాయి. డెన్మార్క్ తో పాటు గ్రీన్‌లాండ్ కూడా ట్రంప్ యత్నాలను ముక్త కంఠంతో వ్యతిరేకించాయి. అమెరికాలో కలిసేది లేదని గ్రీన్‌లాండ్ స్పష్టం చేసింది.

గ్రీన్‌లాండ్‌కు యూఎస్ విమానం!

డెన్మార్క్‌తో నానాటికీ తీవ్రతరమవుతున్న ఉద్రిక్తతల నడుమ, గ్రీన్‌లాండ్‌లోని అమెరికా సైనిక స్థావరంలో యుద్ధ విమానాన్ని మోహరించాలని ట్రంప్ తాజాగా మరో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. అక్కడి పిటుఫిక్ స్థావరంలో దీర్ఘకాలిక అవసరాల నిమిత్తం ఈ చర్య చేపడుతున్నట్టు వైట్‌హౌస్ చెప్పుకొచ్చింది.

ఆమెది కోర్టు ధిక్కారమే

- ఔదార్యంతో మేం ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు
- కోపంతో తీర్పులిస్తున్నారన్న మేనకాగాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- కసబ్ మేనకలా ప్రవర్తించలేదన్న ధర్మాసనం

న్యూఢిల్లీ: లక్షల్లో ఉన్న వీధిశునకాలల్లో కొన్నింటిని పట్టుకొచ్చి షెల్టర్లలో పడేస్తే సమస్య పరిష్కారం కాబోదంటూ సుప్రీంకోర్టు తీర్పును తప్పుబడుతూ వివాదాస్పద వ్యాఖ్యలుచేసిన మాజీ కేంద్ర మహిళా మంత్రి మేనకాగాంధీపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అత్యున్నత న్యాయస్థానంపై, కోర్టు తీర్పుపై ఇష్టారీతిగా మాట్లాడుతూ ఆమె కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాల సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే కోర్టు ఔన్నత్యంతో ఆమెపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండిపోయిందని ధర్మాసనం వెల్లడించింది. దేశ రాజధానిలో వీధి శునకాల బెడద ఎక్కువగా ఉండటంతో వీటికి కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేసి తిరిగి విడిచిపెట్టడం, షెల్టర్లకు తరలించడం వంటి ఆదేశాలతో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మేనకగాంధీ విమర్శించడంపై మంగళవారం ముగ్గురు జడ్జీల ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది.మేనకగాంధీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్‌కు కోర్టు తలంటింది. ''మేం సంయమనం పాటించాలని మీరు మాకు ఉచిత సలహాలు పడేస్తున్నారు. మరి మీ క్లయింట్(మేనకాగాంధీ) ఏ తీరున మాట్లాడుతున్నారో మీకు తెలుసా? పాడ్‌కాస్ట్‌లో ఆమె చేసిన వ్యాఖ్యానాలు విన్నారా? ఆమె మాటల ధోరణి గమనించారా? కోర్టు తీర్పుపై ఎటువంటి వ్యాఖ్యానాలు చేస్తున్నారో ఆలకించారా? ఆమె కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారు. ప్రతి ఒక్కరినుద్దేశస్తూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. ఆమె అలా ఎలా మాట్లాడగలరు?'' అని ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారన్న కోర్టు వ్యాఖ్యానాలపై న్యాయవాది రాజు స్పందించలేదు. ఇది కోర్టు ధిక్కరణకు సంబంధించిన కేసు కాబట్టి ఈ విషయంలో స్పందించదల్చుకోలేదని చెప్పారు. అయితే మధ్యలో కల్పించుకుని ''గతంలో 26/11 దాడుల కేసులో అజ్మల్ కసబ్ తరఫున సైతం వాదించా'' అని అన్నారు. దీనిపై జడ్జి విక్రమ్‌నాథ్ జోక్యం చేసుకుని ''కసబ్ ధోరణి ఈ తరహాలో అయితే లేదు. అతను ఏనాడూ కోర్టు ధిక్కరణకు పాల్పడలేదు. కానీ మీ క్లయింట్ మేనకాగాంధీ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారు''అని జడ్జి వ్యాఖ్యా నించారు.

అంత స్పృహ ఉంటే బడ్జెట్ ఏది?

వాదనల సందర్భంగా జడ్జి సందీప్ మెహతా కల్పించుకుని మాట్లాడారు. ''మేనక గతంలో కేంద్రప్రభుత్వంలో మంత్రిగానూ సేవలందించారు. జంతువుల హక్కుల కార్యకర్తగానూ పేరొందారు. మరి ఆమె హయాంలో జంతువుల సంరక్షణకు ఏపాటి బడ్జెట్ కేటాయించారు. ఏ స్థాయిలో పోరాడారు? వీధి శునకాల సమస్య పరిష్కారం కోసం ఎంత మేర బడ్జెట్ కేటాయింపులు జరిపారు?'' అని జడ్జి ప్రశ్నల వర్షం కురిపించారు. బడ్జెట్ కేటాయింపులు అనేవి విధాన నిర్ణయాలు అని, ఈ అంశంలో సమాధానం ఇవ్వలేనని న్యాయవాది చెప్పుకొచ్చారు.

భారీ ఒప్పందం బాటలో ఈయూ, భారత్

- ఇది 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'
- యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వ్యాఖ్య



న్యూఢిల్లీ: గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికాతో విబేధించిన యురోపియన్ యూనియన్ దేశాలు, రష్యా చమురు విషయంలో ట్రంప్ ప్రభుత్వంతో పేచీలు పెట్టుకున్న భారత ప్రభుత్వం చివరకు ఒక్కటయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పరస్పర వాణిజ్య ప్రయోజనాలే పరమావధిగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్, ఐరోపా సమాఖ్య నిర్ణయించుకున్నాయి. ఈ దిశగా వడివడిగా అడుగులువేస్తున్నామని యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయన్ మంగళవారం ప్రకటించారు. ప్రపంచ ఆర్థిక సదస్సు శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరానికి విచ్చేసిన ఆమె మీడియాతో మాట్లాడారు. భారత్‌తో ట్రేడ్ డీల్ పురోగతి వివరాలను వెల్లడించారు. 200 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం చేకూర్చే చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కోసం భారత్, ఈయూ తీవ్రంగా కృషిచేస్తున్నాయి. వృద్ధి కేంద్రాలుగా, ఈ శతాబ్దపు ఆర్థికశక్తులుగా ఉన్న దేశాలతో వాణిజ్యం చేసేందుకు యూరప్ ఉవ్విళ్లూరుతోంది. అందుకే నేను, యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఈనెల 25 నుంచి మూడ్రోజులపాటు భారత్‌లో పర్యటిస్తాం. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొంటాం. తర్వాత ప్రధాని మోదీతో వాణిజ్య చర్చలు జరుపుతాం. సంప్రతింపులపై జనవరి 27న ఒక కీలక ప్రకటన చేయబోతున్నాం. వాణిజ్య ఒప్పందంపై ఇంకా కొంత పని పూర్తిచేయాల్సి ఉంది. ఈ ఒప్పందాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఒప్పందం(మదర్ ఆఫ్ ఆల్ డీల్స్)గా పిలుస్తున్నారు. 200 కోట్ల మందికి ప్రయోజనం చేకూరబోతోంది. ఇది ప్రపంచ జీడీపీలో 25 శాతానికి సమానం''అని ఆమె అన్నారు.

సాక్షి
గుంటూరు
బుధవారం । 21 । జనవరి । 2026

హనుమాన్ చాలీసా పారాయణం

ఫిరంగిపురం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలోని దక్షిణాముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 37.8632 టీఎంసీలు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3000, గరిష్ట ధర రూ.3700, మోడల్ ధర రూ.3400 వరకు పలికింది.

న్యూస్‌రీల్

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

రేపల్లె: మాఘమాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని రేపల్లె పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయంలో లక్ష్మీ, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. వేకువ జామునే స్వామివారికి, దేవేరులకు మంగళస్నానాలు చేయించి వధువరులుగా అలంకరించారు. వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తడవర్తి విజయ్‌కుమార్, రాధికారాణి, పవన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూజ్య ధర్మాచార్య సదస్సు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణం సీతానగరంలోని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌నందు సమరసత సేవా ఫౌండేషన్ వారి పూజ్య ధర్మాచార్య సదస్సును మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అహోబిల రామానుజ జీయర్ స్వామి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఈ సమరసత సేవా ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్వామీజీలు, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు, ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కొండకు నిప్పు పెట్టిన అల్లరి మూకలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి కొండపై గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టడంతో భారీ ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. గంట వ్యవధిలో సుమారు 15 ఎకరాల వరకు తగలబడింది. కొంతమంది స్థానికులు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మంగళగిరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా వారి వద్ద నుంచి ఎటువంటి స్పందన లభించలేదు. స్థానికులు జాగ్రత్తలు తీసుకోవడం, కొండపై మంటలు కిందకు వ్యాపించకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కల్యాణ రాజశ్యామలాదేవిగా బగళాముఖి



చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయంలో మాఘమాసం సందర్భంగా రాజశ్యామలా నవరాత్ర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాలలో భాగంగా మంగళవారం బగళాముఖి అమ్మవారు కళ్యాణ రాజశ్యామలాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 28వరకు అమ్మవారి ఆలయంలో రాజశ్యామలా నవరాత్ర మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి, చైర్మన్ చక్రధర్‌రెడ్డి తెలిపారు.

నత్త నడకన రీ సర్వే

- భూ సర్వేలతో చరిత్ర సృష్టించిన గత ప్రభుత్వం
- అందుబాటులోకి తెచ్చిన ఆధునిక సాంకేతికత
- దేశంలోనే ఆదర్శంగా నిలిచిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- 62 గ్రామాల్లో సుమారు 1.46 లక్షల ఎకరాల భూమి రీసర్వే
- ప్రస్తుతం అంతంత మాత్రంగానే జరుగుతున్న సర్వే పనులు..
- టీడీపీ ప్రభుత్వంలో 24 గ్రామాల్లో కూడా పూర్తి కాని సర్వే...

అప్పటి ప్రభుత్వ హయాంలో ప్రత్తిపాడులో డ్రోన్ ద్వారా మ్యాపింగ్ చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. నాడు తప్పు జరిగిపోతోందంటూ తప్పుడు ప్రచారం చేసిన చంద్రబాబు ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే పనిని మళ్లీ మొదలుపెట్టింది. అయితే ఆ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద రీ సర్వే పనులను తప్పు పట్టిన చంద్రబాబు ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత మళ్లీ దీన్ని పూర్తి చేయడానికి నిర్ణయం తీసుకుంది.

మూలన పడేసిన డ్రోన్లు...

2024 జూన్ తర్వాత జిల్లాలో 2వ విడత రీసర్వేలో 24 గ్రామాలకుగానూ సుమారు 67 వేల ఎకరాల భూ సర్వే నిర్వహించారు. 3వ విడతలో ప్రస్తుతం 35 గ్రామాల్లో రీ సర్వే జరుగుతుంది. అప్పటి డ్రోన్స్‌లో కొన్ని మూలన పడేశారు. మరమ్మతులు కూడా చేయించకుండా ప్రజాధనాన్ని వృథా చేయడంతోపాటు రీసర్వే కూడా ఆలస్యమవుతుంది.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 62 గ్రామాలలో 1,42,450 ఎకరాల భూమిని రీ–సర్వే చేశారు. ఎనిమిది గ్రామాల్లో గ్రామకంఠం భూములను కూడా రీ–సర్వే పూర్తి చేశారు. దీనికి ఇరువైపులా సుమారు 84 వేల సర్వే రాళ్ళు కూడా వేశారు.
- తొలిసారిచేసిన కృషి ఎంత చెప్పినా తక్కువే. గతంలో ఎన్నడూ చేయని గ్రామ కంఠం భూములను సైతం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టి ఔరా అనిపించింది. దీనిలో భాగంగా 66 గ్రామాల్లోని 9920 మందికి సంబంధించిన గ్రామ కంఠం భూములకు ఉచితంగా పట్టాలు సైతం అందజేశారు.

రోవర్స్

- ఎప్పుడో 1905లో బ్రిటీషర్లు చేపట్టిన తర్వాత 2020 వరకు మరే నాయకుడు దీని జోలికి వెళ్లే ధైర్యం చేయలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ రీ–సర్వేని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. దీని ద్వారా ప్రతి అంగుళం భూమి మ్యాపింగ్‌లోకి తీసుకురావడంతోపాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చే దిశగా ఈ ప్రక్రియ గుంటూరు జిల్లాలో 2020 డిసెంబర్‌లో ప్రారంభమయ్యింది.
- తొలుత పైలెట్ ప్రాజెక్ట్ కింద దుగ్గిరాల మండలం దేవరాపల్లి అగ్రహారం, ప్రత్తిపాడు మండలం కొండజాగర్లమూడి, వేమూరు మండలం పులిచింతలపాలెం, యడ్లపాడు మండలం మర్రిపాలెం, దాచేపల్లి మండలం అలుగుమల్లిపాడులను ఎంపిక చేశారు. అక్కడ విజయవంతంగా పూర్తి చేశారు.
- సర్వే అనంతరం సంబంధిత భూమి, స్థలం యజమానికి ప్రింటెడ్ పాస్‌బుక్ ఉచితంగా ఇచ్చారు.
- రీసర్వేలో వాడిని టెక్నాలజీ అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే మనం చూడగలం. అయితే అప్పటి ప్రభుత్వం అత్యాధునిక డ్రోన్స్, రోవర్స్‌తోపాటు 840 మంది సర్వేయర్లను కూడా ఉపయోగించింది.
- అప్పటికే కొరతగా ఉన్న సర్వేయర్లను సచివాలయ వ్యవస్థ ద్వారా నియమించి విజయవంతంగా రీ సర్వే చేసింది. దీనివల్ల ఎన్నో సివిల్, క్రిమినల్ తగాదాలు తగ్గుముఖం పట్టాయి.
- ఇటీవల కలెక్టరేట్‌లోని రీసర్వే భవనంలో అధికారి ఉండే చాంబర్ సీలింగ్ కూలిపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. దీనిని కనీసం మరమ్మత్తులు కూడా చేయించకుండా తాత్కాలికంగా ఇరిగేషన్ కార్యాలయంపై ఖాళీగా ఉన్న భవనంలోకి మార్చుకున్నారు. శకునం చూసే బల్లి కుడితిలో పడ్డట్లుంది ఆ శాఖ పరిస్థితి.

ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు

- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా
- అధికారులతో సమావేశం

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): ఇంటర్మీడియెట్ పరీక్షలు సజావుగా జరిగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట ప్రణాళిక ప్రకారం అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల సన్నద్ధత, నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మకంగా పరీక్ష కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పరీక్షలలో మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ జరగకుండా ఇంటర్మీడియెట్ శాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఐఓ జీ సునీత మాట్లాడుతూ థియరీ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 34,778 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 31,478 మంది, ద్వితీయ సంవత్సరం బ్యాక్‌లాగ్ విద్యార్థులు 834 మంది, మొదటి సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు 707 మంది, రెండో సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు 706 మంది, ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ బ్యాక్‌లాగ్ విద్యార్థులు 448 మంది మొత్తం 68,951 మంది విద్యార్థులు 87 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు 126 పరీక్ష కేంద్రాల్లోను, ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 10వ తేది వరకు 17 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలకు 27,960 మంది, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 2,292 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. సమావేశంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్, ఇంటర్మీడియెట్ ఆర్‌జెడీ పద్మ, ఏపీసీపీడీసీఎల్ ఈఈ నాగేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం రామకృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ నాగవర్ధన్, పోస్టల్ శాఖ పీఆర్ఐలు వై మాధవరావు, చెన్నకేశవులు, డీఈసీ సభ్యులు జి సిరిల్‌పాల్, జానకిరామయ్య, సుబ్బారావు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

జిల్లాలో పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పశు ఔషధి కేంద్రాల ఏర్పాటుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు సరసమైన ధరలకు మంచి నాణ్యత గల జనరిక్ మందులను అందించడం కోసం 'పశు ఔషధి విక్రయ కేంద్రాలను' ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఏర్పాటుకు మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ సహకార సొసైటీలు, బీ ఫార్మసీ లేదా డీ ఫార్మసీ డిగ్రీ కలిగిన వారు పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అర్హులని తెలిపారు. జిల్లాలో ప్రాథమికంగా గుంటూరు, తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలో పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు వెబ్ సైట్ పశు ఔషధి.హెచ్‌ఏహెచ్‌డి.జీఓవి.ఐఎన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో సహకార శాఖ అధికారి వీరాచారి, డ్రగ్ కంట్రోలర్ లక్ష్మణ్, జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మోహనరావు పాల్గొన్నారు.

'సంక్షేమం'లో సంక్షోభం

గుంటూరులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ శాఖ సముదాయం

- ప్రభుత్వం నుంచి డైట్ బిల్లులు రాక హాస్టల్ వార్డెన్ల ఇబ్బందులు
- సరుకులు అప్పు తెచ్చి, విద్యార్థులకు భోజనం పెడుతున్న వార్డెన్లు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుంది. ప్రతి నెలా డైట్ బిల్లులు సకాలంలో జమచేయకపోవడంతో వార్డెన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు డైట్ చార్జీలు సకాలంలో చెల్లించకపోవడంతో వెండర్స్(వ్యాపారుల)నుంచి సరుకుల అప్పు తీసుకువచ్చి భోజనం పెడుతున్నారు. గత సంవత్సరం అక్టోబర్ నుంచి బిల్లులు చెల్లింపు జరగక వార్డెన్లు తమ సొంత డబ్బుతో భోజనం పెట్టాల్సిన పరిస్థితి.

- జిల్లాలో 33 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 27 బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు, 4 ఎస్టీ హాస్టళ్లు ఉన్నాయి. ఎస్సీ హాస్టళ్లలో 2510 మంది, బీసీ హాస్టళ్లలో 2083, ఎస్టీ హాస్టళ్లలో 458 విద్యార్థులు ఉన్నారు. వీరిలో పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు నెలకు రూ.1600, ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు నెలకు రూ.1400 ప్రభుత్వం చెల్లిస్తుంది.
- మూడు నెలలుగా రూపాయి జమ చేయకపోవడంతో డైట్ బిల్లుల కోసం వార్డెన్లు ఎదురు చూపులు చూస్తున్నారు.
- ఇక గుంటూరు నగరంలో ఉన్న హయ్యర్ హాల్–1 (సాంఘిక సంక్షేమ శాఖ) హాస్టల్‌కి గత సంవత్సరం మార్చి నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కాస్మోటిక్ కిట్స్ ఊసే లేదు..

- గత ప్రభుత్వం హయంలో ప్రతి విద్యార్థికి రూ.200 చొప్పున వారి బ్యాంకు ఖాతాలో కాస్మోటిక్ చార్జీలు కింద జమ చేసేది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలకు బదులు కాస్మోటిక్ కిట్స్ ఇస్తామని చెప్పి సంవత్సరం గడుస్తున్నా ఇంత వరకు ఇవ్వకపోవడంతో విద్యార్థులే సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లా పర్చేజ్ కమిటీ ఏర్పాటు చేస్తేనే మంచిది ...

- గతంలో జిల్లా పర్చేజ్ కమిటీ ద్వారా హాస్టళ్లకు కోడిగుడ్లు, కూరగాయాలు, చికెన్, పాలు, పెరుగు మినహా మిగిలిన సరుకులు సరఫరా అవుతుండేవి. ఈ కమిటీ జేసీ ఆధ్వర్యంలో నడిచేది. అయితే గత కొద్ది సంవత్సరాల క్రితం ఇది ఆగిపోవడంతో వార్డెన్లు బయట వ్యాపారుల నుంచి అప్పు తీసుకుని సరుకులు తెచ్చుకుని విద్యార్థులకు భోజనం పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.
- సకాలంలో బిల్లులు ప్రాసెస్ కాకపోవడంతో తీసుకున్న అప్పు చెల్లించాలంటూ వెండర్స్ వచ్చి ఇబ్బందులు పెడుతున్నారంటూ కొంత మంది వార్డెన్లు వాపోతున్నారు.
- జిల్లా పర్చేజ్ కమిటీ, డివిజనల్ పర్చేజ్ కమిటీలు ఉంటే సరుకులు కొనే అవస్థలు ఉండవని వాపోతున్నారు.
- డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్న అంశాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్‌కు సంబంధించిన నోడల్ ఆఫీసర్ చెన్నయ్య దృష్టికి తీసుకువెళ్లగా బిల్లులు చెల్లింపు సకాలంలో జరుగుతున్నాయి..ఏదైన హాస్టల్‌కు బిల్లు రావడం లేదని చెబితే ఎందుకు రావడం లేదో పరిశీలిస్తామన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- ఈనెల 29 వరకు వివిధ షిఫ్టలలో నిర్వహణ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్–2026 మొదటి సెషన్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 29వ తేదీ వరకు వివిధ షిఫ్టలలో జరగనున్న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)లకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 21, 22, 23, 24, 28వ తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టలలో పేపర్–1 (బీఈ, బీటెక్), 29న పేపర్–2 బీఆర్క్ పరీక్ష జరగనుంది. అడ్మిట్‌కార్డులు పొందిన విద్యార్థులు పరీక్షా సమయానికి రెండు గంటల ముందుగానే కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పేపర్–2 పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 8.30, మధ్యాహ్నం 2.30 వరకే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతిస్తారు.

బతికుండగానే చంపేశారు...

- రాజధానిలో రెవెన్యూ లీలలు
- తప్పుడు పత్రాలు సృష్టించి రూ.25 కోట్ల విలువైన భూమి కబ్జాకు యత్నం
- రాజమండ్రిలో మరణ ధృవీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్
- భీమవరంలో వీలునామా సర్టిఫికెట్
- తాడికొండలో పనిచేసి రాజధానికి బదిలీ అయిన వీఆర్వో సహకారంతో 8.32 ఎకరాలకు ఎసరు
- తప్పుడు పత్రాలతో ఆన్‌లైన్‌లో నమోదుకు పచ్చజెండా ఊపిన రెవెన్యూ అధికారులు
- దత్త పుత్రిక అని రాసిన వీలునామా ఆధారంగా ఆధార్ కార్డు లేకుండానే ఆన్‌లైన్‌లో పేరు మార్పు
- రూ.కోట్లలో చేతులు మారినట్లు ఆరోపణలు
- తాడికొండకు చెందిన పలువురు హస్తం ఉన్నట్లు సమాచారం
- ఆమెరికా నుంచి బయలుదేరిన అసలైన హక్కుదారుడు

రాజధానిలో భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారుల కన్ను పడింది. ప్రజల, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారు. డబ్బుకు ఆశపడి ఎంతటి నీచానికైనా దిగజారుతున్నారు. మనిషి ప్రాణాలతో ఉన్నప్పటికీ చనిపోయినట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రం, వీలునామా, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ చూపించడంతోపాటు ఓ మహిళను దత్తత తీసుకున్నట్లు చూపించి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 8.32 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో పేరు మార్చి కబ్జా చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ విషయాలు తెలిసి అవాక్కైన స్థానికులు అమెరికాలో ఉన్న భూమి హక్కుదారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన బయలుదేరి వస్తున్నారు.

ఈనెల 6న రాజమండ్రిలో జారీ చేసినట్లు పొందుపరిచిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్



ఈనెల 15న వీలునామాగా ఆన్‌లైన్‌లో చూపించిన అధికారులు

తాడికొండ: తాడికొండ గ్రామానికి చెందిన వంగర హనుమంత సుబ్రహ్మణ్య శాస్త్రికి స్థానికంగా సర్వే నెంబర్ 1151లో 8.32 ఎకరాల భూమి ఉంది. ఆయన ఎప్పటి నుంచో హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డాడు. స్థానికంగా తనకున్న పొలం మాత్రం పెదపరిమి గ్రామానికి చెందిన రైతుకు కౌలుకు ఇవ్వగా ప్రతి ఏటా ఆయన కౌలు నగదును ఆన్‌లైన్ ద్వారా హక్కుదారుడైన సుబ్రహ్మణ్య శాస్త్రికి పంపిస్తుంటాడు.

వ్యవహారం నడిచిందిలా...

ఈ భూమిపై కన్నుపడిన తాడికొండలో గతంలో పనిచేసిన ఓ వీఆర్వో స్థానికంగా పట్టించుకునే నాథుడు లేడని తెలిసి డాక్యుమెంట్ రైటర్ వద్ద సహాయకులుగా పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వ్యక్తిని ఎంచుకొని పక్కాగా స్కెచ్ గీశాడు. ఇందులో భాగంగా తనకు గతంలో నుంచి అనుభవం ఉన్న తప్పుడు పత్రాల రూపకల్పనకు శ్రీకారం చుట్టి పదునుపెట్టి తెనాలి ప్రాంతానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ద్వారా కథ నడిపించాడు. రాజధాని ప్రాంతంలో ఎకరం రూ.2–3 కోట్లకు పైగా ధరలు పలుకుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్‌లో పేరుమార్చి ఎవరో ఒకరిని ఏ మార్చి అమ్ముకొని సొమ్ము చేసుకుందామనే యోచనతో ఓ పెట్టుబడిదారుడిని వెదికి పట్టుకొచ్చి కథంతా నడిపించారు. ఇందులో భాగంగా వంగర హనుమంత సుబ్రహ్మణ్య శాస్త్రికి పిల్లలు లేని కారణంగా బంధువుల అమ్మాయి వరలక్ష్మిని దత్తత తీసుకొని ఆమెకు పొలం రాసినట్లు 1997లో భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వీలునామా చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. దీనికి తోడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఈనెల 6వ తేదీన దరఖాస్తు చేయగా అదే తేదీన రాజమండ్రిలో పత్రం ఇచ్చినట్లు జతచేయడం మరో విశేషం. మరణ ధ్రువీకరణ పత్రంలో ఆయన 2019లో మరణిస్తే ఈనెల 11వ తేదీన ధ్రువీకరణ పత్రం జారీ చేయగా ఇవన్నీ తీసుకున్న కేవలం రెండే రోజుల్లో అంటే ఈ నెల 13వ తేదీన ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్య శాస్త్రి పేరు తొలగించి సలుమూరి వరలక్ష్మి పేరును ఎక్కించారు. ఈ వ్యవహారంలో సదరు నిందితులు ఎక్కడా కూడా ఆ మహిళ అడ్రస్ కానీ, ఆధార్ నంబర్ లేదా ఆధార్ కార్డు జతచేసిన దాఖలాలు కనిపించకుండా జాగ్రత్త పడటం విశేషం

వ్యవహారం బయటకు పొక్కిందిలా...

గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులకు ఈ వ్యవహారంలో ముడుపులు ముట్టజెబుతామని చెప్పిన సదరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో పేరు మార్చిన అనంతరం వారిని లెక్కచేయకపోవడంతో వ్యవహారం బయటకు పొక్కింది. రూ.కోట్ల విలువైన భూముల వ్యవహారంలో తమను పక్కనబెట్టడంతో ఆగ్రహించిన సదరు వ్యక్తులు విషయం బయటకు కక్కడంతో వ్యవహారం బయటకు పొక్కింది.

తమకేమీ తెలియదు అంటున్న సిబ్బంది

తమకేం తెలియదు పైఅధికారి చేయమని ఇస్తే అన్నీ ఉన్నాయి కదా అని చేశామని చెబుతుండగా పై స్థాయి అధికారి మాత్రం ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం టీడీపీ నాయకులు ప్రశ్నించగా అన్ని పత్రాలు ఉన్నాయి కనుకే ఆన్‌లైన్‌లో చేర్చామని, హక్కుదారుడు వచ్చి ఓ స్టేట్‌మెంట్ ఇస్తే తొలగిస్తాం అంటూ నింపాదిగా సమాధానం చెప్పడంతో ఆశ్చర్యపోవడం వారి వంతైంది. అసలు భూమి ఉన్న హక్కుదారుడే మరణించలేదని, ఆయనకు పిల్లలు కూడా ఉన్నారని, దరఖాస్తు వచ్చినప్పుడు గ్రామంలో కనీసం విచారించకుండా బతికున్న మనిషి చనిపోయినట్లు చూపిస్తే గుడ్డిగా ఎలా చేశారంటూ పలువురు ప్రశ్నించడంతో అధికారులు నీళ్ల నములుతున్నారు.

భారీగా నజరానాలు

ఈ తంతులో తెనాలికి చెందిన టీడీపీ నాయకుడు పాత్ర ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో కూడా ఓ భూమి వ్యవహారంలో రూ.30 లక్షలు తీసుకొని పనిచేయకుండా తిప్పుకుంటూ ఇబ్బందులు పెడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ శాఖలో సహకరించిన పెద్దలకు రూ.కోటికి పైగా ముట్టజెప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాడికొండలో వీఆర్వోకు సహకరించిన వ్యక్తులకు రూ.50 లక్షల వరకు నగదు చేతులు మారగా ఈ తంతు నడిపించిన వీఆర్వోకు కూడా భారీగా ముట్టినట్లు చెబుతున్నారు. కింది స్థాయి అధికారులు సంతకాలు చేసినందుకు కూడా భారీ నజరానాలు అందాయని రెవెన్యూ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యేకు పలువురు ఫిర్యాదు

తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు స్థానిక నాయకులు పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్డీవోతో విచారణ చేయించి బాధ్యులను సస్పెండ్ చేయిస్తానని ఆయన నాయకులకు హామీ ఇచ్చారు. తమ సామాజిక వర్గానికి చెందిన వారే ఈ వ్యవహారంలో ఉండటంతో పలువురు నాయకులు మీకేం కాదులే మేమున్నాం అంటూ భరోసా ఇస్తున్నట్లు సమాచారం.

మిర్చి యార్డు సమాచారం
(మంగళ వారం ధరలు)

వచ్చిన బస్తాలు	54,236
అమ్మకాలు	50,639
నిల్వ	13,633

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,000–22,000
నంబరు–5	13,500–21,000
341	13,500–23,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	12,000–20,000
341	15,000–21,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	12,500 – 18,200
బాడిగ–355	13,500 – 21,000
దేవనూరు డీలక్స్	14,000 – 24,000
ఆర్మూర్	12,000 – 17,300
తాలుకాయలు	6,500 – 10,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	12,000–16,500
బాడిగ – 355	12,000–19,500
తాలు	6,500 – 9,000

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(మంగళ వారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 753

కొమ్ములు : 582 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట:	గరిష్ట:	మోడల్:
12,575	14,300	13,631

కాయలు : 171 బస్తాలు

కనిష్ట:	గరిష్ట:	మోడల్:
13,500	14,300	13,675

మొత్తం అమ్మకాలు : 564.75 క్వింటాళ్లు

–దుగ్గిరాల

ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రతులు దహనం

విషపు రాతలపై వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆగ్రహం

ఆంధ్రజ్యోతి పత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగం నాయకులు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): పచ్చ పత్రికల విషపు రాతలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిలువెల్లా రాతల్లో అబద్ధాలు తప్ప.. ఒక్క నిజం లేదని మండిపడ్డారు. అబద్ధాల పుత్రిక ఆంధ్రజ్యోతి పత్రికను బహిష్కరించాలన్నారు. పథకాల అమలుపై ఎల్లో మీడియాలో వచ్చిన కథనాలపై వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన, మహిళా విభాగంతో పాటు నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ శ్రేణులు కన్నెర్రజేశాయి. గుంటూరు లాడ్జి సెంటర్ వేదికగా కదం తొక్కాయి. వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వినోద్, యువజన విభాగం నగర ఉపాధ్యక్షుడు యర్రెడ్ల వెంకటేష్‌రెడ్డి, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు కేసరి సుబ్బులు, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తప్పుడు రాతల ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రతులను దహనం చేశారు.

■ ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు మాట్లాడుతూ పథకాలు అమలు చేతకాక గత ప్రభుత్వంపై నిందలు వేయడం నీతిమాలిన పని అని ధ్వజమెత్తారు. దీనికి పచ్చ మీడియా వంత పాడుతూ చంద్రబాబు తానా అంటే అవి తందానా అని తాళం వేస్తున్నాయని విమర్శించారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక అందరి కన్నా ముందు వరుసలో నిలబడి నిస్సిగ్గుగా పత్రికా విలువలకు తిలోదకాలు ఇచ్చేసిందని దుయ్యబట్టారు. చంద్రబాబు 'చెప్పేది కొండంత – చేసేది గోరంత' అయితే ఆంధ్రజ్యోతి మాత్రం దానికి పూర్తి రివర్సుగా కథనాలు వండి వడ్డిస్తోందని విమర్శించారు. తెలుగు దినపత్రికలా కాక తెలుగుదేశం కరపత్రికలా మారిపోయిన ఆంధ్రజ్యోతిని ప్రజలంతా బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

■ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ మాట్లాడుతూ అన్ని పథకాలు క్రమంగా ఎత్తేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. అందుకే ఆర్భాట ప్రచారాలతో ప్రజలను ఏమారుస్తోందని విమర్శించారు. పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కేసరి సుబ్బులు మాట్లాడుతూ, తన అనుకూల మీడియాలో కథనాలు రాయిస్తోన్న చంద్రబాబు వైఖరిని తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర ఉపాధ్యక్షుడు యర్రెడ్ల వెంకటేష్‌రెడ్డి మాట్లాడుతూ పిచ్చిపిచ్చి రాతలు రాస్తే.. చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం నేతలు గనిక జాన్సీ, తోటకూర స్వర్ణలత, రజియా బేగం, వెంకాయమ్మ, తులసి, విజయ, విద్యార్థి విభాగం నేతలు అరుణ్, అభి, రోషన్, వీరాస్వామి, తేజ, వెంకటేశ్వరరెడ్డి, రోహన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన మంగళగిరి కోచ్

డాక్టర్ సాతులూరి రాజు (ఫైల్)

మంగళగిరి టౌన్: పంజాబ్ రాష్ట్రం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్ పాటియాలాలో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈనెల 14,15,16 తేదీల్లో నిర్వహించిన ఏఎఫ్ఐ స్టార్టర్స్ సెమినార్ కం ఎగ్జామినేషన్‌లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన డాక్టర్ సాతులూరి రాజు ఉత్తీర్ణత సాధించారని ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరి గౌతమ్‌కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 44 మంది మాత్రమే పాల్గొనడానికి అర్హత సాధించగా వారిలో 32 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. డాక్టర్ రాజు ప్రస్తుతం హైదరాబాద్‌లోని సీబీఐటీ కళాశాలలో అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఖేలో ఇండియా అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స పోటీల్లో స్టార్టరుగా వ్యవహరించారని, జాతీయ స్థాయి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజును పలు క్రీడల అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

రేపటి నుంచి విజ్ఞాన్ వర్సిటీలో ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్

బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య, ఏపీ సైన్స్ సిటీ సీఈఓ కేశినేని వెంకట్

చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ అకాడమీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24 వరకు ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమ్మిట్–2026ను నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన్ ఇన్‌చార్జి వైస్ చాన్స్లర్ కేవీ క్రిష్ణకిషోర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, ఏపీ సైన్స్ సిటీ సీఈఓ కేశినేని వెంకట్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సమ్మిట్‌కు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వెల్లడించారు. ఎన్ఈసీసీన్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్, డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి, ఏపీ ప్రభుత్వ రోడ్లు, భవన నిర్మాణాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొననున్నట్లు తెలిపారు. అమరావతిలోని స్పేస్ సిటీ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా 'సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్–2026'ను కూడా మూడు రోజుల పాటు ఇదే సమ్మిట్‌లో భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్–2026

సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్–2026 ప్రధాన ఆకర్షణ

సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే 'సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్–2026' లో దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్, డిగ్రీ, స్కూల్, పాలిటెక్నిక్ విద్యార్థి బృందాలు పాల్గొననున్నాయని ఏపీ స్పేస్ సిటీ సీఈఓ కేశినేని వెంకట్ తెలిపారు. విజేతలకు ప్రత్యేక ట్రోఫీలు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు యూనివర్సిటీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలన

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, కలెక్టర్, ఎస్పీ

తాడికొండ: గుంటూరు జిల్లా రాయపూడిలో రాష్ట్ర స్థాయి గణతంత్ర వేడుకల ఏర్పాట్లను సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు పరిశీలించారు. ఈ మేరకు ఆయన మంగళవారం గుంటూరు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఐజీ రాజకుమారి, ఎస్పీ వకుల్ జిందాల్, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుడు కె.ఎస్.విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. గవర్నర్, ముఖ్యమంత్రి వచ్చే మార్గంతో పాటు స్టేజ్, ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్‌అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ భార్గవ తేజ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో క్రైం బ్రాంచ్ ఎస్ఐ మృతి

వినుకొండ: వ్యక్తిగత పనులపై వినుకొండ వచ్చిన ఎస్ఐ గుండెపోటుతో మృతిచెందిన ఘటన వినుకొండలో మంగళవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా కురిచేడుకు చెందిన డి.లక్ష్మీప్రసాదు (60) గతంలో వినుకొండలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం నరసరావుపేట జిల్లా క్రైం బ్రాంచ్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే స్వగ్రామం కురిచేడు నుంచి వ్యక్తిగత పనులపై వినుకొండ రైల్వేస్టేషనుకు వచ్చిన ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వినుకొండ పోలీస్టేషను సమాచారం ఇవ్వగా లక్ష్మీప్రసాదును స్థానికంగా ఉన్న ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

నెల్లూరు సబ్ జైల్‌కు అమృతలూరు ఎస్ఐ తరలింపు

వేమూరు: అమృతలూరు ఎస్ఐ రవితేజను నెల్లూరు సబ్‌జైలుకు తరలించారు. యువతిని మోసగించిన కేసులో న్యాయమూర్తి సోమవారం పదేళ్ల శిక్ష విధించిన విషయం విధితమే. నగరపాలెం పోలీసులు నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి సబ్‌జైలుకు తరలించారు. 2023 నగరంపాలెం ఎస్ఐగా పని చేస్తున్న సమయంలో రవితేజపై గుంటూరు జీజీహెచ్‌లో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న యువతి రవితేజ మోసం చేశాడని, న్యాయం చేయాలని కోరుతూ తాడేపల్లి ఐద్వా ప్రతి నిధులను ఆశ్రయించింది. ఐద్వా సహకారంతో గుంటూరు ఎస్పీకి స్పందనలో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో జైలు శిక్ష విధించగా సబ్ జైల్‌కు తరలించారు.

ఉద్యోగులను తొలగిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

పిడుగురాళ్ల: స్త్రీశక్తి పథకంపై విధులు అంటూ ఆర్టీసీ ఉద్యోగులను తొలగిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. పట్టణంలోని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ పల్నాడు జిల్లా నిర్మాణ కమిటీ సమావేశం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. పిడుగురాళ్ల ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీతో ఈ మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకాన్ని విజయవంతం చేయడంలో ఏపీపీటీడీ(ఆర్టీసీ) సిబ్బంది అంకిత భావంతో కృషి చేస్తున్నారన్నారు. బస్సుల కండీషన్ బాగాలేకపోయినా, టిమ్స్ సరిగా పనిచేయకుండా.. ఇబ్బంది పెడుతున్నా పని చేస్తున్నామన్నారు. ఈ పథకం అమలులో రోజువారి డ్యూటీల్లో కండక్టర్లు, డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను గాని, పెరుగుతున్న తీవ్రమైన పని ఒత్తిడిని గానీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆర్టీసీ తనిఖీ అధికారులు అత్యుత్సాహం చూపిస్తూ విధి నిర్వహణలో జరుగుతున్న చిన్న చిన్న పొరపాట్లపై కేసులు రాస్తూ.. ఉద్యోగులను సస్పెండ్లు చేయడమే కాకుండా తీవ్రమైన పనిష్మెంట్లు ఇస్తున్నారని, ఇలాగైతే భవిష్యత్‌లో కండక్టర్లు, డ్రైవర్లు డ్యూటీలు చేయడమే కష్టం అవుతుందన్నారు. ఇప్పటికైనా స్త్రీ శక్తి పథకం కేసుల్లో సస్పెండ్ చేసే విధానాలు మానుకోవాలని, లేకపోతే భవిష్యత్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఈయూ ఆధ్వర్యంలో ఉద్యమాల బాట పట్టక తప్పదని హెచ్చరించారు.

■ ఏపీజేఏసీ–అమరావతి పల్నాడు జిల్లా చైర్మన్ ఎన్.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ... ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర 4వ మహాసభలు ఫిబ్రవరి 5న విజయవాడలో నిర్వహిస్తునానమని ఈ మహాసభల్లో అధిక సంఖ్యలో ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు, రాష్ట్ర నాయకులు ఎన్‌వీ కృష్ణారావు, మందపాటి శంకరరావు, ఎన్.కోటేశ్వరరావు, బీకే రావు, జోనల్ అధ్యక్షుడు వాకా రమేష్, సీపీఐ పిడుగురాళ్ల పట్టణ కార్యదర్శి బాలయ్య, అన్ని డిపోల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆ..బాలికను గుర్తించాం

తండ్రి భిక్షాటన చేయమంటున్నాడనే ఇల్లు వదిలి వెళ్లిపోయినట్లు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ వెల్లడి

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కుమార్తె అదృశ్యం అయిందని పీజీఆర్ఎస్‌లో పిల్లా ఏసోబు అనే వ్యక్తి ఫిర్యాదు చేసిన అంశంపై గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్‌డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్ లాలాపేట పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆర్.అగ్రహారం నిమ్మలపేటకు చెందిన పిల్లా ఏసోబు దివ్యాంగుడు. తన కుమార్తె గత ఏడాది మార్చి 15వ తేదీ నుంచి ఇంటి నుంచి వెళ్ళిపోయిందని, పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈ అంశంలో వాస్తవానికి ఏసోబు అంజలి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి 14 సంవత్సరాల బ్లెస్సీ అనే కుమార్తె ఉన్నది. ఏసోబు తన భార్యతో కలిసి గుంటూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఏసోబు తన భార్య అంజలి, కుమార్తె బ్లెస్సీని కూడా తనతో కలిసి భిక్షాటనకు రావాలని బలవంతం చేయడం ప్రారంభించాడు. వారిద్దరు అందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలోనే తల్లి అంజలి, కుమార్తె బ్లెస్సీ కలిసి గత ఏడాది జనవరి 2వ తేదీన ఇంటి నుంచి వెళ్ళిపోయారు. అనంతరం ఏసోబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే ఏడాది ఏప్రిల్ 22న కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా అంజలి, బ్లెస్సీల ఆచూకీ తెలిసిందని, గత సంవత్సరం మే 8వ తేదీన అంజలి లాలాపేట పీఎస్‌కు హాజరుకాగా, తన భర్త భిక్షాటన చేయమంటున్నాడని, అందుకే తాము వెళ్ళిపోయామని, తన కుమార్తెను తానే చూసుకుంటానని చెప్పిందన్నారు. తన భర్త మరో మహిళను వివాహం చేసుకుని, తనని మానసిక రోగిగా చూపిస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడని ఆమె చెప్పటం జరిగిందన్నారు. కుమార్తె బ్లెస్సీ కూడా తన తల్లి చెప్పిన విషయాలతో ఏకభవిస్తూ.. తన తండ్రితో కలిసి ఉండడానికి ఆసక్తి చూపలేదని వెల్లడించింది. దీంతో కేసును నిలిపివేయటం జరిగిందన్నారు. ప్రస్తుతం, అదృశ్యమైన బాలిక ఆచూకీ రంగారెడ్డి జిల్లా కీసర మండలంలో గుర్తించబడిందని, ఆమెను ఇక్కడకు తీసుకురావడానికి సిబ్బందిని పంపటం జరిగిందన్నారు. ఈ అంశంలో పోలీసులు నిర్లక్ష్యం వహించలేదని తెలిపారు.

క్లుప్తంగా

కాజా టోల్‌గేట్ వద్ద అదుపు తప్పిన లారీ

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం కాజా టోల్‌గేట్ వద్ద ఓ లారీ అదుపు తప్పిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు విజయవాడ నుంచి కేరళ వైపు వెళ్తున్న కాటన్ బెయిల్ లోడ్ తో ఉన్న లారీ బ్రేకులు ఫెయిలవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. లారీ డ్రైవర్ అప్రమత్తతో టోల్ ప్లాజా వద్ద టోల్ ఫీజు వసూలు చేసే ఒక కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్‌ని ఢీ కొట్టి ఆగిపోయింది. దాంతో టోల్‌గేట్ కు సంబంధించిన కొంత సామగ్రి దెబ్బతింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో టోల్ ప్లాజా సిబ్బందితో పాటు వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన జరగడంతో టోల్ ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ ఆగిపోయింది.

ఏఐబీఈ- 2025లో వీఎస్ఎల్ నూరుశాతం ఉత్తీర్ణత

తాడికొండ: వీఐటీ–ఏపీ వర్సిటీలోని వీఐటీ–ఏపీ స్కూల్ ఆఫ్ లా (వీఎస్ఎల్) విద్యార్థులు ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ (ఏఐబీఈ) 2025లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు యాజమాన్యం మంగళవారం తెలిపింది. ఇది న్యాయ విద్యలో రాణించడానికి వీఐటీ–ఏపీ స్కూల్ ఆఫ్ లా నిబద్ధతను ప్రతిబింబించే ఒక అద్భుతమైన మైలురాయి అన్నారు. వీఐటీ–ఏపీ స్కూల్ ఆఫ్ లా డీన్ డాక్టర్ బెనార్జీ చక్కా మాట్లాడుతూ వీసీ డాక్టర్ అరుళ్ మౌళి వర్మన్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి సహకారం, వర్సిటీ చాన్స్లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మద్దతు, అధ్యాపకుల అంకితభావంతో కూడిన ప్రయత్నాలతో, వీఎస్ఎల్ విద్యార్థులు అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు.

కాలువలో పడి వృద్ధురాలు మృతి

చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు కాలువలో పడి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందోలు ఎస్ఐ ఎంవీ శివకుమార్ యాదవ్ తెలిపిన వివరాల మేరకు పిట్టలవాని పాలెం మండలం చందోలు పంచాయతీ పెద దళితవాడ గ్రామానికి చెందిన మండే భూలక్ష్మి(70) చందోలు గ్రామంలోని వైన్ షాపు సమీపంలో ఉన్న ఆర్మండ్ కాలువలో పడి మృతిచెందినట్లు తెలిపారు. భూలక్ష్మి ఈనెల 17వ తేదీన మధ్యాహ్నం నుంచి కనిపించటం లేదని కుటుంబ సభ్యులు తమకు ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం ఆర్మండ్ చానల్‌లో మృత దేహం ఉన్న విషయం తెలుసుకుని బయటకు తీయించి కుటుంబ సభ్యుల సమక్షంలో భూలక్ష్మిగా గుర్తించామని తెలిపారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

తనిఖీలు నిర్వహించి మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

గుంటూరు రూరల్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్స్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్ రమేష్ ఆధ్వర్యంలో డీ10 సెక్షన్ నందున్న గుంటూరు, బుడంపాడు గ్రామాల్లో మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు డీపీ కేపీ కరీమ్, జి.సుందరబాబు, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీహెచ్ ఖాన్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. తనిఖీలలో 56 మంది అధికారులు, 168 మంది సిబ్బంది, 56 బృందాలుగా ఏర్పడి 5,298 సర్వీసులను తనిఖీ చేయటం జరిగిందన్నారు. అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరిలలో విద్యుత్ వినియోగిస్తున్న నలుగురికి రూ 38 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న 212 మందికి రూ10.08 లక్షలు మొత్తం రూ 10.46 లక్షలు అపరాధ రుసుంను విధించారని తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులు చేసేందుకు 9440812263, 9440812361 నెంబర్లకు నేరుగా కానీ వాట్సప్ ద్వారా కానీ సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. దాడులలో ఆపరేషన్ విభాగం డీఈఈ షేక్ ముస్తాక్ అహ్మద్, డీపీఈ, డీఈఈ కె.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, ఏట దేవదాస్, ఎం.సతీష్‌కుమార్, శివశంకర్, కె.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు జాతి వృషభ రాజాల బల ప్రదర్శనలో విజేతలు

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని గోల్కొండ గార్డెన్స్‌లో జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభరాజాల బల ప్రదర్శన ఉత్సాహంగా సాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు తమ ఎడ్లజతలను తీసుకువచ్చి పోటీలలో పాల్గొంటున్నారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పోటీలలో రెండు పళ్ల, నాలుగు పళ్ల విభాగాల్లో విజేతలైన ఎడ్లజతల వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. వారికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అధ్యక్షతన మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, శ్రావణ్‌కుమార్‌లు నగదు, జ్ఞాపికలను అందజేశారు.

■ రెండు పళ్ల విభాగంలో.. దొండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్‌లకు చెందిన ఎడ్ల జత 4095.4 మీటర్లు లాగి ప్రథమస్థానంలో నిలిచింది. ఆర్‌కే బుల్స్ అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి (వేటపాలెం)ల ఎడ్ల జత ద్వితీయస్థానంలో, చాగంటి శ్రీనివాస్‌చౌదరి(కొండెపాడు), పల్లం రిత్విక్‌చౌదరి, యువాన్ చౌదరి(ఉప్పుగుండూరు)ల ఉమ్మడి ఎడ్ల జత తృతీయస్థానంలో నిలిచాయి.

■ నాలుగు పళ్ల విభాగంలో... కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవలీష్ రెడ్డి(సూర్యాపేట)ల ఎడ్ల జత 3966.4 మీటర్ల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. చిలుకూరి నాగేశ్వరరావు(జెపంగులూరు), శశంక్‌శ్రేయా (కోడుమూరు)ల ఎడ్ల జత ద్వితీయస్థానంలో, బచ్చిగారి విజయలక్ష్మినాయుడు(ఆకవీడు), కెవీ హేమలతారెడ్డి (కడప)ల ఎడ్ల జత తృతీయస్థానంలో నిలిచాయి.

కాలువలోకి దిగిన యువకుడు గల్లంతు



బాపట్లటౌన్: స్నానం చేసేందుకు కాలువలోకి దిగిన యువకుడు గల్లంతైన ఘటన మండలంలోని నరసాయపాలెం శివారులో చోటుచేసుకుంది. నరసాయపాలెం గ్రామానికి చెందిన మిక్కిలి శరత్‌బాబు మంగళవారం సాయంత్రం నరసాయపాలెం లాకులు సమీపంలో కొమ్మమూరు కాలువలో స్నానం చేసేందుకు దిగారు. కాలువ నీరు ఉధృతంగా రావడంతో కాలువలో కొట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు శరత్ కోసం గాలించి నప్పటికీ ఆచూకీ లభించలేదు.

26న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జల సరళాదేవి కళ్యాణ మండపంలో 26వ తేదీ రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఎ.రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 ఏళ్ల నుంచి 90 సంవత్సరాల వయస్సు వరకు ఎవరైనా పోటీల్లో పాల్గొనవచ్చునని చెప్పారు. 7, 9, అండర్ 11 , అండర్ 13, అండర్ 15 బాల బాలికలకు ప్రత్యేక ట్రోఫీలను అందిస్తామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందచేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారుల కోసం భోజన వసతి కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆర్గనైజర్ జె.మల్లేశ్వరరావు 99598 77276 , డైరెక్టర్ ఎ.రామకృష్ణ– 99486 79397లకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

భూ యజమానులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● సక్రమంగా పనిచేయని సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం

● బాపట్ల కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

కర్లపాలెం: వెబ్‌ల్యాండ్‌లో ఇతరులు అనే కేటగిరిలో ఉన్న భూముల యజమానులను గుర్తించి వారి పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ కర్లపాలెం మండలం పేరలి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరును పరిశీలించారు. కొందరు సిబ్బంది హాజరు వేయక పోవటంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సచివాలయం సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని హెచ్చరించారు. సకాలంలో హాజరు వేయని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావును ఆదేశించారు. వీఆర్వో రెండు నెలల నుంచి సెలవులో ఉండటంపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీదేవికి చెప్పారు. డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్ విధులకు ఆలస్యంగా రావటంపై కలెక్టర్ వారిని మందలించారు. అనంతరం వెబ్‌ల్యాండ్‌లో రైతుల ఆన్‌లైన్ వివరాలను పరిశీలించి ఇతరులు కేటగిరిలో ఉన్న భూముల వివరాలను రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో రైతుల పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గ్రామంలో 6,500ల ఎకరాల భూమి ఉండగా ఇతరుల కేటగిరిలో 2,764ఎకరాల భూమి ఉండటంపై కలెక్టర్ తహసీల్దార్ శ్రీదేవిని వీఆర్వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూముల రీసర్వేలో భాగంగా ఇతరుల కేటగిరిలో ఉన్న రైతులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఆర్డీవో పి.గ్లోరియా, ఈడీఎం కుమార్‌రాజన్ తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. ✆ 87907 41166

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 83338 33368

■ Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nlr Dt. 9150011538, 9750497504

WANTED

■ తెనాలి, మంగళగిరి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అ:డిగ్రీ, జీ: 15000+3000. సంప్ర: 91214 69383

■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్. 10th, ఇంటర్, డిగ్రీ. వ:18–28 సం॥లోపు ✆ 9133444985 / 89

■ అతిథి గృహపుడ్స్ గుంటూరు నందు పనిచేయుటకు అనుభవం కలిగిన DTP ఆపరేటర్ (లేడిస్) వెంటనే కావలెను. వయసు:35 సం॥లోపు, టైమ్ 10 to 8, జీతం: 15000/– సంప్ర: 93969 71898

■ ఆఫీసు మేనేజర్ కావలెను. డిగ్రీ, పిజి, అడ్మినిస్ట్రేషన్ లో 10 సం॥ల అనుభవం, కంప్యూటర్ పై అవగాహన, 40 సం॥లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీ నందు పని చేయుటకు సేల్స్ అడ్వైజర్ కావలెను. అర్హత 10th ఆపైన, వయస్సు 18 సం॥ఆపైన. Cont: 89788 55399

■ Wanted experienced Telicallers / Computer Operators(F) Education Consultancy, Lakshmipuram, Sal: 15k to 20k, Qul: Degree, Contact: 9052975353

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంతి ఉద్యోగులు, హౌస్‌వైఫ్స్ 10th పాస్ 50 సం॥పై వయస్సువారు కావలెను. 70367 61665

■ గుంటూరు, మంగళగిరి, సత్తెనపల్లి, ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & గుంటూరు ఆఫీసులో DTP ఆపరేటర్ కావలెను. 9866618811, 9866618877

■ డైరెక్ట్ జాయినింగ్: సూపర్‌వైజర్స్, డ్రైవర్స్, మెస్ ఇన్‌ఛార్జి, స్టోర్ ఇన్‌ఛార్జి లైబ్రేరియన్ Ex.ఆర్మీ, ITI (Dip. All) కా. (రూం+భో) PF+ESI జీ: 18 to 32 ✆ 85019 22079

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు
7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

వాసవీమాతకు విశేష పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం వాసవీమాత అగ్నిప్రవేశం సందర్భంగా అర్చకులు వి.రాజేంద్రశర్మ విశేష పూజలు చేశారు. ఉత్సవ మూర్తికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్రనామ పూజలు, కుంకుమార్చనలు జరిపారు. ఆర్య వైశ్య మహిళలు పూజల్లో పాల్గొని లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామ పారాయణ గావించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ డి.నరేంద్రకుమార్, కార్యదర్శి గుగ్గిళం మధుసూదనరావు, కె.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

25 పశువులకు ఆరోగ్య పరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామంలో మంగళవారం నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో పశు ఆరోగ్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎం.నరసింహరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా 25 పశువులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, చూడి పరీక్షలు నిర్వహించి నట్టల నివారణ మందులను వైద్యాధికారి షేక్.పీర్ అహ్మద్ అందజేశారు. వాటితో పాటు కొన్ని పశువులకు ఎద ఇంజిక్షన్లు, గర్భకోశ వ్యాధుల పరీక్షలు చేశారు. దూడలకు నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఆర్.వినీల, పాడి రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన అనారోగ్య బాధితుడికి స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. స్థానికులు కందుల కృపాకర్‌కు రూ.2,51,592ల విలువైన చెక్కును లబ్ధిదారుని ఇంటికి వెళ్లి అందజేసినట్లు నాయకులు పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

తాడేపల్లి రూరల్: ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా జరుగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పట్టణం ప్రకాష్‌నగర్‌లోని కార్యాలయంలో సమన్వ కమిటీ సమావేశాన్ని కొప్పునాతి లక్ష్మి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకూ ఆందోళన నిర్వహించాలని కోరారు. ఫిబ్రవరి 12న పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించాలని, కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, నార్ని నాగేశ్వరరావు, కోట బాబూరావు, సూర్యప్రకాష్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తాడికొండ: పశు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పొన్నెకల్లు పశు వైద్యాధికారిణి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. పశు సంవర్ధక శాఖ–రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఈనెల 19 నుంచి ప్రారంభించిన ఈ పథకంలో భాగంగా రూ.1,500 నుంచి రూ.1 లక్ష వరకు పశువు ఖరీదు బట్టి బీమా చేయించుకోవచ్చన్నారు. పశువులకు బీమా చేయిస్తే 3 ఏళ్ల వరకు వర్తిస్తుందని, తెల్ల రేషన్ కార్డు ఉన్న రైతులు ప్రభుత్వ సబ్సిడీతో 50 శాతం రాయితీ ప్రకారం సగమే రైతు కట్టాల్సి ఉందని వివరించారు. ఆవులు, గేదెలు, ఎద్దులతో పాటు గొర్రెలు, మేకలకు కూడా ఈ పథకం వర్తిస్తుందని.. దీనిని పశు పోషకులు ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు.

యువతకు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన నేడు

మేడికొండూరు: మేడికొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఉపాధి కల్పనపై నిరుద్యోగులకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు డీబీఆర్సీ కోఆర్డినేటర్ కూరపాటి నిర్మల తెలిపారు. మండల పరిధిలోని నిరుద్యోగులు హాజరై అధికారులు తెలియజేసే విషయాలను గ్రహించాలని ఆమె పేర్కొన్నారు. పదో తరగతి ఆపై చదివి 18 నుంచి 40 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. మేడికొండూరు మండల ఎంపీడీవో డేవిడ్ ప్రభాకర్, స్టెప్ ఆఫీస్ జిల్లా కోఆర్డినేటర్ రాధిక, మండల వెలుగు ఏపీఎం విజయభారతి పాల్గొంటారని ఆమె తెలియజేశారు.

డ్రగ్స్ రహిత జిల్లాకు సహకరించాలి

- విచ్చలవిడిగా రోడ్లపై మద్యం తాగుతున్నారంటూ మహిళలు ఫిర్యాదు
- ఒక బెల్ట్‌షాపులో మద్యం సీజ్

అంజిరెడ్డి కాలనీలో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ వీరేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డికాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో నలుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 40 మంది సిబ్బంది పాల్గొని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. తనఖీల అనంతరం డీఎస్పీ మురళీకృష్ణ మహిళలకు సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించడంతో రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగుతున్నారని.. రోడ్డుపై నడవాలంటే భయంగా ఉందని వాపోయారు. గతంలో మద్యం కావాలంటే ఎక్కడికో వెళ్లివచ్చేవారని, ఆరునెలలకో ఏడాదికో ఒకసారి రోడ్డుపై మద్యం తాగుతూ కనిపించేవారని, ఆ సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తే వెంటనే వచ్చి వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసేవారని తెలిపారు. కానీ నేడు రేయింబవళ్లు ఇంటివద్ద, రోడ్లపై మద్యం తాగుతున్నారని.. ప్రశ్నిస్తే దాడి చేస్తున్నారంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

బెల్ట్ షాపులు లేకుండా చేయాలి..

అమరారెడ్డి కాలనీలో మూడు చోట్ల బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని.. కాగా ప్రస్తుతం ఒక ఇంట్లో బెల్ట్‌షాపును గుర్తించి మద్యాన్ని సీజ్ చేశారని.. ఇక్కడ బెల్ట్ షాపులు పూర్తిగా లేకుండా చేయాలని మహిళలు మురళీకృష్ణకు విజ్ఞప్తి చేశారు. మహిళల సమావేశం అనంతరం డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా 112కు సమాచారం ఇవ్వాలని, ధైర్యంగా అసాంఘిక వ్యక్తులపై ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఐజీ సర్వశ్రేష్ఠ తిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గుంటూరు జిల్లాని గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా పాత నేరస్తుల నివాసాల తనిఖీలతో పాటు మిగిలిన నివాసాలను కూడా తనిఖీ చేస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాల నివారణకు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించినట్లు ఆయన తెలిపారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 120 వాహనాలను గుర్తించి సీజ్ చేశామని వివరించారు. తనిఖీల్లో ఎస్ఐలు ఖాజావలి, అపర్ణ, సాయి, విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల పత్రాలు తనిఖీ చేస్తున్న తుళ్లూరు పోలీసులు

తుళ్లూరులో స్వాధీనం చేసుకున్న వాహనాలు

తుళ్లూరులో 70 వాహనాలు స్వాధీనం..

తాడికొండ: తుళ్లూరులో మంగళవారం డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో దొండపాడు టిడ్కో గృహాలలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో సరైన వాహన పత్రాలు లేని 70 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత జిల్లాకు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని 70 వాహనాలు సీజ్ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుళ్లూరు సీఐలు శ్రీనివాసరావుతో పాటు ఐదుగురు సీఐలు, 65 మంది సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రతినిధులు

తాడేపల్లి రూరల్: రోటరీ క్లబ్ తాడేపల్లి ఆధ్వర్యంలో తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సినేషన్ (హెచ్‌పీవీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రతినిధులు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, స్కాట్టిపూన వాళ్ల ప్రైవేట్ లిమిటెడ్ రోటరీ డిస్ట్రిక్స్, రోటరీ క్లబ్ ఆఫ్ ఢిల్లీ సౌత్, రోటరీ క్లబ్ ఆఫ్ ఫారదాబాద్ వన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ శక్తి పేరుతో 2,500 మంది బాలికలకు ఉచితంగా గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్స్ అందజేసినట్లు తెలిపారు. సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రముఖ క్యాన్సర్ నిపుణులు, అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సుల పర్యవేక్షణలో టీకా కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రోటరీ ప్రతినిధులు డాక్టర్ గుగాని రవీందర్, బళ్లా వందన, ఎస్.రాంప్రసాద్, డాక్టర్ వడ్లమాని రవి, ప్రాజెక్ట్ శక్తి చైర్మన్ తాళ్ల రాజశేఖరరెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు శెట్టి రామకృష్ణ, కార్యదర్శి జెట్టి శ్రావణి, పాస్ట్ ప్రెసిడెంట్ మున్నంగి వివేకానందరెడ్డి, ప్రెసిడెంట్ ఎలక్ట్ కాట్రగడ్డ శివన్నారాయణ, రావూరి రమేష్‌బాబు, ప్రాజెక్ట్ చైర్మన్ జంగాల వెంకటేష్, పరుచూరి కిరణ్ కుమార్, గోపు నాగరాజేష్, జొన్న రాజేష్, శెట్టి కేశవరావు, పలగాని శ్రీకాంత్, ఉండేల చంద్ర ఓబుల రెడ్డి, చొప్పర బుల్లిబాబు పాల్గొన్నారు.

23న అమరావతిలో మెగా జాబ్ మేళా

270కి పైగా ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి–శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీఏ సౌజన్యంతో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో 'జాబ్ మేళా' నిర్వహించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఆర్‌వీఆర్ కన్‌స్ట్రక్షన్స్, ఎన్‌సీసీ లిమిటెడ్, ఎంవీఆర్ కన్‌స్ట్రక్షన్స్, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, ఎల్‌అండ్‌టీ కన్‌స్ట్రక్షన్స్, బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. జాబ్ మేళాలో సైట్ ఇంజినీర్, సైట్ సూపర్‌వైజర్, ఎలక్ట్రిషియన్, ప్లంబర్, ఎన్ఎంఆర్ లేబర్, మెకానికల్ ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్, సివిల్ ఇంజినీర్, మెకానికల్ ఇంజినీర్, క్యూఏ అండ్ క్యూసీ ఇంజినీర్, క్యూస్ అండ్ ప్లానింగ్ ఇంజినీర్, అకౌంటెంట్స్, సివిల్ ఇంజినీర్(టెక్నికల్), కన్‌స్ట్రక్షన్ ఎలక్ట్రిషియన్స్, వెల్డింగ్, ఫోమ్ వర్క్, కార్పెంటరీ, బార్ బెండింగ్, స్కాఫోల్డింగ్ ట్రేడ్, ఫీల్డ్ కోఆర్డినేటర్, ఫీల్డ్ అసిస్టెంట్, అకౌంట్స్–ఇన్వెంటరీ, ఇంటర్నల్ ఆడిట్, ఓహెచ్ఎస్, ఈ అండ్ ఎస్ కన్‌స్ట్రక్షన్ సేఫ్టీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగనున్నాయని తెలిపారు. 10, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, డిగ్రీ, పీజీ చదివి 19 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగిన ఫ్రెషర్స్, వృత్తి అనుభవం ఉన్న అభ్యర్థులు హాజరు కావొచ్చని పేర్కొన్నారు. పలు ఉద్యోగాలకు వసతి, భోజన సదుపాయం, ఇన్సెంటివ్‌లు, అలవెన్సులు సైతం లభిస్తాయని అన్నారు. పూర్తి వివరాలకు శ్రీకర్ 99634 25999 నంబరును సంప్రదించాలని కోరారు. జాబ్ మేళాలో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నైపుణ్యం పోర్టల్ httpr://naipunyam.ap.gov.in లో నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ప్రయాణికులకు తప్పని నల్లమట్టి తిప్పలు!

ఉండవల్లి రోడ్డులో భారీగా రోడ్డుపై పడిన నల్లమట్టి

నల్లమట్టిని తొలగిస్తున్న స్థానిక వ్యక్తి

తాడేపల్లి రూరల్: రాజధాని ముఖద్వారమైన ఉండవల్లి గ్రామస్తులకు నల్లమట్టి తిప్పలు తప్పడంలేదు. మంగళవారం తెల్లవారుజామున ఉండవల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఓ లారీ నుంచి రోడ్డుపై నల్లమట్టి పడింది. తెల్లవారుజామున స్థానికులు గమనించకుండా నీళ్లు జల్లడంతో ఆ దారంతా నల్లమట్టితో బురదమయంగా మారింది. మరో పక్క ఇసుక లారీలు వచ్చినప్పుడల్లా నల్లమట్టిపై నీళ్లు కారడంతో నల్లమట్టి, బురద అలాగే ఉండిపోయింది. రాకపోకలు సాగించే వాహన చోదకులు ఆ మట్టిపై జారి వాహనాలతో సహా కింద పడుతున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో అనేక సార్లు నల్లమట్టి పడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రోడ్డుపై నల్లమట్టిని తొలగించకపోవడంతో స్థానికులు ఆ మట్టిని తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవం వేంకటేశుడి కల్యాణం

దుగ్గిరాల: దుగ్గిరాల రైలుపేట పసుపు యార్డు సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో మంగళవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి శాంతి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. అర్చకులు సాకేత్ శర్మ, రామచంద్ర కల్యాణ క్రతువు జరుపగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణ గావించారు.

28, 29న అంతర కళాశాలల చదరంగం పోటీలు

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చలపతి విద్యా సంస్థల సెక్రటరీ సుజిత్, అధ్యాపకులు

తాడికొండ: మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో ఈనెల 28, 29 తేదీల్లో ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పురుషుల, స్త్రీల చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు చలపతి విద్యా సంస్థల సెక్రటరీ వై.సుజిత్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నల్లాని వెంకటరామారావు, అధ్యాపకులతో కలిసి సుజిత్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని అధిగమించి మానసిక వికాసానికి చదరంగం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. తమ విద్యా సంస్థలు గత కొన్నేళ్లుగా ఈ పోటీలకు వేదికగా నిలవడం తమకు సంతోషదాయకమని, భవిష్యత్తులో కూడా దీనికి ముందుండి తోడ్పాటు అందిస్తామని అన్నారు. అంతర కళాశాలల పోటీలలో విజేతలైన జట్లు సౌత్ జోన్ అంతర విశ్వ విద్యాలయాల పోటీల్లో పాల్గొనే విజేతలకు వేదిక కానుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతికత వినియోగంపై శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట దీపక్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణం ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఎస్ఈఓసీ)ను స్టేట్‌లెవల్ అధికారులు మంగళవారం సందర్శించారని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సౌత్ క్యాంపస్ కొండపావులూరులో విపత్తు సంసిద్ధత, ప్రతిస్పందనలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికత వినియోగంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా 10 రాష్ట్రాలకు చెందిన స్టేట్ లెవల్ అధికారులు విచ్చేశారని తెలిపారు. వీరికి జాతీయ, రాష్ట్ర స్థాయిలో నూతన సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా వాతావరణ స్మార్ట్ డాష్ బోర్డులు, డెసిషన్ సపోర్ట్ సిస్టమ్‌లు, కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆపరేషనల్ వర్క్‌ఫ్లో గురించి వివరించారు. కార్యక్రమంలో పీ ఎస్ఈఓసీ ఇన్‌చార్జి పీటర్, కెపాసిటీ బిల్డింగ్ ఆఫీసర్ తనూజ, ప్రాజెక్ట్ మేనేజర్లు బస్వంత్, సతీష్, కిషోర్, పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి వేడుకలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలో నాదబ్రహ్మ, రామభక్తుడు త్యాగరాజస్వామి జయంతిని నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కొత్తపేటలో త్యాగరాజస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి విశేష పూజలు జరిపారు. నాదస్వర కచేరీ నిర్వహించి వారిని సత్కరించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఉంచి మంగళవాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు బి.నరసింహరావు, టి.రంగయ్య, డాక్టర్ టి.వెంకటేశ్వరరావు, టి.జయరాములు, వి.ఏడుకొండలు, వెంకటపతి, చిన్నప్ప, కోటయ్యలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఏఎంఆర్ నెట్‌వర్క్ సమావేశం

హాజరుకానున్న ఇండియా, యూకే నిపుణులు

మంగళగిరి టౌన్: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బుధవారం నుంచి ఇండియా యూకే దేశాల పరిశోధనా నిపుణులతో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై ప్రత్యేక సమావేశం జరగనున్నట్లు సమావేశ పర్యవేక్షకులు డాక్టర్ జయశీలన్ మురుగయ్యన్ మంగళవారం తెలిపారు. ఏఎంఆర్ వాడకం, వ్యాధి నిరోధకతపై పరిశోధనలు, వీటిని ముందుకు తీసుకువెళ్లేందుకు అవసరమైన ప్రణాళికల రూపకల్పన కోసం సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి ఇండియా, యూకే దేశాల నుంచి పరిశోధకులు, వైద్యులు, పశువైద్యరంగ నిపుణులు, ప్రజారోగ్య ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఏఎంఆర్‌పై ఈ రెండు దేశాల నిపుణుల మధ్య సహకారం పెంపొందించడమే సమావేశ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. యూకేలోని లీడ్స్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ సువర్ణ మిత్రా, డాక్టర్ మహుదారాస్, బోస్ ఇనిస్టిట్యూట్ అండ్ యూనివర్సిటీ ఆఫ్ ఖుర్వాన్ నుంచి డాక్టర్ జమూర్ ఘోష్, ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ నుంచి డాక్టర్ శోభన్‌లు, తదితర నిపుణులు హాజరు కానున్నారని ఆయన తెలియజేశారు.

నాశనమవుతున్న కార్మికుల జీవితాలు

కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కార్మికుల జీవితాలు నాశనమవుతున్నాయని సీఐటీయూ తాడేపల్లి నాయకులు వేముల దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బ్రహ్మానందపురంలో కార్మికుల నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు అంకయ్య, సుభాని, తుపాకుల నాగేశ్వరరావు, సూర్యప్రకాష్, దామవరపు నాగేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 413 రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నా యాజమాన్యంలో గానీ, ప్రభుత్వంలో గానీ స్పందన లేకపోవడం విచారకరమని అన్నారు. కార్మికులకు నష్టపరిహారం ఇవ్వకుండా కాలయాపన చేయడం వల్ల కార్మికుల జీవితాలు నాశనం అవుతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో షాంసుద్దీన్, గురవయ్య, పిచ్చయ్య, మహిళలు, బ్రహ్మానందపురం మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. దీక్షలో ఏసుదాసు, నారదాసు, సుబ్బారావు, యహోషువా, హగ్గయ్య తదితరులు కూర్చున్నారు.

విజయానికి సహకరించాలి

తెనాలిరూరల్: బార్ కౌన్సిల్‌లో ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు మద్దతు తెలిపి విజయానికి సహకరించాలని సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ న్యాయవాదులను కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఫిబ్రవరి 13న ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో పోటీచేస్తున్న సీనియర్ న్యాయవాది రాజేంద్రప్రసాద్ మంగళవారం తెనాలి వచ్చారు. కోర్టు భవనాల సముదాయంలోని జిల్లా కోర్టును సందర్శించారు. న్యాయవాదులతో మాట్లాడారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావటానికి తాను చాలాకాలంగా కషిచేస్తున్నట్టు తెలిపారు. ఆ దిశగా భవిష్యత్‌లో మరింతగా కషిచేస్తానని న్యాయవాదులకు హామీనిచ్చారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన పోరాటాలను కొనసాగిస్తానని చెప్పారు.

విద్యుత్ హైఓల్టేజ్‌తో గృహోపకరణాల దగ్ధం

సుమారు రూ.4 లక్షల వరకూ నష్టం

నివాసంలో దగ్ధమైన సీలింగ్, టీవీ, ఫర్నిచర్

మంగళగిరి టౌన్: విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అవాంతరాలతో మంగళగిరి 28వ వార్డు గాంధీనగర్‌లో మంగళవారం పలు నివాసాల్లో గృహోపకరణాలతో పాటు విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. అకస్మాత్తుగా సరఫరా అయిన హైఓల్టేజ్‌తో గృహాల్లో వినియోగంలో ఉన్న రిఫ్రిజిరేటర్లు, ఫ్యాన్లు, లైట్లు, టీవీలతో పాటు ఫర్నిచర్, సీలింగ్, పలు ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం సంభవించిన ఈ ఘటనతో నివాసాల్లో నుంచి ప్రజలు రోడ్డుపైకి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోపు ఆయా నివాసితులు మంటలు అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు చెలరేగిన నివాసాల్లో అగ్నిమాపక సిబ్బంది వివరాలు సేకరించి సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉండవచ్చని అంచనా వేశారు. దీనిపై మంగళగిరి విద్యుత్‌శాఖ అధికారి సురేష్‌బాబును వివరణ కోరగా ఆ ప్రాంతంలోని 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు న్యూట్రల్ ఇంటర్నల్‌గా కట్ కావడంతో నేరుగా 440 ఓల్ట్స్ అధిక విద్యుత్ సరఫరా అయ్యిందని, దీంతో ఆయా నివాసాల్లో ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. హైఓల్టేజ్ రాకుండా ప్రొటెక్షన్ ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారుడు అమర్చుకోవాలని సూచించారు.

కిసాన్ సభలు జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న అప్పారావు

దుగ్గిరాల: అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మంగళవారం దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డు, పసుపు ఫ్యాక్టరీ కార్మికులు, పసుపు దుకాణాలలో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు గుంటూరు నగరంలోని విజ్ఞాన మందిరంలో రైతులకు విజ్ఞాన ప్రదర్శనలు జరగనున్నాయని అన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మేరువ

ఫిరంగిపురం: బీజేపీ మండల అధ్యక్షుడిగా 113.తాళ్లూరు గ్రామానికి చెందిన మేరువ లక్ష్మారెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు నుంచి ఉత్తర్వులు విడుదల చేశారు. కాగా ఇప్పటి వరకు మండల అధ్యక్షుడిగా ఉన్న విశ్వనాథుని హరిబాబును పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమించారు. లక్ష్మారెడ్డి ఎంపికపై పలువురు పార్టీ ఉపాధ్యక్షులు డి.వీరారెడ్డి, షేక్.రియాజ్, బి.సుబ్బారావు, అరుణ, షేక్.ఖాజాబీలు అభినందనలు తెలిపారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి



దుగ్గిరాల: రైతులకు యూరియా, ఎరువులు సకాలంలో అందుతున్నాయా లేదా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నామని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండల కేంద్రంలో పీఏసీఎస్‌లోని ఎరువుల వివరాల రికార్డులను ఆమె పరిశీలించారు. పద్మావతి మాట్లాడారు. రికార్డులు పరిశీలించి స్టాక్ వివరాల నమోదు తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం పెనుమూలి గ్రామంలో మొక్కజొన్న పైరును పరిశీలించారు. రైతులందరూ తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఇన్‌చార్జి ఏడీ ఆర్ విజయబాబు, ప్రజ్ఞాన్‌బాబు, విజయలక్ష్మి రాఘవ, భార్గవి, రైతులు పాల్గొన్నారు.

కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్ చందు రామారావు

దుగ్గిరాల: కళాశాలలో ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఏపీఐఐడీసీ అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాశాల డైరెక్టర్ చందు రామారావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రామారావు మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అతిథులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

> ఆనందం అనేది ఎంతో దూరాన ఉన్న గొప్ప లక్ష్యాన్ని సాధించడంలోనే లేదు. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు సాగించే ప్రయాణాన్ని సైతం ఎంజాయ్ చేయాలి
>
> -టిమ్ కుక్, యాపిల్ సీఈవో

'యువతకు ఇప్పుడు ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా స్టార్టప్ ఎకో సిస్టమ్, ఆర్ అండ్ డీలో అనేక ప్రోత్సాహకాలు లభిస్తున్నాయి. వీటిని అందిపుచ్చుకునేందుకు ముందడుగు వేయాల్సిన బాధ్యత యువతదే.ఏ రంగంలోనైనా సాధించగలం అనే తపనతో పని చేస్తే కచ్చితంగా సక్సెస్ సొంతమవుతుంది' అంటున్నారు.. దేశంలోని తొలి స్వదేశీ మ్యాపింగ్ టూల్స్ సంస్థ మ్యాప్‌మైఇండియా వ్యవస్థాపకులు రాకేశ్ వర్మ. బిట్స్ పిలానీలో బీఈ చదివి.. వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీలో ఎంబీఏ పట్టా అందుకుని.. అక్కడే జనరల్ మోటార్స్‌లో ఉన్నత స్థానాల్లో విధులు నిర్వహించిన ఆయన భారత్‌కు తిరిగి వచ్చి.. మ్యాప్‌మైఇండియా సంస్థను నెలకొల్పారు. రాకేశ్ వర్మతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

సాధించాలనే తపనతోనే సక్సెస్

దేశంలో స్టార్టప్ ప్రోత్సాహకాలు పెరుగుతున్నాయి

విద్యార్థులు కొత్తగా ఆలోచించే దృక్పథం పెంచుకోవాలి

మ్యాప్‌మైఇండియా వ్యవస్థాపకులు రాకేశ్ వర్మతో ఇంటర్వ్యూ

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో సక్సెస్ అవ్వాలంటే ఎలాంటి వ్యూహాలు అనుసరించాలి?

ముందుగా భవిష్యత్తును అంచనా వేయగలిగే సామర్థ్యం ఉండాలి. సంబంధిత రంగంలో ప్రస్తుత పరిస్థితులను తెలుసుకుని.. రానున్న కాలంలో ఎలా ఉండొచ్చు అనే అంచనా వేసుకోవాలి. దాని ఆధారంగా ప్రస్తుతం మనుగడలో ఉన్న బిజినెస్ మోడల్స్‌కు భిన్నంగా అడుగులు వేయాలి. భవిష్యత్తులో అవసరమయ్యే బిజినెస్ మోడల్ దిశగా ప్రయత్నిస్తే.. కచ్చితంగా సక్సెస్ లభిస్తుంది. మా సంస్థ విషయంలో ఇది ప్రత్యక్షంగా రుజువైంది. మూడు దశాబ్దాల క్రితం.. జీపీఎస్, డిజిటల్ మ్యాప్, నేవిగేషన్‌లు అంటే తెలియని రోజుల్లో.. వీటి అవసరం భవిష్యత్తులో ఏర్పడుతుందని గుర్తించాం. ఆ సేవలు అందించేలా మ్యాప్‌మైఇండియాకు రూపకల్పన చేశాం. మా అంచనాలు వమ్ము కాలేదు. ఇప్పుడు రియల్ టైమ్ నేవిగేషన్ విషయంలో రైల్వే శాఖ, అలాగే పలు రాష్ట్రాల ప్రభుత్వ శాఖలతో ఒప్పందాలు చేసుకుంటున్నాం.

స్టార్టప్‌కు ప్రభుత్వ ప్రోత్సాహకాలపై మీ అభిప్రాయం?

స్టార్టప్ ఔత్సాహికులకు ఇటీవల కాలంలో ప్రభుత్వ ప్రోత్సాహకాలు పెరిగాయి. స్టార్టప్ ఇండియా, మైటీ స్టార్టప్ హబ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్ వంటి పలు స్కీమ్స్ ద్వారా ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తోంది. ఐఐటీలు, ఐఐఎంలలో ఇన్‌స్టిట్యూట్స్ స్థాయిలో స్టార్టప్ ఇనిషియేటివ్స్ పెరుగుతున్నాయి. ఇది ఎంతో ఆహ్వానించదగ్గ పరిణామం. యువత వీటిని అందిపుచ్చుకోవాలి.

రాకేశ్ వర్మ

స్టార్టప్స్ ఏర్పాటులో యువతకు ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారం ?

వాస్తవానికి గత దశాబ్ద కాలంలో స్టార్టప్స్‌కు ప్రోత్సాహకర పరిస్థితులు నెలకొన్నాయి. కానీ.. వీటికి సంబంధించి సరైన సమాచారం లేక చాలా మంది తమ కలను సాకారం చేసుకోలేకపోతున్నారు. దీనికి అకడమిక్ ఇన్‌స్టిట్యూట్స్ పరిష్కార మార్గాన్ని చూపాలి. ఇంక్యుబేషన్ సెంటర్లను మరింత విస్తృతం చేయాలి. ఇప్పుడు పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లోని ఇంక్యుబేషన్ సెంటర్లలో స్టార్టప్ ఔత్సాహికులు తమ ఐడియాలపై పనిచేసే అవకాశం కల్పిస్తున్నారు. అయితే ఇవి ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్స్‌కే పరిమితం అవుతున్నాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని కాలేజీల్లో కూడా ఈ సదుపాయం కల్పించాలి. లేదంటే.. ఇంక్యుబేటర్స్ ఉన్న ఇన్‌స్టిట్యూట్స్‌తో ఒప్పందాలు చేసుకుని తమ విద్యార్థులను అక్కడ ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

ఆత్మనిర్భర్ భారత్ నినాదం సాకారం అవుతుందా?

కచ్చితంగా అవుతుంది. దేశంలోని యువ పారిశ్రామిక వేత్తలు, ఇప్పటికే ఉన్న పరిశ్రమల విషయంలో ఎంతో వృద్ధి కనిపిస్తోంది. ఇదే జోరు కొనసాగితే కచ్చితంగా ఈ లక్ష్యం నెరవేరుతుంది. మరో రెండు మూడేళ్లలో మన దేశం నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇందులో పారిశ్రామిక వేత్తలు, యువత, ఉద్యోగుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యం. వీరందరికీ సరైన సదుపాయాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించొచ్చు.

స్టార్టప్ ఫండింగ్‌లో సమస్యలు ఎదురవుతాన్నయనే వ్యాఖ్యలపై మీ అభిప్రాయం?

స్టార్టప్ ఫండింగ్ విషయంలో సమస్యలు సహజమే. ప్రొడక్ట్ లేదా ఆవిష్కరణకు ఏంజెల్ ఫండింగ్ సంస్థల ఆమోదం పొందడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే.. సదరు ఫండింగ్ ఏజెన్సీలను మెప్పించేలా ప్రొడక్ట్ గురించి వివరించడం, దాని ఆవశ్యకతను తెలియజేసే నైపుణ్యం పెంచుకోవాలి. ఒక సెగ్మెంట్‌లో ఇప్పటికే ఉన్న మోడల్‌ను అనుసరించేలా స్టార్టప్ ఆలోచన ఉంటే ఫండింగ్ దొరకడం కష్టం. కొంతమేరకైనా ఆ సెగ్మెంట్‌లో కొత్తదనం కల్పించే ఆలోచనతో ప్రొడక్ట్ రూపొందించడం ముఖ్యం. అదేవిధంగా స్టార్టప్ ఔత్సాహిక యువత కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా.. దేశ వ్యాప్తంగా నాస్కామ్, సీఐఐ వంటి సంస్థలు నిర్వహించే స్టార్టప్ పోటీల్లో పాల్గొనడం ద్వారా ఎక్స్‌పోజర్ పెరుగుతుంది. ఎవెన్యూస్ పెరుగుతాయని గుర్తించాలి.

యువతకు మీరిచ్చే సలహా?

ఏ రంగంలోనైనా.. నేర్చుకోవాలనే తపన.. సాధిస్తాం అనే విశ్వాసం.. నిరంతర అభ్యసన దృక్పథంతో అడుగులు వేయాలి. అప్పుడే ఏఐ యుగంలోనైనా.. డీప్ టెక్ పరిస్థితుల్లోనైనా సమర్థంగా రాణించగలరు. మూస ధోరణితో ఉంటే స్వల్పకాలిక ప్రయోజనం ఉంటుందేమో కానీ.. దీర్ఘకాలంలో ఇబ్బందులు ఎదురవుతాయి.

వైద్య విద్యలో టాప్ ర్యాంకులు సాధించిన తెలుగు తేజాల 'సక్సెస్ మంత్ర'

ఎయిమ్స్-ఢిల్లీ ఎంసీహెచ్ ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో ఒకటో ర్యాంక్ సాధించిన డాక్టర్ అనుషా రెడ్డి, ఐఎన్ఐసెట్‌లో ఆల్ ఇండియా 7వ ర్యాంక్ కైవసం చేసుకున్న డాక్టర్ సాయి త్రిషా రెడ్డిని 'సాక్షి ఎడ్యుకేషన్' ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా వారు తమ వైద్య విద్యా ప్రయాణంలోని ఒడిదుడుకులు, ప్రిపరేషన్ వ్యూహాలు, విజయ రహస్యాలను పంచుకున్నారు. వైద్య విద్యార్థులకు దిశానిర్దేశం చేసే పలు కీలకమైన చిట్కాలను సూచించారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వారి స్ఫూర్తిదాయకమైన ఇంటర్వ్యూలను చూడొచ్చు.

ఉద్యోగ సమాచారం

ఐవోసీఎల్‌లో 405 అప్రెంటిస్ ఖాళీలు

ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్).. అప్రెంటిస్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం అప్రెంటిస్ ఖాళీల సంఖ్య:** 405
- **అప్రెంటిస్ ఖాళీల వివరాలు:** టెక్నీషియన్ అప్రెంటిస్, ట్రేడ్ అప్రెంటిస్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్.
- **ట్రేడులు:** మెకానికల్, ఎలక్ట్రికల్, టీ అండ్ ఐ, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, ఫిట్టర్, మెషినిస్ట్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తదితరాలు.
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 31.12.2025 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక ప్రక్రియ:** విద్యార్హతలు, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది:** 31.01.2026
- **వెబ్‌సైట్:** https://iocl.com/apprenticeships-

నాబార్డ్‌లో 162 డెవలప్‌మెంట్ అసిస్టెంట్ పోస్టులు

ముంబయిలోని ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థ.. నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్).. 162 డవలప్‌మెంట్ అసిస్టెంట్/డవలప్‌మెంట్ అసిస్టెంట్(హిందీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ కార్యాలయాల్లో ఈ ఉద్యోగాలను భర్తీ చేయనుంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 162
- **పోస్టుల వివరాలు:** డవలప్‌మెంట్ అసిస్టెంట్-159, డవలప్‌మెంట్ అసిస్టెంట్(హిందీ)-3
- **అర్హతలు:** డెవలప్‌మెంట్ అసిస్టెంట్‌కు ఏదైనా విభాగంలో కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. డెవలప్‌మెంట్ అసిస్టెంట్ (హిందీ) పోస్టులకు హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్-హిందీ అనువాదం చేయగలగాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి.
- **వేతనం:** ప్రారంభంలో నెలకు రూ.46,500
- **వయసు:** 01.01.2026 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక ప్రక్రియ:** ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ పరీక్ష, లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 03.02.2026
- **వెబ్‌సైట్:** https://www.nabard.org/careers

సాయ్‌లో 323 అసిస్టెంట్ కోచ్ ఉద్యోగాలు

ఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ క్రీడా విభాగాల్లో ఖాళీగా ఉన్న 323 అసిస్టెంట్ కోచ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టు పేరు:** అసిస్టెంట్ కోచ్
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 323
- **క్రీడా విభాగాలు:** స్విమ్మింగ్, అథ్లెటిక్స్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, జూడో, రోయింగ్, షూటింగ్, బాక్సింగ్, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీ బాల్, ఫీల్డ్‌హాకీ, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, సెపక్ తక్రా, వుషు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ, ఎమ్మెస్సీ(స్పోర్ట్స్ కోచింగ్), లేదా సమానమైన అర్హత, లేదా ఒలింపిక్స్, ఆసియా క్రీడలు/వరల్డ్ చాంపియన్‌షిప్‌తోపాటు సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పొంది ఉండాలి.
- **వయసు:** 01.02.2026 నాటికి 30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **వేతనం:** నెలకు రూ.35,400– రూ.1.12,400 వేతన శ్రేణి లభిస్తుంది.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష ఆధారంగా ఎంపిక.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 15.02.2026
- **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.nic.in/

హెచ్‌ఏఎల్‌లో అప్రెంటిస్ ఖాళీలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన మహారత్న సంస్థ హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్).. ఐటీఐ ఉత్తీర్ణులు, ఇంటర్మీడియెట్ ఒకేషనల్ అభ్యర్థుల నుంచి అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అప్రెంటిస్ ఖాళీల వివరాలు:** ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్, ఇంటర్మీడియెట్ ఒకేషనల్ అప్రెంటిస్.
- **విభాగాలు:** ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, వెల్డర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, డ్రాట్స్‌మెన్, ప్రింటర్, కార్పెంటర్, ఆటోమొబైల్, అకౌంటెన్సీ, స్టెనో, హెల్త్ వర్కర్ తదితరాలు.
- **అర్హతలు:** అభ్యర్థులు గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ లేదా ఇంటర్మీడియెట్ వొకేషనల్(10+2) ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 30.01.2026
- **వెబ్‌సైట్:** https://-hal-in-dia.co.in/-ca-reer

మహేశ్వర్ పెరి

ఇంజనీరింగ్ స్పెషల్

బీటెక్.. లక్షల మంది విద్యార్థుల కల. అయితే బీటెక్‌లో చేరే సమయంలో కాలేజ్‌కు ప్రాధాన్యమివ్వాలా? బ్రాంచ్‌ను ఎంచుకోవాలా! అనే సందేహం. మరోవైపు అధిక శాతం మంది విద్యార్థులు బ్రాంచ్ కంటే ఇన్‌స్టిట్యూట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. కానీ.. తాజా ట్రెండ్స్‌ను గమనిస్తే మాత్రం ఇన్‌స్టిట్యూట్ కంటే బ్రాంచ్‌కే జై కొట్టాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. దేశంలోని ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌గా పేర్కొనే ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో గత ఏడాది క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ గణాంకాలను విశ్లేషిస్తే.. ఈ విషయం స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో.. గత ఏడాది దేశంలోని ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ట్రెండ్స్‌పై కెరీర్ గైడెన్స్ నిపుణులు మహేశ్వర్ పెరి విశ్లేషణ..

బ్రాంచ్‌కే జై కొట్టాలి

నేడు అధిక శాతం కాలేజీలు వంద శాతం ప్లేస్‌మెంట్స్ సాధించినట్లు చెబుతున్నాయి. అంతేకాకుండా ప్రతి కాలేజ్ వెబ్‌సైట్‌లో అత్యధిక ప్యాకేజ్‌లు అని చూపిస్తారు. కానీ వాస్తవం ఏంటంటే.. ప్లేస్‌మెంట్స్ అనేవి ఇన్‌స్టిట్యూట్ ప్రాముఖ్యత ఆధారంగా లభించడంలేదు. అవి బ్రాంచ్ వారీగానే ఉంటున్నాయి. ఉదాహరణకు.. ఒకే ఇన్‌స్టిట్యూట్‌లో పట్టా పుచ్చుకున్న ఇద్దరు విద్యార్థులకు ప్లేస్‌మెంట్ ఫలితాలు వేర్వేరుగా ఉంటాయి. దీనికి కారణం.. వారు ఎంచుకున్న బ్రాంచ్‌లు వేర్వేరు కావడమే. బీటెక్ విద్యార్థులు వేసుకోవాల్సిన సరైన ప్రశ్న ఏంటంటే.. కాలేజ్ మంచిదా అనే ప్రశ్న కంటే.. ఆ కాలేజ్‌లో సదరు బ్రాంచ్ మంచిదా? కాదా అని తెలుసుకోవడం. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో సైతం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో బ్రాంచ్‌ల హవానే నడుస్తోందని గుర్తించాలి.



ప్లేస్‌మెంట్ డేటా ఎంతో ముఖ్యం

- ఏదైనా ఒక ఇన్‌స్టిట్యూట్‌లో చేరాలని నిర్ణయించుకున్నప్పుడు.. ఆ కాలేజీలోని బ్రాంచ్ వైజ్ ప్లేస్‌మెంట్ డేటాను పరిశీలించడం ఎంతో ముఖ్యం. నిర్దిష్టంగా ఒక బ్రాంచ్‌లో వాస్తవ గణాంకాలు ఎలా ఉన్నాయి? ప్లేస్‌మెంట్స్‌కు హాజరైన వారి సంఖ్య? వారిలో ఆఫర్లు సొంతం చేసుకున్న వారెందరు? సగటు, కనీస వేతనాల మొత్తం ఎంత? అనే గణాంకాలను కూడా పరిశీలించాలి.
- ఉదాహరణకు ఎన్ఐటీ దుర్గాపూర్‌నే పరిశీలిస్తే.. మొత్తం 158 మంది ప్లేస్‌మెంట్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. 134 మంది మాత్రమే హాజరవడం గమనార్హం. ఇక్కడ ఆఫర్ల సంఖ్యతో పాటు సగటు వేతనం, గరిష్ఠ వేతనం మధ్య వ్యత్యాసం కూడా ఎంతో ముఖ్యం. ఈ క్యాంపస్‌లో గరిష్ఠ వేతనం రూ.58 లక్షలుగా నమోదైతే.. సగటు వేతనం రూ.17.4 లక్షలుగా ఉంది. అంటే.. కనీస వేతనం రూ.9 లక్షలుగా ఉండొచ్చు. ఈ కనీస వేతనంపై అవగాహన ఉండడంతో ఎక్కువ మంది ప్లేస్‌మెంట్స్‌కు హాజరై ఉండకపోవచ్చు.

సీఎస్ఈ హవా

- ఆర్ఐటీ చట్టం ద్వారా 10 ఐఐటీలు, 10 ఎన్ఐటీలు, 3 ట్రిపుల్ ఐటీల్లోని క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ గణాంకాల సమాచారాన్ని క్రోడీకరిస్తే.. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బ్రాంచ్ హవా కనిపించింది.
- ఉదాహరణకు.. ఐఐటీ–గాంధీనగర్ క్యాంపస్‌నే పరిశీలిస్తే..సీఎస్ఈ విద్యార్థులకే అత్యధిక ప్యాకేజ్‌తో ఆఫర్ లభించింది. ఈ క్యాంపస్‌లో సీఎస్ఈ విద్యార్థులకు సగటు వేతనం రూ.23.37 లక్షలుగా నమోదు కాగా.. ఆ తర్వాత స్థానంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ నిలిచింది. ఈ బ్రాంచ్ విద్యార్థులకు సగటు వేతనం రూ.23.13 లక్షలుగా నమోదైంది. అదే విధంగా కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ.17.06 లక్షలు, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ.12.36 లక్షలు, మెటీరియల్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు రూ.9.74 లక్షలుగా సగటు వేతనాలు నమోదయ్యాయి. ఇదే ట్రెండ్ దాదాపు అన్ని ఇన్‌స్టిట్యూట్స్‌లో కనిపించింది. మొత్తం ప్లేస్‌మెంట్స్‌లో సీఎస్ఈ బ్రాంచ్ విద్యార్థులకే ఎక్కువ వేతనాలు లభించాయి.

ఆర్‌టీఐ సమాచారం మేరకు గత ఏడాది 10 ఐఐటీల్లో సీఎస్ఈ ప్లేస్‌మెంట్స్ గణాంకాలు..

ఐఐటీ	అనుమతించిన ఇన్‌టేక్	ప్లేస్‌మెంట్స్‌కు నమోదు చేసుకున్న వారు	ఆఫర్లకు ఆమోదం తెలిపిన వారు	ప్లేస్‌మెంట్ శాతం (మొత్తం విద్యార్థులకు	ప్లేస్‌మెంట్ శాతం (నమోదు చేసుకున్న వారికి)	గరిష్ఠ వేతనం	సగటు వేతనం
భువనేశ్వర్	63	65	62	91.18	95.38	-	-
కాన్పూర్	103	116	113	87.60	97.41	-	44.7
పాలక్కాడ్	47	46	39	82.98	84.78	52	19.14
రోపార్	73	83	80	95.24	96.39	-	-
గాంధీ నగర్	37	40	38	90.48	95	-	23.37
గోవా	32	40	39	97.50	97.50	-	-
జమ్ము	40	38	34	85.00	89.74	-	22.32
జోథ్‌పూర్	80	86	85	100	98.84	56	21.26
రూర్కీ	109	108	107	98.17	99.07	-	-
ధన్‌బాద్	139	140	129	92.81	92.14	66.14	26.73

ఆర్‌టీఐ సమాచారం మేరకు గత ఏడాది 3 ట్రిపుల్ ఐటీల్లో సీఎస్ఈ ప్లేస్‌మెంట్స్ గణాంకాలు..

ట్రిపుల్ ఐటీ	అనుమతించిన ఇన్‌టేక్	ప్లేస్‌మెంట్స్‌కు నమోదు చేసుకున్న వారు	ఆఫర్లకు ఆమోదం తెలిపిన వారు	ప్లేస్‌మెంట్ శాతం (మొత్తం విద్యార్థులకు	ప్లేస్‌మెంట్ శాతం (నమోదు చేసుకున్న వారికి)	గరిష్ఠ వేతనం	సగటు వేతనం
వడోదర్	250	226	134	53.60	59.29	56.30	13.39
తిరుపతి	50	50	49	98.00	98.00	65.00	23.00
సోనేపట్	120	110	67	55.83	60.91	62.00	13.98

ఆర్‌టీఐ సమాచారం మేరకు గత ఏడాది 10 ఎన్ఐటీల్లో సీఎస్ఈ ప్లేస్‌మెంట్స్ గణాంకాలు..

ఎన్ఐటీ	అనుమతించిన ఇన్‌టేక్	ప్లేస్‌మెంట్స్‌కు నమోదు చేసుకున్న వారు	ఆఫర్లకు ఆమోదం తెలిపిన వారు	ప్లేస్‌మెంట్ శాతం (మొత్తం విద్యార్థులకు	ప్లేస్‌మెంట్ శాతం (నమోదు చేసుకున్న వారికి)	గరిష్ఠ వేతనం	సగటు వేతనం
ఢిల్లీ	75	68	68	90.67	100	-	-
దుర్గాపూర్	187	158	134	71.66	84.81	58.00	17.40
మేఘాలయ	33	29	22	66.67	75.86	51.03	12.79
రూర్కెల	136	159	128	94.12	80.50	62.44	20.35
హమీర్‌పూర్	124	104	97	78.23	93.27	58.00	14.83
సూరత్‌కల్	115	103	96	83.48	93.20	52.42	26.85
పుదుచ్చేరి	60	53	47	78.33	88.68	16.00	9.80
జైపూర్	117	110	85	72.65	77.27	64.00	19.80
కాలికట్	172	150	140	81.40	93.33	43.24	19.21
నాగ్‌పూర్	115	106	99	86.09	93.40	64.00	17.30

గమనిక: - మొత్తం విద్యార్థుల సంఖ్య = 2021-22 విద్యా సంవత్సరంలో సీఎస్ఈ బ్రాంచ్‌కు అనుమతి లభించిన సీట్ల సంఖ్య - వివరాలను ఆయా ఇన్‌స్టిట్యూట్స్ ఇవ్వలేదు.

మొత్తంగా ఇలా

2021-22లో ప్రవేశం పొంది గత ఏడాది (2024-25)లో ప్లేస్‌మెంట్స్ పూర్తి చేసుకొని.. ఆర్‌టీఐ ద్వారా సమాచారం ఇచ్చిన ఇన్‌స్టిట్యూట్స్ సంఖ్య-23(10 ఐఐటీలు, 10 ఎన్ఐటీలు, 3 ట్రిపుల్ ఐటీలు).

- వీటిలో 2021-22లో అడుగు పెట్టిన మొత్తం విద్యార్థులు: **2,332**
- 2024-25లో ప్లేస్‌మెంట్స్‌కు నమోదు చేసుకున్న విద్యార్థులు: **2,188**
- ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ఆమోదించిన వారి సంఖ్య: **1,892**
- ఇన్‌టేక్ సంఖ్యతో పోల్చితే ప్లేస్‌మెంట్స్ శాతం: **81.3**
- నమోదు చేసుకున్న వారితో పోల్చితే ప్లేస్‌మెంట్స్ శాతం: **86.47**
- సగటు సీటీసీ: రూ.20.35 లక్షలు

What is Primitive Subsistence Farming?

CHAPTER - 4

AGRICULTURE

KEYPOINTS

- Primitive subsistence farming depends on monsoons and natural soil fertility.
- This type of farming is also called slash-and-burn farming in some region.
- It has many names like Milpa, Conuco, Roca, Masole, Ladang and Ray.
- In Mexico and Central America, it is called Milpa.
- Intensive subsistence farming is done in high population areas.
- HYV means High Yielding Varieties.
- Tea, coffee, rubber, sugarcane and banana are plantation crops.
- Assam and North Bengal are famous for tea.
- Karnataka is famous for coffee.
- India has three crop seasons: Rabi, Kharif and Zaid.
- Rabi crops are sown from October to December.
- Wheat, barley, peas, gram and mustard are Rabi crops.
- The Green Revolution was successful in Punjab and Haryana.
- Kharif crops are harvested in September and October.
- Paddy, maize, jowar and bajra are Kharif crops.
- Assam, West Bengal, Odisha and AP grow a lot of rice.
- Assam, West Bengal and Odisha grow three paddy crops: Aus, Aman and Boro.
- The Zaid season comes in summer between Rabi and Kharif.
- Watermelon, muskmelon and cucumber are Zaid crops.
- Rice is the main food crop of India.
- India is the second largest rice producer after China.
- Wheat is the second most important cereal crop of India.
- Wheat grows in the Ganga-Sutlej plains and the Deccan black soil region.
- Jowar, bajra and ragi are important millets.
- Millets are also called coarse grains.
- Jowar is India's third most important food crop.
- Maize is used as both food and fodder.
- India is the largest producer and consumer of pulses.
- Pulses improve soil fertility by fixing nitrogen.
- India is the second largest sugarcane producer after Brazil.
- Uttar Pradesh is the major sugarcane-producing state.
- Groundnut and mustard are major oilseed crops in India.
- India is the second largest groundnut producer after China.
- Tea is an important beverage crop.
- Assam and West Bengal are major tea-producing states.
- India was the second largest tea producer after China.
- Plantation crops are usually grown on large estates with modern methods.

8 MARKS QUESTIONS

1. What is Primitive Subsistence Farming?

1. Primitive subsistence farm is practised on small patches of land
2. It involves primitive tools like hoe, dao and digging sticks, and family/community labour.
3. It is a 'slash and burn' agriculture.

Primitive Subsistence Farming depends upon:

i) Monsoons.
ii) Natural fertility of the soil.
iii) Suitable environmental conditions.

2. Write about the Rabi cropping season.

1. Rabi crops are sown in winter from October to December.
2. Rabi crops are harvested in summer from April to June.
3. Rabi crops are wheat, barley, peas, gram and mustard.
4. Wheat growing states are Punjab, Haryana, Himachal Pradesh, Jammu and Kashmir, Uttarakhand and Uttar Pradesh.
5. The western temperate cyclones helps the rabi crop.
6. Green revolution was successful in Punjab, Haryana, western Uttar Pradesh and parts of Rajasthan.

3. Write about the Rice cropping in India. / Describe the geographical conditions required for the growth of rice.

1. Rice is staple food crop in India.
2. India is the 2nd largest producer of rice in the world after China.
3. Rice is a kharif crop.
4. Rice requires above 25° C temperature.
5. Rice requires annual rainfall of more than100 cm.
6. Rice is grown in the northern plains and north-eastern parts, coastal and delta regions, Punjab, Haryana and western Uttar Pradesh and parts of Rajasthan.

4. Write about the Kharif cropping season.

1. Kharif crops are grown with the onset of monsoon.
2. Kharif crops are harvested in September-October.
3. Kharif crops are paddy, maize, jowar, bajra, tur, moong, urad, cotton, jute, groundnut and soyabean.
4. Rice-growing regions are Assam, West Bengal, Odisha, Andhra Pradesh, Telangana, Tamil Nadu, Kerala, Maharashtra, Uttar Pradesh and Bihar.
5. Recently, paddy has become an important crop of Punjab and Haryana.
6. In Assam, West Bengal and Odisha, three crops of paddy are grown in a year.
7. These are Aus, Aman and Boro.

5. Write about the Rubber cropping in India.

1. Rubber is an equatorial crop.
2. Rubber requires moist and humid climate.
3. Rubber requires rainfall of more than 200 cm.
4. Rubber requires temperature above 25°C.
5. Rubber is an important industrial raw material.
6. It is mainly grown in Kerala, Tamil Nadu, Karnataka and Andaman and Nicobar islands and Garo hills of Meghalaya.

6. Write about the Wheat cropping in India.

1. This is the second most important cereal crop.
2. It is the main food crop, in north and north-western India.
3. Wheat crop requires a cool growing season.
4. Wheat crop requires a bright sunshine at the time of ripening.
5. It requires 50 to 75 cm of annual rainfall.
6. Two wheat-growing zones 1. The Ganga-Satlej plains 2. Black soil region of the Deccan.
7. The major wheat-producing states are Punjab, Haryana, Uttar Pradesh, Madhya Pradesh, Bihar and Rajasthan.

7. Write about Intensive Subsistence Farming.

1. Intensive Subsistence Farming is practised in the high population pressure areas.
2. It is labour intensive farming.
3. It needs high doses of biochemical inputs.
4. The 'right of inheritance' lead to the division of land.
5. The use of higher doses of modern inputs
   * High yielding variety (HYV) seeds
   * Chemical fertilisers.
   * Insecticides and pesticides

8. Write about the Tea cropping in India. / Explain about one important beverage crop and the geographical conditions required for its growth.

1. Tea is an important beverage crop.
2. The tea plant grows well in tropical and sub-tropical climates.
3. Tea bushes require warm and moist frost-free climate.
4. Frequent showers ensure continuous growth of tender leaves.
5. Tea is a labour-intensive industry.
6. It requires abundant, cheap and skilled labour.
7. Tea is processed within the tea garden to restore its freshness.
8. Major tea producing states are Assam, hills of Darjeeling and Jalpaiguri districts, West Bengal, Tamil Nadu, Kerala, Himachal Pradesh, Uttarakhand, Meghalaya (limited), Andhra Pradesh and Tripura.
9. India was the second largest producer of tea after China.

9. Enlist the various institutional reform programmes introduced by the government in the interest of farmers.

1. Crop insurance.
2. Crop loans.
3. Subsidies.
4. Kisan Credit Card.
5. Minimum Support Price.
6. Procurement prices.
7. Awareness programmes on TVs.
8. Abolition of zamindari system.
9. Consolidation of small holdings.

Continued on next page..

10. What are the problems faced by Indian agriculture?
1. Irregular rainfall.
2. Lack of irrigation.
3. Low support prices.
4. Small land holdings.
5. Poor storage facilities.
6. Lack of financial support.
7. Droughts, cyclones and floods.
8. High prices of seeds and fertilizers.

11. Write about the Cotton cropping in India.
1. India is the original home of the cotton plant.
2. Cotton is the raw materials for the textile industry.
3. India was second largest producer of cotton after China.
4. Cotton grows well in the black soil of the Deccan plateau.
5. It requires high temperature, light rainfall.
6. It requires 210 frost-free days and bright sunshine.
7. It is a kharif crop.
8. It requires 6 to 8 months to mature.
9. Major cotton-producing states are Maharashtra, Gujarat.

12. Suggest the initiative taken by the government to ensure the increase in agricultural production.
1. Abolished the zamindari system.
2. Land reforms were introduced.
3. Land development programs were initiated.
4. During droughts and floods crop insurance is announced.
5. Minimum Support Price is initiated.
6. Established the Indian Council of Agricultural Research.
7. Irrigation facilities were developed.
8. Constructed many multi-puropose projects on rivers.
9. Supplied the HYV seeds to the farmers.

13. Write about the "Bhoodan – Gramdan" movement in India.
1. Mahatma Gandhi declared Vinoba Bhave as his spiritual heir.
2. Vinoba Bhave participated in the Satyagraha.
3. Gram Swarajya was the concept of Gandhi.
4. At Pochampalli in Andhra Pradesh, Ram Chandra Reddy offered 80 acres as 'Bhoodan' to Vinoba Bhave .
5. Later zamindars offered to distribute some villages among the landless. It was known as Gramdan.
6. Landowners feared the Land Ceiling Act.
7. The Bhoodan-Gramdan movement initiated by Vinoba Bhave.
8. The Bhoodan-Gramdan movement is also known as the Blood-less Revolution.

14. Write about the Zaid cropping season.
1. In between the rabi and the kharif seasons, there is a short season during the summer months known as the Zaid season.
2. 'Zaid' crops are watermelon, muskmelon, cucumber, vegetables and fodder crops.

15. Write about the Coffee cropping in India.
1. Indian coffee is known in the world for its good quality.
2. The Arabica variety was brought from Yemen.
3. The Arabica variety is in great demand.
4. Initially it was introduced on the Baba Budan Hills.
5. Today its cultivation is confined to the Nilgiri in Karnataka, Kerala and Tamil Nadu.

16. What are the schemes implemented for the benefit of the farmers in India?
1. Kisan Credit Card (KCC),
2. Personal Accident Insurance Scheme (PAIS)
3. Special agricultural programmes on the radio and television.
4. Announces minimum support price
5. Announces remunerative and procurement prices
6. Banks provide loan facilities to the farmers.

17. What are the institutional reforms for farmers provided by the government.
1. Minimum Support Price (MSP).
2. Kisan Credit Card.
3. Irrigation projects.
4. Crop insurance.
5. Free soil tests.
6. Subsidies on seeds and fertilizers.
7. Crop loans.
8. Clearance of loans.

CHAPTER 3

WATER RESOURCES

8 MARKS QUESTIONS

1. What are the basic safety precautions to be taken in the flood-prone area?
1. Watch TV for the latest weather bulletins.
2. Pass on the information to others.
3. Make a family emergency kit.
4. Keep ORS, dry food items & drinking water with you.
5. Keep ropes, rubber tubes,umbrellas in your house.
6. Keep your cash, jewelry, documents in a safe place.
7. Move along with your family members to relief camps.
8. Turn off power and gas connections before leaving your house.

2. What are the Dos and Don'ts during floods?
1. Don't enter flood waters.
2. Don't allow children to play in or near flood waters.
3. Stay away from sewerage lines, gutters, drains, culverts etc.
4. Be careful of snakes during floods.
5. Stay away from electric poles and fallen powerlines.
6. Don't use wet electrical appliances.
7. Eat freshly cooked and dry food.
8. Always keep your food covered.
9. Use boiled and filtered drinking water.

3. Write about tankas.
1. Tankas mean Underground water tanks.
2. The tanks can be as large as a big room.
3. One household in Phalodi had a tank that was 6.1 metres deep, 4.27 metres long and 2.44 metres wide.
4. The first spell of rain was not collected.
5. Rainwater, or 'palar pani' is considered the purest form of natural water.
6. Many houses constructed underground rooms adjoining the 'tanka' to beat the summer heat as it would keep the room cool.

4. Write about rooftop rainwater harvesting.
1. Rooftop rainwater harvesting is a common practice in Shillong.
2. Shillong faces acute shortage of water.
3. Nearly 25% of the water comes from rooftop water harvesting.
4. Gendathur villagers have installed this system.
5. Nearly 200 households have installed this system.
6. Gendathur receives an annual precipitation of 1,000 mm.
7. Every house can collect about 50,000 litres of water annually.
8. The village harvested rainwater annually nearly 1,00,000 litres.
9. Tamil Nadu is the first state to make rooftop rainwater harvesting structure compulsory.

5. Describe how modern adaptations of traditional rainwater harvesting methods are being carried out to conserve and store water.
1. Traditional rainwater harvesting methods are still popular.
2. Using bamboo pipes, spring water is tapped in Meghalaya.
3. This system is over 200 years old.
4. Gendathur villagers installed a rooftop rainwater harvesting system.
5. They harvest around 1 lakh litres of rainwater annually.
6. In Rajasthan Rooftop rainwater harvesting was practiced.
7. Underground tanks are created to store rainwater in Rajasthan.
8. In Shillong, 15-20% of water needs are met through rooftop rainwater harvesting.

6. Give examples of modern adaptations of traditional rainwater harvesting.
1. Rooftop rainwater storage tanks.
2. Recharge pits to fill groundwater.
3. Check dams built with new materials.
4. Percolation tanks with modern designs.
5. Urban rainwater drains.
6. Public places use rain gardens to absorb rainwater.
7. Schools and offices build recharge pits.
8. Apartments use filter units to clean rainwater before storing it.

7. Explain how water becomes a renewable resource.
1. Water circulates in nature in many forms.
2. They are liquid, snow, dew, ice, fog, and water vapor.
3. Water evaporates from the Earth's surface.
4. It forms clouds and returns as rain to the Earth's surface.
5. This process is known as the water cycle.
6. Thus, water is called a renewable resource.

8. Write about Sardar Sarovar Dam
1. On the Narmada river in Gujarat Sardar Sarovar Dam has built.
2. It is one of the largest water resource projects of India.
3. It covers Maharashtra, Madhya Pradesh, Gujarat and Rajasthan
4. The project would meet the requirement of water in drought-prone areas.
5. It serves 9,490 villages and 173 towns in Gujarat and 124 villages in Rajasthan.

Prepared by
K. Suresh,
Subject Expert

Daily Quiz

1. This is the west flowing river.
A) The Godavari B) Narmada
C) Krishna D) Damodar

2. Continuous contour trenches are constructed on
A) Plains B) Hills
C) Rivers D) Islands

3. Which of the following is / are correctly matched?
i) Triambak – Godavari
ii) Chemayungdung Glacier – Brahmaputra
iii) Gangotri Glacier -Ganga
iv) Lake Manasarovar - Indus
A) i and ii
B) iii and iv
C) i and iii
D) i, ii, iii and iv

4. The largest Peninsular river is–
A) Krishna B) Mahanadi
C) Godavari
D) Cauvery

5. The world's largest delta "Sundarbans is formedby.
A) Ganga- Brahmaputra B) Godavari-Krishna
C) Narmada -Tapati D) Mahanadi-Cauvery

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్

● సునీతా శరణ్

'నేను చనిపోవాలనుకున్న ప్రతిసారీ అమ్మ బతికించింది' అన్నారు అమెరికాలో చెఫ్‌గా, కుక్ బుక్స్ రచయితగా, రెస్టరెంట్ల యజమానిగా ప్రసిద్ధి చెందిన సువిర్ శరణ్. చిన్నప్పటి నుంచి తాను పురుష దేహంలో చిక్కుబడ్డ స్త్రీగా గుర్తించి సమాజం నుంచి, లోకం నుంచి పారిపోవాలని అనుకున్నప్పుడల్లా అమ్మ తనను అర్థం చేసుకుందని చెప్పారాయన. 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో తన పుస్తకం విడుదలైన సందర్భంగా తల్లి సునీతా శరణ్ ఎలా జీవదాయినిగా కాపాడుతూ వచ్చిందో చెప్తూ భిన్న జెండర్ అస్తిత్వాలను తల్లిదండ్రులు అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని మాట్లాడారాయన.

అమ్మ అర్థం చేసుకుంటుంది

● సువిర్ శరణ్ తాజా పుస్తకం 'టెల్ మై మదర్ ఐ లైక్ బాయ్స్'ను ఆవిష్కరిస్తున్న ప్రసిద్ధ రచయిత్రి శోభా డే

'నాకు ఐదేళ్లు దాటినప్పటి నుంచే నాలోని భిన్నత్వం అర్థమవసాగింది. నాలో ఉన్నది నేను కాదని, ఈ అబ్బాయిలో అమ్మాయి ఉందని తెలిసిన మరుక్షణం నుంచి నా ప్రపంచం తల్లకిందులైపోయింది. భయంతో ఇంట్లో అమ్మ ఎక్కడుందా అని వెతుక్కునేవాణ్ణి. అమ్మ వంటగదిలో ఉంటే పరిగెత్తుకుంటూ వెళ్లి చీరకొంగులో మొహం దాచుకుని భద్రంగా ఉన్నట్టు భావించేవాణ్ణి. అప్పుడే కాదు... ఇప్పుడు కూడా అమ్మ ఉంటేనే ధైర్యం' అన్నారు సువిర్ శరణ్ (53).

తాను 'గే' అని చెప్పడానికి సంకోచపడని సువిర్ శరణ్ 'ఇప్పుడు ఇలా ప్రకటించుకుంటున్న స్థితి వేరు. ఈ స్థితికి చేరడానికి సాగిన కఠోరమైన ప్రయాణం వేరు. ఆ ప్రయాణపు ప్రతి దశలో అమ్మ నన్ను కాపాడింది' అన్నారాయన. ఢిల్లీకి చెందిన సువిర్ శరణ్ అమెరికాలో స్టార్ చెఫ్‌గా, చిత్రకారుడిగా, కుక్ బుక్స్ రచయితగా ప్రసిద్ధి చెందారు. ఆయన తాజా పుస్తకం 'టెల్ మై మదర్ ఐ లైక్ బాయ్స్' విడుదలైన సందర్భంగా తనకు ఇష్టమైన 'ఉమ్రావ్‌జాన్' దుస్తులు ధరించి, తల్లి సునీతా శరణ్ ప్రేక్షకుల్లో కూచుని ఉండగా ప్రేక్షకులతో సంభాషించారు. దానికి ముందు ప్రసిద్ధ రచయిత్రి శోభా డే ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఆటలు ఆడకపోతే...

మగ పిల్లలు ఆటలు ఆడతారు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ ఇలాంటి ఆటలు ఆడకపోతే వాళ్లకు డౌట్ వస్తుంది. నేను అబ్బాయిలు ఆడే ఆటలు ఆడేవాణ్ణి కాదు. రంగులంటే నాకు ఇష్టం. రంగులతో బొమ్మలు వేసుకునేవాణ్ణి. వాళ్ల తేడాను కనిపెట్టారు. ఆ తర్వాత ఎంతో హింసించారు. నా స్థితిని అర్థం చేసుకోవడానికి అమ్మ ఎంతో ప్రయత్నించింది. మగపిల్లలు వంటగదిలోకి వస్తే తల్లులు ఇక్కడేం పని అని తరిమేస్తారు. అమ్మ నన్ను ఉండనిచ్చింది. అలా నాకు వంట తెలిసింది. ఇవాళ నేను అమెరికాలో స్టార్ చెఫ్‌గా ఉన్నానంటే అమ్మ నా బాధ మళ్లించడానికి వంట నేర్పడమే... అన్నారు శరణ్.

చనిపోదామనుకుంటే...

నా పదహారో ఏట నేను చనిపోవాలని ఆహారాన్ని తీసుకోవడం పూర్తిగా మానేశాను. కట్టెపుల్లగా మారిపోయి మంచాన పడ్డాను. అమ్మ ఆ రోజుల్లో ఎంత తల్లడిల్లిందో తలుచుకుంటే బాధేస్తుంది. మరేం చేయను. నేను నాలా ఉందామనుకుంటే నేను కోరుకున్న అస్తిత్వంతో ఉందామనుకుంటే ప్రతి ఒక్కరికీ సమస్యే. బంధువులు, స్నేహితులు, స్కూల్లో క్లాస్‌మేట్లు అందరూ కామెంట్లు చేసేవారే. అమ్మ తప్ప అందరూ బాధిస్తూ ఉంటే చచ్చిపోదామనుకున్నాను. రెండేళ్లు అమ్మ నన్ను కంటికి రెప్పలా చూసి బతికించింది. ఆ సమయంలో నేను బొమ్మలతో, రకరకాల వంటలతో ప్రయోగాలు చేశాను. అవన్నీ న్యూయార్క్‌లో 'దేవి' రెస్టరెంట్ స్థాపించినప్పుడు నాకు లాభించాయి. అమెరికాలో 'మెషిలిన్ స్టార్' సాధించిన తొలి ఇండియన్ రెస్టరెంట్ నాదే... అన్నారు శరణ్.

న్యూయార్క్ పారిపోయి...

ఇండియాలో ఉండలేక చదువు పేరుతో న్యూయార్క్ వెళ్లిపోవాలనుకున్నప్పుడు కూడా అమ్మ నాకు సపోర్ట్ ఇచ్చి నిలబెట్టింది. ఇప్పుడూ ప్రపంచానికి నాలా నేను తెలుసు. నాలాంటి వారి హక్కుల కోసం పని చేస్తున్నాను. ప్రచారం చేస్తున్నాను. నేను తల్లిదండ్రులకు చెప్పేది ఒక్కటే... పిల్లలు తమలో భిన్న జెండర్ అస్తిత్వాలను గుర్తించినప్పుడు వారిని మొదటగా అర్థం చేసుకోవాల్సింది మీరే. బయట సాగే హింస నుంచి ధైర్యాన్ని ఇవ్వాల్సింది మీరే. మీరు కూడా దాడి చేస్తే పిల్లలు ఇళ్ల నుంచి పారిపోవడం, చనిపోవడం తప్ప ఏం చేయగలరు. శోభా డే గారు ఇందాక మాట్లాడుతూ నాలాంటి పిల్లలు ఒక్కరు ఉన్నా తాను పెంచగలిగేదాన్ని కాను అన్నారు. మా అమ్మ కాబట్టి నన్ను పెంచింది. ప్రతి అమ్మ మా అమ్మలా ఉంటే భిన్న జెండర్ అస్తిత్వాలతో కూడా పిల్లలు విజయాలు సాధిస్తారు. వారిని వారిలా గౌరవించి ప్రోత్సహించండి... అని ముగించారాయన.

● అదర్ సైడ్

సిల్వర్ స్క్రీన్ వారియర్

సినిమా రంగం, నాటక రంగం, సామాజిక రంగం...రంగం ఏదైనా కావచ్చు...నటి, సామాజిక కార్యకర్త, నిర్మాత తృప్తి బోయిర్ గురించి మాట్లాడే సందర్భం ఏదో ఒకటి వస్తూనే ఉంటుంది. ఆమె నిర్మించి, నటించిన 'పారో' 2026 ఆస్కార్ అవార్డ్‌ల బరిలో ఉత్తమ చిత్ర పురస్కారాల కోసం పోటి పడే అర్హత ఉన్న 201 చిత్రాల జాబితాకి ఎంపిక కావడం విశేషం అయితే కావచ్చుగానీ, 'పారో'కు లభిస్తున్న అంతర్జాతీయ గుర్తింపు వల్ల చాలామందికి తెలియని సామాజిక సమస్యపై చర్చకు అవకాశం ఏర్పడింది. 'పారో' సినిమా పరిధిని దాటి విధాన నిర్ణయాలకు సంబంధించిన చర్చలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో సాంస్కృతిక వేదికపై తృప్తి బోయిర్ సామాజిక కృషి గురించి ఆమె మాటల్లోనే...

ఆ క్షణం నుంచే...

కొన్ని సంవత్సరాల క్రితం నేను వధువుల అక్రమ రవాణా(బ్రైడ్ ట్రాఫికింగ్)పై రెండు డాక్యుమెంటరీలు చూశాను. ఇది నిజమేనా? నా దేశంలో ఇలాంటివి జరుగుతున్నాయా? అనిపించింది. ఈ క్రమంలోనే నిజానిజాలు తెలుసుకోవడానికి పరిశోధన మొదలుపెట్టాను. హరియాణాలోని మేవార్‌తో పాటు రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ శివార్లలోని కొన్ని ప్రాంతాలలో ఈ దురాచారం ఉందని తెలుసుకున్నాను. అప్పుడే అనిపించింది వారు పడుతున్న బాధలను, నిస్సహాయతను లోకానికి చెప్పాల్సి ఉందని.

● 'పారో'లో తృప్తి

మూడేళ్ల పరిశోధన

మొదటిసారిగా మేవార్ ప్రాంతానికి వెళ్లినప్పుడు పారోలుగా గుర్తించబడిన 60 మందికి పైగా మహిళలను కలిశాను. తమ గురించి తాము చెప్పిన విషయాలను విన్నాను. చిన్న వయసులో ఉన్నప్పుడే వారిని తీసుకువెళ్లి తెలియని ఊళ్లలో వధువులుగా మార్చారు. ప్రతి మహిళ కళ్లలో నాకు జీవితకాల దుఃఖం కనిపించింది.

వారు కన్నీళ్లు పెట్టుకున్నారు

'పారో మహిళల గొంతును అత్యున్నత స్థాయిలో వినిపించాలి' అనే లక్ష్యంతో నా ప్రయాణం ప్రారంభమైంది. అధికారంలో ఉన్న వారిని చేరుకోవడానికి నేను చేసిన కఠినమైన ప్రయాణం ఇది. ఈ ప్రయాణంలో నేను ఎన్నో తలుపులు తట్టాను. అధికారులను కలిశాను. ఉత్తరాలు రాశాను. ఎంతకీ సమాధానం రాకపోయినా ఎదురుచూశాను. కేంద్ర సామాజిక న్యాయ శాఖమంత్రి రాందాస్ అతావలె నాకు అండగా నిలిచారు. ఆయన మద్దతుతో నేను ఎన్నో గ్రామాల్లోకి వెళ్లి వాస్తవ డేటాను సేకరించాను. నాలుగు వేల మందికి పైగా మహిళల కథలను డాక్యుమెంట్ చేయగలిగాను. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆ డేటాను సమీక్షించి విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన ఒక ముఖ్యమైన సమావేశంలో నన్ను మాట్లాడడానికి వెంటనే ఆహ్వానించారు. ఆ సమావేశానికి ఇద్దరు పారో బాధితులను కూడా తీసుకువెళ్లాను. వారు కమిషన్ ముందు నిలబడి వణుకుతున్న గొంతుతో మాట్లాడినప్పుడు ఆ గదిలోని వారందరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. మా డిమాండ్స్ అధికారికంగా నమోదు చేయబడ్డాయి.

అంతర్జాతీయ స్థాయిలో...

ప్రతిష్ఠాత్మకమైన టెడ్ ఎక్స్ మన్‌హట్టన్ సమావేశంలో తృప్తి బోయిర్ ప్రసంగానికి ప్రేక్షకుల నుంచి అపూర్వ స్పందన లభించింది. పారో వధువు బానిసత్వ వ్యవస్థ గురించి లోతుగా మాట్లాడడానికి ఈ సమావేశం ఆమెకు ఉపయోగపడింది. తృప్తి ప్రసంగం స్టాండింగ్ ఒవేషన్‌తో ముగిసింది. 'నా స్వచ్ఛంద సంస్థ షెల్టర్ ఫౌండేషన్ ద్వారా నేను నిరంతరం పోరాడుతున్నాను. నా మాటలు ప్రజల హృదయాల్లోకి చేరుకుంటాయని నమ్ముతున్నాను. కళ, సామాజిక స్పృహ రెండు వేరు వేరు అంశాలు కాదు. అవి కలిసే నడుస్తాయి' అని తన ప్రసంగంలో చెప్పింది తృప్తి బోయిర్.

ఆ కన్నీళ్ల వెనుక...

'పారో' సినిమాలో 'పారో' పాత్ర పోషించిన తృప్తి బోయిర్ కన్నీళ్లు పెట్టుకుంది. 'నిజమైన బాధితులు అనుభవించే భయానక పరిస్థితుల ముందు నా కన్నీళ్లు ఎంత!' అంటుంది తృప్తి. తన స్వచ్ఛంద సంస్థ 'షెల్టర్' ఫౌండేషన్‌తో వధువుల అక్రమ రవాణాపై పోరాడుతోంది. గజేంద్ర అమిరే దర్శకత్వం వహించిన 'పారో' పారోల జీవితాలను కళ్లకు కడుతుంది. 'పారో'లు అంటే పురుషుల ద్వారా ఆస్తిలాగా అమ్మబడే మహిళలు. ఎలాంటి హక్కులు లేని ఈ బాధితులు గృహ బానిసలుగా మారతారు. వారికి ఒక ఉనికి అంటూ ఉండదు. ఇంట్లో సమస్త పనులు చేస్తారు. కాని పిల్లలపై వారికి ఎలాంటి హక్కు ఉండదు. యజమానికి వీరు నచ్చనప్పుడు అమ్మేయవచ్చు. 'వ్యభిచార వృత్తిలో ఉన్న వారికి కనీసం తమ కోసం సంపాదించుకునే హక్కు అయినా ఉంటుంది. వీరికి ఆ హక్కు కూడా లేదు. 2016 నాటి మానవ అక్రమ రవాణా నివారణ మరియు పునరావాసం బిల్లు ద్వారా బాధితులకు చట్టపరంగా రక్షణ ఉన్నప్పటికీ, ఈ దారుణమైన ఆచారాన్ని నిర్మూలించడానికి ఇంకా చాలా చేయాల్సి ఉంది.హరియాణా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలలో 'పారో' దురాచారం ప్రబలంగా ఉంది.

● లీగల్

ఆ హాస్పిటల్ వారిపై మీరు కేసు వేయవచ్చు!

నేను చాలా కాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్నాను. దగ్గర్లోని ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్ళగా నాకు ఒక అరుదైన జబ్బు ఉందనీ, దానికి చికిత్సగా నామీద ప్రయోగాత్మకంగా కొన్ని మందులు వాడితే పనిచేయవచ్చునని చెప్పారు. అంతేకాదు, ఆ మందులు నామీద ప్రయోగించడానికి ఉచిత వైద్యం చేస్తాం అని చెప్పారు. నేను పెద్దగా చదువుకోలేదు. దాంతో వారి మాటలను గుడ్డిగా నమ్మాను. వారు నాతో తియ్యగా మాట్లాడుతూ ప్రతి వారం నాకు కొన్ని కొత్త మందులు ఇచ్చేవారు. అంతేకాదు, హాస్పిటల్‌కి వెళ్లడానికయ్యే ఖర్చులు కూడా ఇచ్చేవారు. ఇలా కొంత కాలం గడిచిన తర్వాత నాకు నొప్పి ఎక్కువ అవడంతో వేరే డాక్టర్ దగ్గరికి వెళ్లాను. కిడ్నీలలో సమస్య మొదలైంది అని చెప్పి నేను వాడుతున్న మందులు మొత్తం పరిశీలించి వాటిని వెంటనే ఆపేయమని చెప్పారు. కొన్ని నెలల తర్వాత నాకు కిడ్నీలు పూర్తిగా పాడయ్యాయి. అందుకు ఆ హాస్పిటల్ వాళ్లు నా మీద ప్రయోగించిన మందులే కారణమని తేలింది. ఇదేమిటని సదరు ఆస్పత్రి వారిని ప్రశ్నిస్తే– 'నువ్వు మాకు అంగీకార పత్రం ఇచ్చావు కదా.. మేము నీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని' నన్నే బెదిరించారు. అది నేను అంగీకరించే చేశాను కాబట్టి నాకు ఎటువంటి పరిష్కారం లేదంటారా?

– రవి, హైద్రాబాద్

మీ మీద ప్రయోగించిన మందులు ఒకవేళ ఆ ప్రైవేట్ హాస్పిటల్ వాళ్ళు నిర్దేశించిన ప్రమాణాలు, ఎథిక్స్ కమిటీ (నైతిక కమిటీ) ఆమోదం పొంది, తగిన జాగ్రత్తలు తీసుకొని – మీ పూర్తి అంగీకారం, అలాగే మీతో పాటుగా ఎవరైనా కుటుంబ సభ్యులు గానీ – సన్నిహితుల వద్ద కానీ పొంది తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రయోగించవచ్చు. అది కూడా ఒకవేళ మీకు ప్రాణాపాయం ఉంది అనుకుంటే వెంటనే ఆపేయవలసి ఉంటుంది. మీరు పెద్దగా చదువుకోలేదని చెప్తున్నారు కాబట్టి మీ హాస్పిటల్ రికార్డులు మొత్తం తీసుకుని ఎవరైనా చట్టం తెలిసిన వారితో కలిసి రాష్ట్ర వైద్యమండలి (మెడికల్ కౌన్సిల్) లో ఫిర్యాదు చేయవచ్చు. అలాగే మీకు జరిగిన నష్టానికి గాను పూర్తి పరిహారం చెల్లించవలసిందిగా కోరుతూ మీరు సివిల్ కోర్టును కూడా ఆశ్రయించవచ్చు. అందుకు తగిన పత్రాలు ఏం కావాలో దగ్గర్లోని న్యాయనిపుణులను కలిస్తే వారు మీకు సూచిస్తారు. అంతేకాకుండా ఇందులో ఏదైనా నేర దృక్పథం ఉంటే కూడా తగిన క్రిమినల్ చట్టాల కింద కూడా కేసు నమోదు చేసే ఆస్కారం ఉంది. పూర్తి వివరాలతో న్యాయ నిపుణుల – వైద్య నిపుణుల సలహా తీసుకుంటే పరిష్కారం లేకపోలేదు.

– శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

● లేబుల్ బ్లైండ్

చూస్తూనే కనుకొనేలా...

సూపర్‌మార్కెట్ షెల్ఫ్ నుంచి ప్యాకేజ్డ్ ఫుడ్ పాకెట్ తీసుకొని న్యూట్రీషన్ ఫ్యాక్ట్స్, రెగ్యులేటరీ సింబల్స్, చిన్న చిన్న డిస్క్లైమర్‌లు చూడడం అనేది సాధారణ విషయం. అయితే ఈ సాధారణ దృశ్యం వెనుక పెద్ద కష్టమే ఉంది. బ్రాండ్‌ల 'లేబులింగ్' వెనక కనిపించని కష్టం ఎంతో ఉంది. మన దేశంలో ప్యాకేజ్డ్–ఫుడ్ మార్కెట్ విస్తృతమవుతున్న రోజుల్లో 'లేబులింగ్' ప్రక్రియ మాత్రం నత్తకు క్లోజ్‌ఫ్రెండ్‌లా స్లోగా ఉండేది. ఈ నేపథ్యంలోనే 'లేబులింగ్' ప్రక్రియను స్పీడెత్తించడానికి 'లేబుల్ బ్లైండ్' అనే స్టార్టప్‌ను ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాన్ని సాధించింది న్యూట్రీషన్ ఎక్స్‌పర్ట్ రషీద వాపీవాలా...

మన దేశంలో ప్యాకేజ్డ్ ఫుడ్ మార్కెట్ వృద్ధి చెందినప్పటికీ, లేబులింగ్ విషయంలో మాత్రం పొరపాట్లు దొర్లుతూనే ఉన్నాయి. తప్పులు లేకుండా 'లేబులింగ్' ప్రక్రియను సకాలంలో పూర్తిచేయడం సమస్యగా ఉండేది. ఈ నేపథ్యంలోనే పోషకాహార నిపుణురాలు రషీదా వాపీవాలా 'లేబుల్‌బ్లైండ్'ను ప్రారంభించాలని నిర్ణయించుకుంది. ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషన్‌లో మాస్టర్స్, ఆ తరువాత పీహెచ్‌డీ చేసిన రషీద హెల్త్ టోటల్, డైట్ ఫర్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీలలో పనిచేసింది.

ఫుడ్ రేటింగ్‌తో మొదలై...

స్థిరమైన కార్పొరేట్ కెరీర్‌ను వదులుకొని కొత్తదారి ఎంచుకోవాలనుకోవడం కొందరికి రిస్క్. అయితే రషీద మాత్రం రిస్క్ అనుకోలేదు. 'ఆహారం మన జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుందో చూశాను. అదే సమయంలో లేబుల్స్‌తో వినియోగదారులు ఎలా గందరగోళానికి గురవుతున్నారో చూశాను. సమాచారానికి సంబంధించి కంపెనీలు, వినియోగదారులు స్పష్టతతో ఉండాలని నమ్ముతాను' అంటున్న రషీద ముంబై కేంద్రంగా 'లేబుల్‌బ్లైండ్'ను ఫుడ్ రేటింగ్ వెబ్‌సైట్‌గా ప్రారంభించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) 'లేబుల్ బ్లైండ్' పనితీరును గుర్తించి ప్యాక్ లేబులింగ్ నియమాలను తెలియజేసే ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ హోదా ఇచ్చింది.

ఫోల్‌సోల్

'ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్' అవకాశంతో రషీదకు మన దేశంలోని పెద్ద ఫుడ్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడే అవకాశం వచ్చింది. పెద్ద కంపెనీలలో కూడా డిజిటలైజేషన్ ప్రక్రియ ఊపందుకోకపోవడాన్ని గమనించిన రషీద 'ఫోల్‌సోల్'కు శ్రీకారం చుట్టింది. ఇది 'లేబుల్‌బ్లైండ్'కు సంబంధించిన క్లౌడ్ బేస్డ్ సాఫ్ట్‌వేర్. ఫుడ్ లేబులింగ్ ప్రక్రియను సులభతరం చేసింది. ఒకప్పుడు ఈ ప్రక్రియకు వారాలు, నెలల సమయం తీసుకునేది.

'60 నుంచి 100 సెకన్లలో మా ఏఐ సాధనాలు నివేదికను రూపొందిస్తాయి' అంటుంది రషీద.

డైరీ, బేకరి, స్నాక్స్...మొదలైన విభాగాలలో 'లేబుల్ బ్లైండ్' పనిచేస్తోంది. 2021 నుంచి 2023 మధ్య మెనూలేబులింగ్‌కు సంబంధించి రెస్టారెంట్లు, హోటల్స్, క్విక్–సర్వీస్ రెస్టారెంట్(క్యూఎస్‌ఆర్)లతో కలిసి పనిచేసింది. 2023 నుంచి 2024 మధ్య కాలంలో కంపెనీ అంతర్జాతీయంగా విస్తరించింది. వేగవంతమైన, కచ్చితమైన, ప్రపంచవ్యాప్త నిబంధనలకు అనుగుణంగా ఉండే లేబులింగ్ కోసం చూస్తున్న కంపెనీలకు 'ఫోల్‌సోల్' ఒక కీలక సాధనంగా మారింది.

డైనమిక్ లేబుల్స్

మొదట్లో సవాళ్లు ఎదురైనా నైపుణ్యం ఉన్న బృందాన్ని ఏర్పాటు చేసుకోవడంలో, కంపెనీని విజయపథంలో నడిపించడంలో విజయం సాధించింది రషీద. స్టాటిక్ ప్యాకేజింగ్‌కు మాత్రమే కంపెనీ పరిమితమైపోలేదు. ఎన్నో కొత్త ఫీచర్‌లను ఆవిష్కరించింది. ఈ ఆర్థిక సంవత్సరం క్యూఆర్–బేస్డ్ డైనమిక్ లేబుల్స్‌ను ఆవిష్కరించింది. ఎగుమతికి సంబంధించిన వివరాలు, ప్లాస్టిక్ వ్యర్థాల సమాచారం, మాన్యుఫ్యాక్చర్ డేటా అప్‌డేట్ చేయడానికి బ్రాండ్‌లకు ఇది ఉపయోగపడుతుంది.

పెద్ద కంపెనీల నమ్మకాన్ని గెల్చుకొని...

ప్రారంభదశలోనే టాటా స్టార్‌బక్స్, ఐటీసీ హోటల్స్, టిమ్ హోర్టన్స్ ఇండియాలాంటి పెద్ద కంపెనీల నమ్మకాన్ని గెల్చుకుంది లేబుల్‌బ్లైండ్. మెనూ–లేబులింగ్ సొల్యూషన్స్‌కి సంబంధించి ఈ కంపెనీలు ఇప్పటికీ 'లేబుల్‌బ్లైండ్' యాక్టివ్ యూజర్‌లుగా ఉన్నాయి. ప్యాకేజ్డ్–ఫుడ్ క్లయింట్‌లలో బికానో, బికనేర్‌వాలా, ఎవరెస్ట్ స్పైసెస్, మదర్ రెసిపీ(దేశాయ్ బ్రదర్స్), గోల్డీ మసాలా, థియోబ్రొమా...మొదలైనవి ఉన్నాయి. ప్రస్తుతం 'లేబుల్‌బ్లైండ్' నలభైకి పైగా భారతీయ కంపెనీలతో కలిసి పనిచేస్తోంది. వీటిలో ఎక్కువ కంపెనీలు యూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియా...మొదలైన దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తాయి.

తొలి రోజుల్లో సవాళ్లు

తొలి అడుగులు వేస్తున్న కాలంలో కంపెనీకి కొన్ని సవాళ్లు ఎదురయ్యాయి. ఫుడ్ రెగ్యులేషన్స్‌కు సంబంధించి సంక్లిష్ట అంశాలను అర్థం చేసుకోవడం, సరియైన టీమ్‌ను తయారుచేసుకోవడం కాస్త కష్టం అయింది. మన దేశ నియమాలకు, ఇతర దేశ నియమాలకు తేడా ఉంటుంది. 'సాంకేతికత, ఆహారనియంత్రణ అనే రెండింటిలోనూ నైపుణ్యం కలిగిన వ్యక్తులను కనుగొనడం కష్టంగా అనిపించింది' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది రషీద.

● సోషల్ మీడియా

సీఎం సార్... నాకు చిప్స్ కావాలి!

ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, ఒక చిన్న అబ్బాయికి మధ్య సాగిన సరదా సంభాషణ సోషల్ మీడియాలో నవ్వులు పూయిస్తోంది. గోరఖ్‌పూర్‌లోని బాబా గోరఖ్‌నాథ్ ఆలయంలో ఏటా నిర్వహించే ఖిచ్డీ ఉత్సవంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి దగ్గరికి ఒక చిన్నారి వచ్చాడు. సీఎం యోగి ఆ చిన్నారితో ముచ్చటిస్తూ 'నీకు ఏం కావాలో చెప్పు?' అని మురిపెంగా అడిగాడు. ఆ పిల్లాడు ఏ మాత్రం తడబడకుండా 'నాకు చిప్స్ కావాలి' అని ముఖ్యమంత్రి చెవిలో చెప్పాడు. అతడి సీక్రెట్ విన్నపం అక్కడున్న వారికి వినిపించింది. ఆ పసివాడి మాటతో ముఖ్యమంత్రితో పాటు అక్కడ ఉన్న అధికారులు, భక్తులు ఒక్కసారిగా నవ్వేశారు. ఈ సరదా సన్నివేశం వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వెంటనే వైరల్ అయింది.

● బ్యూటిప్స్

పొడిబారిన చర్మానికి మాయిశ్చరైజర్!

● అర టీ స్పూన్ తేనె, రెండు టేబుల్ స్పూన్ల రోజ్ వాటర్ కలిపి ముఖానికి, మెడకు రాసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. తేనె చర్మానికి మాయిశ్చరైజర్‌లా ఉపయోగపడుతుంది. రోజ్ వాటర్‌తో పోర్స్ శుభ్రపడి ముఖ చర్మం కాంతివంతమవుతుంది.

● మూడు టీ స్పూన్ల కొబ్బరి నూనె, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, టీ స్పూన్ గ్లిజరిన్, రెండు టీ స్పూన్ల నీళ్లు కలిపి మరిగించాలి. ఈ మిశ్రమం చల్లారాక ముఖానికి రాసి, మసాజ్ చేయాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఈ ఆయిల్ ప్యాక్ చర్మాన్ని మృదువుగా మారుస్తుంది.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జనవరి 20న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,51,149	బంగారం (24 క్యారెట్లు)	1,50,000	బంగారం (24 క్యారెట్లు)	1,47,280	బంగారం (24 క్యారెట్లు)	1,50,000	బంగారం (24 క్యారెట్లు)	1,49,000	బంగారం (24 క్యారెట్లు)	1,48,470
బంగారం (22 క్యారెట్లు)	1,39,263	బంగారం (22 క్యారెట్లు)	1,35,000	బంగారం (22 క్యారెట్లు)	1,35,000	బంగారం (22 క్యారెట్లు)	1,39,050	బంగారం (22 క్యారెట్లు)	1,37,080	బంగారం (22 క్యారెట్లు)	1,36,100
వెండి	3,17,216	వెండి	3,15,000	వెండి	3,30,000	వెండి	3,15,500	వెండి	3,10,000	వెండి	3,30,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

మహిళా క్రీడాకారిణులకు అండగా... సానియా 'నెక్స్‌ట్ సెట్' ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మహిళా క్రీడాకారిణులకు అండగా నిలిచేందుకు కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. 'నెక్స్‌ట్ సెట్' అనే పేరుతో మొదలైన ఈ పథకం ద్వారా వర్ధమాన మహిళా ప్లేయర్లకు ఆమె తగిన రీతిలో సహకారం అందిస్తుంది. ప్రొఫెషనల్ క్రీడల్లో ప్రస్తుతం ఉన్న డిమాండ్, ఎదురవుతున్న సమస్యలను అధిగమించే దిశగా ఈ కార్యక్రమం ఉంటుంది. వీటిలో ముందుగా టెన్నిస్ ప్లేయర్లకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇందులో రెండు విధాలుగా ఆటగాళ్లకు చేయూత లభిస్తుంది. సీజన్ ఆసాంతం ప్లేయర్లు రాణించే విధంగా ప్రత్యేక వ్యవస్థను రూపొందిస్తారు. ఇందులో భాగంగా కోచ్‌లు, ఫిజియో థెరపిస్ట్‌లు, ట్రయినర్లు కూడా ప్లేయర్లతో కలిసి టోర్నీలకు వచ్చి వారి సన్నాహాల్లో భాగంగా ఉంటారు. రెండో అంకంలో సానియా అకాడమీలో ఆమె నేతృత్వంలోనే క్యాంప్‌లు, కోచింగ్ క్లినిక్‌లు నిర్వహిస్తారు. మ్యాచ్‌ల కోసం సాంకేతికంగా, మానసికంగా కూడా ఎలా సిద్ధం కావాలో ఇందులో చెబుతారు. 'నెక్స్‌ట్ సెట్' కార్యక్రమాన్ని మన టెన్నిస్ ప్లేయర్ల కోసం తాను ఎంతో ఇష్టంతో చేస్తున్నానని సానియా మీర్జా పేర్కొంది. దీనికి దుబాయ్‌కు చెందిన రెండు సంస్థలు జీఎన్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్స్, మక్రా పాలీ క్లినిక్స్ సహకారం అందిస్తున్నాయి.

ఢిల్లీని గెలిపించిన జెమీమా

మళ్లీ ఓడిన ముంబై ఇండియన్స్ ● నాట్ సీవర్ మెరుపులు వృథా

శ్రీచరణి

జెమీమా

వడోదర: జెమీమా రోడ్రిగ్స్ (37 బంతుల్లో 51 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్‌ను గెలిపించింది. దీంతో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ ఖాతాలో రెండో విజయం చేరింది. మంగళవారం జరిగిన పోరులో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. నాట్ సీవర్ బ్రంట్ (45 బంతుల్లో 65 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (33 బంతుల్లో 41; 7 ఫోర్లు) రాణించారు. 21 పరుగుల వద్దే ఓపెనర్లు సజన (9), హేలీ మాథ్యూస్ (12) నిష్క్రమించగా... హర్మన్, బ్రంట్ మూడో వికెట్‌కు 78 పరుగులు జోడించారు. క్యాపిటల్స్ బౌలర్లలో తెలుగమ్మాయి నల్లపురెడ్డి శ్రీచరణి 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో మూడే వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు లీజెల్లి లీ (28 బంతుల్లో 46; 7 ఫోర్లు, 1 సిక్స్), షఫాలీ వర్మ (29; 6 ఫోర్లు) తొలి వికెట్‌కు 63 పరుగులతో చక్కని ఆరంభమిచ్చారు. ముంబైకిది 'హ్యాట్రిక్' పరాజయం. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 6 మ్యాచ్‌లాడిన హర్మన్ బృందం కేవలం రెండు మ్యాచ్‌ల్లోనే గెలిచింది. డబ్ల్యూపీఎల్‌లో నేడు విశ్రాంతి దినం. గురువారం జరిగే మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో యూపీ వారియర్స్ తలపడుతుంది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: సజన (బి) నందిని 9; హేలీ మాథ్యూస్ (బి) మరిజాన్ కాప్ 12; నాట్ సీవర్ (నాటౌట్) 65; హర్మన్‌ప్రీత్ (సి) హామిల్టన్ (బి) శ్రీచరణి 41; నికోలా కేరీ (సి) స్నేహ్ రాణా (బి) శ్రీచరణి 12; అమన్‌జోత్ (సి) లీజెల్లి (బి) శ్రీచరణి 3; సంస్కృతి (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 154. వికెట్ల పతనం:** 1-21, 2-21, 3-99, 4-130, 5-134. **బౌలింగ్:** మరిజాన్ 4-0-8-1, హామిల్టన్ 4-0- 36-0, నందిని శర్మ 4-0-36-1, శ్రీచరణి 4-0-33-3, స్నేహ్ రాణా 3-0-27-0, షఫాలీ వర్మ 1-0-14-0. **ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్:** షఫాలీ (బి) వైష్ణవి 29; లీజెల్లి లీ (స్టంప్డ్) రహిలా (బి) అమన్‌జోత్ 46; వోల్వార్డ్ (రనౌట్) 17; జెమీమా (నాటౌట్) 51; మరిజాన్ కాప్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (19 ఓవర్లలో 3 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1-63, 2-84, 3-118. **బౌలింగ్:** షబ్నిమ్ 4-0-26-0, నికోలా 1-0-13-0, నాట్ సీవర్ 4-0-42-0, సంస్కృతి 1-0-13-0, అమన్‌జోత్ 3-0-21-1, వైష్ణవి 4-0-20-1, హేలీ 2-0-19-0.

ఫైనల్ రిహార్సల్...

నాగ్‌పూర్‌లో నేడు భారత్, న్యూజిలాండ్ తొలి టి20

- తుది జట్టు కూర్పుపై టీమిండియా దృష్టి
- జోరు మీదున్న కివీస్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత జట్టు 2024లో టి20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత వరుసగా ఎనిమిది సిరీస్‌లలో విజేతగా నిలిచింది. సరిగ్గా చెప్పాలంటే 36 మ్యాచ్‌లు ఆడితే 29 గెలిచి, 5 మాత్రమే ఓడిందంటే టీమ్ ఎలాంటి ఫామ్‌లో ఉందో అర్థమవుతుంది. ఇప్పుడు మరో వరల్డ్‌కప్ టైటిల్ వేటలో చివరి రిహార్సల్‌గా సొంతగడ్డపై ఈ ఫార్మాట్‌లో పోరుకు టీమిండియా సిద్ధమైంది. అయితే ఈ విజయాల పర్వంలో తాము ఒక్కసారి కూడా తలపడని న్యూజిలాండ్ ఇప్పుడు ప్రత్యర్థిగా ఉంది. సంచలనాల కివీస్‌ను రెండేళ్లుగా టి20ల్లో భారత్ ఎదుర్కోలేదు. ఇరు జట్ల మధ్య వన్డే సిరీస్ ఫలితం తర్వాత ఇప్పుడు టి20 సిరీస్ ఆసక్తిని రేపుతోంది.

అర్ష్‌దీప్, సామ్సన్, అక్షర్ పటేల్

నాగ్‌పూర్: టి20 వరల్డ్ కప్‌కు ముందు చివరి సన్నాహకం కోసం భారత్, న్యూజిలాండ్ సన్నద్ధమయ్యాయి. ఇరు జట్ల మధ్య ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు తొలి పోరు జరగనుంది. ఇటీవల సిరీస్ ఆడిన వన్డే టీమ్‌తో పోలిస్తే ఒకరిద్దరు మినహా భారత బృందం పూర్తిగా కొత్తగా కనిపిస్తోంది. మరోవైపు కివీస్ కూడా రెగ్యులర్ సభ్యులు అందుబాటులోకి రావడంతో పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతోంది. టి20 వరల్డ్ కప్ ఇక్కడే జరగనుండటం, రెండు టీమ్‌లు కూడా ఐసీసీ టోర్నీలో ఆడే టీమ్‌నే దాదాపుగా ఎంపిక చేయడంతో ఈ సిరీస్ సరైన ప్రాక్టీస్ కానుంది. తమ బలాబలాలను అంచనా వేసుకోవడంతో పాటు తుది జట్టు కూర్పుపై కూడా జట్లు దృష్టి పెట్టాయి. అనూహ్యంగా వన్డే సిరీస్ విజయంతో ఆత్మవిశ్వాసం పెరిగిన న్యూజిలాండ్‌ను భారత్ తక్కువగా అంచనా వేస్తే అదే ఫలితం పునరావృతం అయ్యే ప్రమాదం ఉంది.

స్టార్లంతా సిద్ధం...

ఇషాన్, అభిషేక్

బుమ్రా వచ్చేశాడు, హార్దిక్ పాండ్యా కూడా వచ్చాడు... మెరుపు ఆరంభాలకు అభిషేక్ శర్మ, సామ్సన్ కూడా సిద్ధం. ఎప్పటిలాగే భారత టి20 జట్టు అన్ని రంగాల్లో పటిష్టంగా కనిపిస్తోంది. జట్టులో ప్రతీ ఆటగాడు ఒంటిచేత్తో విజయం అందించే స్థాయిలో ఉన్నాడు. ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. బుమ్రా, పాండ్యాలు సత్తా చాటితే టీమిండియాకు ఎదురే ఉండదు. శస్త్ర చికిత్స కారణంగా తొలి మూడు మ్యాచ్‌లకు దూరమైన తిలక్ వర్మకు బదులుగా శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేసినా... మూడో స్థానంలో ఇషాన్ కిషన్ ఆడతాడని కెప్టెన్ సూర్యకుమార్ స్పష్టం చేసిన నేపథ్యంలో బ్యాటింగ్ ఆర్డర్ విషయంలో కూడా సందేహాలు లేవు. ఏడు, ఎనిమిది స్థానాల్లో హిట్టర్లు రింకూ సింగ్, శివమ్ దూబే ఆడటం అంటే జట్టు బ్యాటింగ్ లోతు ఏమిటో తెలుస్తోంది. ఇద్దరు రెగ్యులర్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి భారం మోస్తారు. వన్డే సిరీస్‌లో కుల్దీప్ ప్రభావం చూపకపోయినా... టి20ల్లో ప్రత్యర్థిని కుప్పకూల్చగల సమర్థుడు. ఇన్ని సానుకూలతల మధ్య ఏదైనా ఆందోళన ఉందంటే అది కెప్టెన్ సూర్య ఫామ్ గురించి మాత్రమే. గత 22 ఇన్నింగ్స్‌లలో అతను అర్ధసెంచరీ సాధించలేకపోయాడు. జట్టు సారథిగా, విధ్వంసకర బ్యాటర్‌గా తనకున్న గుర్తింపును ప్రదర్శించేందుకు ఈ సిరీస్ అతనికి సరైన వేదిక. కెరీర్‌లో ఇది సూర్యకు 100వ టి20 మ్యాచ్ కానుంది.

మిచెల్, ఫిలిప్స్‌పై దృష్టి...

న్యూజిలాండ్ వన్డేల తరహాలో ఈ సిరీస్ కోసం కూడా ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఇప్పటికే వన్డేల్లో సత్తా చాటిన డరైల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ మరోసారి భారత బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు. టి20ల్లో మిచెల్‌కు కూడా మెరుగైన రికార్డు ఉండగా, ఫిలిప్స్ దూకుడుకు మారుపేరు. వన్డేల్లో విఫలమైన కాన్వే ఇక్కడ మెరుగ్గా ఆడాలని పట్టుదలగా ఉన్నాడు. కివీస్ కూడా పలువురు టి20 స్పెషలిస్ట్‌లు చాప్‌మన్, డఫీ, సోధిలకు అవకాశం కల్పిస్తోంది. పేసర్ డఫీ చక్కటి ఫామ్‌లో ఉండగా... రచిన్ రవీంద్ర, కెప్టెన్ సాంట్నర్ విరామం తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చారు. ఇటీవల ఆస్ట్రేలియాపై మెరుపు సెంచరీ చేసిన రాబిన్సన్ ఓపెనర్‌గా చెలరేగిపోగలడు.

సాంట్నర్

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, సామ్సన్, ఇషాన్ కిషన్, పాండ్యా, అక్షర్, రింకూ, దూబే, కుల్దీప్, బుమ్రా, వరుణ్.

న్యూజిలాండ్: సాంట్నర్ (కెప్టెన్), రాబిన్సన్, కాన్వే, రచిన్, మిచెల్, ఫిలిప్స్, చాప్‌మన్, నీషమ్, హెన్రీ, సోధి, డఫీ.

సినెర్ గెలుపు బోణీ	ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేసిన డిఫెండింగ్ చాంపియన్
మరిన్ని క్రీడా వార్తలు	సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

12-10 భారత్, న్యూజిలాండ్ మధ్య మొత్తం 25 టి20లు జరగ్గా... భారత్ 12 గెలిచి 10 ఓడింది. మరో 3 మ్యాచ్‌లు 'టై' అయ్యాయి. భారత్‌లో 2017, 2023లలో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లు జరగ్గా... రెండూ భారత్ గెలిచింది.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్, బౌలింగ్‌కు సమంగా అనుకూలించే మంచి స్పోర్టింగ్ వికెట్. అయితే స్పిన్నర్లు కొంత అదనపు ప్రభావం చూపగలరు. దేశంలో పెద్ద బౌండరీలు ఉన్న మైదానాల్లో ఒకటి కాబట్టి భారీ స్కోర్లు కష్టం. వర్షం సమస్య లేదు.

ఐపీఎల్‌లో 'జెమినై'

రూ. 270 కోట్లతో ఒప్పందం

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) స్పాన్సర్ల సుదీర్ఘ జాబితాలో ఇప్పుడు మరో ప్రతిష్టాత్మక సంస్థ కూడా చేరింది. గూగుల్‌కు చెందిన ఏఐ ప్లాట్‌ఫామ్ 'జెమినై' ఐపీఎల్‌లో భాగస్వామిగా మారుతూ బీసీసీఐతో జత కట్టింది. ఇందు కోసం మూడేళ్ల కాలానికి 'జెమినై' రూ. 270 కోట్లు చెల్లిస్తుంది. భారత క్రికెట్‌లో ఏఐ ప్లాట్‌ఫామ్‌ల పాత్ర పెరిగేందుకు ఈ ఒప్పందం కీలకంగా మారుతుందని బీసీసీఐ భావిస్తోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో మరో ప్రముఖ సంస్థ, 'జెమినై'కి పోటీదారు అయిన చాట్ జీపీటీ ఇప్పటికే మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో స్పాన్సర్‌గా ఉండటం విశేషం. గత నవంబర్‌లోనే బీసీసీఐ ఈ ఒప్పందం చేసుకుంది. 2026 ఐపీఎల్ సీజన్ మార్చి 26 నుంచి మే 31 వరకు జరుగుతుంది.

"ఒక నటుడిగా ఫలానా జానర్‌లోనే సినిమాలు చేయాలని అనుకోలేదు. నా ప్రతి సినిమాతో ప్రేక్షకులకు ఓ కొత్త కథ చెప్పాలనే ప్రయత్నిస్తుంటాను. కానీ 'అమ్మ చెప్పింది, అందరి బంధువయ, శతమానం భవతి, నారీ నారీ నడుమ మురారి...' వంటి చిత్రాలు ఫ్యామిలీ ఆడియన్స్‌కు నన్ను దగ్గర చేశాయి. ఇది వారి నుంచి నాకు దక్కిన ఆశీర్వాదంగా భావిస్తున్నాను" అని హీరో శర్వానంద్ అన్నారు. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన సినిమా 'నారీ నారీ నడుమ మురారి'. ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో శర్వానంద్ పంచుకున్న విశేషాలు...

నాకు నచ్చేలా నేను ఉండాలనే ఇలా మారాను

- శర్వానంద్

● 'నారీ నారీ నడుమ మురారి' సినిమా కథ విన్నప్పుడే ఈ సినిమా ఎప్పుడొచ్చినా బ్లాక్‌బస్టర్ అని చెప్పాను. నా నమ్మకం నిజమైంది. ఈ సంక్రాంతి సీజన్‌కి మా సినిమా కంటే ముందుగానే నాలుగు సినిమాలు రిలీజ్‌లు ఖరారు చేసుకున్నాయి. కానీ సంక్రాంతి సీజన్ అంటే పెద్ద లాంగ్ వీకెండ్, హాలిడేస్ ఉన్నాయి. పైగా 23 నుంచి 26 వరకు మరో వీకెండ్ కలిసొచ్చింది. దీంతో మా 'నారీ నారీ నడుమ మురారి' సినిమా రిలీజ్‌కు ఏ ఇబ్బంది ఉండదనుకున్నాం. పైగా మా సినిమా కంటెంట్‌ని బలంగా నమ్మాం. మా సినిమాను సంక్రాంతి సీజన్‌లో ఆడియన్స్ ఆదరిస్తారని అనుకున్నాం. అదే నిజమైంది. ఇప్పుడు మా సినిమా ప్రదర్శితమయ్యే థియేటర్స్ సంఖ్య పెరుగుతోంది. కలెక్షన్స్‌ను నేను పెద్దగా పట్టించుకోను. 'శతమానం భవతి' (2017) సినిమా సంక్రాంతి సమయంలో విడుదలైనప్పుడు దాదాపు రూ. 40 కోట్ల షేర్ వచ్చిందని అన్నారు.

● 'నారీ నారీ నడుమ మురారి'లో సందర్భానుసారంగా వచ్చే కామెడీ బాగా వర్కౌట్ అయ్యింది. నిజానికి రామ్ అబ్బరాజులాంటి దర్శకులు ఇండస్ట్రీకి కావాలి. ఈ సినిమాలో గెస్ట్ రోల్ చేసిన శ్రీవిష్ణు గారికి ధన్యవాదాలు చెబుతున్నాను. నిర్మాత అనిల్‌గారు నాకు బిగ్ బ్రదర్‌లాంటివారు. మేం అన్నీ మాట్లాడుకునే ఈ సినిమా చేశాం.

● గతంలో నేను నటించిన 'ఎక్స్‌ప్రెస్ రాజా, శతమానం భవతి', ఇప్పుడు 'నారీ నారీ నడుమ మురారి' సినిమాలు సంక్రాంతి సీజన్‌లోనే విడుదలై, సూపర్ హిట్ అయ్యాయి. ప్రతి సంక్రాంతికి నా సినిమా ఉంటే బాగానే ఉంటుంది. కానీ అది చెప్పలేం. అయితే నెక్స్ట్ సంక్రాంతికి శ్రీను వైట్లగారి డైరెక్షన్‌లోని సినిమాతో థియేటర్స్‌కు వస్తాను.

● దర్శకులు, నిర్మాతలు, హీరోలు ఎప్పటికప్పుడు చర్చించుకుంటూ, సినిమాలు చేస్తే బడ్జెట్లు పెరగవు. అందరికీ మంచి సినిమాలు కావాలి. ఓటీటీ సంస్థల ప్రభావం ఇండస్ట్రీపై ఉంది. కానీ మనం థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ కోసం సినిమాలు తీయాలి. ఓటీటీల కోసం కాదు. ఏదైనా ఒక సినిమా థియేట్రికల్‌గా మంచిగా రెవెన్యూ చేస్తే ఓటీటీ వాళ్ళు కూడా హ్యాపీగానే ఉంటారు. అందుకే ఓటీటీ అనేది బోనస్.

● 'జాను' సినిమా షూట్ సమయంలో నాకు పెద్ద ప్రమాదం జరిగింది. నా చేయి పని చేయకపోవచ్చన్నారు. ఆ తర్వాత కోలుకున్నాను. కానీ బరువు పెరిగాను. అందుకే 'శ్రీకారం, ఆడవాళ్ళు మీకు జోహార్లు' వంటి సినిమాల్లో కాస్త బొద్దుగా కనిపిస్తాను. ఆ లుక్ నాకే నచ్చలేదు. దీంతో నాకు నచ్చేలా నేను ఉండాలనే సంకల్పంతో ట్రాన్స్‌ఫార్మ్ అవ్వాలనుకున్నాను. మొదట వాకింగ్, ఆ తర్వాత రన్నింగ్, స్ట్రెంత్ ట్రైనింగ్, యోగా... ఇలా ఒక్కొక్కటి చేస్తూ వచ్చాను. అలా ఈ ప్రస్తుత లుక్‌లోకి మారిపోయాను.

● 'బైకర్' సినిమా చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే రిలీజ్ చేస్తాం. ఈ చిత్రంలో తండ్రి-కొడుకు పాత్రల్లో నటించాను. సంపత్ నందిగారి డైరెక్షన్‌లోని 'భోగి' సినిమా షూట్‌ను ఆరంభించాం. శ్రీను వైట్లగారితో మంచి వినోదాత్మక చిత్రం చేస్తున్నాను.

నా మనసుకు నచ్చిన పాత్ర సంధ్య

- శోభిత ధూళిపాళ్ల

''చీకటిలో' సినిమాలో సంధ్య అనే ట్రూ క్రైమ్ పాడ్‌కాస్టర్‌గా చేశాను. ఈ కథ నా చుట్టూ తిరుగుతుంటుంది. హైదరాబాద్‌లో జరిగే కొన్ని చీకటి రహస్యాలను ధైర్యంగా వెలికి తీసే పాత్ర నాది. సంధ్య ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది? అన్నది సినిమాలో ఆసక్తిగా ఉంటుంది. నా మనసుకు బాగా నచ్చిన పాత్ర సంధ్య'' అని శోభిత ధూళిపాళ్ల తెలిపారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'చీకటిలో...'. చంద్ర పెమ్మరాజు రచనా సహకారంతో శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించారు. విశ్వదేవ్ రాచకొండ, చైతన్య విశాలక్ష్మి, ఈషా చావ్లా, ఝాన్సీ, ఆమని, వడ్లమాని శ్రీనివాస్ కీలక పాత్రలు పోషించారు. డి. సురేష్‌బాబు నిర్మించిన ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ నెల 23 నుంచి తెలుగు, హిందీ, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

● విశ్వదేవ్ రాచకొండ, శోభిత ధూళిపాళ్ల, శరణ్ కొప్పిశెట్టి

ఈ సందర్భంగా శోభిత ధూళిపాళ్ల మాట్లాడుతూ– ''అమెజాన్ ప్రైమ్ వీడియోలో గతంలో 'మేడిన్ హెవెన్' అనే వెబ్ సిరీస్ చేశాను. 'చీకటిలో' కథ వారి దగ్గరకి వచ్చినప్పుడు సంధ్య పాత్ర కోసం నన్ను అనుకున్నారు. శరణ్‌గారు చెప్పిన 'చీకటిలో' కథ నచ్చింది. సంధ్య క్యారెక్టర్ గురించి వినగానే... ఓ నటిగా ఇలాంటి పాత్ర చేయాలని అనిపించింది. పాడ్ కాస్ట్ కల్చర్ మన దేశంలో ఇప్పుడిప్పుడే వస్తోంది. మా మూవీలో చూపించిన క్రైమ్ పాడ్ కాస్ట్ ఆడియన్స్‌కి కొత్తగా అనిపిస్తుందనే నమ్మకం ఉంది. ఇక నేను వేగంగా సినిమాలు చేయాలనుకోవడం లేదు. కథలు చాలా వింటున్నప్పటికీ నాకు బాగా నచ్చితేనే నటిస్తున్నాను. నేను వేరే భాషల్లో నటిస్తున్నప్పటికీ నా మాతృభాష తెలుగులో నటించడం సౌకర్యంగా అనిపిస్తుంది. ప్రస్తుతం తమిళ్‌లో 'వెట్టువమ్' అనే సినిమాలో నటిస్తున్నాను'' అని చెప్పారు. **శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ–** ''సంధ్య పాత్ర కోసం శోభిత వంద శాతం ఎఫర్ట్స్ పెట్టారు. ఈ మూవీ ద్వారా జనాల్లో అవగాహన తీసుకురావడంతో పాటు ఓ సందేశం కూడా ఇస్తున్నాం. ప్రశాంత్ వర్మ క్రియేట్ చేసిన 'అధీరా'కి నేను దర్శకత్వం వహించబోతున్నాను'' అని పేర్కొన్నారు. **విశ్వదేవ్ రాచకొండ మాట్లాడుతూ–** ''చీకటిలో' కథ వినగానే క్రైమ్ జానర్‌లోకి అడుగుపెడుతున్న ఒక రియలిస్టిక్ డ్రామాలా అనిపించింది'' అన్నారు.

మీ ప్రేమ శాశ్వతం

- చిరంజీవి

''మన శంకర వరప్రసాద్‌గారు'కి ప్రేక్షక దేవుళ్లు చూపిస్తున్న ఆదరణ, ఈ అపూర్వమైన విజయం చూస్తుంటే నా మనసు కృతజ్ఞతా భావనతో నిండిపోయింది'' అని చిరంజీవి అన్నారు. ఆయన హీరోగా, వెంకటేశ్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో సుష్మిత కొణిదెల, సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఈ సినిమా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 300 కోట్లు వసూళ్లను రాబట్టిందని, ఉత్తర అమెరికాలో 3 మిలియన్ డాలర్ల మార్క్‌ను అధిగమించి, విజయవంతంగా ప్రదర్శితమవుతోందని చిత్ర బృందం పేర్కొంది. ఈ సందర్భంగా మంగళవారం తన 'ఎక్స్' ఖాతా వేదికగా చిరంజీవి ఓ నోట్‌ను షేర్ చేశారు. ''నేను ఎప్పుడూ చెప్పేది, నమ్మేది ఒక్కటే. నా జీవితం మీ ప్రేమాభిమానాలతో ముడిపడింది. మీరు లేనిదే లేను. ఈ విజయం పూర్తిగా నా ప్రియమైన తెలుగు ప్రేక్షకులది, నా ప్రాణ సమానమైన అభిమానులది, నా డిస్ట్రిబ్యూటర్లది, సినిమాకు ప్రాణం పెట్టి పని చేసిన ప్రతి ఒక్కరిదీ. ముఖ్యంగా దశాబ్దాలుగా నా వెంట నిలబడి ఉన్నవారందరిదీ. వెండితెరపై నన్ను చూడగానే మీరు వేసే విజిల్స్, కొట్టే చప్పట్లే నన్ను నడిపించే నా శక్తి. రికార్డులు వస్తుంటాయి... పోతుంటాయి. కానీ మీరు నా పై కురిపించే ప్రేమ శాశ్వతం. ఈ బ్లాక్‌బస్టర్ విజయం వెనక ఎంతో కృషి చేసిన మా హిట్ మిషన్ అనిల్ రావిపూడికి, నిర్మాతలు సాహు అండ్ సుష్మితలకు... మొత్తం యూనిట్‌కీ ధన్యవాదాలు'' అంటూ ఈ నోట్‌లో పేర్కొన్నారు చిరంజీవి.

అందరికీ కనెక్ట్ అయ్యే కథ ఇది

- ఏఆర్ సజీవ్

తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతి:' ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనూప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు నిర్మించారు. మలయాళ హిట్ ఫిల్మ్ 'జయ జయ జయ జయ హే'కి తెలుగు రీమేక్‌గా తెరకెక్కిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఏఆర్ సజీవ్ మాట్లాడుతూ– ''స్వస్థలం వెస్ట్ గోదావరి జిల్లా నిడదవోలు. దర్శకుడు వీవీ వినాయక్‌గారి స్ఫూర్తితో ఇండస్ట్రీకి వచ్చాను. దర్శకులు సంకల్ప్, నందకిషోర్‌ల వద్ద దర్శకత్వ విభాగంలో పని చేయడంతో పాటు మరికొంతమంది దర్శకుల దగ్గర రైటింగ్ టీమ్‌లో మెంబర్‌గా ఉన్నాను. నా దగ్గర ఉన్న ఓ కథతో సినిమా చేయాలనుకున్నాను. కానీ ఈ రీమేక్ సినిమా ప్రపోజల్ నిర్మాత నుంచి రాగానే సరే అని ఒప్పుకున్నాను. 'ఈ నగరానికి ఏమైంది?' సినిమా తర్వాత దర్శకుడు తరుణ్ భాస్కర్‌గారి దగ్గర వర్క్ చేయాలనుకున్నాను. అయితే ఆయన లీడ్ రోల్‌లో నా డైరెక్షన్‌లో సినిమా చేసే చాన్స్ రావడంతో ఎగ్జైట్ అయ్యాను. యూనివర్సల్‌గా ప్రేక్షకులందరికీ కనెక్ట్ అయ్యే కథ ఇది. సో... ఈ సినిమా కోర్ పాయింట్ తీసుకుని, మన తెలుగు ఆడియన్స్‌కు నచ్చేలా గోదావరి బ్యాక్‌డ్రాప్ పెట్టాం. చివరి 30 నిమిషాల కథ కొత్తగా కనిపిస్తుంది. తరుణ్‌గారికి దర్శకుడిగా అనుభవం ఉన్నప్పటికీ నాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఈ చిత్రంలో ఆయన గోదావరి యాసలో మాట్లాడారు. ఇందుకోసం కొంత ప్రిపేర్ అయ్యారు. ఈవీవీ సత్యానారాయణగారి సినిమాల్లో భార్యాభర్తల మధ్య ఉండే ఎమోషనల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రంలోనూ ఉంటుంది. సురేష్‌బాబు, తరుణ్ భాస్కర్లగారితో పాటు మరికొంతమంది మా సినిమా చూసి, బాగుందన్నారు'' అని చెప్పారు.

సరికొత్తగా...

● దునియా విజయ్

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా సినిమా 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్'. ఈ చిత్రంలో సంయుక్త హీరోయిన్‌గా నటించగా, టబు, దునియా విజయ్ ప్రధాన పాత్రల్లో నటించారు. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, జేబీ నారాయణరావు కొండ్రోల్ల నిర్మించారు. జనవరి 20 (మంగళవారం) దునియా విజయ్ బర్త్ డే సందర్భంగా 'స్లమ్‌డాగ్' నుంచి ఆయన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''దునియా విజయ్‌గారు ఇప్పటివరకు చేయని సరికొత్త పాత్రను ఈ సినిమాలో చేశారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని యూనిట్ పేర్కొంది.

కల్యాణంలో పర్వతాలు

● వీకే నరేశ్

వీకే నరేశ్, అనుపమా పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకత్వంలో బూసం జగన్‌మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పర్వతాలు అనే కీలక పాత్ర చేస్తున్నారు వీకే నరేశ్. మంగళవారం (జనవరి 20) వీకే నరేశ్ బర్త్ డే సందర్భంగా ఈ పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''తెలంగాణ నేపథ్యంలో పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో వినోదాత్మకంగా సాగే చిత్రం ఇది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సురేష్ బొబ్బిలి.

మరొక్కసారి రెడీ

● సంజన, నరేశ్

నరేశ్ అగస్త్య, సంజనా సారథి హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'మరొక్కసారి'. నితిన్ లింగుట్ల రచన, దర్శకత్వంలో ఈ చిత్రాన్ని బి. చంద్రకాంత్ రెడ్డి నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దక్షిణాది భాషల్లో ఈ సినిమా రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ సందర్భంగా బి. చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ – ''ఫీల్ గుడ్ రొమాంటిక్ లవ్ మూవీ ఇది. కథలోని బలమైన భావోద్వేగాలను తెరపై అద్భుతంగా ఆవిష్కరించడానికి అందుకు తగ్గ లొకేషన్స్‌లో షూట్ చేశాం. ముఖ్యంగా టిబెట్ సరిహద్దు సమీపంలోని సముద్ర మట్టానికి సుమారు 5,430 మీటర్ల (17,800 అడుగులు) ఎత్తులో ఉన్న గురుడోంగ్మార్ సరస్సు వద్ద షూటింగ్ చేయడం మాకో పెద్ద సవాల్. అక్కడ చిత్రీకరణ జరుపుకున్న తొలి భారతీయ సినిమా మాదే. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని తెలిపారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	1,066	82,180
నిఫ్టీ ▽	353	25,232

విదేశీ సూచీలు

నాస్డాక్	23,152	▽	362
డోజోన్స్	48,801	▽	558
ఎఫ్టీఎస్ఈ 100	10,119	▽	76
డాక్స్	24,757	▽	203
షాంఘై	4,113	▽	1
నికాయ్	52,991	▽	592

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్బీఐ	90.50	91.52
£	బ్రిటన్ పౌండ్	ఎస్బీఐ	120.67	120.79
€	యూరో	ఎస్బీఐ	104.70	107.50
¥	జపాన్ యెన్ (100)	ఎస్బీఐ	56.94	58.32
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్బీఐ	58.58	62.50
S$	సింగపూర్ డాలర్	థామస్కుక్	68.48	72.17
SAR	సౌదీ రియాల్	థామస్కుక్	23.35	24.85
UAE	యూఏఈ దిర్హామ్	థామస్కుక్	23.86	25.12
¥	చైనా యువాన్	థామస్కుక్	12.18	14.00

పసిడి పరుగులు వెండి వెలుగులు

- 1,53,000 దాటిన గోల్డ్
- రూ. 5,100 అప్
- సిల్వర్ మరో రూ. 20,400 ర్యాలీ

న్యూఢిల్లీ: సర్వత్రా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో సురక్షితమైన పెట్టుబడి సాధనాలుగా పరిగణించే పసిడి, వెండి రికార్డు పరుగులు కొనసాగిస్తున్నాయి. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పసిడి రేటు కీలకమైన రూ. 1.5 లక్షల మార్కును దాటేసింది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల పసిడి రేటు ఏకంగా రూ. 5,100 పెరిగి రూ. 1,53,200కి చేరింది. వెండి ధర కిలోకి రూ. 20,400 పెరిగి మరో కొత్త గరిష్ట స్థాయి రూ. 3,23,000కి ఎగిసింది.

అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో ఔన్సు (31.1 గ్రాములు) బంగారం ధర తొలిసారిగా 4,700 డాలర్ల మైలురాయిని అధిగమించింది. 66.38 డాలర్లు పెరిగి 4,737.40 డాలర్లకు చేరింది. స్పాట్ సిల్వర్ కూడా కొత్త గరిష్ట స్థాయి 95.88 డాలర్లకి పెరిగింది. దేశీయంగా ఫ్యూచర్స్ మార్కెట్ ఎంసీఎక్స్లో ఫిబ్రవరి డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 6,861 పెరిగి రూ. 1,52,500 వద్ద ట్రేడయ్యింది. అటు వెండి కూడా రూ. 17,723 ఎగిసి రూ. 3,27,998 వద్ద ట్రేడయ్యింది. అటు అంతర్జాతీయంగా కామెక్స్లో పసిడి రేటు ఔన్సుకి (31.1 గ్రాములు) 147.5 డాలర్లు ఎగిసి 4,724.9 డాలర్లు పలికింది. సిల్వర్ ఫ్యూచర్స్ 6.87 డాలర్లు పెరిగి తొలిసారి 95 డాలర్ల మార్కును దాటింది.

అనిశ్చితి, ఉద్రిక్తతలతో ఆజ్యం..

అంతర్జాతీయంగా అనిశ్చితి, అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, రష్యా–ఉక్రెయిన్ వివాదం కొలిక్కి రాకపోవడంలాంటి అంశాల వల్ల ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పసిడి, వెండి వైపు మళ్లుతున్నారని వెంచురా సంస్థ హెడ్ (కమోడిటీ, సీఆర్ఎం) ఎన్ఎస్ రామస్వామి చెప్పారు.

క్రాష్ మార్కెట్

రూ.10 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

- 1,066 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- 83 వేల స్థాయిని కోల్పోయిన ఇండెక్స్
- నిఫ్టీకి 353 పాయింట్ల నష్టం
- మూడు నెలల కనిష్టానికి సూచీలు

ముంబై: అమెరికా, ఐరోపా దేశాల మధ్య భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, టారిఫ్ అనిశ్చితి దలాల్ స్ట్రీట్ను వణికించాయి. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల పరంపర, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ పతనం ప్రతిబంధకాలయ్యాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 1,066 పాయింట్లు పతనమైన 83 వేల స్థాయి కింద 82,180 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 353 పాయింట్లు కోల్పోయి 25,232 వద్ద నిలిచింది. ఈ ముగింపు ఇరు సూచీలకు మూడు నెలల కనిష్టం కావడం గమనార్హం. మార్కెట్ పతన తీవ్రత ఎంతలా ఉందంటే..., ఒక్కరోజులో రూ.10 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.465 లక్షల కోట్ల నుంచి రూ.455 లక్షల కోట్లకు దిగివచ్చింది.

రోజంతా నష్టాల ట్రేడింగ్: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే బలహీనంగా మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపారు. ఏ దశలోనూ కోలుకోలేక రోజంతా నష్టాల్లో కదలాడాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,235 పాయింట్లు క్షీణించి 82,011 వద్ద, నిఫ్టీ 414 పాయింట్లు కుప్పకూలి 25,171 వద్ద కనిష్టాలు తాకాయి.

హెచ్డీఎఫ్సీ షేరుకు మాత్రమే లాభాలు

సెన్సెక్స్ 30 షేర్లలో ఒక్క హెచ్డీఎఫ్సీ బ్యాంకు షేరు మాత్రమే 0.38% స్వల్ప లాభంతో గట్టెక్కింది. ఇదే సూచీలో ఎటర్నల్ 4%, బజాజ్ ఫైనాన్స్ 3.88% సన్ఫార్మా 3.68%, బజాజ్ ఫిన్సర్వ్ 3.05%, ఇండిగో 3% అత్యధికంగా నష్టపోయిన టాప్ 5 షేర్లు.

అన్ని రంగాల ఇండెక్సులు డీలా

మార్కెట్లోని విస్తృత స్థాయి అమ్మకాలతో బీఎస్ఈలో అన్ని రంగాల ఇండెక్సులు డీలాపడ్డాయి. రియల్టీ 5.21%, సర్వీసెస్ 3%, క్యాపిటల్ గూడ్స్ 2.76%, కన్జూమర్ డిస్క్రెషనరీ 2.73%, కన్జూమర్ డ్యూరబుల్స్ 2.71%, టెలికమ్యూనికేషన్ 2.42%, ఆటో 2.36%, విద్యుత్ 2.23 శాతం పతనమయ్యాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 2.74%, 2.52 శాతం క్షీణించాయి.

ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల పతనం

ట్రంప్ టారిఫ్ భయాలు, గ్లోబల్ టారిఫ్విధానంపై అమెరికా సుప్రీం కోర్టు తీర్పు వెలువరించనున్న నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లూ నష్టాల్లో ట్రేడయ్యాయి. చైనా, జపాన్, సింగపూర్, హాంగ్కాంగ్ మార్కెట్లు 1.50% నుంచి 0.50% పతనమయ్యాయి. యూరప్ మార్కెట్లు 1% క్షీణించాయి. అమెరికా స్టాక్ సూచీలు ఒకటిన్నరశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

నష్టాలకు 4 కారణాలు

సూచీలకు ఐటీ షేర్ల పోటు

కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్ల కారణంగా ఐటీ రంగ కంపెనీలు డిసెంబర్ త్రైమాసికంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాయి. బలహీన ఆదాయాల ప్రకటనతో విప్రో 3%, ఎల్టీఐ మైండ్ట్రీ 7%, ఇన్ఫోసిస్ 1%, టీసీఎస్ 2% నష్టపోయాయి. బీఎస్ఈ ఐటీ ఇండెక్స్ ఏకంగా 3% పతనమైంది. ఐటీ షేర్లలో అమ్మకాలు సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి.

విదేశీ ఇన్వెస్టర్ల టేకాఫ్ మూడ్

భారత మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ ఆగడంలేదు. సోమ, మంగళవారాల్లో రూ.6,200 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఈ నెలలో 11వ రోజూ అమ్మకాలు కొనసాగాయి డాలర్ మారకంలో రూపాయి విలువ 7 పైసలు బలహీన పడి జీవిత కాల కనిష్ట ముగింపు 90.97 వద్ద ముగిసింది.

ట్రంప్ టారిఫ్ బెదిరింపులు

గ్రీన్లాండ్ విషయంలో తనకు సహకరించకుంటే వాణిజ్య సుంకాలు విధిస్తానని యూరోపియన్ యూనియన్(ఈయూ) దేశాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దిగుతున్నారు. ఈ క్రమంలోనే మళ్లీ టారిఫ్ వార్ భయాలు మార్కెట్లలో మొదలయ్యాయి. ఈ ప్రభావం మన మార్కెట్లపైనా పడింది.

పెరిగిన క్రూడ్; వీఐఎక్స్ ఇండెక్స్

అంతర్జాతీయంగా బ్రెంట్ ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణ ఆందోళనలు రేకెత్తాయి. మరోవైపు ఈక్విటీ మార్కెట్లో అనిశ్చితిని సూచించే వీఐఎక్స్ ఇండెక్సు 4% పెరిగి 12.34 వద్దకు చేరుకుంది. దీనికి తోడు మంగళవారం 'నిఫ్టీ వీక్లీ ఎక్స్పైరీ' కారణంగా భారీ ఒడిదుడుకులు చోటుచేసుకున్నాయి.

వింగ్స్లో ఎయిర్బస్ విమానాల ప్రదర్శన

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్ బేగంపేట ఎయిర్పోర్టులో జనవరి 28 నుంచి జరిగే వింగ్స్ ఇండియా 2026లో పలు విమానాలు, హెలికాప్టర్లను ప్రదర్శించనున్నట్లు విమానాల తయారీ దిగ్గజం ఎయిర్బస్ వెల్లడించింది. వీటిలో ఏ321నియో, ఏ220 విమానాలు, హెచ్160 హెలికాప్టర్ మొదలైనవి ఉంటాయని తెలిపింది. అలాగే, పైలట్లకు శిక్షణనిచ్చేందుకు ఉపయోగించే హెచ్125 వర్చువల్ రియాలిటీ సిమ్యులేటర్ని కూడా ప్రదర్శనలో ఉంటుందని ఎయిర్బస్ వివరించింది. ఈ సందర్భంగా మీట్ అండ్ గ్రీట్ పేరిట రిక్రూట్మెంట్ డ్రైవ్ కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపింది. బిగ్ డేటా, ఐవోటీ తదితర నైపుణ్యాలున్న అభ్యర్థులను డిజిటల్, ఇంజినీరింగ్ విభాగాల్లో రిక్రూట్ చేసుకోనున్నట్లు పేర్కొంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్లో ..

- డెట్ ఫండ్స్కు ఇండెక్సేషన్ ప్రయోజనం ఇవ్వాలి
- మౌలిక రంగాల్లో మెరుగైన పనితీరు

అర్బన్ క్రూజర్ ఎబెల్లా

భారత్లో టయోటా తొలి ఎలక్ట్రిక్ కారుకు బుకింగ్స్ ప్రారంభం

ముంబై: ఆటోమొబైల్ దిగ్గజం టయోటా కిర్లోస్కర్ మోటర్స్ భారత్లో తమ తొలి బ్యాటరీ ఎలక్ట్రిక్ మోడల్ (బీఈవీ) అర్బన్ క్రూజర్ ఎబెల్లాను ఆవిష్కరించింది. దీనికి బుకింగ్స్ ప్రారంభించినట్లు సంస్థ డిప్యూటీ ఎండీ తడాషీ అసజుమా తెలిపారు. సుజుకీ, టయోటాకి అంతర్జాతీయంగా భాగస్వామ్య ఒప్పందం ఉన్నందున సుజుకీ మోటర్ గుజరాత్ ఈ వాహనాన్ని సరఫరా చేస్తుందని చెప్పారు. ఇది 49 కిలోవాట్హవర్, 61 కిలోవాట్హవర్ బ్యాటరీ ఆప్షన్లతో లభిస్తుంది. ఒక్కసారి చార్జి చేస్తే 543 కి.మీ. వరకు రేంజి ఉంటుంది. ఎబెల్లాను యూరప్కి కూడా ఎగుమతి చేయనున్నట్లు తడాషీ వివరించారు. చార్జింగ్ నెట్వర్క్ను విస్తరించేందుకు జియో–బీపీలతో చేతులు కలిపినట్లు, క్రమంగా ఇతర సంస్థలతోనూ ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు చెప్పారు. టయోటా ప్రస్తుతం భారత్లో హైబ్రిడ్, డీజిల్, పెట్రోల్ కార్లను విక్రయిస్తోంది.

ఐపీవోకు ఫోన్పే రెడీ

సెబీ నుంచి తొలి అనుమతి ● త్వరలో అప్డేటెడ్ ప్రాస్పెక్టస్

న్యూఢిల్లీ: దేశీ డిజిటల్ పేమెంట్స్ దిగ్గజం ఫోన్పే త్వరలో పబ్లిక్ ఇష్యూ చేపట్టనుంది. ఇందుకు అనుగుణంగా సెబీకి నవీకరించిన మలి ప్రాస్పెక్టస్ దాఖలు చేయనుంది. 2025 సెప్టెంబర్లోనే గోప్యతా విధాన సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేయగా.. తాజాగా అనుమతి లభించినట్లు తెలుస్తోంది. కాగా.. ఐపీవోలో భాగంగా కంపెనీలో ప్రస్తుత వాటాదారులు రూ. 12,000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఆఫర్ చేయనున్నట్లు తెలుస్తోంది. తద్వారా కంపెనీ 15 బిలియన్ డాలర్ల విలువను ఆశిస్తున్నట్లు సమాచారం.

పెట్టుబడులకు ఏపీని మించిన గమ్యస్థానం మరొకటి లేదు

- దావోస్లో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఏపీని మించిన అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానం మరొకటి లేదని, పారిశ్రామికవేత్తలకు రాష్ట్రం అతి పెద్ద మార్కెట్ అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా రెండో రోజైన మంగళవారం 'ది ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్' అంశంపై సీఐఐ బ్రేక్ ఫాస్ట్ సెషన్లో ఆయన మాట్లాడుతూ.. ఏపీకి వచ్చి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలు, పెట్టుబడులకు ఉన్న సానుకూల పరిస్థితుల్ని స్వయంగా పరిశీలించాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. దావోస్లో ప్రపంచ పారిశ్రామికవేత్తల ఆలోచనలు అర్థం చేసుకుని రాష్ట్రాన్ని బిజినెస్ ఫ్రెండ్లీ స్టేట్గా మారుస్తున్నామని చంద్రబాబు చెప్పారు. సెషన్లో భాగంగా సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, మాస్టర్ కార్డ్ సీఈఓ, కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ సహా విదేశీ కంపెనీల ప్రతినిధులతో చంద్రబాబు మాట్లాడారు. అనంతరం దావోస్లో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండియా లాంజ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం పలువురు పారిశ్రామిక వేత్తలతో భేటీ అయ్యారు. కాగా.. దావోస్లో ఆర్ఎంజెడ్ చైర్మన్ మనోజ్ మెండాతో మంత్రి లోకేశ్ చర్చలు జరిపారు. రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో లక్ష ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆర్ఎంజెడ్ సంస్థ ముందుకు వచ్చిందని ఆయన తెలిపారు. విశాఖలో కాపులుప్పాడ ఫేజ్–1 ఐటీ పార్క్లో సుమారు 50 ఎకరాలలో జీసీసీ పార్క్ను అభివృద్ధి చేయడానికి ఆర్ఎంజెడ్ గ్రూప్ అంగీకరించిందన్నారు.

ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఆంక్షలు ఎత్తివేయాలి

సాక్షి,అమరావతి: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్లకు కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రభుత్వం విధించిన ఆంక్షల్ని ఎత్తివేయాలని కోరుతూ సర్పంచుల సంఘాల ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్కు వినతి పత్రం అందజేశారు. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీ విడుదల చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు ,అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ పూడ్చివేతకు కమిటీ

సీడబ్ల్యూసీ సీఈ వివేక్ త్రిపాఠి అధ్యక్షతన సాంకేతిక నిపుణుల బృందం ఏర్పాటు



సాక్షి, అమరావతి: శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ను పూడ్చివేసి, అప్రాన్ను యథాస్థితికి తెచ్చే పనులు చేపట్టేందుకు కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) సాంకేతిక నిపుణుల బృందం(టీఈజీ) ఏర్పాటు చేసింది. సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజినీర్(డిజైన్స్) వివేక్ త్రిపాఠి అధ్యక్షతన సీడబ్ల్యూసీ డైరెక్టర్లు సోమేష్కుమార్, సమర్థ్ అగర్వాల్, డిప్యూటీ డైరెక్టర్లు అరుణ్ ప్రతాప్సింగ్, మధుకర్ గోయల్, సీఎస్ఎంఆర్ఎస్(సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్) శాస్త్రవేత్త మనీష్ గుప్తా, సీడబ్ల్యూపీఆర్ఎస్(సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్) శాస్త్రవేత్త ఎంకే వర్మ, జీఎస్ఐ(జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) డైరెక్టర్ శైలేంద్ర సింగ్ సభ్యులుగా సాంకేతిక నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేసింది. ఈ బృందంలో సభ్యుడిగా చేర్చేందుకు ఇంజినీర్–ఇన్–చీఫ్, సీఈ స్థాయికి తక్కువ కాకుండా ఒక అధికారిని ప్రతిపాదించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. కృష్ణా బోర్డు నుంచి డైరెక్టర్ స్థాయికి తక్కువ కాకుండా ఒక అధికారిని ఈ బృందంలో సభ్యుడిగా చేర్చేందుకు ప్రతిపాదించాలని పేర్కొంది. ఈ నిపుణుల బృందానికి సీడబ్ల్యూసీ డైరెక్టర్ సమర్థ్ అగర్వాల్ సభ్య కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. కృష్ణా నదికి వచ్చే భారీ వరదల ఉధృతి ప్రభావం వల్ల శ్రీశైలం ప్రాజెక్టు అప్రాన్ కోతకు గురై పెద్ద గొయ్యి(ప్లంజ్ పూల్) ఏర్పడింది. ఇది శ్రీశైలం ప్రాజెక్టు భద్రతకు సవాల్గా మారింది. తక్షణమే ప్లంజ్ పూల్ను పూడ్చి వేసి, అప్రాన్ను యథాస్థితికి తేవాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఆ మేరకు సాంకేతిక నిపుణుల బృందాన్ని సీడబ్ల్యూసీ చైర్మన్ నిరుపమ్ ప్రసాద్ ఏర్పాటు చేశారు. శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలను, డాక్యుమెంట్లను క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చినప్పుడు సాంకేతిక నిపుణుల బృందానికి అందించాలని.. ప్రత్యేకమైన అధ్యయనాలు నిర్వహించడానికి యువ అధికారులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇక సాంకేతిక నిపుణుల బృందం చేసిన సూచనల మేరకు నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని షరతు విధించారు.

ఎన్డీఎస్ఏ చైర్మన్ అసహనం

ప్రాజెక్టు భద్రతపై 2025, మార్చి 6న నిర్వహించిన సమీక్షలో ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్.. మే 31లోగా ప్లంజ్ పూల్, స్పిల్ వేకు మరమ్మతులు చేయాలని ఏపీ జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. 2025 జూలై 28–29న శ్రీశైలం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన తక్షణం చేపట్టాల్సిన మరమ్మతులు చేయకపోవడాన్ని ఆక్షేపించారు. ప్లంజ్ పూల్ను శాశ్వతంగా పూడ్చడానికి.. ప్రాజెక్టుకు శాశ్వతంగా మరమ్మతులు చేయడానికి చేయాల్సిన అధ్యయనాలపై సూచనలు చేశారు. కానీ ప్రభుత్వం ఆ పనులను చేపట్టలేదు.

బ్రాండ్ ఇమేజ్తో కాదు.. బ్యాండ్ మేళంతో వెళ్లినట్టుంది

- చంద్రబాబు, లోకేశ్ పర్యటన తీరుపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆక్షేపణ
- వైఎస్ జగన్ హయాంలో పరిశ్రమలనూ చంద్రబాబు ఖాతాలో వేసుకుంటున్నారు
- ముమ్మాటికీ తండ్రీ, కొడుకులది క్రెడిట్ చోరీయే

సాక్షి, విశాఖపట్నం: 'ప్రపంచ వేదికలపైకి వెళ్లినప్పుడు రాష్ట్రంలో వనరులు, అవకాశాలతో పాటు పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అనుకూలతలు ఏమిటో చెప్పాలి. కానీ సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి లోకేశ్ బృందం పూర్తిగా వారి సొంత డబ్బా కొట్టుకున్నారు. దావోస్లో చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్తో కాకుండా తెలుగుదేశం పార్టీ బ్యాండ్ మేళంతో వెళ్లినట్టు ప్రజలకు కనిపిస్తోంది' అని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఎద్దేవా చేశారు. మంగళవారం విశాఖలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దావోస్లో పెట్టుబడులు కోసం కాకుండా చంద్రబాబు పొలిటికల్ మార్కెటింగ్ చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలకు శంకుస్థాపనలు చేస్తూ.. వాటిని తమ ఖాతాలోకి వేసుకుంటూ తండ్రీ, కొడుకులు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారన్నారు. 'ఇళ్ల నిర్మాణం చేస్తున్నప్పుడు దిష్టి తగలకుండా బొమ్మలు పెడతాం. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ నిర్మాణానికి తానే కారణమని దిష్టిబొమ్మ అనుకున్నట్టు.. నారా వారి దిష్టిబొమ్మ కూడా రాష్ట్రంలో ఏం జరిగినా తనవల్లే అనుకోవటం పరిపాటిగా మారింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ, అనుమతులతో అన్నీ పూర్తిచేసి నిర్మాణ పనులకు జగన్ శంకుస్థాపన చేస్తే.. అది కూడా తానే కట్టానంటూ చంద్రబాబు తన ఖాతాలో వేసుకుంటున్నారు' అని ఎద్దేవా చేశారు.

పాలన చేతగాక అంతర్జాతీయ వేదికలపై విమర్శలా?

'రెండేళ్లలో చంద్రబాబు, లోకేశ్ సాధించిన ఘనత ఏంటి? కనీసం ఒక్కటైనా చెప్పగలరా? ఆరోగ్యశ్రీ లేక రోగులు, రూ.5,600 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ రాక విద్యార్థులు, ఫీజులు కట్టకపోవడంతో హాల్టికెట్లు ఇవ్వని యాజమాన్యాలు.. వీటికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటో కనిపించడం లేదు. మరోవైపు రూ.4,500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు కూడా చెల్లించలేదు. రైతులకు మద్దతు ధరలు లేవు. వారికి కనీసం యూరియా కూడా సమయానికి ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఇంత అధ్వాన్నంగా రాష్ట్రంలో పరిస్థితులు కనిపిస్తుంటే.. మీరు మాత్రం అంతర్జాతీయ వేదికలమీద మీ డప్పు మీరు కొట్టుకుంటూ.. ప్రతిపక్ష వైఎస్సార్సీపీ మీద విమర్శలు చేయడానికి ఆ వేదికలను ఉపయోగించుకోడానికి సిగ్గనిపించడం లేదా?' అని అమర్నాథ్ నిలదీశారు. 'స్విట్జర్లాండ్ జ్యూరిక్లో తెలుగు డయాస్పోరాలో సంక్రాంతి పండుగకు రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించామని చెబుతారా? టీడీపీ పెద్ద రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్ అని చెప్పుకుంటారా? ఇటీవల మహిళల వస్త్రధారణపై కొందరు కామెంట్ చేస్తే దానిమీద దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరిగింది. అలాంటిది సంక్రాంతి పండుగలో ఎప్పుడూ లేనివిధంగా మహిళలను కించపరిచేలా రికార్డింగ్ డ్యాన్స్లు నిర్వహించారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు, అన్ని ప్రాంతాల ప్రజలు కష్టాల్లో ఉన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఎన్ని లక్షల మందికి ఉద్యోగాలిచ్చారో ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు ఆంధ్రజ్యోతిలాంటి సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపులు చేశారు. ఆంధ్రజ్యోతి మీద అంత ప్రేమ ఉంటే హెరిటేజ్ భూములు ఇవ్వండి. ఇప్పటికే విశాఖలో భూములను పప్పు బెల్లాల్లా పంచారు. మా పార్టీ అధికారంలోకి రాగానే భూ కేటాయింపుపై చర్యలు ఉంటాయి' అని అమర్నాథ్ చెప్పారు.

పెట్టుబడులు బూటకం.. దోపిడీ నిజం

- ఏటా చంద్రబాబు చేసే దావోస్ పర్యటనలన్నీ బోగస్
- వైఎస్ జగన్ని తిట్టడానికి అంతదూరం వెళ్లాలా?
- వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్కుమార్రెడ్డి



సాక్షి, అమరావతి: పెట్టుబడుల పేరుతో తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేశ్ చేసుకుంటున్న ప్రచారమంతా బూటకమేనని, కంపెనీల ఏర్పాటు పేరుతో వేలకోట్ల విలువైన భూములను బినామీలకు దోచిపెట్టి ప్రభుత్వ సంపదను దోపిడీ చేస్తున్నది మాత్రమే నిజమని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్కుమార్రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏటా పెట్టుబడుల పేరుతో చంద్రబాబు చేస్తున్న దావోస్ పర్యటనలన్నీ బోగస్ అని, లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయని చెప్పడమే తప్ప వాటిలో కార్యరూపం దాల్చినవాటి వివరాలు చెప్పే ధైర్యం చంద్రబాబు ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు. తమను తాము పొగుడుకోవడానికి, వైఎస్ జగన్ని తిట్టడానికి దావోస్ వెళ్లడం దేనికని మండిపడ్డారు. 'చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో విచిత్ర వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రిగా పెట్టుబడుల పేరుతో దావోస్ పర్యటనలు చేసే తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేశ్ పబ్లిసిటీ పిచ్చికి వందల కోట్ల ప్రజాధనం వృథా అవుతోంది. పెద్ద మొత్తంలో ప్రజాధనం ఖర్చుచేసి తమను తామే పొగుడుకోవడం, వైఎస్ జగన్ని తిట్టడం తప్ప రాష్ట్రానికి తెచ్చిన పెట్టుబడులు మాత్రం శూన్యం. 2014–19 మధ్య జరిగిందే ఇప్పుడు జరుగుతోంది. లక్షలకోట్ల ఒప్పందాలు చేసుకున్నామని ఎల్లో మీడియాలో ఇబ్బడిముబ్బడిగా రాయిస్తారేగానీ, వాటిలో కార్యరూపం దాల్చిన వాటి వివరాలు మాత్రం ఎప్పటికీ చెప్పరు. కానీ వైఎస్సార్సీపీ హయాంలో వైఎస్ జగన్ కృషితో ఏర్పాటైన పరిశ్రమలకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేసి తామే సాధించినట్టుగా క్రెడిట్ చోరీకి పాల్పడుతుంటారు. చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నిత్యం వైఎస్ జగన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. సీఎంగా చంద్రబాబు రూ.23 లక్షల కోట్ల ఎంవోయూలు చేసుకుంటే వాటిలో కార్యరూపం దాల్చినవి 5 శాతం కూడా లేవు. పారిశ్రామిక అభివృద్ధి, కంపెనీల ఏర్పాటు పేరుతో ఊరూపేరులేని కంపెనీలకు విశాఖలో వేలకోట్ల విలువైన భూములను ఎకరం 99 పైసలకే కట్టబెడుతున్నారు. తెలంగాణలో ప్రభుత్వస్థలాన్ని ఓపెన్గా వేలం వేసి ఎకరం రూ.170 కోట్లకు విక్రయిస్తుంటే, చంద్రబాబు మాత్రం పెట్టుబడుల పేరుతో తన బినామీలకు అప్పనంగా కట్టబెట్టేస్తున్నాడు. దీనిపై జర్నలిస్టులు ప్రశ్నిస్తే.. మా ఇష్టం.. నేనిస్తా అని చెబుతున్న లోకేశ్కి అధికార మదం తలకెక్కింది. అంతగా ఇవ్వాలనుకుంటే హెరిటేజ్ ఆస్తులు ఇచ్చుకోవాలి. భూ పంపిణీ రూపంలో ఏడాదిన్నరలోనే చంద్రబాబు వేలకోట్ల అవినీతికి పాల్పడ్డాడు. ఇలాంటి నిరంకుశ నియంత పోకడలతోనే ఫ్రెంచి విప్లవం పుట్టిందనే విషయాన్ని చంద్రబాబు తెలుసుకోవాలి. కూటమి ప్రభుత్వ విధానాలపై తెలుగుదేశం అనుకూల మీడియాలోనే తీవ్రమైన వ్యతిరేక కథనాలు వస్తున్నాయి' అని చెప్పారు.

విదేశీ పర్యటనను రహస్యంగా ఎందుకు ఉంచారు?

'ప్రైవేట్ కార్యక్రమం అంటూనే నారావారిపల్లెలో కుటుంబంతో కలిసి జరుపుకొన్న సంక్రాంతి సంబరాలను టీవీల్లో లైవ్ ఇచ్చుకున్న చంద్రబాబు.. వారం రోజులు తండ్రీకొడుకులు విదేశీ పర్యటనకు వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారు? రాష్ట్రంలో దోచుకుంటున్న అవినీతి సంపదను పెట్టుబడుల రూపంలో దాచుకోవడానికే వారు విదేశాలకు వెళ్లారని ప్రజలంతా అనుకుంటున్నారు. దీనికి చంద్రబాబు, లోకేశ్ సమాధానం చెప్పి తీరాల్సిందే. టీడీపీ అనుకూల మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్లలో సైతం ప్రభుత్వ పెద్దల అవినీతిపై భారీ ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. రాజనీతి అనే టీడీపీ అనుకూల యూట్యూబ్ చానల్లో రాష్ట్రంలో ఉన్న అనేకమంది ఐఏఎస్ అధికారులు ఈ 19 నెలల్లో రూ.300 కోట్ల నుంచి రూ.500 కోట్ల వంతున దోచుకున్నారని తీవ్రమైన ఆరోపణలు చేశారు. నిజాయితీ ఉంటే టీడీపీ మీడియా చేసిన ఆరోపణలకైనా చంద్రబాబు ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాలి' అని పేర్కొన్నారు. చంద్రబాబే దోపిడీకి డోర్లు బార్లా తెరవడంతో ఆయన బాటలోనే కూటమి ఎమ్మెల్యేలు కూడా రెచ్చిపోతున్నారు' అని ఆయన చెప్పారు.

క్లుప్తంగా...

నేటి నుంచి జేఈఈ మెయిన్

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్) తొలి విడత బుధవారం నుంచి దేశవ్యాప్తంగా మొదలవుతుంది. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలు ఈనెల 29 వరకు కొనసాగుతాయి. దేశవ్యాప్తంగా 13.8 లక్షల మంది జేఈఈ మెయిన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు 60 వేలకుపైగానే ఉంటారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అభ్యర్థుల అడ్మిట్ కార్డులు విడుదల చేసింది. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరు.

సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో పొగలు

తుని: విశాఖపట్నం నుంచి గుంటూరు వెళ్తున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో మంగళవారం పొగలు వచ్చాయి. దీంతో కాకినాడ జిల్లా తుని సమీపంలోని హంసవరం రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. రైలు తుని స్టేషన్‌లో బయలుదేరి వెలమ కొత్తూరు రైల్వేగేటు వద్దకు చేరేసరికి స్వల్పంగా పొగలు వస్తున్నట్లు గమనించిన గేట్‌మన్ రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో, రైలును హంసవరం స్టేషన్‌లో గంటన్నర పాటు నిలిపివేశారు. లోకోపైలట్, గార్డు, సిబ్బంది రైలును పరిశీలించారు. బ్రేక్ పట్టేయడంతో పొగలు వచ్చినట్లు గుర్తించారు. మరమ్మతుల అనంతరం రైలు బయలుదేరి వెళ్లింది. రైలులో పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు.

రామచంద్రమూర్తికి గజ్జెలమల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కారం

కడప ఎడ్యుకేషన్: సీనియర్ సంపాదకుడిగా పనిచేసిన కొండుభట్ల రామచంద్రమూర్తికి గజ్జెల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కారం (2024–25) ఇవ్వనున్నట్లు యోగి వేమన వర్సిటీ వీసీ, గజ్జెల మల్లారెడ్డి ట్రస్ట్ అధ్యక్షుడు ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ప్రకటించారు. రామచంద్రమూర్తి తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపే ప్రయత్నం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని, వివిధ పత్రికలలో, ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ఆయన పని చేసి గుర్తింపు పొందారని తెలిపారు. కాగా సీనియర్ జర్నలిస్టులు కె.శ్రీనివాస్ (2022–23), తెలకపల్లి రవి (2023–24)ని కూడా పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు. వీరి ముగ్గురికి ఫిబ్రవరిలో గజ్జెల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కారాలను అందజేస్తామని తెలిపారు. పురస్కారం కింద రూ. 50 వేల నగదుతో పాటు జ్ఞాపిక అందజేస్తామన్నారు.

జననాయకన్ చిత్రంపై వీడని చిక్కుముడి

తమిళ సినిమా: విజయ్ కథానాయకుడిగా నటించిన జననాయకన్ చిత్రం విడుదలపై సస్పెన్స్ కొనసాగుతోంది. జనవరి 9న విడుదల అవ్వాల్సిన ఈ చిత్రం సెన్సార్ సమస్యల కారణంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకి సెన్సార్ ధ్రువపత్రం వస్తుందా, రాదా అనే ఉత్కంఠ నడుమ మంగళవారం చెన్నై హైకోర్టు డివిజన్ బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం శ్రీవాత్సవ, జస్టిస్ అరుళ్ మురుగన్ సమక్షంలో విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తులు ఎలాంటి తీర్పు ఇవ్వకుండా, తదుపరి విచారణ వాయిదా వేశారు. దీంతో చిత్రం విడుదలపై సస్పెన్స్ కొనసాగుతోంది.

మల్లయ్య కొండలపై మైనింగ్ బాబుల కన్ను

- కాంపోజిట్ లైసెన్స్ మంజూరుకు కంపెనీలను ఆహ్వానిస్తూ రహస్యంగా టెండర్లు
- 16న గుట్టుగా ముగిసిన టెండర్ల ప్రక్రియ
- భక్తుల మనోభావాలతో చంద్రబాబు సర్కారు చెలగాటం
- 2006 నుంచి వ్యతిరేకిస్తున్న శివ భక్తులు
- ఇక్కడ మైనింగ్ జరగనివ్వబోనని 2009లో చంద్రబాబు ప్రకటన
- ఇప్పుడు వేల కోట్ల విలువైన ఖనిజంపై కన్ను

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మల్లయ్య కొండ తవ్వేందుకు సిద్ధం..

సాధుకొండపై 3,815 ఎకరాల్లో ఐరన్ ఓర్ దండుకునే వ్యూహం

మల్లయ్యకొండ సముదాయంలోని సాధుకొండలు

మదనపల్లె: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోని ప్రఖ్యాత మల్లయ్య కొండలను ఐరన్ ఓర్ పేరుతో కొల్లగొట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం పక్కా పథకం వేసింది. వేల కోట్ల విలువైన ఇనుప ఖనిజాన్ని దోచుకునేందుకు రహస్యంగా పావులు కదిపింది. ముందుగా కాంపోజిట్ లైసెన్స్‌కు అత్యంత రహస్యంగా టెండర్లు పిలిచింది. ఆ తర్వాత మైనింగ్‌కు అనుమతించాలనేది ప్రభుత్వ వ్యూహమని సమాచారం. ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ చర్యపై శివ భక్తుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. మల్లయ్య కొండల్లో మైనింగ్ జరగనివ్వబోమని గతంలో చెప్పిన చంద్రబాబే ఇప్పుడు మాట తప్పి, ఆ కొండలపై ఉన్న మల్లికార్జున స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ సాధుకొండను తొలిచి అమ్ముకొనేందుకు తన అనుంగులకు కట్టబెట్టే ప్రయత్నాలు సాగిస్తుండటంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఐరన్ ఓర్ దోపిడీకి వ్యూహం

తంబళ్లపల్లె సమీపంలో మల్లయ్య కొండల సమూహంలో సాధుకొండ, ఇనుము కొండ, మల్లయ్య కొండ ఉన్నాయి. ఇవి 6,079 హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. మల్లయ్య కొండపై పురాతన మల్లికార్జున స్వామి ఆలయం ఉంది. నిత్యం అనేక మంది భక్తులు కొలిచే ఈ ఆలయం ఉండటం వల్ల ఈ కొండలపై మైనింగ్ చేయడంలేదు. 1893లోనే బ్రిటిష్ ప్రభుత్వం ఈ కొండల ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించింది. ఈ కొండల్లో 100 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం ఉందని 2006 నుంచి కేంద్ర ప్రభుత్వం చెబుతూ వస్తోంది. మల్లయ్య కొండల్లో మైనింగ్ చేపట్టరాదని ఈ ప్రాంత ప్రజలు గతంలో తీవ్రస్థాయిలో ఉద్యమించారు. గత ప్రభుత్వాలు కూడా భక్తుల మనోభావాలను గౌరవించి ఈ కొండల జోలికి వెళ్లలేదు. దీన్ని లీజు పేరుతో దక్కించుకునేందుకు కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో జియో మైసూర్ సంస్థ పావులు కదిపింది. అప్పట్లో 89 సంస్థలు పోటీ పడినప్పటికీ, జియో మైసూర్ సంస్థకు ఎక్స్‌ప్లరేషన్ లైసెన్స్ మంజూరయింది. దీనిపై భక్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆ సంస్థ మొక్కుబడిగా పరిశీలన జరిపి, ఆ తర్వాతి చర్యలు నిలిపివేసింది. 2009 ఎన్నికల్లో తంబళ్లపల్లి నియోజకవర్గం ప్రచారానికి వచ్చిన చంద్రబాబు మల్లయ్య కొండల్లో మైనింగ్ జరగనివ్వబోమని, భక్తుల మనోభావాలను గౌరవిస్తామని ప్రకటించారు. ఇప్పుడు దీన్ని విస్మరించి కొండలను కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. భక్తుల మనోభావాలను పక్కన పెట్టి వేల కోట్ల రూపాలయ విలువైన ఇనుప ఖనిజాన్ని అనుకూల కంపెనీలకు దోచి పెట్టేందుకు చంద్రబాబు సర్కారు సిద్ధమైంది. అనుకూల సంస్థలకు ముందుగా కంపోజిట్ లైసెన్స్ మంజూరు చేసి..ఆ తర్వాత మైనింగ్ లైసెన్స్ జారీ చేసేలా వ్యూహం పన్నినట్టు అర్థమవుతోంది. దీని కోసం గత ఏడాది నవంబర్ 27న మల్లయ్య కొండల సమూహంలోని సాధుకొండలో 900 హెక్టార్లు, శివపురం పరిధిలోని ఇదే కొండకు చెందిన 626 హెక్టార్లలో (మొత్తం 3,815 ఎకరాలు) ఐరన్ ఓర్ కోసం పరిశోధనలు జరపడం, అంచనాలు వేసుకునేందుకు తొలి విడతలో కాంపోజిట్ లైసెన్స్ పొందేందుకు సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. ఈ బిడ్ల స్వీకరణ జనవరి 16న ముగిసింది. టెండర్ల ఆహ్వానం, బిడ్ల స్వీకరణ మొత్తం అత్యంత గుట్టుగా సాగిపోయింది. బిడ్ల దాఖలు చేసిన సంస్థలు ఏవి అన్న విషయం కూడా రహస్యంగానే ఉంచారు.

భక్తుల మనోభావాలు గౌరవించి సౌకర్యాలు కల్పించిన వైఎస్ జగన్

మల్లయ్య కొండల్లో వేల కోట్ల విలువైన ఇనుప ఖనిజం ఉన్నప్పటికీ, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా భక్తుల మనోభావాలకే గౌరవమిచ్చారు. మైనింగ్ కంపెనీలు వీటిపై దృష్టి పెట్టకుండా చర్యలు చేపట్టారు. అక్కడ ఉన్న మల్లికార్జున స్వామి ఆలయానికి జీర్ణోద్ధరణ పనులు చేశారు. భక్తులకు తాగునీరు, రహదారి సహా అనేక సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం భక్తుల మనోభావాలతో చెలగాటమాడుతూ మైనింగ్‌కు సిద్ధమవుతోంది.

ఏయూలో విద్యార్థుల ఆకలి కేకలు

- ఫీజులు కట్టలేదని విద్యార్థులకు పస్తులు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తే చెల్లిస్తామంటూ వేడుకోలు
- అయినా కనికరించని ఏయూ అధికారులు

తాళం వేసి ఉన్న ఏయూ మెస్

విశాఖ సిటీ/మద్దిలపాలెం: శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం దాదాపు రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వకపోవడంతో... విద్యార్థులు ఫీజులు చెల్లించలేదన్న నెపంతో ఏయూ పాలకులు కర్కశంగా ప్రవర్తిస్తున్నారు. రెండు రోజులుగా హాస్టల్ విద్యార్థులకు భోజనాలు పెట్టకుండా పస్తులు పెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేసిన వెంటనే చెల్లిస్తామని విద్యార్థులు వేడుకున్నప్పటికీ.. ఏయూ అధికారులు కనికరించ లేదు. ఫీజు చెల్లిస్తేనే భోజనాలు పెడతామని తెగేసి చెప్పి మెస్‌లకు తాళాలు వేశారు. దీంతో హాస్టల్స్ విద్యార్థులు మెస్‌ల వద్దకు వచ్చి గంటల తరబడి నిరీక్షించినా తెరవకపోవడంతో ఆకలితోనే వెనక్కు వెళ్లిపోవాల్సి వచ్చింది.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. పాలకుల కర్కశత్వం

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదు. దీంతో విద్యార్థులు హాస్టల్ ఫీజులు కట్టలేకపోతున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి తర్వాత హాస్టళ్లకు వచ్చిన విద్యార్థులకు ఏయూ అధికారులు షాక్ ఇచ్చారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం విద్యార్థులు మెస్‌లకు వెళ్లగా.. వాటికి తాళాలు వేసి ఉన్నాయి. మధ్యాహ్నం, రాత్రి కూడా అలాగే ఉండడంతో వేలాది మంది పస్తులు పడుకోవాల్సి వచ్చింది. మంగళవారం కూడా అదే పరిస్థితి నెలకొంది. కనీసం 50 శాతమైనా ఫీజు కడితేనే భోజనాలు పెడతామని చెప్పి విద్యార్థుల చేతుల్లో అధికారులు స్లిప్పులు పెట్టారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు అప్పులు చేసి రూ.4 వేలు, రూ.5 వేలు చొప్పున చెల్లించారు. వీరికి మాత్రమే మంగళవారం మధ్యాహ్నం భోజనాలు పెట్టారు. ఇంకా 60 శాతం మంది ఫీజులు కట్టకపోవడంతో మెస్‌లోకి కూడా అనుమతించ లేదు. దీంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఫీజులు కట్టలేదని రెండు రోజులుగా విద్యార్థులను పస్తులు వుంచడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే దానికి విద్యార్థులు బలైపోవాలా అని ప్రశ్నించారు. ఇది అత్యంత క్రూరమైన చర్య అని, వెంటనే మెస్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఏయూ రిజిస్ట్రార్ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు.

సాక్షి SAKSHI.COM
సాక్షి టీవీ ప్రసారాలను నిలిపివేయడం..
చట్టరీత్యా నేరం...
సాక్షి టీవీ ప్రసారాలు మీ హక్కు..
ప్రసారాలను అడ్డుకోవడం చట్టవిరుద్ధం...
ప్రజల కోసమే మా పోరాటం ప్రజా గొంతుకై నినదిస్తాం
వార్తల వెనుక వాస్తవాలు తెలియాలంటే
సాక్షి టీవీ చూడండి
సాక్షి టీవీ ప్రసారాల కోసం...
డీటీహెచ్‌లో సాక్షి ప్రసారాల కోసం
1456 2449
airtel 907 SUN 184
ఇంటర్నెట్‌లో సాక్షి ప్రసారాల కోసం
youtube.com/SakshiNews
Jio Fiber xstream
సత్యమేవ జయతే

వధువు కావాలంటూ ఫ్లెక్సీ

తమకు వధువు కావాలంటూ చిత్తూరు జిల్లా ఐరాల మండలంలోని కలికిరిపల్లెలో యువకులు వినూత్న రీతిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వీరంతా సంక్రాంతికి ఆహ్వానం పేరుతో గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో మొదటి వరుసలో పెళ్లికాని యువకుల ఫొటోలు వేసి, ఫొటోలపై స్టార్ గుర్తులు పెట్టారు. కింద "గమనిక: స్టార్ మార్క్ ఉన్న యువకులకు వధువు కావలెను"అని ముద్రించారు. ఇందులో ఉన్న యువకులంతా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే. ఈ ఫ్లెక్సీ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

– కాణిపాకం

టీడీపీ ఎమ్మెల్యేతో స్టేజీపై బైకుల దొంగ

- బైకులు చోరీ చేసి పట్టుబడిన టీడీపీ నేత
- ఎమ్మెల్యే పక్కనే దర్జాగా సీటు

ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో పాటు స్టేజిపై బైకుల దొంగ లద్దగిరి అలీంబాషా (వృత్తాకారంలోని వ్యక్తి)

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఓ బైకుల దొంగ ఏకంగా టీడీపీ ఎమ్మెల్యేతో పాటు స్టేజీని పంచుకున్న ఘటన కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. బెట్టింగ్‌ల కోసం చేసిన అప్పులను తీర్చేందుకు కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన లద్దగిరి అలీంబాషా కర్నూలులో పార్క్ చేసిన 11 బైకులను ఎత్తుకెళ్లి ఈనెల 13న పోలీసులకు పట్టుబడ్డాడు. అదే రోజు అనారోగ్య కారణాలు చూపి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ప్యాలకుర్తికి చెందిన లద్దగిరి అలీంబాషా చాలా ఏళ్లుగా స్థానిక టీడీపీ నేతగా చెలామణి అవుతున్నాడు. మంగళవారం ప్యాలకుర్తి గ్రామంలో జరిగిన కంది కొనుగోళ్లలో కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో పాటు అలీంబాషా స్టేజీపైనే దర్జాగా కూర్చోవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. దొంగతనాలకు పాల్పడే వ్యక్తికి అధికార పార్టీ ఇంతటి దర్జా కల్పిస్తుండటం చూసి ముక్కున వేలేసుకున్నారు.

SKODA
ఎప్పుడూ అద్భుతమైన డ్రైవ్.
ఇప్పుడు ఓనర్‌షిప్ మరింత సులువు.
మా కార్లు ఎప్పుడూ డ్రైవింగ్‌పై ప్రేమతోనే రూపొందించబడ్డాయి.
ఇప్పుడు, 180+ నగరాల్లో విస్తరిస్తున్న మా నెట్‌వర్క్, Škoda సర్టిఫైడ్ సర్వీస్ టీమ్స్,
ఒరిజినల్ పార్ట్స్ అందుబాటు, అలాగే కొత్తగా పరిచయమైన Škoda Super Care భరోసాతో –
you never drive alone.
Introducing SKODA Super Care Across the range
4 Years Standard Warranty* Free Services** Years Roadside Assistance
Scan to know more
Authorised Dealers: Guntur: Mahavir Auto: 90109 70004; Hyderabad: (Kondapur): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Gachibowli): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Hyder Nagar): PPS Motors: 79934 64666; (AS Rao Nagar): PPS Motors Pvt. Ltd.: 79934 64666; (Bachupally): PPS Motors: 96424 33334; (L. B. Nagar): Mody India Cars: 77992 50000 / 95818 24365; (Attapur): Mody India Cars: 98859 15217; (Uppal): Mody India Cars: 77992 50000 / 95818 24365; (Jubilee Hills): Mahavir Auto: 83672 30004; (Somajiguda): Mahavir Auto: 83673 30004; (Bowenpally): Mahavir Auto: 95815 50004; (Sanath Nagar) Mahavir Auto: 96426 40005; Secunderabad: (Bowenpally): Mahavir Auto: 83674 30004; (Brigadier Sayeed Road): Mahavir Auto: 83674 30004; Nizamabad: PPS Motors: 79934 64666 / 79939 69888; Vizag: Mahavir Auto: 83676 30004; Vijayawada: Mahavir Auto: 83675 30004; Tirupati: (Renigunta Road): PPS Motors: 79934 64666; (Thookivakam Village): PPS Motors: 79959 09992; Warangal: Mahavir Auto: 90105 75959; Karimnagar: Mody India Cars: 77992 50000 / 98859 18412; Nellore: Mahavir Auto: 83670 30004; Kurnool: PPS Motors: 79934 64666; Ananthpur: PPS Motors: 79934 64666; Rajmundhry: Mahavir Auto: 79979 60437
Terms and Conditions apply. The Škoda Super Care programme is applicable to all new Škoda vehicles purchased on or after 1st January 2026. *Each Škoda vehicle is covered by warranty for a period of 4 years or 100,000 km, whichever occurs earlier. **The 4 free services scheduled at 1,000 km, 7,500 km, 15,000 km and 30,000 km are limited to free labour charges only; all costs pertaining to parts, consumables and lubricants shall be borne by the customer. Roadside Assistance is subject to Škoda Assist's standard coverage areas and service terms. Please refer to www.skoda-auto.co.in for more information. All disputes are subject to Mumbai court's jurisdiction only.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

బెంగళూరు-బలుర్‌ఘాట్ మధ్య వీక్లీ రైలు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల డిమాండ్ మేరకు రైల్వే శాఖ ఎస్‌ఎంవీటీ బెంగళూరు – బలుర్‌ఘాట్ మధ్య వారాంతపు రైలును ప్రవేశపెట్టింది. ఎస్‌ఎంవీటీ బెంగళూరు – బలుర్‌ఘాట్ (16523) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21 నుంచి ప్రతి బుధవారం ఉదయం 10.15 గంటలకు ఎస్‌ఎంవీటీ బెంగళూరులో బయలుదేరి, అదే రోజు రాత్రి 9.50కి విజయవాడ వచ్చి 10 గంటలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 4.15 గంటలకు బాలుర్‌ఘాట్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (16524) ఈనెల 24 నుంచి ప్రతి శనివారం ఉదయం 5.15 గంటలకు బలుర్‌ఘాట్‌లో బయలుదేరుతుంది. ఆదివారం మధ్యాహ్నం 12.05కి విజయవాడ చేరుకుని, 12.15కి బయలుదేరుతుంది. సోమవారం ఉదయం 3 గంటలకు ఎస్‌ఎంవీటీ బెంగళూరు చేరుకుంటుంది. రెండు మార్గాల్లో ఈ రైలు కృష్ణార్జునపురం, బంగారుపేట్, కుప్పం, జోలార్ పేట్, కాట్పాడి, అరకోణ్ణం, పెరంబూర్, నాయుడుపేట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకా కుళం రోడ్డు, పలాస తదితర స్టేషన్లలో ఆగుతుంది.

రాష్ట్ర అవార్డులకు 20 పాఠశాలల ఎంపిక

సాక్షి, అమరావతి : పాఠశాలల్లో ఆహ్లాదకర, పచ్చని వాతావరణం కల్పించేందుకు 'స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్' పేరిట నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర స్థాయి అవార్డులకు 20 పాఠశాలలు ఎంపికయ్యాయి. జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా సంబంధిత పాఠశాలల హెడ్మాస్టర్లకు సర్టిఫికెట్లు బహూకరిస్తారు. ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీపీ ప్రసాద్ అభినందనలు తెలిపారు.

24న అరసవల్లి స్వామికి పట్టువస్త్రాలు

సాక్షి, అమరావతి: రథసప్తమి సందర్భంగా ఈనెల 24 అర్ధరాత్రి 12.05 గంటలకు (తెల్లవారితే 25) అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివార్లకు ప్రభుత్వం తరఫున మంత్రి అచ్చెన్నాయుడు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి హరిజవహర్‌లాల్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ఎట్టకేలకు కదిలిన సర్కారు

- ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది.కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ అన్ని బాలికలు, కో- ఎడ్యుకేషన్ పాఠశాలల్లో ఈ ఏడాది మార్చి 8వ తేదీ నాటికి నూరు శాతం మరుగుదొడ్లు అందుబాటులోకి తేవాలని ఆదేశించడంతో కదిలింది. వాస్తవానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చింది. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం మిగిలిన పనులు చేపట్టలేదు. మనబడి- మన భవిష్యత్తు కార్యక్రమం కింద సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం రూ.1302 కోట్లు విడుదల చేసింది. దీంతో పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్లను పూర్తి చేయడంతో పాటు లేని పాఠశాలల్లో కొత్తగా నిర్మాణం చేయనున్నారు.

ఐవీఆర్‌ఎస్ కాల్స్‌తో ఉద్యోగుల మనోభావాలకు భంగం

ఏలూరు (మెట్రో): ఐవీఆర్‌ఎస్ కాల్స్‌తో ఉద్యోగుల మనోభావాలకు భంగం కలుగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐవీఆర్‌ఎస్ కాల్స్‌లో వస్తున్న రిపోర్టులు వాస్తవాలు కాదని పేర్కొన్నారు. కొంతమంది అధికారులు ఐవీఆర్‌ఎస్ కాల్స్ పేరుతో ఉద్యోగులకు మెమోలు, షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమయంతో సంబంధం లేకుండా వీఆర్‌ఓలు పనిచేస్తున్నారని, అయినప్పటికీ ఐవీఆర్‌ఎస్ కాల్స్ సంతృప్తి, అసంతృప్తి అని పర్సంటేజ్‌లు ఇస్తూ వారి మనోభావాలను దెబ్బతీసేలా అధికారులు ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.

డీఏ బకాయిలు విడుదల చేయండి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఏపీ మోడల్ స్కూల్ బోధనా సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిల(డీఏ)ను తక్షణమే విడుదల చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల పెండింగ్ డీఏ చెల్లించడానికి ఉత్తర్వులు జారీ చేసినా ఏపీ మోడల్ స్కూల్స్ రెగ్యులర్ బోధనా సిబ్బందికి బకాయిలు మంజూరు చేయలేదని పేర్కొన్నారు.

ఆర్టీసీకి రికార్డు ఆదాయం

సాక్షి, అమరావతి: సంక్రాంతి సెలవుల ముగియడంతో ఆర్టీసీ జనవరి 19న రికార్డుస్థాయిలో రూ.27.68 కోట్ల రాబడి సాధించింది. ఆ ఒక్క రోజే 50లక్షలమందికి పైగా బస్సుల్లో ప్రయాణించారని ఆర్టీసీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

పేద రోగుల సేవలో జింకానా

- గుంటూరు జీజీహెచ్‌కు రూ.100 కోట్ల విరాళం
- గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల దాతృత్వం
- పూర్వ వైద్య విద్యార్థుల విరాళాలతో మాతా శిశు సంరక్షణ కేంద్రం
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే నిర్మాణం ప్రారంభం
- ప్రస్తుతం తుది దశకు చేరుకోవడంతో ఈనెల 30న ప్రారంభానికి సన్నాహాలు
- రూ.20 కోట్లు విరాళం ఇచ్చిన డాక్టర్ ఉమా గవిని
- రూ.10 కోట్లు విరాళం ఇచ్చిన డాక్టర్ పొదిల ప్రసాద్

ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా వైద్య విద్యార్థులంతా ఒక సంఘంగా ఏర్పడి చదువుకున్న మాతృ సంస్థ రుణం తీర్చుకుంటూ సంస్థ అభివృద్ధికి అవిరళ కృషి చేస్తున్నారు. ఆ సంఘం పేరే జింకానా. గుంటూరు వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్లంతా ఉన్నత స్థానాల్లో స్థిరపడి తాము చదువుకున్న కళాశాలను మరిచిపోకుండా అభివృద్ధికి కృషి చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. గుంటూరు వైద్య కళాశాల అల్యూమిని ఆఫ్ నార్త్ అమెరికా (జింకానా) 1981లో ఏర్పడింది. సుమారు 2,500 మంది పూర్వ విద్యార్థులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. వీరంతా ప్రతి ఏడాది గుంటూరు వైద్య కళాశాలకు, గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి అభివృద్ధికి విరాళాలు అందజేస్తున్నారు. – గుంటూరు మెడికల్

ప్రారంభానికి సిద్ధమవుతున్న ఎంసీహెచ్ వార్డు

గుంటూరు జీజీహెచ్‌లో, వైద్య కళాశాలలో ఏళ్ల తరబడి అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు నిధులు వెచ్చిస్తున్న జింకానా తాజాగా జీజీహెచ్‌లో ఎంసీహెచ్ (మాతా శిశు సంరక్షణ కేంద్రం) వార్డు నిర్మాణం కోసం రూ. 100 కోట్లు కేటాయించింది. భవన నిర్మాణం పూర్తవడంతో ఈనెల 30న ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. జింకానా ఆధ్వర్యంలో కళాశాల, ఆసుపత్రికి ప్రతీ ఏడాది నిధులు అందుతున్నా 2004లో కళాశాలలో జింకానా ఆడిటోరియం నిర్మాణంతో పూర్వ విద్యార్థుల సేవలు వెలుగులోకి వచ్చాయి. సుమారు రూ.2.50 కోట్లతో 850 సీటింగ్ సామర్థ్యంతో జింకానా ఆడిటోరియం నిర్మించారు. 2009లో రూ.35 కోట్లతో డాక్టర్ పొదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ, ట్రామా సెంటర్ భవన నిర్మాణం జరుగ్గా అందులో రూ.20 కోట్లు జింఖానా సభ్యులు విరాళంగా అందజేశారు. డాక్టర్ పొదిల ప్రసాద్ ఒక్కరే రూ. 5 కోట్లు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు రావడంతో పొదిల ప్రసాద్ భవన నిర్మాణం జరిగింది. ప్రపంచ స్థాయి మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్స్ నిర్మించడంతో డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే ఆధ్వర్యంలో గుండె మార్పిడి ఆపరేషన్లు చేయడంతో జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.

తాజాగా ఎంసీహెచ్ నిర్మాణం

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మాతా శిశు మరణాలు తగ్గింపే లక్ష్యంగా గుంటూరు జీజీహెచ్‌లో మాతా, శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్ వార్డు) నిర్మించాలని నిర్ణయించాయి. సుమారు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఎంసీహెచ్ నిర్మాణం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభమై చివరి దశకు చేరుకుంది. భవన నిర్మాణం చేపట్టేందుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయేలా గత ప్రభుత్వం చేయూతనివ్వడంతో జింఖానా సభ్యులు రూ. 100 కోట్లు విరాళం ఇచ్చి భవన నిర్మాణం పూర్తి చేశారు. గతంలో జీజీహెచ్‌లో డాక్టర్ పొదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ మిలీనియం బ్లాక్ నిర్మాణం కోసం రూ. 5 కోట్లు విరాళం ఇచ్చిన డాక్టర్ పొదిల ప్రసాద్ ఎంసీహెచ్ వార్డు నిర్మాణం కోసం మరో రూ. 5 కోట్లు విరాళం ఇచ్చారు. అతేకాకుండా డాక్టర్ పొదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌పైన రెండంతస్తులు నిర్మాణం చేసేందుకు రూ. 10 కోట్లు విరాళం అందజేశారు. జింకానా సభ్యుల్లో 200 మంది విరాళాలు అందించారు. వీరిలో అత్యధికంగా డాక్టర్ ఉమ గవిని రూ. 20 కోట్లు అందజేయడంతో ఆమె భర్త డాక్టర్ కానూరి రామచంద్రరావు పేరుతో ఎంసీహెచ్ వార్డు నిర్మాణం చేస్తున్నారు. డాక్టర్ కె.వెంకట్రావు, రమాదేవి వాసిరెడ్డి దంపతులు రూ.4.3 కోట్లు, డాక్టర్ ముప్వా వెంకటేశ్వరరావు, వేదవతి దంపతులు రూ.4కోట్లు, తాతినేని గోపాలరావు రూ.4కోట్లు ఎంసీహెచ్ నిర్మాణం కోసం అందజేశారు.

ఎంసీహెచ్ ప్రత్యేకతలు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కడా లేని విధంగా మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) 600 పడకలతో ఐదంతస్తుల భవనాన్ని నిర్మించారు. అప్పుడే పుట్టిన పసికందులకు, గర్భిణులు, బాలింతలకు కార్పొరేట్ వైద్యసేవలు ఎంసీహెచ్ వార్డులో ఉచితంగా అందనున్నాయి. ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో నిర్మించిన అత్యాధునిక మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్లు తొమ్మిది ఉన్నాయి. 29న జింకానా సభ్యులంతా ఎంసీహెచ్ వార్డులో హాజరు కానున్నారు.

జింకానా దేశానికే ఆదర్శం

గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ అభివృద్ధే ధ్యేయంగా జింకానా పనిచేస్తోంది. విదేశాల్లో ఉన్న పూర్వ వైద్య విద్యార్థులంతా ప్రతిరోజూ తాము చదువుకున్న కళాశాలకు విరాళాలు ఇస్తున్నారు.ప్రతి ఏడాదీ కళాశాల లో అత్యధిక మార్కులు సాధిస్తున్న మెడికోలకు, వైద్యులకు అవార్డులు, పారితోషికాలను అందజేస్తూ వైద్య విద్యను ప్రోత్సహిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు జింకానా పేరుతో మాతృసంస్థ అభివృద్ధికి చేస్తున్న సహాయాన్ని చూసి దేశ వ్యాప్తంగా పలు కళాశాలల వారు ఆదర్శంగా తీసుకుని తమ మాతృసంస్థలను అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు రావడం జింకానా గొప్పతనానికి నిదర్శనమని చెప్పుకోవచ్చు.

– డాక్టర్ యశశ్వి రమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్, గుంటూరు

డాక్టర్ పొదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ మిలీనియం బ్లాక్

జింకానా ఆడిటోరియం

జనాభా గణన-2027కు
గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది

- జనాభా గణన, సూపర్‌వైజర్లుగా నియామకాలు
- రిజిస్ట్రార్ ఆఫ్ జనరల్ గణన కమిషనర్ ఆమోదం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జనాభా గణన-2027కు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని వినియోగించాల్సిందిగా సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.ఎస్.రావత్ జిల్లా కలెక్టర్లను, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లను ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని జనాభా గణనతో పాటు సూపర్‌వైజర్లుగా ఉపయోగించుకునేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రిజిస్ట్రార్ జనరల్-సెన్సస్ కమిషనర్ షరతులకు లోబడి అనుమతించినట్లు ఉత్తర్వుల్లో రావత్ పేర్కొన్నారు. జనాభా గణనలో ఎటువంటి తప్పిదం, నకిలీ లేకుండా అన్ని గృహాల జనాభా పూర్తిగా కవర్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే డేటా నాణ్యతతో నిర్వహించాలని, సేకరించిన డేటాలో గోప్యత పాటించడంలో రాజీపడరాదని స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని జనాభా గణన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా ఉపయోగించేందుకు కలెక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లకు అనుమతించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి ఆదేశాలేమైనా ఇచ్చినా వాటిని పాటించాల్సిందిగా ఆదేశించారు.

'సున్నా వడ్డీ' రాయితీ జమ చేయాలి

- ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని చిన్న, సన్నకారు, కౌలురైతులు తీసుకున్న రూ.లక్ష లోపు పంట రుణాలకు సంబంధించి సున్నా వడ్డీ రాయితీని చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. కాటమయ్య, పి. జమలయ్య డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక్క పైసా కూడా వడ్డీ రాయితీ కింద రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ధ్వజమెత్తారు. కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్సీ) ఉన్న వారికి సైతం అరకొరగా రుణాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రుణాలపై బ్యాంకులు 9 శాతం వడ్డీ వసూలు చేస్తాయని,కేంద్ర ప్రభుత్వ రాయితీలు పోగా మిగిలిన 4శాతం వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందన్నారు.నిబంధనల ప్రకారం ఏడాదిలోగా రుణం తిరిగి చెల్లించిన రైతులకు ఈ 4శాతం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తేనే 'సున్నా వడ్డీ' అమలవుతున్నట్టని చెప్పారు. 2024-25 ఖరీఫ్ సీజన్ నుంచి పెండింగ్‌లో ఉన్న వడ్డీ రాయితీని తక్షణమే విడుదల చేయాలని మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

నూతన ఆర్టీఐ కమిషనర్ల ప్రమాణ స్వీకారం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్‌కు నూతనంగా నియమితులైన చీఫ్ కమిషనర్, నలుగురు కమిషనర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం సచివాలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నూతన కమిషనర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావుతో ముందుగా ప్రమాణం చేయించారు. తరువాత కమిషనర్లు పరవాడ సింహాచలంనాయుడు, వంటేరు రవిబాబు, ఆదెన్న గాజుల, శరత్ చంద్ర కళ్యాణ చక్రవర్తి వట్టికూటిచే సమాచార కమిషనర్లుగా ప్రమాణం చేయించారు. నూతన కమిషనర్లకు సీఎస్ పుష్పగుచ్ఛాలు అందించి ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలల్లో నీటి సదుపాయం కల్పించండి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లతో పాటు పూర్తిస్థాయిలో నీటి సదుపాయం కల్పించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వానికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నా నీటి వసతి లేకపోవడంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని ఆయన తెలిపారు.

బాలాజీ నాయక్ పదవీకాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీ ఆయిల్‌ఫెడ్) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాలాజీ నాయక్ పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యాన శాఖ అదనపు డైరెక్టర్‌గా పనిచేస్తున్న బాలాజీ నాయక్‌ను గతేడాది జనవరి 23న ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ అండ్ ఎండీగా ఏడాది కాల పరిమితితో నియమించారు. ఈనెల 23వ తేదీతో ఆయన పదవీ కాలం ముగియనుండడంతో మరో ఏడాది పాటు కొనసాగేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

విజయవాడలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ విగ్రహం ఏర్పాటు

సాక్షి, అమరావతి: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం సమీపంలోని వాటర్ ట్యాంకు వద్ద బీజేపీ మూల సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ విగ్రహాన్ని బీజేపీ ఏర్పాటు చేయనుంది. ఈ నెల 23, 24న జరగనున్న ఏకాత్మ మానవతావాద జాతీయ సదస్సు సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. కాగా, విగ్రహ ఏర్పాటుకు మంగళవారం పార్టీ నేతలు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ ప్రోగ్రామ్ అండ్ ప్రోటోకాల్ ఇన్‌చార్జ్ పాతూరి నాగభూషణం, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోపీ శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో తనిఖీలకు జాయింట్ యాక్షన్ కమిటీలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ హాస్టళ్లలో తనిఖీల కోసం 9 శాఖల అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ వీరపాండియన్ మంగళవారం తెలిపారు. కమిటీల ఏర్పాటుపై అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. అంటు వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర టాస్క్ ఫోర్స్ చేసిన సిఫార్సులను జిల్లాలకు పంపినట్లు పేర్కొన్నారు. కమిటీలు క్రమం తప్పకుండా విద్యా సంస్థలు, హాస్టల్స్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు వైద్య సేవలు, హాస్టళ్లలో, విద్యా సంస్థల్లో పరిసరాలు, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారం, వంటి ఇతర అంశాలను అధికారులు గమనించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు వంట గదుల్లో పరిస్థితులు, ఆహారం, నీటి నమూనాలను పరీక్షించాలని ఆదేశించారు.

పూల సేద్యంతో మంచి ఆదాయం

"గిరిజనుల నుంచి భూమిని లీజుకు తీసుకుని గడిచిన మూడేళ్లుగా పూల సాగు చేస్తున్నాం. పర్యాటక ప్రాంతంలో చేపడుతున్న పూల సాగుతో మంచి లాభాలు వస్తున్నాయి.ఈ ఏడాది పర్యాటకుల సంఖ్య కూడా పెరగడంతో పూలకు గిరాకీ పెరిగింది.ప్రస్తుతం కిలో పూలను రూ. 2వందల వరకూ విక్రయిస్తున్నాం.సీజన్‌లో రూ. 3వందల వరకూ వచ్చే అవకాశం ఉంది." – కసిరెడ్డి కృష్ణ, కౌలు రైతు నర్సీపట్నం.

ఆంధ్రాకశ్మీరులో
లాభాల పూదోట

- బంతి,చామంతితో పాటు స్వదేశీ,విదేశీ రకాల పూలసాగు
- లాభాలు ఆర్జిస్తున్న రైతులు
- పర్యాటకులను ఆకర్షిస్తున్న విరుల సోయగాలు
- సందర్శకుల నుంచి ప్రవేశ రుసుం వసూలు

దేశంలోనే అరుదుగా కనిపించే మొక్కలు ఆంధ్రా కశ్మీరులో విరబూస్తున్నాయి. కన్నులు మిరుమిట్లు గొలిపే రంగురంగుల విరులు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. పూల సాగు పర్యాటకులను ఆకర్షించడమే కాకుండా రైతులకు లాభాల సిరులు కురిపిస్తోంది.

పలు రకాలు అంతూరియా పూల అందాలు

ఆంధ్రా స్ట్రాబెర్రీ తోటలో సాగు చేస్తున్న రెండు రకాల బంతి పూలు

చింతపల్లి: ఆంధ్రా కశ్మీరు పర్యాటక ప్రాంతంలో పలు రకాల పూల సాగు పర్యాటకులను కనువిందు చేయడంతో పాటు రైతన్నలకు లాభాల సిరులు కురిపిస్తోంది. మూడేళ్లుగా అల్లూరి జిల్లా లంబసింగి పర్యాటక ప్రాంతంలో ఆంధ్రా స్ట్రాబెర్రీ పేరిట స్ట్రాబెర్రీ తోటలతో పాటు పలు రకాలు పూల మొక్కలను కూడా సాగు చేస్తున్నారు. మైదాన ప్రాంతానికి చెందిన యువ కౌలు రైతులు ఎస్.సత్యనారాయణ, కసిరెడ్డి కృష్ణ గిరిజనులకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని పూల మొక్కలు పెంచుతూ లాభాలు పొందుతున్నారు. ప్రస్తుతం పర్యాటక సీజన్ కావడంతో పూలకు గిరాకీ పెరిగింది.

లంబసింగిలో చేపడుతున్న పూల సాగు

ఆంధ్రా స్ట్రాబెర్రీగా లంబసింగిలో పేరుగాంచిన ఈ తోటలో స్ట్రాబెర్రీతో పాటు రెండు ఎకరాల్లో పలు రకాల పూల మొక్కలను సాగు చేస్తున్నారు. రాష్ట్రంలో లభించే పూల మొక్కలతో పాటు దేశవిదేశాలకు చెందిన అరుదైన మొక్కలను సాగుచేస్తూ మంచి లాభాలను ఆర్జిస్తున్నారు. బంతి రెండు రకాలు, చామంతి 9 రకాలు, దాలియా 6 రకాలతో పాటు విదేశీ జాతికి చెందిన జరిబిరా 7 రకాలు, అంతూలియా 6 రకాలలో వివిధ రంగులతో కూడిన మొక్కలను సాగు చేస్తున్నారు. ఈ పూల మొక్కలను పూణే, మదనపల్లి, కడియం తదితర ప్రాంతాల నుంచి తీసుకువచ్చారు. జరిబిరా మొక్కలను రూ.30, చామంతి రూ.25, మిగిలిన మొక్కలను రూ.10 చొప్పున కొనుగోలు చేసి తీసుకువచ్చి షెడ్లు ఏర్పాటు చేసి బిందు సేద్యం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పూలను కిలో రూ.150 నుంచి రూ. 2వందల వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. సీజన్‌ను బట్టి ఈ పూల వ్యాపారం కొనసాగుతుంది. పండగలు, పెళ్లిళ్లు, వేడుకల సమయాల్లో కిలో రూ.మూడు వందల వరకూ ధర లభిస్తోంది. ప్రస్తుతం సాగులో ఉన్న జరబిరా, చామంతి పూలు కొన్ని రోజుల పాటు వాడి పోకుండా ఉండే గుణాలున్న పూలని రైతులు తెలిపారు.

తోటలో సందడి చేస్తున్న పర్యాటకులు

పర్యాటకులకు అనుమతి

లంబసింగి పర్యాటక ప్రాంతం కావడంతో ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల నుంచి రుసుం వసూలు చేసి పూలతోటను సందర్శించేందుకు అనుమతి ఇస్తున్నారు.తోటల సందర్శనకు స్థానికుల నుంచి రూ.20, పర్యాటకుల నుంచి రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇది వివిధ వర్ణాల పుష్పాలతో శోభిల్లుతూ చూపరులను మైమరపింపచేస్తుండడంతో ఈ పూల తోటలో వీడియో షూటింగ్, ఫొటో షూట్‌లతో ఎంజాయ్ చేస్తున్నారు. పూల అమ్మకం ద్వారానే కాకుండా పర్యాటకుల సందర్శనతో కూడా వీరికి అదనంగా ఆదాయం లభిస్తోంది. ఈ ఏడాది పర్యాటకులు రాక అధికంగా ఉండడంతో మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. వీరు ఈ తోటల్లో పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

సాక్షి సినిమా

ఓ వైపు నూతన సంవత్సరం జోరు. మరోవైపు చిత్ర పరిశ్రమలో సినిమాల విడుదలకు అతి పెద్ద పండగలా భావించే సంక్రాంతి సందడి... ఈ సంక్రాంతికి విడుదలైన ప్రభాస్ 'ది రాజా సాబ్', చిరంజీవి 'మన శంకర వర ప్రసాద్‌గారు', రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒకరాజు', శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి' వంటి సినిమాలన్నీ ప్రేక్షకులను అలరించాయి. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకెళుతున్నాయి. థియేటర్లలో సంక్రాంతి పండగ సందడి ఇంకా కనిపిస్తోంది. ఈ పండగకి చిన్న విరామం తీసుకున్న మన హీరోలు సంక్రాంతి ముగియగానే 'షూటింగ్ పోదాం చలో చలో' అంటూ సెట్స్‌లో వాలిపోయారు. తమ సినిమాల చిత్రీకరణలతో బిజీ బిజీగా ఉంటున్నారు. కొందరు హీరోలు విదేశాల్లో తమ మూవీ షూటింగ్స్‌లో జాయిన్ కాగా... వెంకటేశ్, మహేశ్ బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్, నాని, విజయ్ దేవర కొండ, సాయిదుర్గా తేజ్ వంటి పలువురు హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో జోరుగా హుషారుగా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆ వివరాలేంటో ఓ లుక్కేద్దాం....

● వెంకటేశ్

బేగంపేటలో...

'సంక్రాంతికి వస్తున్నాం' (2025) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'. తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా పేరు సంపాదించుకున్న త్రివిక్రమ్ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. వెంకటేశ్ కెరీర్‌లో 77వ సినిమాగా తెరకెక్కుతోన్న ఈ మూవీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బేగంపేట చిరాగ్ పోర్ట్‌లో జరుగుతోంది. వెంకటేశ్‌తో పాటు ఇతర ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారట త్రివిక్రమ్. వెంకటేశ్ హీరోగా నటించిన హిట్ మూవీ 'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి' కి త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ మూవీస్ హిట్‌గా నిలిచాయి. ఇప్పుడు వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'. ఫ్యామిలీ హీరోగా వెంకటేశ్‌కి ఉన్న ఇమేజ్, చక్కిలిగింతలు పెట్టే హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల మేళవింపుతో కుటుంబ బంధాలను, విలువలను తెలియజేసే చిత్రాలను తెరకెక్కించడంలో త్రివిక్రమ్ దిట్ట. వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ చిత్రంపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి.

● మహేశ్‌బాబు

గండిపేటలో...

'గుంటూరు కారం' (2024) వంటి హిట్ మూవీ తర్వాత మహేశ్‌బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వారణాసి'. 'ఆర్ఆర్ఆర్' (2022) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో ప్రియాంకా చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కరడుగట్టిన, కమాండింగ్ ప్రతినాయకుడు కుంభ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఆయన లుక్‌కి మంచి స్పందన వచ్చింది. దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని గండిపేటలో జరుగుతోంది. అక్కడ ప్రత్యేకంగా వేసిన వారణాసి సెట్‌లో ఈ మూవీ చిత్రీకరణ జరుపుతున్నారట రాజమౌళి. ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబుతో పాటు ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ సినిమా కోసం మహేశ్‌బాబు పొడవాటి హెయిర్ స్టైల్, గెడ్డంతో ప్రత్యేకంగా మేకోవర్ అయిన సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు, రాజమౌళి కలిసి చేస్తున్న ఎపిక్ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు ఎదురుచూస్తున్నారు. గత నవంబరులో హైదరాబాద్‌లో నిర్వహించిన 'వారణాసి' గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్ సోషల్ మీడియాను షేక్ చేయడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాపై అంచనాలు తారస్థాయికి చేరేలా చేసింది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మూవీని హాలీవుడ్‌కి ఏ మాత్రం తగ్గని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నారట రాజమౌళి. ఈ సినిమాని 2027 వేసవిలో విడుదల చేస్తామని మేకర్స్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే పక్కా డేట్ విషయంలో మాత్రం ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ అప్‌డేట్ కోసం వేచి చూస్తున్న అభిమానులకు త్వరలోనే ఒక తీపి కబురు అందనుందని ఫిల్మ్‌నగర్ టాక్. 'వారణాసి' విడుదల తేదీని ఈ ఏడాది శ్రీరామ నవమి (మార్చి 26న) సందర్భంగా ప్రకటించాలని చిత్ర యూనిట్ భావిస్తోందని తెలుస్తోంది. ఈ సినిమాపై మహేశ్‌బాబు ఎంతో నమ్మకంతో ఉన్నారు. ''వారణాసి' నా కలల ప్రాజెక్ట్. జీవితంలో ఒక్కసారి వచ్చే అవకాశం ఇది. దీని కోసం ఎంత కష్టపడాలో అంతా కష్టపడతాను. ఈ సినిమా విడుదలైనప్పుడు దేశమంతా గర్వపడుతుంది'' అంటూ గ్లోబల్ ట్రాటర్ ఈవెంట్‌లో మహేశ్‌బాబు మాట్లాడిన మాటల్ని బట్టి చూస్తే సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందో తెలుస్తోంది.


● మహేశ్‌బాబు

● ఎన్టీఆర్

● వెంకటేశ్

● రామ్‌చరణ్


● నాని


● సాయిదుర్గా తేజ్

● విజయ్ దేవరకొండ

షూటింగ్ పోదాం చలో చలో...

● ఎన్టీఆర్

ఆర్ఎఫ్‌సీలో...

'దేవర' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్ 1, కేజీఎఫ్ 2, సలార్' వంటి హిట్ చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న సినిమా ఇది. ఈ మూవీలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా, బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని నిర్మిస్తున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలా ఉంటే... ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్ సమీపంలోని ఆర్ఎఫ్‌సీలో శరవేగంగా జరుగుతోంది. అక్కడి స్టూడియోలో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో ఎన్టీఆర్‌పై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారట ప్రశాంత్ నీల్. ఈ సెట్‌లోనే జరిగిన గత షెడ్యూల్స్‌లో ఓ నైట్ సాంగ్‌ని, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరించారని తెలిసింది. ప్రస్తుత షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌పై కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ జరగనుందని సమాచారం. ఈ షెడ్యూల్ జనవరి ఆఖరు వరకు సాగుతుందట. ఈ చిత్రానికి సంబంధించిన ప్రతిదీ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారుతోంది. మూడువేల మంది జూనియర్ ఆర్టిస్టులతో చిత్రీకరించిన ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్, అలాగే సుమారు 2000 మందితో తెరకెక్కించిన ఓ పాట... సుమారు పదిహేను కోట్ల రూపాయలతో వేసిన ఎన్టీఆర్ ఇంటి సెట్... ఇలా అన్నీ హైలెట్‌గా మారాయి. ఈ చిత్రం ఈ ఏడాది జూన్ 25న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సినిమాకు 'కేజీఎఫ్, సలార్, మార్కో' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

● రామ్‌చరణ్

అజీజ్‌నగర్‌లో...

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియన్ ఫిల్మ్ 'పెద్ది'. తొలి సినిమా 'ఉప్పెన'తో (2021) బ్లాక్‌బస్టర్ అందుకున్న బుచ్చిబాబు సానా ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్‌కి జోడీగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. జగపతిబాబు, శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో సమీపంలోని అజీజ్ నగర్‌లో జరుగుతోంది. రామ్ చరణ్‌తో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట బుచ్చిబాబు. 'రంగస్థలం' (2018) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత 'పెద్ది' చిత్రంలోనూ ఫుల్ మాస్ లుక్‌లో కనిపించనున్నారు రామ్‌చరణ్. ఆట కూలీ అనే కొత్త కాన్సెప్ట్‌ను ఈ సినిమా ద్వారా తెలుగు ఆడియన్స్‌కు పరిచయం చేయబోతున్నారు దర్శకుడు. వింటేజ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ మూవీలో చరణ్ చేస్తున్న క్యారెక్టర్ తన కెరీర్‌లోనే ఇంట్రస్టింగ్ అని టాక్. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ ఏడాది మార్చి 27న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. అందుకు తగ్గట్టే షూటింగ్ శరవేగంగా సాగుతోందని టాక్. అయితే ఓ వైపు షూటింగ్ జరుగుతుండటం, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతుండటంతో అనుకున్న సమయానికి సినిమా ప్రేక్షకుల ముందుకు రాకపోవచ్చనే ప్రచారం ఫిల్మ్‌నగర్‌లో జరుగుతోంది. కానీ ముందుగా ప్రకటించిన మార్చి 27నే 'పెద్ది' విడుదలవుతుందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు రామ్‌చరణ్. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి...' పాట 200 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించినట్లు చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే.

● విజయ్ దేవరకొండ

గండిపేటలో...

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రౌడీ జనార్ధన'. 'రాజావారు రాణిగారు' (2019) సినిమాతో దర్శకుడిగా తన ప్రతిభని నిరూపించుకున్న రవికిరణ్ కోలా ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో కీర్తీ సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. రూరల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఈ మూవీ చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని గండిపేటలో జరుగుతోంది. విజయ్ దేవరకొండ, కీర్తీ సురేష్‌లపై ముఖ్యమైన సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారట రవికిరణ్ కోలా. ''రౌడీ జనార్ధన' కథ 1980 దశకం నేపథ్యంలో సాగుతుంది. ఔట్ అండ్ ఔట్ మాస్ క్యారెక్టర్‌లో విజయ్ కనిపించబోతున్నారు. ఈ మూవీ కోసం విజయ్ తొలిసారిగా ఈస్ట్ గోదావరి యాసలో డైలాగులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఇంత మాస్, బ్లడ్ షెడ్ ఉన్న క్యారెక్టర్‌ని ఆయన చేయలేదు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ ఏడాది డిసెంబరులో 'రౌడీ జనార్ధన' విడుదల కానుంది.

● నాని

ముచ్చింతల్‌లో..

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'దసరా'. కీర్తీ సురేష్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. 2023 మార్చి 30న విడుదలైన ఈ మూవీ ఘన విజయం సాధించింది. 'దసరా' వంటి హిట్ మూవీ తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ మూవీలో మంచు మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో నానితో పాటు చిత్రంలోని ప్రధాన తారాగణం పాల్గొంటోంది. ఈ సన్నివేశాలు ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయట. జనవరి నెలాఖరు వరకు ఈ షెడ్యూల్ కొనసాగే అవకాశముందని తెలిసింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రంలో జడల్ అనే శక్తిమంతమైన పాత్రలో నాని కనిపించనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన స్టిల్‌లో నాని రెండు జడలు వేసుకుని, పక్కా మాస్ లుక్‌లో కనిపించగా అద్భుతమైన స్పందన వచ్చింది. నాని లుక్, స్టోరీ, టేకింగ్... ఇలా ప్రతిదీ వైవిధ్యంగా ఉండేలా తెరకెక్కిస్తున్నారట శ్రీకాంత్ ఓదెల. ఈ సినిమాని తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ఈ ఏడాది మార్చి 26న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ఇప్పటికే ప్రకటించింది. అయితే మార్చి 27న రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదలవుతుండటంతో డేట్స్ క్లాష్ అయ్యే అవకాశం ఉన్నందువల్ల ఈ మూవీ రిలీజ్ ఉండకపోవచ్చనే వార్తలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఈ విషయాలపై చిత్ర నిర్మాత సుధాకర్ చెరుకూరి స్పష్టత ఇచ్చారు. "ది ప్యారడైజ్' చిత్రీకరణ 60 శాతం పూర్తయింది. సినిమాకి సంబంధించిన కీలకమైన సన్నివేశాలన్నింటినీ పూర్తి చేశాం. పాటలు, ఫైట్స్ దాదాపు పూర్తయ్యాయి. అయితే టాకీ పార్ట్ మాత్రమే పూర్తవ్వాల్సి ఉంది. అది కూడా వీలైనంత త్వరలో పూర్తి చేస్తాం. అయితే 'పెద్ది' సినిమాతో పోటీ పడి మా 'ది ప్యారడైజ్'ని విడుదల చేయం. రెండు సినిమాలను ఒకేసారి రిలీజ్ చేయకుండా వేర్వేరు తేదీల్లో రిలీజ్ చేసే ప్లాన్ చేసే ఆలోచన కూడా ఉంది" అని సుధాకర్ చెరుకూరి తెలిపారు. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

● సాయిదుర్గాతేజ్

తుక్కుగూడలో..

'విరూపాక్ష', 'బ్రో' వంటి హిట్ సినిమాల తర్వాత సాయిదుర్గా తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల ఏటిగట్టు). ఈ సినిమా ద్వారా రోహిత్ కేపీ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'హను–మాన్' (2024) చిత్రంతో పాన్ ఇండియన్ హిట్ అందుకున్న కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. ఇదిలా ఉంటే... ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో జరుగుతోంది. అక్కడ ప్రత్యేకంగా వేసిన సెట్‌లో లాంగ్ షెడ్యూల్ జరుపుతున్నారు మేకర్స్. ఈ షెడ్యూల్‌లో సాయిదుర్గా తేజ్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు దర్శకుడు. ఈ మూవీ షూటింగ్ పూర్తి కాకపోవడంతో ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడుతూ వస్తోంది. సాయిదుర్గా తేజ్ పుట్టినరోజు సందర్భంగా 2025 అక్టోబరు 15న 'అసుర ఆగమన' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మూవీ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో తన పాత్ర కోసం సాయిదుర్గా తేజ్ కండలు తిరిగిన దేహంతో, గుబురు గెడ్డంతో ఫుల్‌గా మేకోవర్ అయ్యారు. ఈ మూవీకి బి.అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు.

పైన పేర్కొన్న సినిమాలే కాదు... మరికొన్ని చిన్న, పెద్ద సినిమాలు కూడా హైదరాబాద్‌లో, పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకుంటున్నాయి.

- డేరంగుల జగన్ మోహన్

● తరుణ్, జగ్గి అరోరా, వెంకట్‌సాయి, జేడీ బ్రూక్‌షైర్

ది స్టోరీటెల్లర్ యూనివర్స్ ఫిల్మ్ ఫెస్టివల్

భారతీయ మూలాలు కలిగిన ఫిల్మ్‌మేకర్, నటుడు, నిర్మాత వెంకట్ సాయి గుండా న్యూయార్క్ నగరంలో 'ది స్టోరీటెల్లర్ యూనివర్స్' అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన వెంకట్ సాయి గుండా తన ఫీచర్ ఫిల్మ్ 'ది డిజర్వింగ్'తో అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. ఇప్పుడాయన 'ది స్టోరీటెల్లర్ యూనివర్స్' ఫెస్టివల్ డైరెక్టర్‌గా, స్వతంత్ర సినిమాలకు మద్దతు ఇచ్చేలా ఈ వేదికను ఏర్పాటు చేశారు. న్యూయార్క్‌లో జరిగిన తొలి ఎడిషన్‌కు వివిధ దేశాల నుంచి ఫిల్మ్‌మేకర్లు, కళాకారులు హాజరయ్యారు. వెంకట్ సాయి గుండా మాట్లాడుతూ–''సినిమా చేయడం ఎంత కష్టమో నాకు తెలుసు. ఫిల్మ్‌మేకర్లకు మద్దతు ఇవ్వడం, వారి కథలను ప్రపంచానికి చేర్చడమే నా లక్ష్యం. ఈ ఫెస్టివల్‌కి జగ్గీ అరోరా, జేడీ బ్రూక్‌షైర్, మహేశ్వర పాండియన్ శర్వణన్, తరుణ్ డేగల, తిరుమలేష్ గుండ్రాత్, ప్రత్యూష ఉడత సహకారం అందించారు'' అని తెలిపారు. 'ది స్టోరీటెల్లర్ యూనివర్స్' ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా 'మొహమ్మద్ మహది కతిరాచీ', ఉత్తమ దర్శకుడిగా నాడన్ పైన్స్, ఉత్తమ నటుడిగా తాహా మొహమ్మది, ఉత్తమ నటిగా అంజా బోథే ఎంపికయ్యారు.

డెట్ ఫండ్స్‌కు ఇండెక్సేషన్ ప్రయోజనం

- తిరిగి పునరుద్ధరించాలి
- కొత్త విధానంలోనూ ఈఎల్ఎస్ఎస్‌కు మినహాయింపు
- ఎన్‌పీఎస్ ప్రయోజనాలు ఫండ్స్‌కు వర్తింపజేయాలి
- బడ్జెట్ 2026–27పై యాంఫి సూచనలు

న్యూఢిల్లీ: మరో 10 రోజుల్లో పార్లమెంట్ ముందుకు రానున్న 2026–27 బడ్జెట్‌కు సంబంధించి మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) కీలక సూచనలు చేసింది. డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులపై దీర్ఘకాల మూలధన లాభాలకు (మూడేళ్లు, అంతకు మించిన పెట్టుబడులపై) గతంలో మాదిరి ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని (లాభం నుంచి ద్రవ్యోల్బణం మినహాయింపు) పునరుద్ధరించాలని కోరింది. అలాగే, జాతీయ పింఛను వ్యవస్థ (ఎన్‌పీఎస్) మాదిరి ప్రయోజనాలతో పెన్షన్ ఫండ్స్‌ను ఆఫర్ చేసేందుకు మ్యూచువల్ ఫండ్స్ సంస్థలను అనుమతించాలని కోరింది. ముఖ్యంగా ఈ క్విటీ పెట్టుబడులపై ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 1.25 లక్షలుగా ఉన్న పన్ను రహిత మూలధన లా భాల పరిమితిని రూ.2 లక్షలకు పెంచాలని సూచించింది. అంతేకాదు ప్రస్తుతం ఏడాది మించిన ఈక్విటీ పెట్టుబడులకు దీర్ఘకాల మూలధన లాభాల పన్ను ను అమలు చేస్తుండగా, దీన్ని ఈక్విటీ ఫండ్స్‌కు ఐదేళ్లకు పెంచాలని కోరింది. దీనివల్ల ఇన్వెస్టర్లు దీర్ఘకాలంపాటు పెట్టుబడులను కొనసాగిస్తారని పేర్కొంది

యాంఫి సూచనలు..

- ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) ఫండ్స్‌లో పెట్టుబడులకు కొత్త పన్ను విధానంలోనూ పన్ను ప్రయోజనాన్ని కల్పించాలి.
- ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్) పథకాలను ఈక్విటీ ఆధారిత పథకాలుగా వర్గీకరించాలి.
- ఫ్యూచర్స్, ఆప్షన్లపై మ్యూచువల్ ఫండ్స్ లావాదేవీలకు గతంలో మాదిరి సెక్యూరిటీ లావాదేవీల పన్నును (ఎస్‌టీటీ) రేట్లను వర్తింపజేయాలి. ఎందుకంటే ఆర్బిట్రేజ్ ఫండ్స్, ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ తమ పెట్టుబడులకు హెడ్జింగ్‌గా ఫ్యూచర్స్, ఆప్షన్లను వినియోగిస్తుంటాయి.
- రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)లో కనీసం 65 శాతం ఇన్వెస్ట్ చేసే మ్యూచువల్ ఫండ్స్‌కు ఈక్విటీ పథకాల మాదిరి పన్నును వర్తింపచేయాలి.
- భారత బాండ్ మార్కెట్ విస్తరణకు వీలుగా డెట్ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (డీఎల్ఎస్ఎస్)ను ప్రవేశపెట్టాలి.
- మ్యూచువల్ ఫండ్ – స్వచ్ఛంద పదవీ విరమణ ఖాతాను ప్రవేశపెట్టాలి.
- ఎన్ఆర్ఐలకు సంబంధించి వసూలు చేసే మూలం వద్ద పన్ను (టీడీఎస్)పై సర్‌చార్జీకి ఏకరూప రేటును తీసుకురావాలి.
- మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌ను పంపిణీ చేసే ఆదాయంపై టీడీఎస్ అమలు పరిమితిని పెంచాలి.
- సెక్షన్ 54ఈసీ కింద ఎల్‌టీసీజీ మినహాయింపునకు వీలుగా మ్యూచువల్ ఫండ్ యూనిట్లను దీర్ఘకాల ఆస్తులుగా వర్గీకరించాలి.

బిజినెస్ రీల్

ఎస్‌బీఐ లైఫ్ ప్రచారకర్తలుగా పంత్, జడేజా

'జాలీ–పోలీ' క్యాంపెయిన్‌తో బీమా–బాధ్యతలపై అవగాహన

ముంబై: ప్రముఖ ప్రైవేట్ జీవిత బీమా సంస్థ ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ భారతీయ క్రికెటర్లు రిషభ్ పంత్, రవీంద్ర జడేజాలను ప్రచారకర్తలుగా నియమించుకుంది. ఈ సందర్భంగా జాలీ–పోలీ' పేరుతో ఒక ప్రచార వీడియోను విడుదల చేసింది. ఇందులో పంత్ 'జాలీ' పాత్రలో.., జడేజా 'పోలీ' పాత్రలో నటించారు. కుటుంబాలు తమ పిల్లల కలలకు మద్దతు ఇవ్వాలనే సందేశాన్ని 'జాలీ' పాత్రలో ద్వారా చెబుతున్నందుకు ఆనందంగా ఉందని రిషభ్ పంత్ తెలిపారు. వ్యక్తిగత లక్ష్యాలు, కుటుంబ బాధ్యతలు రెండింటినీ సమతుల్యం చేయడమే నిజమైన ప్రణాళిక. సరైన ఆర్థిక భద్రత ఉంటే కుటుంబ భవిష్యత్తుపై రాజీపడాల్సిన అవసరం ఉండదు. ఈ సందేశాన్ని 'పోలీ' పాత్ర ద్వారా చెప్పడం గర్వంగా ఉందని జడేజా పేర్కొన్నారు. ''కుటుంబ సభ్యులకు జీవిత బీమా ద్వారా ఆర్థిక భద్రతను కల్పిస్తే వారికి తమ కలలను నెరవేర్చుకునే స్వేచ్ఛ లభిస్తుందని అనే సందేశాన్ని సరళంగా, సహజంగా 'జాలీ–పోలీ' ప్రచారం ద్వారా తెలియజేస్తున్నాము' అని ఎస్‌బీఐ లైఫ్ చీఫ్ రవీంద్ర శర్మ తెలిపారు.

ఫ్రెష్‌బస్ స్లీపర్ ఎలక్ట్రిక్ బస్ సర్వీసులు

న్యూఢిల్లీ: దూరప్రయాణాలకు సంబంధించి పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ స్లీపర్ బస్ సేవలను ప్రారంభిస్తున్నట్లు ఫ్రెష్‌బస్ వ్యవస్థాపకుడు సుధాకర్ చిర్రా తెలిపారు. ఎక్స్‌పొనెంట్ ఎనర్జీ సంస్థకి చెందిన ర్యాపిడ్ చార్జింగ్ ప్లాట్‌ఫాం దన్నుతో మొత్తం 250 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు వివరించారు. ఇందుకోసం ఇరు సంస్థలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ముందుగా హైదరాబాద్–బెంగళూరు రూటుతో ప్రారంభించి దశలవారీగా దేశవ్యాప్తంగా సేవలను విస్తరించనున్నట్లు సుధాకర్ చెప్పారు. ప్రతి 300 కి.మీ.కి ఒకసారి 15 నిమిషాల వ్యవధిలోనే తమ ప్లాట్‌ఫాంలలో చార్జింగ్ చేసుకునేందుకు వీలవుతుందని ఎక్స్‌పొనెంట్ ఎనర్జీ వ్యవస్థాపకుడు అరుణ్ వినాయక్ వివరించారు.

గ్రో ప్లాట్‌ఫామ్‌పై కొత్తగా 'గ్రో ప్రైమ్'

న్యూఢిల్లీ: ప్రముఖ ఫిన్‌టెక్, బ్రోకరేజీ సంస్థ గ్రో.. తన ప్లాట్‌ఫామ్‌పై గ్రో ప్రైమ్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించినట్లు ప్రకటించింది. యూజర్లు తమ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను మరింత సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు ఈ సదుపాయం ఉపకరిస్తుందని తెలిపింది. ఈ సేవను ఎంపిక చేసుకోవడం ద్వారా ఇన్వెస్టర్లు.. పోర్ట్‌ఫోలియోలకు సంబంధించి మరింత లోతైన సమాచారాన్ని పొందగలరని, 24/7 చాట్ సహకారంతోపాటు మెరుగైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకునేందుకు కావాల్సిన మార్గదర్శకం లభిస్తుందని వివరించింది. తమ లక్ష్యాలకు అనుకూలమైన మ్యూచువల్ ఫండ్స్ పథకాలను ఎంపిక చేసుకోవడం, రీబ్యాలెన్స్ తదితర విషయాల్లో సహకారం లభిస్తుందని పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

21-1-2026

విశాఖ	500–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	75.00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,443
ఎన్ఎస్ఈ	1,25,154
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,57,674
ఎఫ్ఐఐ	- 2,938
డీఐఐ	+ 3,666

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	60.34	$	59.34
బ్రెంట్	64.89	$	63.94

క్యూ3 ఫలితాలు

షాపర్స్ స్టాప్ లాభం నేలచూపు

రూ. 16 కోట్లకు పరిమితం

ముంబై: ఫ్యాషన్ రిటైల్ రంగ చైన్ షాపర్స్ స్టాప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం వార్షికంగా 69 శాతంపైగా క్షీణించి రూ. 16 కోట్లకు పరిమితమైంది. పండుగల సీజన్ మారిపోవడం, అనూహ్య వినియోగ ట్రెండ్ ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 52 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా 3 శాతం పుంజుకుని రూ. 1,416 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 1,379 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం దాదాపు 6 శాతం పెరిగి రూ. 1,402 కోట్లను దాటాయి. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 3 శాతం వృద్ధితో రూ. 1,440 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 364 వద్ద ముగిసింది.

ఏయూ స్మాల్ బ్యాంక్ లాభం జూమ్

రూ. 668 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 26 శాతం జంప్‌చేసి రూ. 668 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 528 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 16% ఎగసి రూ. 3,065 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 2,641 కోట్ల ఆదాయం సాధించింది. నికర వడ్డీ ఆదాయం 16% మెరుగుపడి రూ. 2,341 కోట్లను తాకగా.. గత క్యూ3లో రూ. 2,023 కోట్ల వడ్డీ ఆదాయం అందుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) యథాతథంగా 2.3 శాతంగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో బ్యాంక్ షేరు బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 1,001 వద్ద ముగిసింది.

పెర్సిస్టెంట్ లాభం అప్

షేరుకి రూ. 22 డివిడెండ్
487 మందికి కొత్తగా ఉపాధి

ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల మధ్యస్థాయి కంపెనీ పెర్సిస్టెంట్ సిస్టమ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం వార్షికంగా 18 శాతం జంప్‌చేసి రూ. 439 కోట్లను అధిగమించింది. కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ. 89 కోట్ల మేర వన్‌టైమ్ కేటాయింపులు చేపట్టినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 373 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 22 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. తాజా సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం సైతం 23 శాతం ఎగసి రూ. 3,778 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 3,062 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే ఈ ఏడాది క్యూ2(జూలై–సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 7 శాతం క్షీణించగా.. ఆదాయం 5 శాతం పైగా పుంజుకుంది. ఈ కాలంలో 67.45 కోట్ల డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకుంది. 487 మంది ఉద్యోగులు కొత్తగా జత కలవడంతో 2025 డిసెంబర్31కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 26,711కు చేరింది. ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్(ఇసాప్)కింద 11,00,000 ఈక్విటీ షేర్ల జారీకి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.5 శాతం నష్టంతో రూ. 6,343 వద్ద ముగిసింది.

పీటీసీ ఫైనాన్షియల్ లాభం డౌన్

రూ. 49 కోట్లకు పరిమితం

ముంబై: విద్యుత్ రంగ ప్రాజెక్టులకు ఆర్థిక సేవలు అందించే పీటీసీ ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో స్టాండెలోన్ నికర లాభం వార్షికంగా 27 శాతం క్షీణించి రూ. 49 కోట్లకు పరిమితమైంది. వడ్డీ ఆదాయం నీరసించడం ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 67 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 158 కోట్ల నుంచి రూ. 125 కోట్లకు తగ్గింది. వడ్డీ ఆదాయం రూ. 157 కోట్ల నుంచి భారీగా క్షీణించి రూ. 110 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 4 శాతం క్షీణించి రూ. 32 వద్ద ముగిసింది.

ఇండియామార్ట్ లాభం హైజంప్

రూ. 188 కోట్లు

ముంబై: బీ2బీ ఈకామర్స్ దిగ్గజం ఇండియామార్ట్ ఇంటర్‌మెష్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 55 శాతం జంప్‌చేసి రూ. 188 కోట్లను అధిగమించింది. ఆదాయం బలపడటం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 121 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 13 శాతం ఎగసి రూ. 402 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 354 కోట్ల టర్నోవర్ అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం 22 శాతం పెరిగి రూ. 275 కోట్లను దాటాయి. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 35 శాతం బలపడింది. రూ. 537 కోట్లను తాకింది. దీనిలో వెబ్, తత్సంబంధిత సర్వీసుల ఆదాయం 34 శాతం ఎగసి రూ. 368 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2.3 శాతం నష్టంతో రూ. 2,144 వద్ద ముగిసింది.

ఐఆర్ఎఫ్‌సీ లాభం గుడ్

రూ. 1,802 కోట్లు

ముంబై: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్ఎఫ్‌సీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 10 శాతం పుంజుకుని రూ. 1,802 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,631 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 6,766 కోట్ల నుంచి రూ. 6,719 కోట్లకు నామమాత్రంగా నీరసించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 5,135 కోట్ల నుంచి రూ. 4,917 కోట్లకు తగ్గాయి. పీఏస్‌యూ కంపెనీ నెట్‌వర్త్ రూ. 47,443 కోట్ల నుంచి రూ. 52,046 కోట్లకు బలపడింది. 2025 డిసెంబర్31కల్లా కంపెనీ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) సరికొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 4.75 లక్షల కోట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 4 శాతం నష్టంతో రూ. 116 వద్ద ముగిసింది.

ఎగువ మధ్యాదాయ దేశంగా భారత్

- 2030 నాటికి చేరుకుంటుంది
- 4,000 డాలర్లకు తలసరి ఆదాయం
- ఎస్‌బీఐ పరిశోధన నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ వచ్చే నాలుగేళ్లలో (2030 నాటికి) ఎగువ మధ్యాదాయ దేశంగా మారుతుందని, చైనా, ఇండోనేషియా సరసన చేరుతుందని ఎస్‌బీఐ పరిశోధన విభాగం అంచనా వేసింది. అలాగే, 2028 కంటే ముందుగానే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని పేర్కొంది. స్థూల తలసరి ఆదాయం ఆధారంగా ఆర్థిక వ్యవస్థలను తక్కువ ఆదాయం, దిగువ మధ్యాదాయం, ఎగువ మధ్యాదాయం, అధిక ఆదాయంగా ప్రపంచ బ్యాంక్ వర్గీకరిస్తుంటుంది. 1990లో 219 దేశాలను ప్రపంచ బ్యాంక్ వర్గీకరించగా, ఇందులో 51 దేశాలు తక్కువ ఆదాయం, 56 దేశాలు దిగువ మధ్యస్థ ఆదాయం, 29 దేశాలను ఎగువ మధ్యాదాయం, 39 దేశాలను ఉన్నతాదాయ విభాగంలో చేర్చింది. 2024 డేటా ప్రకారం.. తక్కువ ఆదాయం విభాగంలో కేవలం 26 దేశాలే మిగిలాయి. 50 దేశాలు దిగువ మధ్యాదాయం, 54 దేశాలు ఎగువ మధ్యాదాయం, 87 దేశాలు అధిక ఆదాయం కిందకు వచ్చాయి. 60 సంవత్సరాల తర్వాత భారత్ 2007లో తక్కువ ఆదాయం నుంచి దిగువ మధ్యాదాయ దేశంగా మారినట్టు.. తలసరి స్థూల ఆదాయం 1962లో 90 డాలర్లుగా ఉంటే, 2007లో 910 డాలర్లకు చేరినట్టు ఎస్‌బీఐ నివేదిక తెలిపింది.

రెండేళ్లలో 5 ట్రిలియన్ డాలర్లకు..

భారత్ స్వాతంత్య్రం వచ్చిన 60 ఏళ్ల తర్వాత ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుందని, తదుపరి 7 ఏళ్లకు (2014లో) 2 ట్రిలియన్ డాలర్లకు, 2021 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు, 2025లో 4 ట్రిలియన్ డాలర్లకు చేరినట్టు ఎస్‌బీఐ నివేదిక వివరించింది. వచ్చే రెండేళ్లలో 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. తొలి వెయ్యి డాలర్ల తలసరి ఆదాయానికి భారత్ 2009లో చేరుకుందని, తదుపరి పదేళ్లలో 2019 నాటికి ఇది 2,000 డాలర్లు పెరిగిందని, అనంతరం ఏడేళ్లకు 3,000 డాలర్లకు విస్తరించినట్టు తెలిపింది. ''వచ్చే నాలుగేళ్లలో 2030 నాటికి 4,000 డాలర్లకు తలసరి ఆదాయం వృద్ధి చెందుతుంది. తద్వారా ఎగువ మధ్యాదాయ దేశంగా చైనా, ఇండోనేషియా సరసన చేరుతుంది. ప్రస్తుతం ఉన్నతాదాయ దేశానికి ఉన్న పరిమితి 13,936 డాలర్ల స్థాయిని భారత్ 2047 నాటికి చేరుకోవాలంటే.. ఇక్కడి నుంచి ఏటా 7.5 శాతం చొప్పున వృద్ధిని సాధించాల్సి ఉంటుంది. గత 23 ఏళ్ల కాలంలో (2001–2024) భారత్ తలసరి స్థూల ఆదాయం ఏటా 8.3 శాతం చొప్పున పెరుగుతూ వచ్చింది. కనుక ఇకపై 7.5 శాతం వృద్ధి సాధ్యమే''అని ఈ నివేదిక వెల్లడించింది. ఒకవేళ 2047 నాటికి ఉన్నతాదాయ దేశానికి పరిమితి 18,000 డాలర్లకు మారుతుందని భావించేట్టు అయితే.. భారత్ ఇక్కడి నుంచి ఏటా 8.9 శాతం చొప్పున వచ్చే 23 ఏళ్ల పాటు వృద్ధిని సాధించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇందుకు గాను భారత్ సంస్కరణల పథాన్ని కొనసాగించాల్సి ఉంటుందని పేర్కొంది.

ఐపీవోకు అడ్వాంటా ఎంటర్‌ప్రైజెస్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: వ్యవసాయ సంబంధ(అగ్రికల్చరల్) సొల్యూషన్ల కంపెనీ అడ్వాంటా ఎంటర్‌ప్రైజెస్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. వీటి ప్రకారం ఐపీవోలో భాగంగా 3.61 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. వీటిని కంపెనీ మాతృ సంస్థ యూపీఎల్‌సహా.. ప్రస్తుత వాటాదారులు మెల్‌వుడ్ హోల్డింగ్స్ 2 పీటీఈ, కియా ఈబీటీ స్కీమ్2 ఆఫర్ చేయనున్నాయి. ప్రస్తుతం అడ్వాంటాలో.. యూపీఎల్ 64 శాతానికిపైగా వాటా కలిగి ఉంది. యూపీఎల్ కార్పొరేషన్‌కు సైతం 14 శాతం వాటా ఉంది. కాగా.. ఐపీవో నిధులు ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులకు చేరనున్నాయి. హైబ్రిడ్ సీడ్స్, పంటల తదుపరి ప్రొడక్టులపై కంపెనీ ప్రధానంగా దృష్టిపెట్టి సాగుతోంది.

మౌలిక రంగాల్లో మెరుగైన పనితీరు

- డిసెంబర్‌లో 3.7 శాతం వృద్ధి
- నాలుగు నెలల గరిష్ట స్థాయి

న్యూఢిల్లీ: కీలకమైన ఎనిమిది మౌలిక రంగాలు డిసెంబర్‌లో రాణించాయి. నాలుగు నెలల గరిష్ట స్థాయిలో 3.7 శాతం వృద్ధి నమోదైంది. ముఖ్యంగా ఎరువులు, సిమెంట్ రంగాలు మెరుగైన పనితీరు చూపించాయి. కాకపోతే 2024 డిసెంబర్ నెలలో ఎనిమిది కీలక మౌలిక రంగాల్లో 5.1 శాతం వృద్ధి రేటు నమోదు కావడం గమనార్హం. దీంతో పోల్చితే గత డిసెంబర్‌లో వృద్ధి క్షీణించింది. గతేడాది నవంబర్‌లో వృద్ధి 2.1 శాతంతో పోల్చితే మెరుగుపడింది. ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తుల్లో ప్రతికూల వృద్ధి (క్షీణత) కనిపించింది. ఎరువుల ఉత్పత్తి 4.1 శాతం పెరిగింది. సిమెంట్ ఉత్పత్తి 13.5 శాతం వృద్ధి చెందింది. బొగ్గు రంగంలో 3.6 శాతం, స్టీల్ ఉత్పత్తి 6.9 శాతం, విద్యుదుత్పత్తి 5.3 శాతం చొప్పున వృద్ధి నమోదైంది. విద్యుదుత్పత్తి 2025 నవంబర్‌లో 1.5 శాతం క్షీణించడంతో పోల్చితే బలంగా పుంజుకున్నట్టు తెలుస్తోంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలల్లో (ఏప్రిల్–డిసెంబర్) కీలక మౌలిక రంగాల్లో 2.6 శాతం వృద్ధి నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వృద్ధి 4.5 శాతంతో పోల్చితే సగం తగ్గింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఎనిమిది మౌలిక రంగాల వాటా 40.27 శాతంగా ఉంటుంది. దీంతో డిసెంబర్ నెలకు సంబంధించి ఐఐపీ వృద్ధి 4.5–5 శాతానికి పరిమితం కావొచ్చని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ అభిప్రాయపడ్డారు. గతేడాది నవంబర్‌లో ఐఐపీ వృద్ధి 6.7 శాతంగా ఉండడం గమనార్హం.

మెండుగా వ్యాపార విశ్వాసం!

ఐదు నెలల గరిష్టానికి చేరిన సూచీ

- డిమాండ్, లాభదాయకతపై ఆశావహం
- జీఎస్‌టీ తగ్గింపుతో పెరిగిన విక్రయాలు
- సీఐఐ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) వ్యాపార విశ్వాస సూచీ ఐదు నెలల గరిష్టానికి ఎగిసింది. 2025–26 క్యూ3లో (2025 అక్టోబర్–డిసెంబర్) 66.5కు చేరింది. డిమాండ్, లాభదాయకత, పెట్టుబడులకు సానుకూల పరిస్థితులపై ఆశావహ ధోరణి నెలకొంది. అన్ని రంగాలకు చెందిన కంపెనీలు, ఎంఎస్ఎంఈలను సర్వే చేసి సీఐఐ వ్యాపార విశ్వాస సూచీ (బీసీఐ) వివరాలను విడుదల చేసింది. 175కు పైగా కంపెనీలు (ప్రభుత్వ, ప్రైవేటు) అభిప్రాయాలు పంచుకున్నాయి. దేశీ డిమాండ్ కీలక చోదకంగా ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. 2025–26 రెండో త్రైమాసికంలో (సెప్టెంబర్ క్వార్టర్) అధిక డిమాండ్‌ను చూసినట్టు సర్వేలో మూడింట రెండొంతుల కంపెనీలు చెప్పాయి. జీఎస్‌టీ శ్లాబుల కుదింపు, పండుగల సందర్భంగా వినియోగం పెరగడం సానుకూలించినట్టు సీఐఐ నివేదిక తెలిపింది. పెట్టుబడులు, నియామకాల ఉద్దేశ్యాలు బలంగా ఉన్నట్టు పేర్కొంది. మార్చిలోపు ఆర్‌బీఐ రెపో రేటును తగ్గిస్తుందని 69 శాతం సంస్థలు అభిప్రాయపడ్డాయి. ఇకమీదటా వృద్ధి నిలకడగా కొనసాగేందుకు వీలుగా బడ్జెట్‌లో సంస్కరణలు కొనసాగుతాయన్న నమ్మకాన్ని సీఐఐ వ్యక్తం చేసింది.

బడ్జెట్‌పై కీలక సూచనలు

ప్రభుత్వం మూలధన వ్యయాలను స్థిరంగా కొనసాగించాలని, రూ.150 లక్షల కోట్లతో నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ 2.0ను ప్రారంభించాలని బడ్జెట్ 2026కు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖకు సీఐఐ సూచించడం గమనార్హం. వ్యూహాత్మక నిధుల మద్దతుతో దేశ పరిశ్రమ పోటీతత్వాన్ని పెంచాలని కోరింది. ఇండియా డెవలప్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ ఫండ్ (ఐడీఎస్ఎఫ్)ను ఏర్పాటు చేయాలని కూడా సూచించింది. రూ.1,000 కోట్లతో అత్యాధునిక అధ్యయనం, పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రూ.1,000 కోట్లతో డిజిటైజేషన్ ఫండ్‌ను నెలకొల్పాలని కోరింది.

వినియోగానికి జీఎస్‌టీ దన్ను

జీఎస్‌టీలో శ్లాబుల సంఖ్యను కుదించడం ఫలితంగా 375కు పైగా ఉత్పత్తులపై రేట్లు దిగిరావడంతో.. తమ అమ్మకాలు 5–20 శాతం మధ్య పెరిగినట్టు సీఐఐ సర్వేలో 56.3 శాతం సంస్థలు తెలిపాయి. సాహసోపేతమైన సంస్కరణలతో ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం స్థిరపడినట్టు పేర్కొంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితుల మధ్య బలమైన పనితీరు చూపించినట్టు తెలిపింది. వ్యాపార విశ్వాసం క్రమంగా పెరుగుతుండడం అన్నది విదేశీ ప్రతికూలతలను పరిశ్రమ అధిగమించగలదని తెలియజేస్తున్నట్టు సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వృద్ధి రేటు మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు.

సినెర్ గెలుపు బోణీ

- రెండో రౌండ్‌లోకి డిఫెండింగ్ చాంపియన్
- తొలి రౌండ్‌లో రెండు సెట్‌లు గెలిచాక గాయంతో వైదొలిగిన ప్రత్యర్థి

మెల్‌బోర్న్: 'హ్యాట్రిక్' టైటిల్‌పై గురి పెట్టిన ప్రపంచ రెండో ర్యాంకర్ యానిక్ సినెర్ ఆ్రస్టేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో శుభారంభం చేశాడు. 2024, 2025లలో విజేతగా నిలిచిన ఈ ఇటలీ స్టార్ ఈసారీ గెలిస్తే జొకోవిచ్ (సెర్బియా), జాక్ క్రాఫోర్డ్ (ఆ్రస్టేలియా), రాయ్ ఎమర్సన్ (ఆ్రస్టేలియా) తర్వాత ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో 'హ్యాట్రిక్' నమోదు చేసిన నాలుగో ప్లేయర్‌గా ఘనత వహిస్తాడు. హుగో గాస్టన్ (ఫ్రాన్స్)తో మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సినెర్ తొలి రెండు సెట్‌లను 6–2, 6–1తో సొంతం చేసుకున్నాడు. మూడో సెట్ మొదలుకావాల్సిన దశలో హుగో గాస్టన్ గాయం కారణంగా మ్యాచ్‌ను కొనసాగించలేనని చైర్ అంపైర్‌కు తెలిపాడు. దాంతో మూడో సెట్ జరగకుండానే సినెర్‌కు విజయం ఖరారైంది. 68 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సినెర్ కేవలం మూడు గేమ్‌లు మాత్రమే కోల్పోయాడు. ఆరు ఏస్‌లు సంధించిన ఈ మాజీ నంబర్‌వన్ 19 విన్నర్స్ కొట్టి, 15 అనవసర తప్పిదాలు చేశాడు. రెండో రౌండ్‌లో జేమ్స్ డక్‌వర్త్ (ఆ్రస్టేలియా)తో సినెర్ తలపడతాడు. మరోవైపు ఐదో సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ), ఎనిమిదో సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా), తొమ్మిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) కూడా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రాఫెల్ కాలిగ్నన్ (బెల్జియం)తో జరిగిన మ్యాచ్‌లో ముసెట్టి తొలి సెట్‌ను 4–6తో చేజార్చుకున్నాడు. అనంతరం 7–6 (7/5), 7–5తో వరుసగా రెండో సెట్‌లు గెలిచి నాలుగో సెట్‌లో 3–2తో ఆధిక్యంలో ఉన్నాడు. ఈ దశలో కాలిగ్నన్ గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. బెన్ షెల్టన్ 6–3, 7–6 (7/2), 7–6 (7/5)తో యుగో హుంబెర్ట్ (ఫ్రాన్స్)పై, ఫ్రిట్జ్ 7–6 (7/5), 5–7, 6–1, 6–3తో వాలెంటిన్ రోయెర్ (ఫ్రాన్స్)లపై గెలిచారు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో 15వ సీడ్ ఖచనోవ్ (రష్యా) 4–6, 6–4, 6–3, 5–7, 6–3తో మిచెల్సన్ (అమెరికా)పై, 16వ సీడ్ మెన్‌సిక్ (చెక్ రిపబ్లిక్) 7–5, 4–6, 2–6, 7–6 (7/1), 6–3తో కరెనో బుస్టా (స్పెయిన్)పై, 31వ సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) 4–6, 6–3, 6–2, 6–2తో షింటారో మొచిజుకీ (జపాన్)పై, 22వ సీడ్ లుసియానో దర్దెరి (ఇటలీ) 7–6 (7/5), 7–5, 7–6 (7/3)తో క్రిస్టియన్ గారిన్ (చిలీ)పై విజయం సాధించారు.

ఒసాకా

మోన్‌ఫిల్స్ ఓటమి

ఈ ఏడాది తర్వాత టెన్నిస్ నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించిన ఫ్రాన్స్ సీనియర్ స్టార్ గేల్ మోన్‌ఫిల్స్ ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. 20వసారి ఆ్రస్టేలియన్ ఓపెన్ బరిలో దిగిన 39 ఏళ్ల మోన్‌ఫిల్స్ 7–6 (7/3), 5–7, 4–6, 5–7తో డేన్ స్వీనీ (ఆ్రస్టేలియా) చేతిలో ఓడిపోయాడు. 3 గంటల 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మోన్‌ఫిల్స్ 14 ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 56 విన్నర్స్ కొట్టిన ఈ ఫ్రాన్స్ స్టార్ ఏకంగా 77 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు.

కీస్, ఒసాకా ముందంజ

మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా), మాజీ విజేత నయోమి ఒసాకా (జపాన్) తొలి రౌండ్ అధిగమించేందుకు శ్రమించారు. తొలి రౌండ్‌లో కీస్ 1 గంట 40 నిమిషాల్లో 7–6 (8/6), 6–1తో ఒలినికోవా (ఉక్రెయిన్)పై, ఒసాకా 2 గంటల 22 నిమిషాల్లో 6–3, 3–6, 6–4తో అంటోనియా రుజిక్ (క్రొయేషియా)పై విజయం సాధించారు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) 6–4, 6–3తో కాయా యువాన్ (స్లొవేనియా)పై, పదో సీడ్ బెలిండా బెన్‌సిచ్ (స్విట్జర్లాండ్) 6–0, 7–5తో కేటీ బూల్టర్ (బ్రిటన్)పై గెలుపొందారు.

శభాష్ నిశేష్...

అమెరికాకు చెందిన తెలుగు సంతతి క్రీడాకారుడు నిశేష్ బసవరెడ్డి తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. గత ఏడాది 'వైల్డ్ కార్డు'తో ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో బరిలోకి దిగిన నిశేష్ తొలి రౌండ్‌లో సెర్బియా దిగ్గజం జొకోవిచ్‌తో తలపడ్డాడు. జొకోవిచ్‌పై తొలి సెట్ గెలిచి, ఆ తర్వాత మూడు సెట్‌లు చేజార్చుకొని ఓడిపోయాడు. ఈసారి క్వాలిఫయర్ హోదాలో నిశేష్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. తొలి రౌండ్‌లో నిశేష్ 4–6, 7–6 (9/7), 6–7 (3/7), 6–2, 6–3తో క్రిస్టోఫర్ ఒకానెల్ (ఆ్రస్టేలియా)పై గెలుపొందాడు. 4 గంటల 8 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిశేష్ 17 ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 71 విన్నర్స్ కొట్టిన అతను 50 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్ వద్దకు 58 సార్లు దూసుకొచ్చి 38 సార్లు పాయింట్లు గెలిచాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. 20 ఏళ్ల నిశేష్ అమెరికాలోని కాలిఫోర్నియాలో పుట్టి పెరగ్గా... అతని తల్లిదండ్రులు మురళీకృష్ణ బసవరెడ్డి, ప్రసన్న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన వారు. 1999లో నిశేష్ తల్లిదండ్రులు అమెరికాకు వచ్చి స్థిరపడ్డారు.

నిక్కీ జోడీ అవుట్

పురుషుల డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారుడు నిక్కీ కలియంం పునాచాకు నిరాశ ఎదురైంది. ఆ్రస్టేలియన్ ఓపెన్ వైల్డ్ కార్డు టోర్నీలో విజేతగా నిలిచి నిక్కీ పునాచా (భారత్)–ప్రుచాయ ఇసారో (థాయ్‌లాండ్) జోడీ ఈ టోర్నీకి అర్హత పొందింది. తొలి రౌండ్‌లో నిక్కీ–ఇసారో ద్వయం 6–7 (3/7), 5–7తో పెడ్రో మార్టినెజ్–జామీ మునార్ (స్పెయిన్) జంట చేతిలో ఓడిపోయింది. తొలి రౌండ్‌లో ఓడిన నిక్కీ–ఇసారోలకు 44 వేల ఆ్రస్టేలియన్ డాలర్లు (రూ. 27 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించింది.

'పోల్ వాల్ట్' అథ్లెట్లకు అవమానం

క్రీడా సామగ్రితో ప్రయాణించినందుకు జరిమానా విధించిన రైల్వే శాఖ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించడంతో పాటు... పోల్‌వాల్ట్‌లో జాతీయ రికార్డు నెలకొల్పిన అథ్లెట్‌కు రైల్వే స్టేషన్‌లో అవమానం జరిగింది. టోర్నమెంట్‌లో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో క్రీడా సామగ్రితో కలిసి రైలులో ప్రయాణించినందుకు గానూ జరిమానా కట్టాల్సి వచ్చింది. ఈ సంఘటన మహారాష్ట్రలోని పన్వేల్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకోగా... సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రైల్వే శాఖ స్పందించింది. అసలేం జరిగిందంటే... మంగళూరు వేదికగా జరిగిన ఆలిండియా యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌లో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో జాతీయ రికార్డు హోల్డర్ దేవ్ కుమార్ మీనాతో పాటు అతడి కోచ్ ఘన్‌శ్యామ్‌కు రైల్వే స్టేషన్‌లో వింత సమస్య ఎదురైంది. మంగళూరు నుంచి వస్తున్న సమయంలో ప్లేయర్లంతా తమ 'పోల్'లను ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రైలులోని ఫ్యాన్‌ల పైభాగంలో ఉంచారు. అయితే ఇది గమనించిన ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ)... 'పోల్'లను ఇలా తీసుకెళ్లడం నిబంధనలకు విరుద్ధమని వారిని రైలు నుంచి దింపాడు. రూ. 8 వేల జరిమానా కట్టాల్సిందేనని... లేకుంటే పోల్స్ తిరిగి ఇవ్వడం జరగదని హెచ్చరించాడు. అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొన్నట్లు వెల్లడించినా... రైల్వే అధికారులు వినలేదు. సుమారు ఐదు గంటల పాటు అథ్లెట్లను మానసిక వేదనకు గురిచేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

'మేము మంగళూరు నుంచి వస్తున్నాం. పన్వేల్ నుంచి భోపాల్ వెళ్లాల్సి ఉంది. ఆ సమయంలో రైల్వే సిబ్బంది మా క్రీడా సామగ్రిని తొలగించాలని చెప్పారు. అవి పోల్ వాల్ట్స్ అని... మేము టోర్నమెంట్‌లో పాల్గొని వస్తున్నామని వారికి చెప్పాం. అయితే క్రీడా సామాగ్రిని లగేజీ కంపార్ట్‌మెంట్‌లో వేయాలని... ఇలా ప్రయాణికులతో పాటు వాటిని ఉంచకూడదని చెప్పారు. పోల్‌వాల్ట్ కోసం వినియోగించే పోల్స్ ఫైబర్‌తో తయారవుతాయి. వాటి ధర కూడా ఎక్కువే. లగేజీలో వేస్తే విరిగిపోయే ప్రమాదం ఉంది. అందుకే గతంలోనూ వాటిని మాతో పాటే తీసుకొని ప్రయాణించాం. ఎంత చెప్పినా అధికారులు అర్థం చేసుకోలేదు. పెద్ద ఎత్తున జరిమానా కట్టాలని ఒత్తిడి చేశారు. చివరకు దాదాపు 2 వేల రూపాయల జరిమానా అనంతరం మమ్మల్ని వదిలేశారు. ఇది మమ్మల్ని ఎంతగానో బాధించింది' అని కోచ్ ఘన్‌శ్యామ్ వెల్లడించారు. దేవ్ కుమార్ మీనా గతేడాది జర్మనీ వేదికగా జరిగిన ప్రపంచ యూనివర్సిటీ గేమ్స్‌లో 5.40 మీటర్ల ఎత్తు దూకి తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును బద్దలుకొట్టాడు. కాగా రైల్వే శాఖ దీనిపై స్పందిస్తూ... 'ప్లేయర్ల మనోభావాలు దెబ్బతీయడం మా ఉద్దేశం కాదు. మేము అథ్లెట్లను గౌరవిస్తాం. ఒక్కో పోల్ 5 మీటర్ల కంటే పొడవు ఉంది. దాని వల్ల ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుంది అని చెప్పాం' అని వివరణ ఇచ్చింది. ఇది ఈ ఒక్కసారి ఎదురైన సమస్య కాదని... ప్రయాణ సమయంలో ప్రతీసారి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అథ్లెట్లు వాపోతున్నారు. క్రీడా పరికరాలను తీసుకెళ్లే విషయంలో కచ్చితమైన నియమాలను రూపొందించాలని కోరుతున్నారు.

దిద్దుబాటు చర్యలు చేపట్టిన క్రీడాశాఖ

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీ నిర్వహణ లోపాలపై కేంద్ర క్రీడాశాఖ దిద్దుబాటు చర్యలకు దిగింది. మరోమారు ఇలాంటి పొరపాట్లు, నిర్వహణ వైఫల్యాలు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని క్రీడాశాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇండియా ఓపెన్ వేదిక ఇందిరాగాంధీ స్టేడియం అధికారులను పిలిచిన క్రీడాశాఖ... నిర్వహణ తీరు, తలెత్తిన గందరగోళానికి సంబంధించిన సమగ్ర నివేదిక కోరింది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం బిడ్డింగ్ రేసులో నిలవాలనుకుంటున్న భారత్‌కు ఇలాంటి నిర్వాకం చేటు చేస్తుందని క్రీడాశాఖ భావించింది. అందుకే సత్వర చర్యలు తీసుకునేందుకు, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు, ఆతిథ్య వైఫల్యం పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి మాండవీయ 'సాయ్' ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. నిజానికి ఇండియా ఓపెన్ భారత బ్యాడ్మింటన్ సంఘం నిర్వహించినప్పటికీ దేశంలోని ప్రముఖ క్రీడా స్టేడియాలు, ఎక్సలెన్సీ సెంటర్లన్నీ 'సాయ్' పరిధిలోనివి. వీటి నిర్వహణ కోసం కేంద్రం ప్రతీ ఏటా క్రీడా బడ్జెట్లో నిధులు కూడా ఇస్తోంది.

ఇండియా ఓపెన్ నిర్వహణ లోపాలపై దృష్టి

అసలేం జరిగింది?

దేశ రాజధానిలో ఇండియా ఓపెన్ జరిగింది. త్వరలోనే ఇక్కడ ప్రపంచ చాంపియన్‌షిప్ కూడా జరగనుంది. అయితే ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వసతులు అధమంగా ఉన్నాయని, ఆడే పరిస్థితులు లేవని, ప్రాక్టీస్ కోర్టులన్నీ దుమ్ముధూళీతోనే నిండిపోయాయని డెన్మార్క్ షట్లర్ మియా బ్లిచ్‌ఫెల్డ్ తీవ్రస్థాయిలో విమర్శించింది. ఆమె విమర్శలకు మరింత బలం చేకూర్చేలా మ్యాచ్‌లు జరిగే సమయంలో పలుమార్లు కోర్టులో పావురాలు రెట్ట వేశాయి. దీంతో నిర్వహణ తీరు, ఏర్పాట్లపై సర్వత్రా విమర్శలు వచ్చాయి.

ఇబ్రహీం, రసూలీ మెరుపులు

తొలి టి20లో వెస్టిండీస్‌పై అఫ్గానిస్తాన్ విజయం

రసూలీ

దుబాయ్: టి20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా వెస్టిండీస్‌తో జరుగుతున్న సిరీస్‌లో అఫ్గానిస్తాన్ జట్టు బోణీ కొట్టింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా సోమవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన తొలి టి20లో అఫ్గానిస్తాన్ 38 పరుగుల తేడాతో ప్రపంచ మాజీ చాంపియన్ వెస్టిండీస్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. ఇబ్రహీం జద్రాన్ (56 బంతుల్లో 87 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డార్విష్ రసూలీ (59 బంతుల్లో 84; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధశతకాలతో అదరగొట్టారు. రహ్మనుల్లా గుర్బాజ్ (0), సాదిఖుల్లా అటల్ (2) విఫలమవడంతో ఒక దశలో అఫ్గాన్ జట్టు 19 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మూడో వికెట్‌కు ఇబ్రహీం, రసూలీ 162 పరుగులు జోడించి జట్టుకు మంచి స్కోరు అందించారు. అఫ్గానిస్తాన్ తరఫున మూడో వికెట్‌కు ఇదే అతిపెద్ద భాగస్వామ్యం. వెస్టిండీస్ బౌలర్లలో జైడెన్ సీల్స్, మాథ్యూ ఫోర్డ్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 143 పరుగులకు పరిమితం అయింది. సాంప్సన్ (24 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), గుడకేశ్ మోతీ (15 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), జాన్సన్ చార్లెస్ (16 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మాథ్యూ ఫోర్డ్ (25) తలా కొన్ని పరుగులు చేశారు. కెప్టెన్ బ్రాండన్ కింగ్ (4), ఎవిన్ లూయిస్ (4), అమీర్ జాంగో (3), హెట్‌మైర్ (3) విఫలమయ్యారు. అఫ్గాన్ బౌలర్లలో జియాఉర్ రహమాన్ 3 వికెట్లు పడగొట్టగా... కెప్టెన్ రషీద్ ఖాన్, ముజీబ్ ఉర్ రహమాన్, నూర్ అహ్మద్ తలా రెండు వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య నేడు రెండో టి20 జరగనుంది.

'ఐసీసీ ఒత్తిడికి తలొగ్గం'

- భారత్‌లో మ్యాచ్‌లు ఆడేదే లేదు
- బంగ్లాదేశ్ ప్రభుత్వ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ వ్యాఖ్య

ఢాకా: టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లను భారత్‌లో ఆడబోమని... బంగ్లాదేశ్ మరోసారి తెలిపింది. బుధవారం లోగా నిర్ణయాన్ని ప్రకటించాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) గడువు ఇవ్వగా... తమ నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ మంగళవారం వెల్లడించారు. ఒక వేళ భారత్‌లో మ్యాచ్‌లు ఆడేందుకు బంగ్లాదేశ్ నిరాకరిస్తే... ర్యాంకింగ్స్ ఆధారంగా స్కాట్లాండ్‌ను వరల్డ్‌కప్‌నకు ఎంపిక చేసే అవకాశాలున్నాయి. 'మా స్థానాన్ని స్కాట్లాండ్ భర్తీ చేస్తుందని తెలియదు. భారత క్రికెట్ బోర్డు ఒత్తిడికి తలొగ్గి... ఐసీసీ మాపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తే మేము అంగీకరించము. గతంలో భారత్‌లో ఆడేందుకు పాకిస్తాన్ నిరాకరిస్తే... వారి మ్యాచ్‌ల వేదికలను మార్చారు. మేం కూడా అదే కోరుతున్నాం' అని ఆసిఫ్ అన్నారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య ప్రస్తుతం రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో... భారత్‌లో మ్యాచ్‌లు ఆడేందుకు ఆ జట్టు నిరాకరిస్తోంది. షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ జట్టు గ్రూప్ దశ మ్యాచ్‌లను కోల్‌కతా, ముంబైలో ఆడాల్సి ఉంది. ఇటీవల ఐసీసీతో జరిగిన భేటీలో తమ మ్యాచ్‌లను మార్చాలని బీసీబీ కోరింది. గ్రూప్ 'బి'లో ఉన్న ఐర్లాండ్ జట్టు లీగ్ దశలోని మ్యాచ్‌లన్నీ శ్రీలంక వేదికగానే ఆడనుండగా... తమ జట్టును గ్రూప్ 'బి'లో వేసి తమ స్థానంలో ఐర్లాండ్‌కు అవకాశం ఇవ్వాలని కోరింది. అయితే దీనిపై ఐసీసీ స్పందించలేదు. వెస్టిండీస్, ఇటలీ, ఇంగ్లండ్, నేపాల్‌తో కలిసి బంగ్లాదేశ్ గ్రూప్ 'సి'లో ఉండగా... శ్రీలంక, ఆ్రస్టేలియా, ఒమన్, జింబాబ్వేతో కలిసి ఐర్లాండ్ గ్రూప్ 'బి'లో ఉంది.

'బి' కేటగిరీలో కోహ్లి, రోహిత్!

వార్షిక కాంట్రాక్టులను సరళీకృతం చేయనున్న బీసీసీఐ

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆటగాళ్ల కాంట్రాక్టులను క్రమబద్ధీకరించాలనే యోచనలో ఉంది. ప్రస్తుతం భారత జట్టులోని ఆటగాళ్లను ఎ+, ఎ, బి, సి అనే నాలుగు కేటగిరీలుగా విభజించి వార్షిక ఫీజులు చెల్లిస్తున్న బోర్డు... ఇక మీద 'ఎ+' కేటగిరీని తొలగించాలనే ఆలోచనలో ఉంది. ఇప్పటి వరకు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా 'ఎ+' కేటగిరీలో ఉండగా... వీరికి ఏటా రూ. 7 కోట్లు చెల్లిస్తున్నారు. 'ఎ' కేటగిరీలో ఉన్న ప్లేయర్లకు ఏడాదికి రూ. 5 కోట్లు... 'బి' కేటగిరీలోని ప్లేయర్లకు రూ. 3 కోట్లు... 'సి' కేటగిరీలోని ప్లేయర్లకు కోటి రూపాయలు ఇస్తున్నారు. అయితే కోహ్లి, రోహిత్ ఇప్పటికే టి20, టెస్టు ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికి కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతుండగా... జడేజా టెస్టు, వన్డే ఫార్మాట్‌లలోనే ఆడుతున్నాడు. బుమ్రా ఒక్కడే అన్ని ఫార్మాట్‌లలో కొనసాగుతున్నాడు. దీంతో 2025–26 కోసం ప్రకటించనున్న జాబితాలో 'ఎ+' కేటగిరీని తొలగించాలని బోర్డు భావిస్తోంది. అయితే బుమ్రాకు ఇస్తున్న వేతనంలో ఎలాంటి మార్పు చేసే అవకాశాలైతే లేవు. 2018 సుప్రీంకోర్టు నియమించిన కమిటీ 'ఎ+' జాబితాను ప్రవేశపెట్టింది. కోహ్లి, రోహిత్ ఒక్క ఫార్మాట్‌లో మాత్రమే ఆడుతుండటంతో వారికి 'బి' కేటగిరీలో చోటు దక్కనుంది. ఇక ప్రస్తుతం 'బి' కేటగిరీలో ఉన్న అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ వంటి వారికి ప్రమోషన్ దక్కే అవకాశాలున్నాయి. త్వరలో జరగనున్న బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ భేటీలో కొత్త కాంట్రాక్టులపై నిర్ణయం తీసుకోనున్నారు. 'కాంట్రాక్టుల విధానాన్ని సరళీకరించే ప్రయత్నమే ఇది. ప్రస్తుతం అన్ని ఫార్మాట్‌లు ఆడుతున్న ఆటగాళ్లు తక్కువ మందే ఉన్నారు. మూడు ఫార్మాట్‌లు ఆడుతున్న బుమ్రా అత్యుత్తమ కేటగిరీలోనే ఉంటాడు. అతడి వేతనంలో ఎలాంటి కోత ఉండదు' అని బీసీసీఐ అధికారి తెలిపారు.

మెయిన్ 'డ్రా'కు అన్‌మోల్, ఆకర్షి

అన్‌మోల్

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్స్ అన్‌మోల్ ఖరబ్, ఆకర్షి కశ్యప్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో అన్‌మోల్ 21–18, 20–22, 21–19తో ప్రపంచ 45వ ర్యాంకర్ వెన్ జు జాంగ్ (కెనడా)పై నెగ్గగా... ఆకర్షి 21–13, 21–17తో ఇషారాణి బారువా (భారత్)పై గెలిచింది. పురుషుల డబుల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో హరిహరన్–అర్జున్ ద్వయం 21–19, 21–13తో డెవిన్–రేహాన్ (ఇండోనేసియా) జంటపై నెగ్గింది.

నార్వే టోర్నీలో ప్రజ్ఞానంద

స్టావెంజర్ (నార్వే): భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మూడోసారి నార్వే చెస్ టోర్నమెంట్‌లో పాల్గొననున్నాడు. 2022లో తొలిసారి ఈ టోర్నీ బరిలోకి దిగి చాంపియన్‌గా నిలిచిన ప్రజ్ఞానంద ... 2024లో క్లాసికల్ విభాగం ప్రపంచ నంబర్ కార్ల్‌సన్‌పై తొలిసారి విజయం సాధించాడు. ఈ ఏడాది క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కూ అర్హత సాధించాడు. 'నార్వే చెస్ టోర్నీలో పాల్గొంటాను. 2024లో ఈ టోర్నీని చాలా ఆస్వాదించా. నేను ఆడిన అన్నీ టోర్నీల్లోకెల్లా ఇది చాలా భిన్నమైంది' అని ప్రజ్ఞానంద పేర్కొన్నాడు. 'ప్రజ్ఞానంద ఈ టోర్నీలో పాల్గొననుండటం చాలా సంతోషం. ప్రపంచ స్థాయిలో ఎన్నో విజయాలు సాధించిన అతడి లాంటి ప్లేయర్లు టోర్నీకి మరింత వన్నె తేనున్నారు' అని నార్వే చెస్ టోర్నమెంట్ నిర్వాహకులు పేర్కొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్ సన్నద్ధతలో భాగంగా మంగళవారం ఢిల్లీలో సుదర్శన చక్రాకృతిలో బైకులపై సైనికుల రిహార్సల్స్

చిలీలోని కన్సెప్సియన్ నగరంలో ఇళ్ల సమీపం దాకా విస్తరించిన మంటలను చూస్తున్న ప్రజలు

కర్నాటకలోని హుబ్బళ్లిలో తీవ్ర కాలుష్యం కారణంగా మురుగునీటి కాల్వపై దట్టంగా పేరుకున్న నురగ

తొలి అడుగే అగ్నిపరీక్ష!

బీజేపీ నూతన సారథికి 'ఐదు రాష్ట్రాల ఎన్నికల' సవాలు

సాక్షి, న్యూఢిల్లీ: కాషాయ దళపతిగా బాధ్యతలు చేపట్టిన నలభై ఐదేళ్ల నితిన్ నబీన్‌కు తొలి అడుగులే అగ్నిపరీక్షగా నిలవనున్నాయి. కొద్ది నెలల్లో జరగనున్న పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల రూపంలో ఆయన తక్షణ సవాలు ఎదురుకానుంది. ముఖ్యంగా బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బెంగాల్‌లో మమతా బెనర్జీ సారథ్యంలోని అధికార తృణముల్‌కు ఎదురొడ్డి పార్టీని అధికారంలోకి తేవడం కత్తిమీద సామే కానుంది. ఇక దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీని విస్తరించే ప్రణాళిక ఏ మేరకు ఫలించేదీ తమిళనాడు, కేరళ ఎన్నికలు తేల్చనున్నాయి. వీటికి తోడు పార్టీపరమైన సమన్వయం, ఎన్డీఏ భాగస్వాములు, ఇతర మిత్రపక్షాలతో సమన్వయం, పంచాయతీ నుంచి పార్లమెంట్ స్థాయి దాకా పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత నబీన్ భుజస్కంధాలపై ఉంది.

ఆ మూడు రాష్ట్రాలే అసలు సవాలు

కొద్ది నెలల్లో జరగనున్న బెంగాల్, తమిళనాడు, కేరళ అసెంబ్లీ ఎన్నికలు నబీన్‌కు అత్యంత కీలకం కానున్నాయి. వాటిలో బెంగాల్‌ను బీజేపీ అత్యంత సీరియస్‌గా తీసుకుంటోంది. పదిహేనేళ్లుగా అప్రతిహతంగా సాగుతున్న తృణముల్ అధినేత్రి మమతా బెనర్జీ అధికారానికి ఈసారి ఎలాగైనా చెక్ పెట్టాలని బీజేపీ భావిస్తోంది. బెంగాల్ అసెంబ్లీలో 294 సీట్లకు గాను మమత పార్టీకి 223, బీజేపీకి కేవలం 65 సీట్లున్నాయి. ఈ పరిస్థితుల్లో 150 సీట్ల మెజారిటీ మార్కును చేరుకోవడం బీజేపీకి గట్టి సవాలేనని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ బెంగాల్లో బీజేపీ గ్రాఫ్ దిగజారింది. 2019లో 18 సీట్లు నెగ్గగా పోయినసారి ఆరింటిని కోల్పోయి 12 స్థానాలతో సరిపెట్టుకుంది. తృణముల్ ఎంపీ స్థానాలు 22 నుంచి 27 స్థానాలకు పెరిగాయి. కోల్‌కతాతో పాటు చాలా నగర ప్రాంతాల్లో బిహారీ వలసదారులు ఎక్కువ. కనుక అటు నుంచే నరుక్కు రావాలన్నది నబిన్ యోచన. జాతీయ భద్రత, జీవనోపాధి, శాంతిభద్రతలు, వలసలు తదితరాలపై విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లడంతో పాటు తృణమూల్‌కు బలమున్న చోట బీజేపీ ఓటు శాతం పెంచే, గ్రామీణ ఓటర్లతో బీజేపీకి అనుబంధం పెంచే చర్యలపై కొత్త అధ్యక్షుడు దృష్టి పెట్టే అవకాశముంది. ప్రజల్లో గుర్తింపున్న నేతలకే టికెట్లని నబీన్ ఇప్పటికే శ్రేణులకు స్పష్టమైన సంకేతాలు పంపారు.

తమిళనాట...

ఇక దక్షిణాదిలో కీలకమైన తమిళనాడులో ఈసారైనా పట్టు సాధించడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. డీఎంకే ప్రభుత్వ అవినీతి, విద్య, ఉద్యోగ రంగాల్లో వైఫల్యాలు, వాగ్దానాల అమలులో వైఫల్యాల వంటి అంశాల్లో ప్రజల్లోకి వెళ్లేలా కొత్త అధ్యక్షుడు ప్రణాళిక రచించారు. రాష్ట్రంలో సొంతంగా విజయం సాధించే పరిస్థితులు లేనందున అన్నాడీఎంకేతో పొత్తు, ఇతర చిన్న పార్టీల మద్దతు ద్వారా ఓటు బ్యాంకును విస్తరించాలని భావిస్తున్నారు. ఓబీసీ, దళిత వర్గాలతో పాటు యువత, మహిళలను ఆకర్షించేలా కార్యక్రమాల నిర్వహణ, బూత్ స్థాయిలో బలహీనంగా ఉన్న కేడర్‌ను బలోపేతం చేయడం, స్థానిక భాషలో సోషల్ మీడియా ప్రచారానికి ప్రాధాన్యతపై నబీన్ ఫోకస్ చేసే అవకాశముంది. 234 అసెంబ్లీ స్థానాలకు గాను పార్టీ గెలవగలిగే అవకాశామున్న 65 స్థానాలను ఇప్పటికే గుర్తించినట్టు తెలుస్తోంది. ఎన్నికల పొత్తు దిశగా అన్నాడీఎంకేతో వారంలో చర్చలు మొదలవనున్నాయి. కేరళలో బీజేపీ ఇప్పటికే 'మిషన్–2026'పేరుతో భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌లకు దీటుగా రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే లక్ష్యంగా దూకుడు పెంచింది. ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో, ముఖ్యంగా తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో సాధించిన చరిత్రాత్మక విజయం బీజేపీకి కొత్త ఉత్సాహాన్నిచ్చింది. అక్కడ 45 ఏళ్ల తర్వాత ఎల్‌డీఎఫ్‌కు కమలం పార్టీ చెక్ పెట్టడం తెలిసిందే. ఈ విజయాన్ని అసెంబ్లీ ఎన్నికలకు పునాదిగా మార్చుకోవాలని చూస్తోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ స్థాయి కమిటీల పునర్వ్యవస్థీకరణ, కార్యకర్తల శిక్షణ, ముందస్తుగా అభ్యర్థుల ఎంపిక వంటివి మొదలయ్యాయి. గ్రామాల నుంచి నగరాల దాకా ఓటర్లను నేరుగా కలిసే ప్రచారానికి ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర నేతలకు కొత్త అధ్యక్షుడు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. అయితే కేరళలో దశాబ్దాలుగా బలంగా ఉన్న వామపక్ష రాజకీయాలు, జాతీయ పార్టీల పట్ల సంప్రదాయ వ్యతిరేకత బీజేపీకి పెద్ద సవాలుగా మారాయి. ఈ నేపథ్యంలో తొలిసారి ఓటేసే నవ యువతను తమ వైపు తిప్పుకోవడంతో పాటు కీలకమైన విద్య, ఉద్యోగాలపై ప్రచారం చేయాలన్నది కొత్త అధ్యక్షుని వ్యూహమని బీజేపీ నేతలు చెబుతున్నారు.

బీజేపీ నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రధాని మోదీతో నితిన్ నబీన్, ఆయన కుటుంబ సభ్యులు

అంతరిక్ష రంగంలో... ఆరోగ్యకర పోటీ

సునీతా విలియమ్స్

న్యూఢిల్లీ: అంతరిక్ష రంగంలో ప్రస్తుతం ఆరోగ్యకరమైన, ప్రజాస్వామిక పోటీ కొనసాగుతోందని భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ అన్నారు. మనిషి మరోసారి చంద్రునిపై కాలుపెట్టడంతో పాటు అక్కడ శాశ్వత నివాసం ఏర్పరచుకోవడమే లక్ష్యంగా ముమ్మరంగా ప్రయోగాలు జరుగుతున్నట్టు ఆమె గుర్తు చేశారు. కేరళ సాహితీ సదస్సు కోసం భారత్ వచ్చిన 60 ఏళ్ల సునీత మంగళవారం ఢిల్లీలోని అమెరికన్ క్యాన్సర్ సెంటర్లో ఏర్పాటైన సదస్సులో పాల్గొన్నారు. తన తండ్రి పుట్టిపెరిగిన భారత్‌కు రావడం సొంతింటికి వచ్చినట్టుగానే ఉందని ఆమె చెప్పారు. సునీత హాల్లోకి వస్తుండగా యువతీ యువకులు పెద్దపెట్టున చప్పట్లు, హర్షధ్వానాలతో స్వాగతించారు. ఎనిమిది రోజుల మిషన్ కోసమని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి ఏకంగా 9 నెలలకు పైగా అక్కడే చిక్కుబడ్డ సందర్భంగా ఎదుర్కొన్న అనుభవాలను వారితో సునీత పంచుకున్నారు. తానక్కడ ఉండగానే భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా కూడా ఐఎస్ఎస్‌కు వచ్చి ఉంటే బాగుండేదన్నారు. అంతరిక్షంలోని కఠిన పరిస్థితుల్లో మానసిక దృఢత్వాన్ని కోల్పోకుండా ఉండటం మొదలుకుని పలు అంశాలపై యువత అడిగిన ప్రశ్నలన్నింటికీ ఓపిగ్గా బదులిచ్చారు. చమత్కారపూరిత వ్యాఖ్యలతో అందరినీ అలరించారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం పెరుగుదలను స్వాగతించారు. అంతరిక్ష యాత్రలు జీవితం పట్ల తన దృక్పథాన్నే సమూలంగా మార్చేశాయని చెప్పారు.

'శబరిమల' కేసు... 3 రాష్ట్రాల్లో ఈడీ దాడులు

కొచ్చి/న్యూఢిల్లీ: శబరిమల ఆలయంలో బంగారం దొంగతనం కేసు దర్యాప్తును ముమ్మరం చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం పలు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించింది. కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో లో 21 ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. ప్రధాన నిందితుడు బెంగళూరులోని ఉన్నికృష్ణన్ పొట్టి, కేరళలోని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) మాజీ అధ్యక్షుడు ఎ.పద్మకుమార్‌కు సంబంధించిన స్థలాలను, ఆభరణాల వ్యాపారుల ఇళ్లలో కూడా ఈడీ దాడులు చేసింది.

మేలో తొలి మునక!

- ప్రతిష్టాత్మక సముద్రయాన్ జలాంతర్గామి తొలి డైవ్‌కు ముహూర్తం ఖరారు
- సమాయత్తమవుతున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ

న్యూఢిల్లీ: సువిశాల సముద్రాల గుట్టుమట్లు తెల్సుకునేందుకు ఉద్దేశించిన ప్రతిష్టాత్మక సముద్రయాన్ ప్రాజెక్ట్‌ను వీలైనంత త్వరగా ఆరంభించేందుకు కేంద్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. సముద్ర ఉపరితలం నుంచి ఏకంగా 6,000 మీటర్ల లోతులోకి వెళ్లి పరిశోధన చేసే నిమిత్తం మత్స్య6000 పేరిట డీప్‌వాటర్ వెహికల్ జలాంతర్గామిని రూపొందించడం పూర్తయిందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ(ఎన్ఐఓటీ) ప్రకటించింది. అయితే తొలి దఫాలో 500 మీటర్ల లోతుకు ఈ అత్యాధునిక జలాంతర్గామిని తీసుకెళ్లబోతున్నామని ఎన్ఐఓటీ వెల్లడించింది. ఈ ఏడాది మే నెలలో ఈ తొలి ప్రయోగం చేపట్టబోతున్నట్లు తాజాగా ప్రకటించింది. 500 మీటర్ల స్థాయిలో విజయం సాధించాక తర్వాత దశలవారీగా 6,000 మీటర్ల లక్షిత లోతును చేరుకుంటామని ఎన్ఐఓటీ పేర్కొంది. 6 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది తొలినాళ్లలో చేరుకుంటామని అంచనావేసింది. ప్రస్తుతం చెన్నైలోని ఎన్ఐఓటీ తయారీ కేంద్రంలో మత్స్య6000 విడిభాగాలను బిగించే క్రతువు కొనసాగుతోంది. 25 టన్నుల బరువైన ఈ భారీ మానవసహిత సముద్రవాహక నౌకకు ఎన్ఐఓటీ శాస్త్రవేత్తలు అత్యంత అధునిక ఉపకరణాలను అమర్చుతున్నారు.

రెండో ట్రయల్స్ లేవు

''లోతు తక్కువ ప్రాంతాల్లో గతంలో ఒకసారి ట్రయల్స్ చేశాం. మరోసారి ట్రయల్స్ చేసే ఆలోచన లేదు. నేరుగా అరకిలోమీటర్ లోతులోకి మత్స్య6000ను తీసుకెళ్లాలని నిర్ణయించాం. పీడన స్థాయిలు, జలాంతర్గామిలో పరిశోధకుల ప్రాణాధార అవసరాలు, నేవిగేషన్ సెన్సార్ల పనితీరును పరిశీలించబోతున్నాం. రూ.4,077 కోట్ల అంచనా వ్యయంతో 2021లో డీప్ ఓషన్ మిషన్‌ను మొదలుపెట్టాం. స్వదేశీ డిజైన్, దేశీయ ఉపకరణాల సామర్థ్యాలకు ఈ ప్రయోగం గీటురాయిగా మారనుంది''అని ఎన్ఐఓటీ డైరెక్టర్, ప్రొఫెసర్ బాలాజీ రామకృష్ణన్ చెప్పారు. జలాంతర్గామి సాంకేతికతలో అగ్రగాములుగా కొనసాగుతున్న అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జపాన్‌ల సరసన నిలబడే ఉద్దేశ్యంతో భారత్ ఈ కీలక ప్రాజెక్ట్‌ను చేపట్టింది.

ఏమిటీ మత్స్య6000 ?

సముద్రజలాల్లో అత్యంత విలువైన ఖనిజాలు, లోహాలతోపాటు భారతదేశంపై రుతుపవనాల తీరు, వాతావరణ పరిస్థితుల ప్రభావంలో సముద్రాల పాత్రను విశ్లేషించేందుకు ఈ డీప్ ఓషన్ ప్రాజెక్ట్‌ను మొదలెట్టి అందులో భాగంగా ఇస్రో, ఐఐటీ మద్రాస్, డీఆర్‌డీవో తదితర సంస్థల సహకారంతో ఎన్ఐఓటీ శాస్త్రవేత్తలు 'మత్స్య 6000ను తయారుచేశారు. గోళాకారంలో రూపొందించిన ఈ డీప్ వాటర్ వెహికల్‌ను అత్యంత కఠినమైన టైటానియంతో తయారుచేశారు. ఇది సముద్రగర్భంలో అత్యధిక పీడనాలను సైతం తట్టుకుని మత్స్య6000లోని పరిశోధకులకు రక్షణగా నిలుస్తుంది. సముద్రఅడుగున జీవజాలంపై పరిశోధనలు చేయనున్నారు.

'బెంగాలీ పులి' గర్జన

ఆరేళ్ల న్యాయ పోరాటం.. అద్భుత విజయం!

అది ప్రపంచంలోనే పేరుమోసిన ఒక బహుళజాతి కన్సల్టింగ్ సంస్థ. అక్కడ ఉద్యోగం అంటే ఎంతో ప్రతిష్టాత్మకం. కానీ, అనారోగ్యంతో బాధపడుతున్న ఒక భారతీయ మహిళను 'నీ వల్ల కావట్లేదు'.. అంటూ ఆ సంస్థ బయటకు పంపేసింది. అవమానాన్ని భరించి మౌనంగా ఉండిపోలేదు ఆ మహిళ. ఆరేళ్లపాటు అలుపెరగని న్యాయపోరాటం చేసింది. చివరకు బ్రిటన్ హైకోర్టు మెట్లెక్కి.. కార్పొరేట్ దిగ్గజాన్ని తలవంచేలా చేసింది. ఆమే పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎన్నారై ప్రొఫెషనల్ సంజు పాల్.

ఏమిటా కథ?

సంజు పాల్ ప్రముఖ సంస్థ 'యాక్సెంచర్'లో మేనేజర్‌గా పనిచేసేవారు. ఆమె ఎండోమెట్రియోసిస్ అనే దీర్ఘకాలిక గర్భాశయ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. దీనివల్ల తీవ్రమైన నొప్పి ఉంటుంది. అయితే, ఆమె పనితీరు బాలేదంటూ, సీనియర్ మేనేజర్‌గా పదోన్నతి పొందే సామర్థ్యం లేదంటూ 2019లో సంస్థ ఆమెను తొలగించింది.

'అప్ ఆర్ ఔట్'పై సవాల్!

దీనిపై ఆమె ఎంప్లాయిమెంట్ అప్పీల్ ట్రిబ్యునల్ (ఈఏటీ)ను ఆశ్రయించారు. బ్రిటన్ ఈక్వాలిటీ యాక్ట్ 2010 ప్రకారం, దీర్ఘకాలిక అనారోగ్యాన్ని వైకల్యంగా పరిగణించాలని, దాని ఆధారంగా వివక్ష చూపడం చట్టవిరుద్ధమని ఆమె వాదించారు. కార్పొరేట్ సంస్థల్లో ఒక వివాదాస్పద నిబంధన ఉంది. అదే 'అప్ ఆర్ అవుట్'.. అంటే నిర్ణీత సమయంలో పదోన్నతి సాధించకపోతే ఉద్యోగం వదిలి వెళ్లాలి. దీన్ని సంజు పాల్ సవాలు చేశారు. అనారోగ్య సమస్య ఉన్నప్పుడు దాన్ని సాకుగా చూపి ఎలా తొలగిస్తారని ఆమె ప్రశ్నించారు.

వెనక్కి తగ్గని సంజు

మొదట కింది కోర్టు ఆమెకు కేవలం 4,275 పౌండ్ల నామమాత్రపు పరిహారం ఇచ్చి కేసు ముగించాలని చూసింది. కానీ సంజు పాల్ వెనక్కి తగ్గలేదు. దీంతో హైకోర్టు సోమవారం సంచలన తీర్పు ఇచ్చింది. ఎండోమెట్రియోసిస్ వ్యాధిని విస్మరించడం తప్పని కోర్టు తేల్చి చెప్పింది. గతంలో ఆమెకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పును 'అసంబద్ధం'అని కొట్టివేసింది. కేసును సరికొత్త కోణంలో విచారించాలని ఆదేశించింది.

న్యాయం గెలిచింది

'నా లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఉద్యోగుల హక్కుల కోసం, పని ప్రదేశాల్లో వివక్ష పోవాలనే నేను పోరాడాను. ఈ విజయం నా ఒక్కదానిదే కాదు'.. అంటూ సంజు పాల్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆమె సేవలను గుర్తించిన బ్రిటన్ ప్రధాని ఇప్పటికే ఈమెను 'పాయింట్స్ ఆఫ్ లైట్' పురస్కారంతో సత్కరించడం విశేషం. అనారోగ్యం బలహీనత కాదు.. పోరాడితే అది చట్టబద్ధమైన బలం అవుతుందని సంజు పాల్ నిరూపించారు.

బిర్యానీకి 'సుషీ' టచ్!

సుషీలాగే బిర్యానీ కూడా.. జపాన్ రాయబారి కితాబు

బిర్యానీ.. ఈ పేరు వింటేనే నోరూరని భారతీయుడు ఉండడు. కానీ, ఒక విదేశీ రాయబారి మన బిర్యానీని మన పద్ధతిలోనే తింటూ, దానికి తన దేశపు 'వంటకం'తో ముడిపెడితే? సాధారణంగా దౌత్యవేత్తలు అంటేనే.. ఫార్మల్ సూట్లు, చెంచాలు, ఫోర్కులు గుర్తుకొస్తాయి. కానీ, భారత్‌లో జపాన్ రాయబారి ఓనో కెయిచి మాత్రం రూటు మార్చారు. బిర్యానీని చెంచాతో కాకుండా, అచ్చం భారతీయుల్లాగే.. చేత్తో తిని అందరినీ ఆశ్చర్యపరిచారు. అది కూడా ఒక అదిరిపోయే ట్విస్ట్ ఇస్తూ..

పోలిక అదిరింది

తన సోషల్ మీడియా వేదికగా బిర్యానీ తింటున్న ఫొటోలను పంచుకుంటూ ఓనో కెయిచి చేసిన వ్యాఖ్య ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'నా భారతీయ స్నేహితులను అనుసరిస్తూ.. మొదటిసారి బిర్యానీని చేత్తో తిన్నాను. జపాన్ వంటకం 'సుషీ'ని చేత్తో తింటే ఎంత రుచిగా ఉంటుందో, బిర్యానీ కూడా అలాగే ఉంది! ఇప్పుడు నా స్నేహితులకు మరింత దగ్గరైనట్లు అనిపిస్తోంది'.. అంటూ ఆయన రాసుకొచ్చారు. బిర్యానీకి, జపాన్ సంప్రదాయ వంటకం సుషీకి మధ్య ఆయన వెతికిన ఈ 'చేతి రుచి'బంధం నెటిజన్ల మనసు గెలుచుకుంది.

ఆంధ్ర థాలీ.. తెలంగాణ బిర్యానీ

ఓనో కెయిచి కేవలం బిర్యానీతోనే ఆగిపోలేదు. ఇటీవల జపాన్ ఎంబసీ బృందంతో కలిసి ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌కు వెళ్లారు. అక్కడ ఘూటైన ఆంధ్ర థాలీని రుచి చూశారు. గత నవంబర్‌లో తెలంగాణ పర్యటనలో హైదరాబాద్ బిర్యానీని రుచి చూసి ఫిదా అయ్యారు.

వెల్కమ్ టు ఇండియా సార్!

రాయబారి అభిరుచులకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. 'మీరు త్వరలోనే పూర్తి స్థాయి 'దేశీ'గా మారిపోతారు సార్!'అని కొందరు.. 'బిర్యానీని ఎలా కలపాలో, ఆ రుచిని ఎలా ఆస్వాదించాలో'.. మరికొందరు చిట్కాలు చెబుతున్నారు.

ఎవరీ ఓనో కెయిచి?

అక్టోబర్ 2024లో జపాన్ రాయబారి హిరోషి సుజుకి స్థానంలో ఓనో కెయిచి బాధ్యతలు చేపట్టారు. గతంలో జపాన్ విదేశాంగ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన, 2023 జీ–7 సదస్సులో 'షెర్పా'గా వ్యవహరించారు. మొత్తానికి, దౌత్య సంబంధాలే కాదు.. రుచులు కూడా రెండు దేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తాయని ఓనో కీచి నిరూపించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కేరళ అసెంబ్లీలోనూ గవర్నర్ ప్రసంగ వివాదం

గవర్నర్ కొన్ని భాగాలను చదవలేదన్న సీఎం విజయన్

తిరువనంతపురం: గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన విధాన ప్రసంగాన్ని పూర్తిగా చదవలేదని, అందులోని కొన్ని భాగాలను వదిలేశారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. విధాన ప్రసంగం చదవడం ముగిశాక సభ నుంచి గవర్నర్ నిష్క్రమించారు. అనంతరం విజయన్ మాట్లాడుతూ గవర్నర్ ఆ పత్రంలోని 12వ పేరా ప్రారంభాన్ని, 15వ పేరా ముగింపును చదవలేదని అసెంబ్లీకి చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన విధాన ప్రసంగాన్నే అధికారిక పత్రంగా పరిగణించాలని విజయన్ స్పీకర్‌ను కోరారు. మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగానికి భాగాలను జోడించడం, తొలగించడం సభ సంప్రదాయాల ప్రకారం అధికారికం కాదని, ఈసారి కూడా అదే వర్తిస్తుందని స్పీకర్ ఏ.ఎన్. షంసీర్ అన్నారు. గవర్నర్ చదవకుండా వదిలేసిన భాగాల్లో 'ఈ సామాజిక, సంస్థాగత విజయాలు సాధించినప్పటికీ, ద్రవ్య సమాఖ్యవాదం, రాజ్యాంగ సూత్రాలను బలహీనపరిచే కేంద్ర ప్రభుత్వ చర్యల కారణంగా కేరళ తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది'అనేది మొదటిది. మరొకటి 'రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యలపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది, వీటిని రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించారు'అని ఉంది.

నితిన్ నబిన్‌కు జెడ్-కేటగిరీ భద్రత

న్యూఢిల్లీ: భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ నబిన్‌కు కేంద్రం అత్యున్నత స్థాయి వీఐపీ భద్రతను కల్పించింది. ఆయనకు జెడ్ కేటగిరీ భద్రతను అందించే బాధ్యతను సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) వీఐపీ భద్రతా విభాగానికి అప్పగించింది. ఆయనకు సీఆర్‌పీఎఫ్ భద్రతను అందించాలని కొన్ని వారాల కిందటే కేంద్ర హోంశాఖ ఆదేశించిందని అధికారులు తెలిపారు.

డూన్ మెడికల్ కాలేజీ ర్యాగింగ్.. 9 మంది విద్యార్థుల సస్పెన్షన్

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని డూన్ మెడికల్ కాలేజీలో జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేశారనే ఆరోపణలపై తొమ్మిది మంది విద్యార్థులపై చర్యలు తీసుకున్నారు. ర్యాగింగ్ నిరోధక కమిటీ నివేదిక సిఫార్సుల ఆధారంగా చర్యలు తీసుకున్నట్టు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ గీతా జైన్ తెలిపారు. ఇద్దరు విద్యార్థులను తరగతుల నుంచి రెండు నెలలపాటు, హాస్టల్, ఇంటర్న్‌షిప్ నుంచి కోర్సు మొత్తం కాలానికి బహిష్కరించామని తెలిపారు. ఒకొక్కరికి రూ.50వేలు జరిమానా కూడా విధించామన్నారు. మరో ఏడుగురు సీనియర్ విద్యార్థులకు నెలపాటు తరగతుల సస్పెన్షన్, 3 నెలలపాటు హాస్టల్ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు.

అస్సాంలో బోడో, ఆదివాసీల ఘర్షణలు

రెండు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు బంద్

కోక్రాఝర్/గువాహటి: అస్సాంలోని కోక్రాఝర్‌లో మళ్లీ ఘర్షణలు తలెత్తాయి. మూక దాడుల ఘటనల్లో ఇద్దరు మరణించడంతో మంగళవారం తాజాగా బోడో, ఆదివాసీల మధ్య ఘర్షణలు చెలరేగి రెండు జిల్లాల్లో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలాలు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నంచేస్తున్నాయి. ముందు జాగ్రత్తగా కోక్రాఝర్‌తోపాటు పొరుగు జిల్లాలోనూ ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలను ప్రభుత్వం స్తంభింపజేసింది. కరీగావ్‌లో జరిగిన గొడవలో గాయపడిన నలుగురిలో ఒకరు మంగళవారం మరణించడంతో తాజాగా ఘర్షణలు మొదలయ్యాయి. ఈ ఘటనలో ఇప్పటిదాకా 18 మందిని పోలీసులు అరెస్ట్‌చేశారు.

ఇండోర్‌లో కలుషిత నీటి ఘటనపై దర్యాప్తు కమిటీ

భోపాల్: పలుమార్లు స్వచ్ఛతా అవార్డ్ అందుకున్న ఇండోర్ నగరంలో ఇళ్లకు తాగునీరుగా కలుషితనీరు సరఫరా జరిగి 24 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనపై మధ్య ప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్రస్థాయి దర్యాప్తు కమిటీని మంగళవారం ఏర్పాటుచేసింది. ఘటన పూర్వాపరాలను విస్తృత స్థాయిలో సేకరించి ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చేపట్టాల్సిన చర్యలపై కమిటీ సలహాలు, సూచనలు చేయనుంది. దర్యాప్తు వివరాలతో నివేదికను ప్రభుత్వానికి ఒక నెలలోపు సమర్పించనుంది. భగీరథ్‌పురాలో తాగునీరు ఏ కారణాలతో కలుషితమైంది? ఏ స్థాయిలో కలుషితం జరిగింది? దీనికి కారకులెవరు? ఏ స్థాయిలో శాఖాపర నిర్లక్ష్యం జరిగింది? వంటి వివరాలను కమిటీ సేకరించనుంది. అవసరమైతే నీటి సరఫరా వ్యవస్థలను ప్రత్యక్షంగా తనిఖీచేసి నివేదించనుంది. రాష్ట్ర ప్రభుత్వంలోని సాధారణ పరిపాలనా విభాగంలోని అదనపు ప్రధాన కార్యదర్శి సంజయ్ శుక్లా సారథ్యంలో కమిటీని ఏర్పాటుచేశారు.

హాట్‌కేకుల్లా అమ్ముడైన వందేభారత్ స్లీపర్ టికెట్లు

కోల్‌కతా: దేశంలో మొట్టమొదటి వందేభారత్ స్లీపర్ రైలు సర్వీసుకు సంబంధించిన టికెట్లు క్షణాల్లో హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయని రైల్వేశాఖ మంగళవారం ప్రకటించింది. తొలి స్లీపర్ వందేభారత్‌ను జనవరి 17వ తేదీన పశ్చిమబెంగాల్‌లోని మాల్దాలో ప్రధాని మోదీ ప్రారంభించడం తెల్సిందే. ఈ రైలు గువాహటిలోని కామాఖ్య, కోల్‌కతా సమీపంలోని హౌరా స్టేషన్‌ల మధ్య రాకపోకలు సాగించనుంది. ఈ రైలు గురువారం తన తొలి ప్రయాణాన్ని మొదలుపెట్టనుంది.

క్వీన్ ఎలిజబెత్ స్కూల్ ఇకపై భారత్‌లో

లండన్: బ్రిటన్‌లో క్వీన్ ఎలిజబెత్–1 హయాంలో 1573లో నెలకొల్పిన పాఠశాల శాఖను భారత్‌లో తొలిసారిగా ఏర్పాటుచేయనున్నారు. హరియాణాలోని గురుగ్రామ్‌లో ఈ క్వీన్ ఎలిజబెత్(క్యూఈ) గ్లోబల్ స్కూల్‌ను నెలకొల్పబోతున్నామని లండన్‌లోని విద్యాసంస్థ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 450 ఏళ్లకుపైగా చరిత్ర గల మా పాఠశాల అదే స్థాయి విద్యా ప్రమాణాలతో ఆగస్ట్‌లో గురుగ్రామ్‌లో భారత్‌లో తొలి స్కూల్‌ను ప్రారంభించబోతోందని క్యూఈ గ్లోబల్ స్కూల్స్ సీఈఓ కరోలిన్ పెండెల్టన్ నాష్ చెప్పారు.

ఇరాన్‌లో మరణాలు 4,029

దుబాయ్: అనూహ్యంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, అవినీతి, నిరుద్యోగంతో విసిగిపోయిన ప్రజలు ఇరాన్‌లో ఖమేనీ ప్రభుత్వంపై ఉద్యమించడంతో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో ఇప్పటిదాకా 4,029 మంది ప్రాణాలు కోల్పోయారని అక్కడి ఉద్యమకారులు మంగళవారం ప్రకటించారు. ఉద్యమాలను అణచేసేందుకు ప్రభుత్వం ఇప్పటిదాకా 26,000 మందికిపైగా నిరసనకారులను నిర్బంధించిందని అమెరికా కేంద్రంగా పనిచేసే హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్ న్యూస్ ఏజెన్సీ ప్రకటించింది. శాంతియుత ఆందోళనలను ఖమేనీ ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచేస్తోందని పేర్కొంటూ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ గతంలో ఇరాన్ విదేశాంగ మంత్రికి పంపిన ఆహ్వానాన్ని ఉపసంహరించుకుంది. దావోస్ వేదికగా మా ప్రభుత్వ వాదన వినిపించకూడదనే కుట్రతోనే ఇలా చేశారని ఇరాన్ విదేశాంగ మంత్రి ఆరోపించారు.

అది సాఫ్ట్‌వేర్ ఇంటెన్సివ్ రిగ్గింగ్: టీఎంసీ భాష్యం

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సర్వే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కొత్త నిర్వచనం చెప్పింది. సాఫ్ట్‌వేర్ సాయంతో ఓట్ల రిగ్గింగ్‌కు పాల్పడుతోందని పేర్కొంటూ ఎస్ఐఆర్‌ను 'సాఫ్ట్‌వేర్ ఇంటెన్సివ్ రిగ్గింగ్(ఎస్ఐఆర్)గా కొత్త భాష్యం చెప్పింది. ఎస్ఐఆర్ జాబితాలో తార్కిక వ్యత్యాసాలున్న ఓటర్ల జాబితాను తక్షణం గ్రామపంచాయితీ భవనాల్లో ప్రదర్శించాలని ఈసీని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించిన వేళ ఎస్ఐఆర్ ప్రక్రియపై టీఎంసీ మరోసారి ఇలా విమర్శలు గుప్పించింది.

మళ్లీ ఉక్రెయిన్‌పై రష్యా బాంబుల వర్షం

కీవ్: ఉక్రెయిన్‌లోని పవర్ గ్రిడ్ వ్యవస్థే లక్ష్యంగా రష్యా సేనలు మంగళవారం రాత్రి వందల కొద్దీ బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులతో విరుచుకుపడ్డాయి. 300 డ్రోన్లతోనూ దాడులుచేసింది. చలికాలంకావడంతో ఇళ్లను వెచ్చదనం అందించే విద్యుత్ వ్యవస్థలకు సరఫరాచేసే పవర్ గ్రిడ్‌ను రష్యా లక్ష్యంగా చేసుకుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. జనవరి 9న పవర్‌గ్రిడ్‌పై దాడిలో 5,600 అపార్ట్‌మెంట్ బిల్డింగ్‌లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

శాంతి భద్రతలు ఏ జాబితాకు చెందినవి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

అంతర్రాష్ట్ర సంబంధాలు

ఒక సమాఖ్య వ్యవస్థ విజయవంతంగా పనిచేయడానికి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఎంత ముఖ్యమో, అంతర్రాష్ట్ర సంబంధాలూ అంతే ముఖ్యం అనే వాస్తవాన్ని గుర్తించిన రాజ్యాంగ నిర్మాతలు అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించడానికి, స్నేహపూరిత వాతావరణాన్ని కల్పించడానికి రాజ్యాంగంలో కొన్ని ఏర్పాట్లు చేశారు. అందులో ముఖ్యమైనవి..

- అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కార ట్రైబ్యునళ్లు
- అంతర్రాష్ట్ర మండళ్లు
- పబ్లిక్ చట్టాలు, రికార్డులు, న్యాయస్థానాల ఆదేశాలను పరస్పరం గుర్తించే పద్ధతులు
- అంతర్రాష్ట్ర వాణిజ్య వ్యాపార సంబంధాలు

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కారం

ప్రకరణ 262 ప్రకారం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలను సత్వరమే పరిష్కరించడానికి పార్లమెంటు ఒక చట్టం ద్వారా ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయవచ్చు. అలాంటి వివాదాలను నేరుగా ట్రైబ్యునలే పరిష్కరిస్తుంది. ఇందుకోసం 1956లో అంతర్రాష్ట్ర జలాల వివాదాల పరిష్కార చట్టం, రివర్ బోర్డు చట్టాన్ని రూపొందించారు. వీటికి పాక్షిక న్యాయాధికారాలు (Quasi-Judicial) ఉంటాయి.

ప్రకరణ 262(2) ప్రకారం పార్లమెంటు చేసిన చట్టాలపై సుప్రీంకోర్టుకు న్యాయసమీక్ష అధికారం ఉండదు. కానీ, కేంద్రం తన శాసన విధులను నిర్వర్తించేలా ఆదేశించవచ్చు.

ఈ ట్రైబ్యునళ్ల ప్రధాన ఉద్దేశం వివాదాలను సత్వరమే పరిష్కరించడం. సాధారణంగా అంతర్రాష్ట్ర వివాదాలు సుప్రీంకోర్టు ప్రారంభ పరిధిలోకి వస్తాయి. అయితే నదీ జలాల పంపిణీ వివాదాలను పరిష్కరించడానికి ప్రత్యేక ట్రైబ్యునళ్లు ఏర్పాటైతే, ఆయా రాష్ట్రాలు ట్రైబ్యునళ్లలోనే వివాదాలను పరిష్కరించుకోవాలి. వీటి తీర్పులపై సుప్రీంకోర్టులో కేవలం సలహా పూర్వకమైన అప్పీలు చేసుకోవచ్చు.

ఇప్పటివరకు దేశంలో ఎనిమిది అంతర్రాష్ట్ర నదీ జలాల ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేశారు.

- కృష్ణా నదీ జలాల ట్రైబ్యునల్ –1969 (దీని పరిధిలోకి వచ్చే రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ).
- గోదావరి నదీ జలాల ట్రైబ్యునల్ – 1969 (మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ)
- నర్మదా నదీ జలాల ట్రైబ్యునల్– 1969 (రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర)
- రావి, బియాస్ నదీ జలాల ట్రైబ్యునల్– 1986 (పంజాబ్, హర్యానా)
- కావేరి నదీ జలాల ట్రైబ్యునల్– 1990 (కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి)
- కృష్ణా నదీ జలాల ట్రైబ్యునల్ 2–2004 (మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)
- వంశధార నదీ జలాల ట్రైబ్యునల్–2010 (ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)
- మహాదాయి నదీ జలాల ట్రైబ్యునల్–2010 (గోవా, కర్ణాటక, మహారాష్ట్ర).



అంతర్రాష్ట్ర మండలి

ప్రకరణ 263 ప్రకారం అంతర్రాష్ట్ర మండలిని (Inter State Council) ఏర్పాటు చేస్తారు. ఇది కేంద్ర–రాష్ట్రాలు, అంతర్రాష్ట్రాల మధ్య వివిధ అంశాలపై విచారణ చేసి తగిన సూచనలు చేస్తుంది.

నిర్మాణం:

సర్కారియా కమిషన్ నివేదిక (1983–87) మేరకు జనతాదళ్ ప్రభుత్వం (వి.పి.సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు) 1990లో అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేసింది. దీని నిర్మాణం కింద పేర్కొన్న విధంగా ఉంటుంది.

- ప్రధానమంత్రి – అధ్యక్షుడు
- అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు – సభ్యులు
- కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు (శాసనసభలు ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు) –సభ్యులు
- కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలకులు –సభ్యులు
- కేంద్ర ప్రభుత్వ హోంమంత్రి సహా ఆరుగురు కేబినెట్ మంత్రులు – సభ్యులు

విధులు:

- కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉమ్మడి ప్రయోజన విషయాలను పరిశీలించి, చర్చించి నివేదిక ఇవ్వడం.
- అంతర్రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని సాధించే పద్ధతిని, చర్యలను సూచించడం.
- కౌన్సిల్‌కు నివేదించిన ఇతర సాధారణ విషయాలపై చర్చించి సూచనలు చేయడం.

కౌన్సిల్ ఏడాదికి మూడు పర్యాయాలు సమావేశం కావాలి. దీని విధులన్నీ సలహా విధులే. సమావేశంలో వివిధ అంశాలను ఏకాభిప్రాయ సాధన పద్ధతిలో నిర్ణయిస్తారు.

1996లో నిరంతర సలహాల కోసం ఒక స్థాయి సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. దీనికి కేంద్ర హోం శాఖా మంత్రి చైర్మన్‌గా ఉంటారు. అయిదుగురు కేంద్ర కేబినెట్ మంత్రులు, తొమ్మిది మంది ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉంటారు. అంతర్రాష్ట్ర మండలికి ప్రత్యేక సచివాలయం ఉంది. దీనికి అధిపతిగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి ఉంటారు. ఈ సచివాలయమే జోనల్ కౌన్సిళ్లకు కూడా ఉమ్మడి సచివాలయంగా పనిచేస్తుంది.

ప్రకరణ 263 ప్రకారం రాష్ట్రపతి కింద పేర్కొన్న కౌన్సిళ్లను కూడా ఏర్పాటు చేశారు.

- రాష్ట్రపతి సెంట్రల్ హెల్త్ కౌన్సిల్
- సెంట్రల్ లోకల్ గవర్నమెంట్ కౌన్సిల్
- అర్బన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్
- నాలుగు ప్రాంతీయ అమ్మకపు పన్ను కౌన్సిళ్లను కూడా ఏర్పాటు చేశారు.

అదేవిధంగా 2003లో సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి అనే సంస్థలను కూడా ఏర్పాటు చేశారు.

పబ్లిక్ రికార్డులు-న్యాయ ప్రక్రియలు

రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర అధికార పరిధి రాష్ట్ర భూభాగానికే పరిమితం కాబట్టి, రాష్ట్రాలు జారీ చేసిన చట్టాలను, రికార్డులను, ఇతర సర్టిఫికెట్లను ఇతర రాష్ట్రాలు కూడా గౌరవించే విధంగా ప్రకరణ 261లో కొన్ని ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టాలను రూపొందిస్తుంది.

అంతర్రాష్ట్ర వ్యాపార, వాణిజ్య సంబంధాలు

రాజ్యాంగంలోని 13వ భాగంలో ప్రకరణ 301 నుంచి 307 వరకు అంతర్రాష్ట్ర వ్యాపార, వాణిజ్య అంశాలకు సంబంధించి కొన్ని రక్షణలు పేర్కొన్నారు. ప్రకరణ 301 ప్రకారం దేశంలో ఎక్కడైనా వాణిజ్యం, వ్యాపారం, వృత్తిని చేసుకోవడానికి స్వేచ్ఛ ఉంటుంది. అయితే కొన్ని రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాల కోసం ఈ స్వేచ్ఛలపై కూడా పరిమితులు విధించవచ్చు.

ప్రాంతీయ మండలాలు

జోనల్ కౌన్సిళ్లు చట్టపర సంస్థలు. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా వీటిని ఏర్పాటు చేశారు. దేశాన్ని 5 జోన్లుగా విభజించారు. వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి లేదు. కేవలం చట్ట ప్రతిపత్తి (Statutory Status) మాత్రమే ఉంది. అవి:

- **ఉత్తర మండలం:** ఇందులో జమ్ము–కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలు ఉన్నాయి. దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది.
- **దక్షిణ మండలం:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి. దీని ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉంది.
- **పశ్చిమ మండలం:** గుజరాత్, మహారాష్ట్ర, గోవా, దాద్రా & నగర్ హవేలి, డామన్ & డయ్యూ. దీని ప్రధాన కార్యాలయం ముంబైలో ఉంది.
- **తూర్పు మండలం:** బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా. దీని ప్రధాన కార్యాలయం కోల్‌కతాలో ఉంది.
- **మధ్య మండలం:** ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్. దీని ప్రధాన కార్యాలయం అలహాబాద్‌లో ఉంది.
- **ఈశాన్య మండలం:** పైన పేర్కొన్న 5 జోన్లకు అదనంగా ఈశాన్య మండలాన్ని ప్రత్యేకంగా పార్లమెంటు చట్టం ద్వారా 1971లో ఏర్పాటు చేశారు. ఇందులో అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర, సిక్కిం రాష్ట్రాలున్నాయి. సిక్కిం రాష్ట్రాన్ని ఎనిమిదో రాష్ట్రంగా (ఈశాన్య రాష్ట్రాల్లో) 1994లో ఈశాన్య మండలంలో చేర్చారు. దీని ప్రధాన కార్యాలయం షిల్లాంగ్ (మేఘాలయ)లో ఉంది.

నిర్మాణం:

ప్రతి జోనల్ కౌన్సిల్‌లో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇద్దరు ఇతర మంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలకులు, ప్రణాళికా సంఘం నామినేట్ చేసిన ఒక సభ్యుడు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, ఆయా రాష్ట్రాల అభివృద్ధి కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. కేంద్ర హోం శాఖా మంత్రి జోనల్ కౌన్సిళ్లకు ఉమ్మడి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అదేవిధంగా ఆ జోన్‌లోని రాష్ట్ర ముఖ్యమంత్రులు రొటేషన్ పద్ధతిలో ఒక సంవత్సర కాలానికి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

విధులు:

- దేశంలో ప్రజల మధ్య భావ సమగ్రతను సాధించడం.
- మితిమీరిన ప్రాంతీయ వాదాన్ని, భాషా వాదాన్ని, రాష్ట్ర వాదాన్ని నియంత్రించడం
- రాష్ట్రాల విభజన తర్వాత ఏర్పడిన పరిణామాలను పరిష్కరించి, ఆర్థిక అభివృద్ధి, సమగ్రత మధ్య సమన్వయాన్ని సాధించడం.
- కేంద్రం సహకారంతో సామాజిక, ఆర్థిక అంశాల్లో ఏకరూపకతను సాధించడం.
- విభిన్న ప్రాంతాల మధ్య ఒకే రకమైన రాజకీయ సమానత్వాన్ని సాధించడం.
- జోనల్ కౌన్సిల్ విధులన్నీ సలహాపూర్వకమైనవే.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి రాష్ట్రాలకు ఇచ్చే పన్ను ఏది?
ఎ) ఎగుమతి, దిగుమతి సుంకాలు
బి) స్టాంపు డ్యూటీ
సి) ఆదాయ పన్ను
డి) రైలు చార్జీలపై విధించే పన్ను
2. శాంతి భద్రతలు ఏ జాబితాకు చెందినవి?
ఎ) రాష్ట్ర జాబితా బి) కేంద్ర జాబితా
సి) ఉమ్మడి జాబితా డి) ఏదీకాదు
3. అవశిష్ట అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) కేంద్రం బి) రాష్ట్రం
సి) రాష్ట్రపతి డి) ఏదీకాదు
4. భారత, అమెరికా సమాఖ్యలకు ఉన్న సాధారణ లక్షణం ఏది?
ఎ) ఏక పౌరసత్వం
బి) రాజ్యాంగంలో మూడు జాబితాలు
సి) ద్వంద్వ న్యాయ వ్యవస్థ
డి) రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడానికి ఒక సమాఖ్య న్యాయ వ్యవస్థ
5. భారత రాజ్యాంగం సమాఖ్యపూరితమని తెలియజేసేది?
ఎ) లిఖిత, దృఢ రాజ్యాంగం
బి) స్వతంత్ర న్యాయవ్యవస్థ
సి) కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన
డి) పైవన్నీ
6. భారత దేశంలోని రాష్ట్రాల మధ్య సహకారం సమన్వయాలకు ఉన్న రాజ్యాంగేతర, చట్టపరంకాని సాధనాలు ఏవి?
1. జాతీయాభివృద్ధి మండలి
2. గవర్నర్ల సమావేశం
3. మండల కౌన్సిళ్లు
4. అంతర్రాష్ట్ర మండలి
ఎ) 1, 2 బి) 1, 2, 3
సి) 3, 4 డి) 4
7. ఆదాయ పన్ను విధింపు, వసూలు, పంపిణీకి సంబంధించి కిందివాటిలో సరైంది?
ఎ) కేంద్రం విధించి, వసూలు చేసి, ఆ మొత్తాన్ని కేంద్రం, రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తుంది
బి) అన్ని పన్నులను కేంద్రమే విధించి, వసూలు చేసిన మొత్తాన్ని ఖర్చు చేస్తుంది
సి) అన్ని పన్నులను కేంద్రం విధించి, వసూలు చేసిన మొత్తాన్ని రాష్ట్రాలకు పంపిణీ చేస్తుంది
డి) ఆదాయపు పన్నుపై వసూలు చేసిన సర్‌చార్జీని మాత్రం కేంద్రం రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తుంది

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) ఎ; 4) డి;
5) డి; 6) డి; 7) ఎ.

అభ్యుదయ కవిగా 'భువనఘోష'ను వినిపించిన కవి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

1. 'కొండవీటి పొగ మబ్బు - తెలుగువాళ్ల గోల్డునిబ్బు' అని శ్రీశ్రీతో ప్రశంసలు పొందినవారు?
1) జాషువా
2) విశ్వనాథ సత్యనారాయణ
3) గురజాడ అప్పారావు
4) రాయప్రోలు సుబ్బారావు
2. 'శ్లేష కవితా చమత్కృతి' ఎవరి కవితా గుణం?
1) చేమకూర వేంకటకవి
2) రామరాజ భూషణుడు
3) తెనాలి రామకృష్ణుడు
4) పింగళి సూరన
3. కాళ్లకూరి నారాయణరావు రచించిన 'వర విక్రయం' నాటకం ఒక ?
1) పౌరాణికం 2) చారిత్రకం
3) కల్పితం 4) సాంఘికం
4. 'తెలుగు సాహిత్య విమర్శ అవతరణ - వికాసం' అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించిన విమర్శకుడెవరు?
1) కె.వి.ఆర్. నరసింహం
2) ఎస్వీ రామారావు
3) గుంటూరు శేషేంద్రశర్మ
4) కోవెల సుప్రసన్నచార్య
5. 'అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి' అని పేర్కొన్న అలంకారికుడు?
1) ఆనందవర్ధనుడు
2) అభినవ గుప్తుడు
3) విశ్వనాథుడు
4) భరతుడు
6. రామరాజ భూషణుడు రచించిన 'హరిశ్చంద్రనలోపాఖ్యానం' అనేది ఒక
1) ద్వ్యర్థి కావ్యం 2) చంపూ కావ్యం
3) త్ర్యర్థి కావ్యం 4) శాంతరస కావ్యం
7. ఈ ఏడాది తుఫాను వచ్చి పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఇది ఏ రకమైన వాక్యం?
1) కర్మణి వాక్యం 2) హేత్వర్థక వాక్యం
3) శత్రర్థక వాక్యం 4) చేదర్థక వాక్యం
8. 'స్త్రీల రామాయణ పాటలు' అనే గ్రంథాన్ని సంకలనం చేసిందెవరు?
1) శ్రీపాద గోపాలకృష్ణమూర్తి
2) నండూరి సుబ్బారావు
3) విశ్వనాథ సత్యనారాయణ
4) ఆరుద్ర
9. 'ఎ గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్' అనే పేరుతో ఆంగ్లంలో తెలుగు భాషకు వ్యాకరణం రాసిందెవరు?
1) కాల్డ్‌వెల్ 2) క్యాంప్‌బెల్
3) సి.పి.బ్రౌన్ 4) మెకంజీ
10. వ్యక్తిని కానీ, వ్యవస్థను కానీ విమర్శించడం ఏ ప్రక్రియలో సాధారణం?
1) కథానిక 2) నవల
3) గల్పిక 4) వైజ్ఞానిక కల్పనా వ్యాసం
11. 1965–68 మధ్య కాలంలో తెలుగు సాహితీ లోకాన్ని దిగ్భ్రమకు గురి చేసినవారు?
1) భావ కవులు
2)అభ్యుదయ కవులు
3) స్త్రీవాద కవయిత్రులు
4) దిగంబర కవులు
12. విభక్తి పరమైనప్పుడు 'గోయి' మొదలైనవాటి తుది అక్షరం?
1) 'ఇ' వర్ణమగును 2) 'టి' వర్ణమగును
3) 'ంటి' వర్ణమగును 4) 'తి'వర్ణమగును
13. మనస్తత్వ శాస్త్రం ఆధారంగా 'గోపీచంద్' రాసిన నవల?
1) యమపాశం
2) పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా
3) చీకటి గదులు
4) అసమర్థుని జీవయాత్ర
14. 'పసిడి పలుకులు, మిన్నేరు, సెలయేరు' అనే జానపద రచనలు ఎవరు చేశారు?
1) బిరుదురాజు రామరాజు
2) ఆర్.వి.ఎస్. సుందరం
3) నేదునూరి గంగాధరం
4) జి.ఎస్. మోహన్
15. అభ్యుదయ కవిగా 'భువనఘోష'ను వినిపించిన కవి?
1) కె.వి. రమణారెడ్డి
2) శ్రీశ్రీ
3) రెంటాల గోపాలకృష్ణ
4) ఆవంత్స సోమసుందర్
16. 'శోకాగ్ని' అనే పదంలోని సమాసం?
1) షష్ఠీ తత్పురుష
2) విశేషణ పూర్వపద కర్మధారయం
3) ఉపమాన పూర్వపద కర్మధారయం
4) రూపక సమాసం
17. కట్టమంచి రామలింగారెడ్డి 'ముసలమ్మ మరణం' ఒక?
1) వీరగాథా కావ్యం
2) జానపద కథా కావ్యం
3) శాంతరస కావ్యం
4) కరుణ రసాత్మక కావ్యం
18. 'భారతామృతం కర్ణపుటంబుల నారగ్రోలి యాంధ్రావళి మోదము బొరయునట్లు'గా భారతాంధ్రీకరణ చేసినవారు?
1) నన్నయ 2) తిక్కన
3) ఎర్రన 4) అధర్వణుడు
19. మూల ద్రావిడ 'క' కారం 'చ' కారంగా మారడం?
1) వర్ణ వ్యత్యయం 2) తాలవ్యీకరణం
3) వర్ణలోప దీర్ఘత 4) వర్ణ సమీకరణం
20. మహ్మదీయ ప్రభువులకు తెలుగు కావ్యాలను అంకితమిచ్చిన ప్రథమ కవి?
1) పొన్నగంటి తెలగనార్యుడు
2) అద్దంకి గంగాధరుడు
3) కందుకూరి రుద్రకవి
4) చింతలపూడి ఎల్లనార్యుడు
21. ముద్దు పళని రాసిన మోహన శృంగార ప్రబంధం?
1) సత్యభామా సాంత్వనం
2) రాధికా సాంత్వనం
3) ఇళాదేవి సాంత్వనం
4) రాధాగోపాళం
22. 1943లో తెనాలిలో జరిగిన అరసం ప్రథమ మహాసభకు అధ్యక్షత వహించినవారు?
1) శ్రీరంగం శ్రీనివాసరావు
2) తాపీ ధర్మారావు
3) సురవరం ప్రతాపరెడ్డి
4) దాశరథి కృష్ణమాచార్యులు
23. 'భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్త' అని ఎవరిని అంటారు?
1) రాయప్రోలు సుబ్బారావు
2) దేవులపల్లి కృష్ణశాస్త్రి
3) నండూరి సుబ్బారావు
4) కట్టమంచి రామలింగారెడ్డి
24. తొలి తెలుగు మైనారిటీ వాద కవిత, దాని రచయిత?
1) జల్‌జలా – స్కైబాబా
2) వలస – అఫ్సర్
3) పుట్టుమచ్చ– ఖాదర్ మొహియుద్దీన్
4) వెండి మేఘం– సలీం
25. 'తెలుగు బాలెడ్ పొయిట్రీ' అనే పేరుతో జానపద వ్యాసాలు ప్రకటించిన పాశ్చాత్యుడు?
1) జె.ఎ.బోయల్ 2) సి.పి.బ్రౌన్
3) ఆర్.ఎస్. బాగ్స్ 4) డబ్ల్యు.జె.థామ్స్
26. 'అమలోదాత్త మనీష నేను భయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమునంబార గుడ కళావిదుడ' అని చెప్పుకొన్న కవి?
1) నన్నయ 2) తిక్కన
3) శ్రీనాథుడు 4) భట్టుమూర్తి
27. 'జలరుహ నాభుడిట్లు రభసంబున నందన పారిజాతముం' అనే పద్య పాదం ఏ వృత్తానికి చెందింది?
1) మత్తేభం 2) శార్దూలం
3) చంపకమాల 4) ఉత్పలమాల
28. సంగీత, సాహిత్య, నాట్య సంకేతాల సమ్మేళనం కలిగిన పుట్టపర్తి నారాయణాచార్యుల రచన?
1) శివ తాండవం 2) సాక్షాత్కారం
3) మేఘదూతం 4) పండరీ భాగవతం
29. వంగూరు సుబ్బారావు ఆంధ్ర పత్రికలో ప్రకటించిన వ్యాసం?
1) సువర్ణ లేఖలు 2) శారద లేఖలు
3) ప్రేమ లేఖలు 4) వసంత లేఖలు
30. 'అనంతం' అనేది శ్రీశ్రీ రాసిన
1) రేడియో నాటిక 2) వ్యంగ్య కవితలు
3) ప్రామాణిక విమర్శ వ్యాసాలు
4) చారిత్రాత్మక ఆత్మకథ
31. 'పెళ్లి - దాని పుట్టు పూర్వోత్తరాలు' ఎవరి రచన?
1) ఆచార్య తిరుమల రామచంద్ర
2) తాపీ ధర్మారావు
3) అయ్యగారి వీరభద్రరావు
4) గుడిపాటి వెంకటాచలం
32. త్రిపురనేని శ్రీనివాస్ వెలువరించిన గురి చూసి పాడే పాట ఒక?
1) భావకవితా సంకలనం
2) దళిత సంకలనం
3) స్త్రీవాద కవితా సంకలనం
4) అనుభూతివాద కవితా సంకలనం
33. 'నేనింత ఒక పిడికెడు మట్టే కావచ్చు. కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది' అని పేర్కొన్న కవి?
1) తిలక్ 2) మోహన్ ప్రసాద్
3) శేషేంద్రశర్మ 4) సినారె
34. 'మొక్కజొన్న, చక్రకేళి' అనే పదాలు ఏ అర్థ పరిమాణానికి ఉదాహరణ?
1) అర్థ గౌరవం 2) మృదూక్తి
3) అలంకారిక ప్రయోగం
4) లోక నిరుక్తి
35. 'అభినవ వాగను శాసనుడు' అని ఎవరిని అంటారు?
1) గురజాడ అప్పారావు
2) కందుకూరి వీరేశలింగం
3) గిడుగు రామ్మూర్తి పంతులు
4) ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
36. 'Poetry we will call musical thought' ఈ వాక్యానికి తెలుగు అనువాదం?
1) మధురమైన భావమే కవిత్వం
2) ఛందోబద్ధమైన లయ కవిత్వం
3) మనోహరమైన అర్థమే కవిత్వం
4) భావనా వ్యక్తీకరణమే కవిత్వం
37. సుప్రసిద్ధ మైనారిటీవాద కవి స్కైబాబా సంపాదకత్వంలో వెలువడిన కథల సంపుటి?
1) జల్ జలా 2) వతన్
3) వలస 4) పుట్టుమచ్చ
38. 'ఇందీవరం' అనే పదానికి పర్యాయ పదాలు?
1) నల్లకలువ, నీలోత్పలం
2) పొలం, శాలిక్షేత్రం, వరిమడి
3) పర్వతం, నగం, అద్రి
4) మలయం, ధరణీధరం
39. 'హేతువాదాన్ని స్వీకరించే భాష కూడా జన్మసిద్ధం' అని ప్రకటించిన భాషావేత్త?
1) బ్లూంఫీల్డ్ 2) మాక్స్‌ముల్లర్
3) యాస్కాచార్యుడు 4) నోమ్‌ఛామ్‌స్కీ
40. 'మాట్లాడే భాషకు, రాసే భాషకు ఎక్కువ తేడా ఉండరాదు' అనేది ఏ భాష ముఖ్య ఉద్దేశం?
1) గ్రాంథికం 2) ప్రామాణికం
3) వ్యవహారికం 4) శిష్ట వ్యవహారికం
41. బోధనను ప్రభావితం చేసి, చురుకైన అభ్యసనకు తోడ్పడేవి?
1) బోధనోపకరణాలు
2) బోధనా లక్ష్యాలు
3) బోధనా నైపుణ్యాలు
4) కనీస అభ్యసన స్థాయిలు
42. 'నేడు విద్యా విధానం ఉపాధ్యాయుడు కేంద్రంగా కాకుండా, శిశు కేంద్రంగా సాగాలని' ఎవరు చెప్పారు?
1) రూసో 2) పెస్టాలజీ
3) బెంజిమన్ బ్లూమ్ 4) ఫ్రోబెల్
43. ఉపాధ్యాయుడి బోధనా సాఫల్యం ఏ సోపానంపై ఆధారపడి ఉంటుంది?
1) మూల్యాంకనం 2) ప్రదర్శనం
3) ఉన్ముఖీకరణ 4) పఠనాపాటవం
44. దేశంలో ఒకే విద్యా ప్రమాణాలను సాధించడానికి ప్రాథమిక దశ విద్యార్థుల కోసం వేటిని ప్రవేశపెట్టారు?
1) బోధనోపకరణాలు
2) బోధనా సోపానాలు
3) కనీస అభ్యసన స్థాయిలు
4) బోధనా లక్ష్యాలు
45. ఉపాధ్యాయుడు విద్యార్థులతో కత్తి గొప్ప దా? కలం గొప్పదా? లాంటి విషయాలపై వ్యాస రచన చేయించడం ఏ రకమైంది?
1) విమర్శనాత్మక వ్యాసాలు
2) ఆలోచనాత్మక వ్యాసాలు
3) సంవాదాత్మక వ్యాసాలు
4) వర్ణనాత్మక వ్యాసాలు
46. ఏ విధానంలో 'బాలబాలికలు స్వయంగా అభ్యసిస్తారు. ఉపాధ్యాయులు కేవలం మార్గదర్శులు' గా ఉంటారు?
1) డాల్టన్ పద్ధతి 2) మాంటిస్సోరి పద్ధతి
3) క్రీడా పద్ధతి 4) ప్రాజెక్టు పద్ధతి
47. 1956లో త్రిభాషా సూత్రాన్ని రూపొందించినవారు?
1) యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
2) జాతీయ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ
3) జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
4) కేంద్రీయ విద్యా విషయక సలహా సంఘం
48. ఉపవాచకం అధ్యయనం చేయాలంటే ఏ పఠనం ఆమోదయోగ్యం?
1) బాహ్య పఠనం 2) క్షుణ్న పఠనం
3) ప్రకాశ పఠనం 4) విస్తార పఠనం
49. సి.పి.బ్రౌన్ అభిప్రాయం ప్రకారం, ఏ జిల్లాలో మాట్లాడే తెలుగు భాషా రూపం ఆధునిక ప్రామాణిక భాషగా గుర్తింపు పొందింది?
1) కృష్ణా, గుంటూరు
2) కృష్ణా, ఉభయ గోదావరి
3) కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి
4) కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి
50. సహపాఠ్య కార్యక్రమాలు అనేవి?
1) బోధనను సులువు చేస్తాయి.
2) పాఠ్యప్రణాళికకు సన్నిహితంగా ఉండవు.
3) భాషా సామర్థ్యాల ప్రకటనకు అవకాశం కల్పిస్తాయి.
4) విద్యార్థుల్లో భాషాజ్ఞానం పెంపొందిస్తాయి.

సమాధానాలు

1) 2	2) 2	3) 4	4) 2	5) 1
6) 1	7) 2	8) 1	9) 2	10) 3
11) 4	12) 4	13) 4	14) 3	15) 1
16) 4	17) 4	18) 2	19) 2	20) 2
21) 2	22) 2	23) 4	24) 3	25) 1
26) 2	27) 3	28) 1	29) 4	30) 4
31) 2	32) 3	33) 3	34) 4	35) 3
36) 1	37) 2	38) 1	39) 4	40) 3
41) 1	42) 3	43) 3	44) 3	45) 3
46) 1	47) 4	48) 4	49) 2	50) 3

దక్షిణ భారతదేశంలోనే పెద్దదైన మసీదు ఏది?

కుతుబ్‌షాహీలు గోల్కొండను రాజధానిగా చేసుకొని సుమారు 171 ఏళ్లపాటు పరిపాలించారు. వీరు ఆంధ్రదేశాన్ని సమైక్యం చేసి ఆంధ్ర సంస్కృతిని పోషించారు. తెలుగు ప్రజలఆదరాభిమానాలను పొందారు. గోల్కొండ రాజ్యంలోనిప్రజల్లో మూడో వంతు హిందువులేనని గుర్తించి, వారి హృదయాలను చూరగొంటే తప్ప సుస్థిర పాలన చేయలేమని భావించారు. జాతి, మత భేదాలను పాటించకుండా అర్హత, సామర్థ్యం ఉన్న వారికి ఉన్నత ఉద్యోగాలిచ్చి ప్రోత్సహించారు.

కుతుబ్‌షాహీల పాలనా వ్యవస్థ

కుతుబ్‌షాహీలు పరదేశీయులు, ఇతర మతస్థులు అనే భావన ప్రజల్లో రానీయకుండా పరిపాలన చేసినట్లు దక్కన్‌లో వెలువడిన సమకాలీన సాహిత్యం వల్ల తెలుస్తోంది. కుతుబ్‌షాహీల పాలనా విధానం, రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించడానికి ఇండో-పారశీక చరిత్ర, అబ్దుల్లా కుతుబ్‌షా, ఔరంగజేబు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, అక్బర్ నుంచి ఔరంగజేబు వరకు లభిస్తున్న మొగలుల చరిత్ర, గోల్కొండ కవుల సాహిత్యం దోహదపడుతున్నాయి. వీటితో పాటు గోల్కొండను సందర్శించిన బౌరే, టవర్నియర్, తెవ్‌నాట్, బెర్నియర్, మెత్తవోల్డ్, మనుస్సే, మూర్‌లాండ్ లాంటి విదేశీ యాత్రికుల కథనాలు, వారి యాత్రానుభవాలు వీరి పాలన గురించి తెలియజేస్తున్నాయి. మధ్యయుగ చరిత్రను తెలియజేసే క్రానికల్లు, మెకంజీస్ సేకరించిన కైఫీయతులు, సుల్తానులు జారీచేసిన ఫర్మానాలు కూడా ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

కుతుబ్‌షాహీలు బహమనీ సుల్తానుల పాలనా విధానాన్నే అనుసరించారు. ప్రభుత్వ యంత్రాంగంలో సుల్తాన్ ప్రధానపాత్ర పోషించేవాడు. రాజ్యాధిపతిగా ఆయనే శాసనకర్త. సుల్తాన్ తనకు తాను దేవుని ప్రతిబింబం (జిలుల్లా)గా, దైవాంశ సంభూతుడిగా విశ్వసించి నిరంకుశంగా రాజ్యపాలన చేసేవాడు. రాజే సర్వాధికారి, సైన్యాధిపతి, ఉన్నత న్యాయాధిపతి. ప్రభుత్వ విధానాలను రూపొందించి ఫర్మానాలు జారీ చేయడంతోపాటు రాయబారులను, ఉన్నతోద్యోగులను సుల్తానే నియమించేవాడు. రాజ ఆస్థానం ఎల్లప్పుడూ ఆడంబర విలాసాలతో నిండి ఉండేదని సమకాలీన సాహిత్యం ద్వారా తెలుస్తోంది.

సుల్తాన్ సర్వాధికారి అయినప్పటికీ దైవానికే సమాధానకర్తగా వ్యవహరించేవారు. ఖురాన్ గ్రంథం, సూఫీ మత ప్రభావం వల్ల ప్రజల యోగక్షేమాలు చూసేవారు. రాజధానిలో రాజ్య వ్యవహారాలు చర్చించి, విధాన నిర్ణయాలను అమలు చేయడానికి మజ్లిస్-దివాన్‌దారీ, మజ్లిస్-ఇ-కింగాష్ అనే పండిత పరిషత్తులు ఉండేవి. ఇందులో మతాచార్యులు, విద్వాంసులు, రాజనీతిజ్ఞులు, ఉన్నత ఉద్యోగులు సభ్యులుగా ఉండి సుల్తాన్‌కు రాజ్య వ్యవహారాల్లో సూచనలు, సలహాలు ఇస్తుండేవారు. సుల్తాన్ తర్వాతి స్థానం ప్రధానమంత్రిది. కుతుబ్‌షాహీల కాలంలో ప్రధానమంత్రిని వకీల్-ఇ-ముకాలఖ్ (లేదా) పీష్వా అని పిలిచేవారు. ఇతడు రాజ్యంలో సాధారణ పరిపాలనతో పాటు బహిర్గత, అంతర్గత వ్యవహారాలు నిర్వహించేవాడు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో ముస్తాఫాఖాన్ ఆర్దిస్థానీ,

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల
ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

మహమ్మద్ కులీకుతుబ్‌షా కాలంలో మీర్ మెమిన్ అస్త్రాబాది, అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో షేక్ మహమ్మద్ ఇబన్‌ఖాతున్ లాంటి వారు ప్రధాన మంత్రులుగా పేరు పొందారు. ప్రధాన మంత్రి తర్వాతి స్థానం మీర్ జుమ్లా (మంత్రి)కు ఉండేది. ఇతడు ఆర్థిక, రెవెన్యూ శాఖలతోపాటు రాజ్యంలో రాబడి, ఖర్చులకు సంబంధించిన కార్యకలాపాలను ప్రధానంగా నిర్వహించేవాడు. కొన్ని సందర్భాల్లో పీష్వా కంటే ఎక్కువ అధికారం చెలాయించేవాడు. హైదరాబాద్ నగర నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలంలో మీర్జామహమ్మద్ అమీన్, అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో మీర్ మహమ్మద్ సయీద్ లాంటి వారు ఆర్థికశాఖా మంత్రులుగా గొప్ప పేరు గడించారు. పీష్వా (లేదా) ప్రధానమంత్రి పేరును అబుల్ హసన్ తానీషా కాలంలో దివాన్‌గా మార్చారు. మాదన్న దివాన్‌గా పేరు గడించాడు. కోశాధికారిని 'ఖజాన్‌దార్'గా, గణాంక శాఖాధికారిని 'మజుందార్'గా, పోలీస్ కమిషనర్‌ను 'కొత్వాల్'గా, పౌర ఉద్యోగిని 'హవల్దార్'గా పిలిచేవారు. ప్రధాన రెవెన్యూ ఉద్యోగిని 'సర్‌ఖేల్' అని పిలిచేవారు. అన్ని రాష్ట్రాలపై ఇతడు పర్యవేక్షణాధికారిగా వ్యవహరించేవాడు. ప్రభుత్వ ఉత్తర, ప్రత్యుత్తరాలను పర్యవేక్షించడానికి డబీరులు అనే ఇద్దరు కార్యదర్శులు ఉండేవారు. డబీర్ అంటే పండితుడు అని అర్థం. వీరిలో ఒకరు తప్పనిసరిగా హిందువు ఉండేవాడు. ఇతడు సుల్తాన్ జారీ చేసిన ఫర్మానాలను స్థానిక భాషల్లోకి అనువాదం చేసేవాడు. కొత్వాల్ రక్షక భటాధికారి. రాజ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ ఇతడి ప్రధాన విధి.

రాజ్యాన్ని తరఫ్‌లు (రాష్ట్రాలు)గా విభజించారు. అబుల్ హసన్ తానీషా కాలంలో ఆరు తరఫ్‌లు ఉండేవి. వీటిలో తెలంగాణా ప్రాంతం ఒకటి. రాష్ట్రాలను సర్కార్లు(జిల్లాలు)గా, సర్కార్లను పరగణాలు(తాలూకాలు)గా విభజించారు. రాష్ట్రానికి తరఫ్‌దార్ (గవర్నర్) అధిపతి. జిల్లా-తాలూకా అధికార్లను ఫౌజ్‌దార్లు అనేవారు. వీరికి సహాయంగా హవల్దార్లు ఉండేవారు. మచిలీపట్నం లాంటి రేవు పట్టణానికి హవల్‌దార్లు ఉండేవారు. ప్రధాన రేవు అధికారిని షా బందర్ అని పిలిచేవారు. సర్కార్లను సీమలు అని కూడా పిలిచేవారు. బెల్లంకొండ, వినుకొండ, నిజాంపట్నం, కొండపల్లి, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి మొదలైన 22 సీమలు ఉండేవి. అబుల్ హసన్ కాలంలో 37 సర్కారులు, 517 పరగణాలు ఉండేవి.

రేవు పట్టణాల్లో షాబందర్, హవల్‌దార్లు సుంకాలు వసూలుచేసేవారు. రాజ్యంలో శిస్తు వసూళ్లను వేలంపాటల ద్వారా అమ్మేవారు. సర్కార్లను కొన్ని ప్రాంతాలుగా విభజించి ఇష్టమైన వారికి శిస్తు వసూలు అధికారాన్ని ఇచ్చేవారు. ప్రభుత్వానికి, రైతుకు మధ్య ఇద్దరు లేదా ముగ్గురు మధ్యవర్తులు ఉండటంతో రైతుపై శిస్తుభారం విపరీతంగా పెరిగింది. దేశ్‌పాండే, ఠాణేదార్లు, దేశ్‌ముఖ్‌లు, మజుందార్లు, తలసర్కర్ణి లాంటి వారి పాత్ర నిరంకుశంగా ఉండేది. వీరు గ్రామీణ రైతులను దోచుకు తినేవారు. అబుల్ హసన్ పాలనా కాలంలో మజ్లిస్-ఇ-దివాన్ (ప్రివీ కౌన్సిల్) ఏర్పడింది. ఇది రోజూ క్రమం తప్పకుండా సమావేశం అయ్యేది. ఈ సంఘంలో 20 మంది సభ్యులు ఉండేవారు. వీరికి వేతనాల కింద జాగీర్లు ఇచ్చేవారు.

వాస్తు, స్మారక నిర్మాణాలు

వాస్తుపరంగా విశిష్టమైన కుతుబ్ షాహీ శైలి వెలుగులోకి వచ్చింది. వీరు బహమనీ సుల్తాన్ల వాస్తు విధానాన్నే అనుసరించారు. పెద్ద గుమ్మటాలు, విశాలమైన ప్రవేశ ద్వారాలు, ఎత్తైన మినార్లు, అష్టకోణాకృతి నిర్మాణాలు ఈ శైలికి సంబంధించిన ముఖ్య లక్షణాలు. చార్మినార్, చార్‌కమాన్, మక్కామసీదు, టోలీ మసీదు, గోల్కొండ కోట, గోల్కొండ సమాధులు తదితరాలను ముఖ్యమైన వాస్తు కట్టడాలుగా పేర్కొనవచ్చు.

కుతుబ్‌షాహీ మూడో సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో మూసీ నదిపై పురానాపూల్ (పాత వంతెన)ను 1578లో నిర్మించారు. ఇతడి కాలంలోనే హుస్సేన్‌సాగర్, బద్వేల్, ఇబ్రహీంపట్నంతో పాటు గోల్కొండ కోటలో ఇబ్రహీం మసీదును నిర్మించారు.

మహమ్మద్ కులీకుతుబ్ షా 1591లో మూసీ నది ఒడ్డున 'చిచలం' గ్రామంలో ప్లేగు వ్యాధి నివారణకు గుర్తుగా చార్మినార్‌ను నిర్మించాడు. 1594లో హైదరాబాద్‌లో జమామసీదు, బాదుషాహీ అసూర్ ఖానా (పత్తర్‌గట్టీ), దారుల్‌షిఫా, చార్‌కమాన్ లాంటివాటిని నిర్మించారు. వీటిని రాయి, సున్నంతో నిర్మించారు. మహమ్మద్ కుతుబ్‌షా(1612-26)కాలంలో 1617లో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన మక్కామసీదును నిర్మించారు.

కుతుబ్‌షాహీల స్మారక నిర్మాణాలు, గోల్కొండ కోట అంతర్భాగంలో భక్త రామదాసు బందీఖానా, రాణీమహల్, సుల్తానుల మరణానంతరం ఖననానికి ముందు స్నానం చేయించే గదులు నేటికీ ఉన్నాయి. కుతుబ్‌షాహీల సమాధులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాస్తు స్మారక నిర్మాణాలు. కుతుబ్‌షాహీల నిర్మాణాలన్నింటిలో అత్యంత విశాలమైన మైదానంలో నిర్మించినవి ఇవే. ఒకే రాజవంశానికి చెందిన సుల్తానుల సమాధులన్నీ ఒకే ప్రాంగణంలో నిర్మించడం ప్రపంచచరిత్రలో ఇక్కడ మాత్రమే కనిపిస్తుంది. సమాధి డోమ్ అంతర్భాగాన్ని కోణాకృతిలో ప్రత్యేక సాంకేతిక పద్ధతిలో నిర్మించారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఇంగ్లిష్ తూర్పు ఇండియా వర్తక సంఘానికి మచిలీపట్నంలో ఫ్యాక్టరీని స్థాపించడానికి అనుమతి ఇచ్చినవారెవరు? (గ్రూపు-2, 2008)
   జవాబు: అబ్దుల్లా కుతుబ్ షా
2. బీరారు రాజ్యాన్ని స్థాపించిన వంశస్థులు? (గ్రూపు-2, 2005)
   జవాబు: ఇమాద్ షాహీలు
3. ఆది మహాదేవుని దేవాలయం సమీపాన జన్మించిన నది ఏది? (గ్రూపు-2, 2005)
   జవాబు: గోదావరి
4. భగవద్గీతను పర్షియన్ భాషలోకి తర్జుమా చేసినవారెవరు? (గ్రూపు-1, 2003)
   జవాబు: దారాషికో
5. ప్రాకృత భాషలో సంకలనం చేసిన 'గాథా సప్తశతి' వేటి గురించి వివరిస్తుంది? (సివిల్స్ ప్రిలిమ్స్-2002)
   జవాబు: శృంగారగాథలు
6. భారతదేశంపై దండెత్తిన మొదటి ముస్లిం రాజు ఎవరు? (గ్రూపు-2, 2000)
   జవాబు: మహమ్మద్‌బిన్ కాశిమ్
7. కిందివాటిలో సరికాని జత ఏది? (నాన్ గెజిటెడ్ జనరల్ స్టడీస్-2005)
   ఎ) నిజాం షాహీ - అహమ్మద్‌నగర్
   బి) ఆదిల్ షాహీ - బీజాపూర్
   సి) కుతుబ్ షాహీ - గోల్కొండ
   డి) ఇమాద్ షాహీ - బీదర్
   జవాబు: డి
8. కిందివాటిలో మహమ్మద్ కులీకుతుబ్ షా నిర్మించని కట్టడం? (గ్రూప్-1, 2003)
   ఎ) గోల్కొండ బి) హైదరాబాద్
   సి) చార్మినార్ డి) జమా మసీద్
   జవాబు: ఎ
9. 'చార్మినార్'ను దేనికి గుర్తుగా నిర్మించారు? (గెజిటెడ్-2005)
   జవాబు: ప్లేగు వ్యాధి నిర్మూలనలో విజయం
10. ఔరంగజేబు గోల్కొండను జయించిన సంవత్సరం? (గెజిటెడ్-2005)
    జవాబు: క్రీ.శ. 1687

Whose rank is first in a class test?

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Study the following information carefully and answer the following questions.

P, Q, R, S, T and U are six members of a group in which there are three female members. Females work in three departments - Accounts, Administration and HR - and sit on three different floors - Ground floor, first floor and second floor. Person working in the same department are not on the same floor. On each floor two persons work. No two females work in the same department or sit on the same floor. Q and T work in the same department but not in HR. S works in Administration. T and P are on the ground floor and second floor respectively and work in the same department. S, a female does not sit on the first floor. R, a male works on ground floor. U, works on the first floor; and S and P work on the same floor.

1. Which of the following group of members are female?
1) S, T, U
2) R, S, T
3) Q, T, U
4) P, S, U
5) Can't be determined

2. Which of the following pair of person work in Administration?
1) R, S 2) Q, S 3) R, T
4) Data inadequate
5) None of these

3. Which of the following pair works on second floor?
1) P, S 2) R, S 3) Q, U
4) S, T 5) None of these

4. U works in which department?
1) Accounts
2) HR
3) Administration
4) Either HR or Administration
5) None of these

5. If U is transferred to Accounts and T is transferred to Administration, who is to be transferred to HR to maintain the original distribution of female on each floor.
1) R 2) S 3) Q or S
4) Data inadequate
5) None of these

Directions (Q. No. 6-8): Study the following information carefully and answer the given questions:

Six students A, B, C, D, E and F wrote an exam and the following is the data regarding their marks (maximum marks is 20).

- E got twice as much as A.
- A got one-and-a-half times as much as C.
- B got one-third of the marks scored by E.
- D got double that of C.
- F scored 6 marks more than A but is not the topper of the class.

(All marks are integers)

6. Who is the topper of the class & how many marks did he obtain?
1) D - 15 2) E - 12 3) A - 18
4) D - 12 5) E - 18

7. How much more marks does A have to score to be the topper? (if only one person is on 1st position).
1) 9 2) 6 3) 8 4) 10 5) 12

8. What is the difference between the marks obtained by C and F?
1) 6 2) 7 3) 5 4) 8 5) 9

Directions (Q. No. 9-13): Each of the questions below consists of a question and three statements numbered I, II and III given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question and then mark the appropriate option as answer.

9. Six friends M, T, S, R, U and W are sitting around a circular table facing the centre. What is the position of S with respect to M?
I) M is between R and T.
II) R sits second to the left of W.
III) U does not sit on the immediate right of R.
1) Only I and II
2) Only II and III
3) Only III
4) Only I and III
5) All I, II and III together

10. What is the code for 'cold' in a code language?
I) 'icecream is cold' is written as 'tic jic lic'.
II) 'fruits are healthy' is written as 'mic fic eic'.
III) 'healthy is icecream' is written as 'jic mic lic'.
1) Only I
2) Only II
3) Only I and II

BANK EXAMS
REASONINGS

4) Only III and I
5) None of these

11. Among P, Q, R, S, T and U, whose rank is first in a class test?
I) P scored more than only R and S.
II) T's rank is 3rd highest.
III) U did not score the highest marks.
1) Only I 2) Only II 3) Only III
4) I, II and III even together are not sufficient to answer the question.
5) All I, II and III

12. Five persons Jitesh, Jeevan, Jeet, Jai and Jeena sit on a straight line, facing north, but not necessarily in the same order. How many persons sit between Jitesh and Jai?
I) Jeet sits second to the right of Jitesh. Jai is not an immediate neighbour of Jitesh.
II) Jeena sits on the extreme end of the line.
III) Jeet sits on the immediate right of Jeevan.
1) Only II 2) Only III
3) Only I and II
4) Only I and III
5) All I, II and III together

13. How is N related to X?
I) M is brother of N; M is grandson of W.
II) S is sister of N.
III) X is mother of M's father.
1) Only I 2) Only II 3) Only III
4) All I, II and III together
5) Even I, II and III together are not sufficient

Directions (Q. No. 14 - 18): Study the following information carefully and answer the given questions:

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

Input: set near 14 19 went 20 78 ago 80 toy 36 pink 42 colour
Step I: went set near 19 20 78 ago 80 toy 36 pink 42 colour 14
Step II: went toy set near 20 78 ago 80 36 pink 42 colour 14 19
Step III: went toy set pink near 78 ago 80 36 42 colour 14 19 20
Step IV: went toy set pink near colour 78 ago 80 42 14 19 20 36
Step V: went toy set pink near colour ago 78 80 14 19 20 36 42
Step VI: went toy set pink near colour ago 80 14 19 20 36 42 78
Step VII: went toy set pink near colour ago 14 19 20 36 42 78 80

Step VII is the last step of the above input, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

Input: one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 near.

(All the numbers are two-digit numbers.)

14. Which step number is the following output?
two thus so one near and 90 88 make 56 12 15 18 21
1) Step V
2) Step VI
3) Step IV
4) Step III
5) There is no such step

15. How many elements (words or numbers) are there between 'make' and '18' as they appear in last but one step?
1) 3 2) 4 3) 5 4) 2 5) 6

16. How many steps would be required to get the final output?
1) Five 2) Six 3) Four
4) Seven 5) None of these

17. Which of the following represents the position of 'and' in the fifth step?
1) Sixth from the left
2) Seventh from the left
3) Fourth from the right
4) Eighth from the left
5) Sixth from the right

18. Which word/number would be at fifth position from the right in Step VI?
1) 12 2) 18 3) 90
4) and 5) 15

Answers With Explanations

(1-5):

Person	Sex	Floor	Department
P	Male	Second floor	Accounts
Q	Male	First floor	Accounts
R	Male	Ground floor	HR/Administration
S	Female	Second floor	Administration
T(-)	Female	Ground floor	Accounts
U(-)	Female	First floor	HR

1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 2.

(6-8): E → 18
F → 15
D → 12
A → 9
B/C → 6

6) 5; 7) 4; 8) 5;

9) 5;

From I



From I and II



From I, II and III



From all three statements, M sits second to the left of S. So, all three statements are necessary to answer the question.

10. 4; From I and III,
icecream is cold → tic jic lic ...(1)
healthy is icecream → jic mic lic ...(2)
icecream → jic or lic
is → lic or jic
So, the code for 'cold' is 'tic'.
Thus, statements **I** and **III** are sufficient

11. 5; From I. P > R, S
From I and II. – > – > T > P > R, S
From I, II and III.
Q > U > T > P > R, S
Hence all together are sufficient

12. 3;



Thus **I** and **II** together are sufficient.

13. 5; **From I.** M is Brother of N and Grand-son of W and M is male.
From II. S is female and Sister of M,
From III. X is Grand mother of M.
So, in family tree, the sum of all three statements is as follows:



Here N's gender is not defined So, we can't say whether N is Grandson or Granddaughter of X.

(14-18):

The machine rearranges words and numbers in such a way that numbers are arranged from right side and words are arranged from left side. While numbers are arranged in ascending order, words are arranged in reverse alphabetical order.

Input: one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 nears.
Step I: two one 15 and 90 88 make 18 so 21 thus 56 near 12
Step II: two thus one and 90 88 make 18 so 21 56 near 12 15
Step III: two thus so one and 90 88 make 21 56 near 12 15 18
Step IV: two thus so one near and 90 88 make 56 12 15 18 21
Step V: two thus so one near make and 90 88 12 15 18 21 56
Step VI: two thus so one near make and 90 12 15 18 21 56 88
Step VII: two thus so one near make and 12 15 18 21 56 88 90

14. 3;

15. 2;
Sixth step is the last but one.
There are four elements between 'make' and '18'.
The elements are : and, 90, 12 and 15

16. 4;

17. 2; **Step V:** two thus so one near make and 90 88 12 15 18 21 56
Thus, Seventh from the left is 'and'.

18. 5;
Step VI: two thus so one near make and 90 12 15 18 21 56 88.
Thus fifth from the right is 15